మరవరాని మన చరిత్ర
రూ॥ 40/-
పేజీలు:40

నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్), హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54
E-mail: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్(ఆబిడ్స్),హిమాయత్‌నగర్, కొండాపూర్, బండ్లగూడ(నాగోల్)- హైదరాబాద్ హన్మకొండ.

www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★

## 9 నుంచి అసెంబ్లీ !

తెలంగాణ అసెంబ్లీ శీతాకాల సమావేశాలు డిసెంబర్ రెండవ వారంలో జరగనున్నాయి. డిసెంబర్ 9వ తేదీ నుంచి అసెంబ్లీ సమావేశాలు జరిగే అవకాశం ఉంది. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాది కాలం పూర్తి కావస్తుండగా ప్రభుత్వం చేసిన పలు అభివృద్ధి కార్యక్రమాల గురించి రానున్న కాలంలో చేపట్టనున్న సంక్షేమ పథకాల గురించి అసెంబ్లీలో చర్చించడా-నికి ప్రభుత్వం సిద్ధమవుతోంది. ఆర్‌ఓఆర్ చట్టం, కుల గణన, స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్లు తదితర ముఖ్యమైన అంశాలపై కూడా సమావేశాల్లో చర్చించనున్నట్లు సమాచారం.

సంపుటి 07, సంచిక: 351 | శుక్రవారం | 22-11-2024 | మహబూబ్‌నగర్ | Published from: Mahabubnagar, Hyderabad, Khammam, Karimnagar | పేజీలు: 12 | వెల రూ. 5.00

## నదులను కబళిస్తే మనుగడ ప్రశ్నార్థకం

మూసీ ప్రక్షాళన తరతరాలకు మేలు చేసే నిర్ణయం

'ఎక్స్'లో సిఎం రేవంత్‌రెడ్డి పోస్ట్



ప్రజాపక్షం / హైదరాబాద్

'నదుల వెంట నాగరికత వర్ధిల్లాలి. నదులను కబళిస్తే మనిషి మనుగడే ప్రశ్నార్థకమవుతుంది' అని తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి తెలిపారు. ఈమేరకు 'ఎక్స్'లో గురువారం ఆయన పోస్టు చేశారు. ప్రజా ఆరోగ్యం, పటిష్ట ఆర్థికం, పర్యావరణ కోణాల్లో ప్రపంచ స్థాయి ప్రమాణాలతో అభివృద్ధి చెందాల్సిన హైదరాబాద్‌కు మూసీ ఒక వరం కావాలి కానీ, శాపంగా మిగిలిపోకూడదని సిఎం పేర్కొన్నారు. మూసీ ప్రక్షాళన చేయాలనే ప్రజా ప్రభుత్వ సంకల్పం ఈ తరానికే కాకుండా తరతరాలకూ మేలు చేసే నిర్ణయమని రేవంత్ రెడ్డి తెలిపారు. మూసీ ప్రక్షాళన నిర్ణయానికి అండగా నిలిచే ప్రతి వ్యక్తికీ, ప్రతి వ్యవస్థకు ధన్యవాదాలు తెలిపారు.

# గౌతమ్ అదానీపై క్రిమినల్ కేసులు



- లంచాలు, సెక్యూరిటీ మోసాలు చేశారని అమెరికాలో ఆరోపణలు
- భారత్ అధికారులకు రూ.2,200 కోట్లు లంచాలు
- ఆంధ్రా, ఒడిశా అధికారులకే భారీగా ముడుపులు

**న్యూయార్క్/న్యూఢిల్లీ :** వివాదాస్పద భారత పారిశ్రామికవేత్త, భారత్ సంపన్నులలో రెండోస్థానానికి ఎదిగిన గౌతమ్ అదానీపై సరికొత్తగా అమెరికాలో రెండు క్రిమినల్ కేసులు నమోదయ్యాయి. లంచాలు గుప్పించడం, సెక్యూరిటీ మోసాలు అనే రెండు వేరు వేరు ఆరోపణలపై అమెరికాలోని న్యూయార్క్ కోర్టులో న్యాయశాఖ (జస్టిస్ డిపార్ట్‌మెంటు) ప్రాసిక్యూటర్లు కేసులు నమోదు చేశారు. ఈ కేసులో అదానీ, ఆయన మేనల్లుడు సాగర్‌తోపాటు మరో ఏడుగురు నిందితులుగా ఉన్నారు. అదానీ గ్రీన్ ఎనర్జీ లిమిటెడ్ డైరెక్టర్లపై అమెరికా జస్టిస్ డిపార్ట్‌మెంట్, అమెరికా సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ కమిషన్ ఈ కేసులు దాఖలు చేశాయి. ఆంధ్రప్రదేశ్, ఒడిశా రాష్ట్రాల ప్రభుత్వాలు అత్యంత ఖరీదుకు సౌర విద్యుత్‌ను కొనుగోలు చేసినందుకుగాను గుర్తు తెలియని అధికారులకు భారీగా ముడుపులు సమర్పించారు. ఈ జాబితాలో తమిళనాడు, చత్తీస్‌గఢ్, జమ్ముకశ్మీర్ కూడా ఉన్నాయి. ఈ వ్యవహారాలలో అదానీ భాగస్వామిగా ఉన్నారు. ఎవరెవరికి లంచాలు చెల్లించారనే విషయాన్ని అమెరికా బ్యాంకులకు, అదానికి పెట్టుబడులు సమకూర్చిన ఇన్వెస్టర్లకు తెలియకుండా రహస్యంగా ఉంచారని ప్రాసిక్యూటర్ల డాక్యుమెంటు పేర్కొంది. 12 గిగావాట్ల సౌర విద్యుత్ సరఫరాలకు సంబంధించిన ప్రాజెక్టులకు ఈ పెట్టుబడుల సేకరణ జరిగింది. 2020 నుండి 2024 మధ్య కాలంలో అదానీ కంపెనీ అనుబంధ సంస్థలు రెండు బిలియన్ డాలర్లు అంతర్జాతీయ సంస్థలనుండి, బ్యాంకుల నుండి, మేనేజ్‌మెంట్ కంపెనీల నుండి తీసుకుందని, ఒక బిలియన్ డాలర్లు మొత్తాన్ని సెక్యూరిటీ మోసాల ద్వారా అమెరికా ఇన్వెస్టర్లకు విక్రయించిందని డాక్యుమెంటు పేర్కొంది. న్యూయార్క్ కోర్టులో కేసుల నమోదుతో దేశవ్యాప్తంగా రాజకీయ దుమారం చెలరేగింది. దాంతోపాటు స్టాక్ మార్కెట్‌లో కూడా అదానీ తరువాయి 2లో

## స్టాక్ మార్కెట్‌పై అదానీ దెబ్బ

**ముంబయి:** ప్రముఖ వ్యాపారవేత్త గౌతం అదానీపై అమెరికా పలు అభియోగాలు మోపిన ప్రభావం ఆయనకు చెందిన వివిధ కంపెనీలపైనేగాక, భారత స్టాక్ మార్కెట్‌పైన కూడా పడింది. ఈ కారణంగా, అదానీ కంపెనీల స్టాక్స్ భారీగా నష్టపోయాయి. బాంబే స్టాక్ ఏక్సేంజ్ (బిఎస్‌ఇ)లో సెన్సెక్స్30 ప్యాక్‌లోని అదానీ పోర్ట్స్ అత్యధికంగా 13 శాతానికి పైగా నష్టపోయింది. అదానీ ఎంటర్‌ప్రైజెస్, అదానీ ఎనర్జీ సొల్యూషన్స్, అదానీ గ్రీన్ ఎనర్జీ సహా ఇతర అదానీ గ్రూప్ స్టాక్లు దాదాపు 23 శాతం వరకు నష్టపోయాయి. అదానీ గ్రూప్ స్టాక్స్ భారీగా పతనమైన నేపథ్యంలో దేశీయ స్టాక్ మార్కెట్లు కూడా గురువారం నష్టాలతో ముగిశాయి. సెన్సెక్స్ 422.59 పాయింట్లు నష్టపోయి 77,155.79 వద్ద స్థిరపడింది. జాతీయ స్టాక్ ఏక్సేంజ్ (ఎన్ఎస్‌ఇ) నిఫ్టీ 168.60 పాయింట్లు క్షీణించి 23,349.90 వద్దకు ముగించింది. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఎన్‌టిపిసి, ఐటిసి, ఏషియన్ పెయింట్స్, బజాజ్ ఫైనాన్స్, బజాజ్ ఫిన్సర్వ్ షేర్లు నష్టపోయాయి. పవర్ గ్రిడ్, అల్ట్రాటెక్ సిమెంట్, హెచ్‌సిఎల్ టెక్నాలజీస్, యాక్సిస్ బ్యాంక్ షేర్లు లాభపడ్డాయి. కాగా, గురువారం ప్రారంభ ట్రేడింగ్‌లో అదానీ కంపెనీలు భారీ నష్టాలను ఎదుర్కొన్నాయి. ఓ దశలో అదానీ ఎంటర్‌ప్రైజెస్, అదానీ ఎనర్జీ స్టాక్స్ 20 శాతం పడిపోయింది. సోలార్ ఎనర్జీ కాంట్రాక్టులను చేజిక్కించుకునేందుకు అదానీ గ్రూప్ తరువాయి 2లో

## జెపిసి గడువు పెంచాల్సిందే

ప్రతిపక్ష సభ్యులు డిమాండ్

**న్యూఢిల్లీ :** వక్ఫ్ సవరణ బిల్లుపై నియమించిన జెపిసి గడువును పెంచాలని ప్రతిపక్ష సభ్యులు డిమాండ్ చేశారు. ముసాయిదా చట్టాన్ని అధ్యయనం చేసేందుకు తమకు మరింత సమయం అవసరమన్నారు. జెపిసి చైర్మన్, బిజెపి ఎంపి జగదాంబికా పాల్ ఆధ్వర్యంలో గురువారం జరిగిన జెపిసి సమావేశమే చివరిదని చైర్మన్ ప్రకటించారు. ముసాయిదా నివేదికను తరువాయి 2లో

## జెపిసి దర్యాప్తు చేయాల్సిందే

దేశవ్యాప్త ఆందోళన చేపట్టాలని పార్టీ శాఖలకు సిపిఐ పిలుపు



**న్యూఢిల్లీ :** తీవ్ర ఆర్థిక నేరాల ఆరోపణలు ఎదుర్కొంటున్న భారత్ కుబేరుడు గౌతమ్ అదానీ చేసిన దుష్కృత్యాలపైన, ప్రధానమంత్రి నరేంద్రమోదీతో ఆయనకు ఉన్న మిత్రత్వంపైన సంయుక్త పార్లమెంటరీ కమిటీ (జెపిసి)తో తప్పనిసరిగా దర్యాప్తు జరిపి తీరాల్సిందేనని భారత కమ్యూనిస్టుపార్టీ (సిపిఐ) డిమాండ్ చేసింది. ఈ విషయంపై ఒత్తిడి తీసుకువచ్చేందుకు దేశవ్యాప్తంగా పార్టీ శాఖలు నిరసన ప్రదర్శనలు చేపట్టాలని తరువాయి 2లో

## తక్షణమే అరెస్టు చేయాలి

అదానీ గ్రూప్‌పై జెపిసి వేయాలి : కాంగ్రెస్



న్యూఢిల్లీ : అమెరికాలో లంచం, మోసం ఆరోపణలు ఎదుర్కొంటున్న నేపథ్యంలో గౌతమ్ అదానీని తక్షణమే అరెస్టు చేయాలని ప్రతిపక్ష నాయకులు రాహుల్ గాంధీ డిమాండ్ చేశారు. భారతీయ అధికారులకు అదానీ, వారి సహచరులు 25 కోట్ల అమెరికన్ డాలర్లు చెల్లించారని అమెరికన్ ప్రాసిక్యూటర్‌లు ఆరోపించిన కొద్ది గంటలోనే రాహుల్ గాంధీ మీడియా సమావేశం ఏర్పాటు చేసి అదానీపై విరుచుకుపడ్డారు. అమెరికా తరువాయి 2లో



## ఘనంగా కానిస్టేబుళ్ల పాసింగ్ ఔట్ పరేడ్

ఆల్‌రౌండ్ టాపర్‌గా నిలిచిన కానిస్టేబుల్ అభ్యర్థి సౌమ్య

19 కేంద్రాలలో 8,047 మందికి శిక్షణ పూర్తి

ప్రజాపక్షం/హైదరాబాద్

తెలంగాణలో స్టైపెండరీ ట్రైనీ కానిస్టేబుల్స్ 9నెలల శిక్షణ పూర్తి అయింది. సాయుధ దళం (ఎఆర్) సివిల్, ఎస్ఎఆర్ సిపిఎల్, ఐటి, పిటిసి విభాగాలకు చెందిన 8,047మంది స్టైపెండరీ ట్రైనీ కానిస్టేబుళ్ల శిక్షణ విజయవంతమైంది. రాష్ట్రంలోని 19 పోలీసు శిక్షణా కేంద్రాలలో గురువారం కానిస్టేబుల్స్ 4వ పాసింగ్ ఔట్ పరేడ్ గురువారం ఘనంగా నిర్వహించారు. ఫిబ్రవరి 21, 2024లో స్టైపెండరీ ట్రైనీ కానిస్టేబుల్స్ శిక్షణ మొదలైంది. తెలంగాణలో 19ట్రైనింగ్ కేంద్రాలలో వీరు శిక్షణ తీసుకున్నారు. మొత్తం కానిస్టేబుల్ శిక్షణ పొందిన వారిలో 5709 పురుషులు, 2338 మహిళ అభ్యర్థులు ఉన్నారు. ట్రైనీ కానిస్టేబుల్‌కు సమగ్రంగా అన్ని అంశాలపై శిక్షణ ఇచ్చారు. సివిల్, క్రిమినల్, సైబర్ కేసులు ఎన్‌డిపిఎస్ యాక్ట్, క్రైమ్, సెల్ఫ్ డిఫెన్స్ ఇలా చాలా అంశాలపై ట్రైనింగ్ ఇచ్చారు. గ్రా డ్యుయేషన్ 5470 , పోస్ట్ గ్రాడ్యుయేషన్ 1361 కానిస్టేబుల్స్ చదివారు. ఇందులో టెక్నికల్ 1755, నాన్ టెక్నికల్ 5505, లా పూర్తి చేసుకున్న వారు 15మంది ఉన్నారు. పాసింగ్ ఔట్ పరేడ్ తరువాయి 2లో

## ఏడాది కాలంలోనే.. అద్భుతమైన పాలన

- దేశంలో ఏ రాష్ట్రం చేయని విధంగా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అమలు
- టిపిసిసి విస్తృతస్థాయి సమావేశంలో మహేశ్ కుమార్ గౌడ్

ప్రజాపక్షం/హైదరాబాద్ :

రాష్ట్ర ప్రభుత్వం ఏడాది కాలంలో అద్భుతమైన పాలన అందించిందని టిపిసిసి అధ్యక్షుడు బొమ్మ మహేశ్ కుమార్ గౌడ్ అన్నారు. దేశంలో ఏ రాష్ట్రం చేయలేనంత అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అమలు చేసి చూపించామన్నారు. బిఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్లలో చేయలేని అనేక పనులు కాంగ్రెస్ ప్రభుత్వంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కేబినెట్ మంత్రులు చేసి చూపించారని ప్రశంసించారు. గాంధీ భవన్‌లో మహేశ్ కుమార్ గౌడ్ అధ్యక్షతన గురువారం టిపిసిసి విస్తృత స్థాయి సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు సీతక్క, తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఎంపిలు మల్లు రవి, చామల కిరణ్ కుమార్ రెడ్డి, మాజీ మంత్రులు జె.గీతారెడ్డి, పోచారం శ్రీనివాస్ రెడ్డి, మాజీ ఎంపి వి.హనుమంతరావులో పాటు పలవురు సీనియర్ నేతలు పాల్గొన్నారు. ప్రజా పాలన ఏడాది సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా సంబరాలు, రాష్ట్రంలో జరుగుతున్న కులగణనపై, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలపై చర్చించారు. ఈ సందర్భంగా మహేశ్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ తరువాయి 2లో





## భూములు బలవంతంగా లాక్కుంటే చూస్తూ ఊరుకోం

- వామపక్ష పార్టీల నేతల హెచ్చరిక
- భూసేకరణపై ప్రజలకు అవగాహన కల్పించాలని హితవు
- లగచర్ల బాధితులను పరామర్శించిన నేతలు

ప్రజాపక్షం / కొడంగల్

ఫార్మా కంపెనీ ఏర్పాటు కోసం భూసేకరణ చేపట్టే విషయమై వికారాబాద్ జిల్లా లగచర్లలో రైతుల ప్రజాభిప్రాయ సేకరణకు వెళ్లిన జిల్లా కలెక్టర్ సహా ఉన్నతాధికారులపై దాడి ఘటనలో అరెస్టులు కొనసాగుతున్న నేపథ్యంలో గురువారం వామపక్ష పార్టీల అగ్రనాయకులు బాధితులను కలిసి పరామర్శించారు. సంఘటన వివరాలను సేకరించారు. ఈ సందర్భంగా సిపిఐ రాష్ట్ర కార్యవర్గసభ్యురాలు పశ్య పద్మ, సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం మాట్లాడారు. బడుగు బలహీన వర్గాల భూములను ప్రభుత్వాలు బలవంతంగా లాక్కుంటే చూస్తూ ఉరుకునేదిలేదని హెచ్చరించారు. ప్రభుత్వం ఏ విధమైన కంపెనీలు పెట్టాలనుకున్నది? ఏ విధంగా భూ సేకరణ చేయాలనుకున్నది? అనే తరువాయి 12లో



## రఘువంశీ ఏరోస్పేస్ భారీ విస్తరణ

1200 కొత్త ఉద్యోగాలు వచ్చే అవకాశం : మంత్రి శ్రీధర్ బాబు

ప్రజాపక్షం / హైదరాబాద్

విమాన ఇంజన్ల కీలక విడిభాగాలు, రక్షణ రంగ ఉత్పత్తుల తయారీలో గణనీయ వృద్ధిని సాధించిన రఘువంశీ ఏరోస్పేస్ భారీ విస్తరణ పనులకు శ్రీకారం చుట్టింది. శంషాబాద్ ఏరో స్పేస్ పార్క్ లో ఈ సంస్థ తరువాయి 2లో

## బాలలు, కార్మికుల అక్రమరవాణాపై తక్షణమే సమావేశం

కేంద్రాన్ని ఆదేశించిన 'సుప్రీం' ధర్మాసనం

యూపిలో కేవలం 1,101మంది వెట్టి కార్మికులకు మాత్రమే ఆర్థిక సహాయం అందడంపై అసంతృప్తి



**న్యూఢిల్లీ :** బాలలు సహా వెట్టి కార్మికులు అంతర్ రాష్ట్ర అక్రమ రవాణా సమస్యను పరిష్కరించడానికి అన్ని రాష్ట్రాల, కేంద్రపాలిత ప్రాంతాల సంబంధిత మంత్రులతో ఒక సమావేశం నిర్వహించి ప్రతిపాదనలను రూపొందించాలని గురువారం సుప్రీంకోర్టు కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలో విడుదల చేసిన 5,264 మంది వెట్టి కార్మికులకుగాను కేవలం 1,101 మంది మాత్రమే తక్షణ సహాయం పొందడం ఆందోళనచెందాల్సిన విషయమని సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ బిఆర్. గవాయ్, కెవి. విశ్వనాథన్‌లతో కూడిన ద్విసభ్య ధర్మాసనం ముందు ఉంచిన గణాంకాలను పరిశీలించిన తర్వాత వ్యాఖ్యానించింది. బాలలను రక్షించిన తర్వాత వారికి తక్షణమే ఆర్థిక సహాయం అందించడంలో సమస్య ఉన్నదని సర్వోన్నత న్యాయస్థానం పరిశీలనలో వెల్లడైంది. మైనర్లకు సంబంధించిన కొన్ని కేసులలో తరువాయి 12లో



## ఇందిరా మహిళా శక్తి భవనాలు 8 నెలల్లో పూర్తి

అధికారులకు సిఎస్ శాంతికుమారి ఆదేశం

ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్రంలో మహిళా సాధికారతకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి తెలిపారు. ఇందులో భాగంగా మహిళలను కోటీశ్వరులను చేయాలన్న ముఖ్యమంత్రి సంకల్పంలో భాగంగా మహిళా స్వయం సహాయక బృందాలతో బస్సుల కొనుగోలు, సోలార్ ప్లాంట్ల ఏర్పాటు, శిల్పా రామంలో ఇందిరా మహిళా శక్తి బజార్ల ఏర్పాటు పనులు ముమ్మరం చేయాలని తరువాయి 12లో



రాష్ట్రపతి ద్రౌపదీ ముర్మ గురువారం రాష్ట్రానికి విచ్చేసిన సందర్భంగా బేగంపేట విమానాశ్రయంలో స్వాగతం పలికిన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

# నేతన్యాహూకు అంతర్జాతీయ కోర్టు అరెస్టు వారెంట్

## రక్షణమంత్రి గాలంట్, హమాస్ నేత డైఫ్‌లకు కూడా...



**జెరూసలెం :** యుద్ధ నేరాలకు పాల్పడ్డారన్న ఆరోపణలపై ఇజ్రాయెల్ ప్రధానమంత్రి బెంజిమన్ నేతన్యాహూకు అంతర్జాతీయ క్రిమినల్ కోర్టు (ఐసిసి) గురువారంనాడు అరెస్టు వారెంట్ జారీ చేసింది. ఆయనతోపాటు యుద్ధాన్ని నడిపించిన ఆ దేశ రక్షణశాఖ మాజీమంత్రి యోవ్ గాలంట్, హమాస్ సంస్థ సైన్యాధిపతి మహ్మద్ డైఫ్‌లకు కూడా ఐసిసి అరెస్టు వారెంట్లు జారీ చేసింది. దీంతో నేతన్యాహూ మిగిలిన ఇద్దరూ కూడా అంతర్జాతీయంగా వాటెండ్ సస్పెక్ట్స్‌గా మారిపోయారు. అదేవిధంగా ఈ ముగ్గురినీ అంతర్జాతీయంగా ఏకాకులను చేసే అవకాశం ఉంది. దీనివల్ల యుద్ధం ముగించడానికి, కాల్పుల విరమణ సంప్రదింపులు చేసే కృషికి ఆచరణాత్మకంగా చాలా సంక్లిష్టమైన సమస్యలు ఎదురయ్యే పరిస్థితులు వస్తాయి. ఐతే ఈ యుద్ధంలో ఇద్దరు హమాస్ అధికారులు మరణించినందువల్ల, ఇజ్రాయెల్‌గానీ, ఆ దేశ ప్రధాన మిత్రుడు అమెరికాగానీ ఐసిసి సభ్యులుగా లేనందువల్ల ఆచరణాత్మకంగా చూసినప్పుడు వారికి ఉన్న చిక్కులు, సమస్యలు చాలా పరిమితంగా ఉండవచ్చు. మానవత్వానికి వ్యతిరేకంగా నేరాలకు పాల్పడినందుకు, యుద్ధ నేరాలకు పాల్పడినందుకు నేతన్యాహూతో పాటు గాలంట్‌కు కూడా అరెస్టు వారెంట్లు జారీ చేశారు. 2023 అక్టోబరు 8వ తేదీ నుండి, కనీసం 2024 మే 20వ తేదీ వరకూ నేతన్యాహూ, గాలంట్ ఇద్దరూ ఈ నేరాలకు పాల్పడ్డారని ఐతే తనకు అరెస్టు వారెంట్ జారీ చేయడాన్ని నేతన్యాహూ ఖండించారు. హాస్యాస్పదమైన, తప్పుడు చర్యలతో కూడిన ఈ అరెస్టు వారెంటును ఎంతో ఏవగింపు, అసహ్యంతో ఇజ్రాయెల్ తిరస్కరిస్తోంది'' అని పేర్కొన్నారు. గాజాలో ఇజ్రాయెల్ చేస్తున్నది యుద్ధం తప్ప అంతకుమించి ఎక్కువగా ఏమీ చేయలేదని నేతన్యాహూ కార్యాలయం విడుదల చేసిన ప్రకటన పేర్కొంది. ఈ విధంగా వారెంట్లు జారీ చేయాలని ఐసిసి ప్రధాన ప్రాసిక్యూటర్ కరీమ్ ఖాన్ కోరడం అత్యంత అవమానకరం, యూదు శత్రుత్వవైఖరేనని నేతన్యాహూతోపాటు ఇతర ఇజ్రాయెలీ నాయకులు తీవ్రంగా ఖండించారు. అమెరికా ప్రభుత్వం కూడా ప్రాసిక్యూటర్ ఖాన్‌పై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. విమర్శించింది. హమాస్ ఉగ్రవాదానికి వ్యతిరేకంగా తనను తాను రక్షించుకోవడానికి ఇజ్రాయెల్‌కు పూర్తి హక్కులు ఉన్నాయని అమెరికా సమర్థించింది. అదేవిధంగా హమాస్ సంస్థ కూడా ఖాన్ అరెస్టు వారెంట్ విజ్ఞప్తిని ఖండించింది.




# ఉక్రేన్‌పై రష్యా ఐసిబిఎం దాడి: జెలెన్‌స్కీ



**కీవ్ :** మూడేళ్ళుగా ఉక్రేన్‌లో జరుగుతున్న యుద్ధంలో మొదటిసారి రష్యా ఐసిబిఎంలతో దాడులు చేసింది. ఉక్రేన్ దేశాధ్యక్షుడు జెలెన్‌స్కీ గురువారంనాడు రష్యాపై ఈ విమర్శలు చేశారు. కీవ్ నగరం గురువారం ఉదయం బాంబు పేలుళ్ళతో దద్దరిల్లింది. ఐతే ఉక్రేన్ చేసిన ఈ ఆరోపణలపై రష్యా దేశం స్పందించలేదు. రష్యాలోని సదరన్ అస్ట్రాఖాన్ రీజియన్ నుండిఈ ఐసిబిఎంలను ప్రయోగించిందన్న ఈ విమర్శలపై వ్యాఖ్యానించేందుకు రష్యా తిరస్కరించింది. ఐతే బ్రిటన్ సరఫరా చేసిన ఉక్రేన్ ప్రయోగించిన స్ట్రామ్ షాడో క్షిపణులను తమ సైన్యం కూల్చివేసిందని మాత్రం ప్రకటించింది. అదేసమయంలో ఉక్రేన్ కూడా రష్యా ప్రయోగించిన ఆరు కెహెచ్–101 క్రూయిజ్ మిస్సైల్స్‌ను కూల్చివేశామని ప్రకటించింది.ఖండాంతర బాలిస్టిక్ క్షిపణులతో తమదేశంపై రష్యా దాడిచేసిందని జెలెన్‌స్కీ అన్నారు. పూర్తి వివరాలు మాత్రం ఆయన చెప్పలేదు. అమెరికా ఇచ్చిన లాంగ్ రేంజ్ మిస్సైల్స్‌లో మొదటిసారి గడచిన సోమవారంనాడు ఉక్రేన్ దాడులు చేయడం, ఉక్రేన్‌కు నిషేధిత మందుపాతరలు సరఫరా చేస్తామని బైడెన్ ప్రకటించడం వంటి రెచ్చగొట్టే చర్యల పూర్వరంగంలో రష్యా మొదటిసారి ఐసిబిఎంలతో ఉక్రేన్‌పై దాడులు చేసింది. అత్యంత శక్తిమంతమైన ఈ ఐసిబిఎం క్షిపణులు ప్రపంచంలో కేవలం రష్యా, అమెరికా దేశాలవద్దనే ఉన్నాయి. మిగిలిన దేశాలవద్ద అరకొరగా ఉన్నాయి. అణుశీర్షాలను మోసుకుపోవడంతోపాటు భారీఎత్తున విధ్వంసం సృష్టించగల శక్తిసామర్థ్యాలు ఈ ఐసిబిఎంలకు ఉంటాయి. మరోవైపు ఉక్రేన్ సరిహద్దుల్లో ఉన్నహంగేరియా దేశ రక్షణమంత్రి ఒక ప్రకటన చేస్తూ, యుద్ధ నేపథ్యంలో ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థను ఏర్పాటు చేసుకుంటున్నట్లు ప్రకటించారు.

# పాకిస్థాన్‌లో మళ్ళీ ఉగ్రవాద దాడిః 38 మంది మృతి



**పెషావర్ :** పాకిస్థాన్ ఖైబర్ పఖ్తుంక్వా అక్వత్ ప్రాంతంలో ఒక ప్రయాణికుల వాహనంపై ఉగ్రవాదులు దాడి చేశారు. ఈ దాడిలో 38 మంది మరణించారు. లోయర్ ఖుర్రం రీజియన్‌లో గురువారంనాడు ఈ దాడి జరిగిందని అహ్మదీషామా స్టేషన్ హౌస్ ఆఫీసర్ కలీమ్ షా చెప్పారు. ఈ దాడిలో ముగ్గురు మహిళలు సహా 11 మంది గాయపడ్డారు. గడచిన వారం రోజులుగా పాకిస్థాన్‌లో ఉగ్రవాద దాడులు ఆగకుండా కొనసాగుతున్నాయి. మొదట పోలీసులపై ఉగ్రవాదులు దాడి చేశారనీ, తర్వాత పాసింజర్ కాన్వాయ్‌పై రెండు వైపుల నుండి కాల్పులు జరిపారని ఉన్నతాధికారులు చెప్పారు. ఉగ్రవాద భయంతో పోలీసు మద్దతుతో ప్రయాణికుల వాహనాలు రాకపోకలు చేస్తున్నాయి. ఈ ప్రాంతంపై ప్రత్యేకశ్రద్ధ పెట్టామని, ప్రతిరోజు కొత్త కొత్త దాడుల ఘటనలు జరుగుతున్నాయని, ఉగ్రవాదులను వదలబోమని పాకిస్థాన్ కె.పి గవర్నమెంట్ అధికార ప్రతినిధి బరిస్టర్ డా.సైఫ్ అన్నారు. ఐతే దాడికి తామే బాధ్యులమని ఏ ఉగ్రవాద సంస్థా ప్రకటించుకోలేదు. ఖైబర్ పఖ్తుంక్వా కీలక రహదారిపై నిత్యం ఈ ఉగ్రవాద దాడులు కొనసాగుతున్నాయి. పరాచినర్ నుండి పెషావర్ వరకూ అనేక వాహనాలను మూకుమ్మడిగా ఒకేసారి బందోబస్తుగా తీసుకువెళుతున్నామని, ఈ దశలో దాడి జరిగిందనీ స్థానిక పోలీసు అధికారులు చెప్పారు. సున్నీలు మెజారిటీగా ఉండే పాకిస్థాన్‌లో 15 శాతంమంది షియాలు ఉన్నారు. ఈ రెండు తెగలమధ్యా దీర్ఘకాలంగా చారిత్రకంగా గొడవలున్నాయి.

# జాన్ ప్రెస్కాట్ మృతి



**లండన్ :** లేబర్‌పార్టీలో ప్రముఖ నాయకుడు, బ్రిటన్ మాజీ ఉప ప్రధానమంత్రి జాన్ ప్రెస్కాట్ మరణించారు. 1938 మే 31వ తేదీన జన్మించిన ప్రెస్కాట్ తన 86 వ యేట ప్రశాంత మరణం పొందారని కుటుంబసభ్యులు ప్రకటించారు. బ్రిటన్ రాజకీయాలలో తనదైన ముద్రవేసిన ప్రెస్కాట్ ఆల్జీమర్స్‌వ్యాధితో బాధపడుతున్నారు. కేర్‌హోమ్‌లో ఇష్టమైన జాజ్ మ్యూజిక్ వింటూ నవంబరు 20న కన్నుమూశారు. ప్రధానమంత్రి స్టార్‌మర్ ఆయనకు నివాళులు అర్పిస్తూ కార్మిక ఉద్యమంలో, రాజకీయాల్లో ఆయన ఎంతో ప్రముఖపాత్రవహించారన్నారు. టోనీ బ్లెయిర్ ప్రభుత్వంలో ఆయన పది సంవత్సరాలు పనిచేశారు. 'కింగ్‌స్టన్ అపాన్ హల్ ఈస్ట్' స్థానాన్ని నిలబెట్టుకుని 40 సంవత్సరాలపాటు ఆయన పార్లమెంటేరియన్‌గా హౌస్ ఆఫ్ కామన్స్ సభ్యుడుగా కొనసాగారు. లేబర్‌పార్టీ ప్రభుత్వంలో 1997 నుండి 2007 వరకూ ఉపప్రధానమంత్రిగా పనిచేశారు. ఆయనకోసం ప్రత్యేకంగా సృష్టించిన వాతావరణశాఖతోపాటు రవాణాశాఖను కూడా ఆయన నిర్వహించారు. 1970 నుండీ 2010 వరకూ ఆయన 'కింగ్‌స్టన్ అపాన్ హల్ ఈస్ట్' నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహించారు. 2001 నుండీ 2007 వరకూ ఫస్ట్ సెక్రటరీ ఆఫ్ స్టేట్‌గా (విదేశాంగమంత్రి) బాధ్యతలు నిర్వహించారు. అంతకుముందు 1994లో జాన్ స్మిత్ మరణంతో లేబర్‌పార్టీ నాయకత్వాన్ని, డిప్యూటీ లీడర్‌షిప్ బాధ్యతలను కూడా అన్నీ తానై నిర్వహించారు.

# గాజాలో కాల్పుల విరమణ తీర్మానాన్ని నాలుగోసారి తిరస్కరించిన అమెరికా



**న్యూయార్క్ :** గాజా స్ట్రిప్‌లో వెంటనే, బేషరతుగా, శాశ్వతంగా కాల్పుల విరమణ చేయాలని ఐక్యరాజ్యసమితి భద్రతామండలిలో ప్రవేశపెట్టిన తీర్మానాన్ని అమెరికా మరోసారి వీటో చేసింది. ఈ విధంగా వీటో చేయడం ఇది నాలుగోసారి. గడచిన అక్టోబరు నుండీ అమెరికా ఈ తీర్మానాన్ని తొక్కిపట్టి ఉంచింది. భద్రతామండలిలో ఉన్న 15 దేశాలలో 14 దేశాలు కాల్పుల విరమణ ఒప్పందానికి అనుకూలంగా ఓటు వేయగా, అమెరికా మాత్రం వీటో పవర్ ఉపయోగించి తీర్మానాన్ని తిరస్కరించింది. హమాస్ ఉగ్రవాదులు ఇజ్రాయెల్‌పై దాడిచేసినప్పుడు బందీలుగా తీసుకువెళ్ళిన సుమారు 250 మంది వివిధ దేశాలకు చెందిన ఇజ్రాయెల్ పౌరుల ప్రస్తావన ఈ తీర్మానంలో లేదని అమెరికా వాదించింది. 14 నెలలుగా గాజాలో జరుగుతున్న యుద్ధంలో దాదాపు ప్రతినెలా ఒక తీర్మానం ప్రతిపాదిస్తున్నప్పటికీ ఇప్పటివరకూ కేవలం 14 తీర్మానాలకుగాను నాలుగు తీర్మానాలే పాలస్తీనాకు అనుకూలంగా ఆమోదం పొందాయి. మిగిలినవన్నీ తిరస్కరణకు గురయ్యాయి. భద్రతామండలిలో ఒక తీర్మానం ఆమోదం పొందాలంటే 15 దేశాలలో కనీసం తొమ్మిది దేశాలు అనుకూలంగా ఓటు వేయాలి. గత ఏడాది అక్టోబరులో రెండుసార్లు ఈ తీర్మానాన్ని అమెరికా వీటో చేసింది. తర్వాత డిసెంబరులో ఒకసారి, 2024 ఫిబ్రవరినెలలో ఒకసారి, ఏప్రిల్‌లో ఒకసారి, తాజాగా నిన్న నవంబరు 20న ఒకసారి ఈ విధంగా ఇప్పటివరకూ ఆరుసార్లు గాజాలో కాల్పుల విరమణ ఒప్పందాన్ని అమెరికా తిరస్కరించింది. ప్రత్యేకించి ఈ ఏడాదిలో నాలుగుసార్లు ఈ తీర్మానాన్ని వీటో చేసింది. కాగా బ్రిటన్‌దేశం గత ఏడాది అక్టోబరు 25న ఈ తీర్మానాన్ని వీటో చేసింది. ఆ తర్వాత ఒక్కసారి కూడా వీటో పవర్‌ను ఉపయోగించలేదు. ఇక చైనా గత ఏడాది అక్టోబరులో, ఈ ఏడాది మార్చిలో మొత్తం రెండుసార్లు తీర్మానాన్ని వీటోచేసింది. రష్యా కూడా రెండుసార్లు వీటో చేయగా, ఫ్రాన్స్ ఈ తీర్మానంపై ఒక్కసారి కూడా వీటో పవర్‌ను ఉపయోగించలేదు.

## రఘువంశీ ఏరోస్పేస్ భారీ విస్తరణ

(మొదటి పేజీ తరువాయి)

కొత్త కర్మాగారం నిర్మాణానికి ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు గురువారం టిజి ఐఐసి ఎండి విష్ణువర్ధన్ రెడ్డి, సిఐఐ ఛైర్మన్ సాయి ప్రసాద్,, డిఆర్‌డిఓ డైరెక్టర్ రాజబాబు, ఏరోస్పేస్ డైరెక్టర్ పిఏ ప్రవీణ్, రఘు వంశీ డైరెక్టర్ వంశీ వికాస్‌లతో కలిసి శంకుస్థాపన చేశారు. సుమారు రూ.300 కోట్ల వ్యయంతో 2 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో నిర్మితమయ్యే ఈ పరిశ్రమ రానున్న మూడేళ్లలో 1200 మందికి ఉద్యోగావకాశాలు కల్పిస్తుందని ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు వెల్లడించారు. రఘువంశీ ఏరోస్పేస్ చేతిలో ఉన్న రూ.2 వేల కోట్ల ఆర్డర్లకు సంబంధించిన పరికరాలు ఈ నూతన సదుపాయంలో ఉత్పత్తి అవుతాయని ఆయన తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన ఎంఎస్ ఎమ్ఇ పాలసీ ప్రకారం ద్వితీయ, తృతీయ శ్రేణి పట్టణాల్లో ఏర్పాటు చేసే పరిశ్రమలకు ప్రోత్సాహకాలు అందిస్తామని శ్రీధర్ బాబు వెల్లడించారు.

## స్టాక్ మార్కెట్‌పై అదానీ దెబ్బ

(మొదటి పేజీ తరువాయి)

భారత అధికారులకు దాదాపు 250 మిలియన్ డాలర్లు లంచం చెల్లించిందని అమెరికా ఆరోపించింది. కాగా, అదానీ లిస్టెడ్ కంపెనీల మొత్తం వ్యాల్యూలో రూ.2.45 లక్షల కోట్లు గురువారం తుడిచిపెట్టుకుపోయాయి. అదానీ ఎంటర్‌ప్రైజెస్ 23శాతం నష్టపోయింది. అదానీ ఫ్లాగ్‌షిప్ కంపెనీ అదానీ ఎంటర్‌ప్రైజెస్, అదానీ ఎనర్జీ సొల్యూషన్స్ ఓ దశలో 20 శాతం నష్టపోయాయి. అదానీ గ్రీన్ ఎనర్జీ 19.17 శాతం, అదానీ టోటల్ గ్యాస్ 18.14 శాతం, అదానీ పవర్ 17.79 శాతం, అదానీ పోర్ట్స్ 17.79 శాతం మేర క్షీణించాయి. అంబుజా సిమెంట్స్ 14.99 శాతం, ఏసీసీ 14.54 శాతం, ఎన్‌డీటీవీ 14.37 శాతం, అదానీ విల్మార్ 10, వీటితో పాటు అదానీ గ్రూపునకు చెందిన మరికొన్ని కంపెనీలు కూడా నష్టాల్లో ట్రేడ్ అయ్యాయి.

## ఘనంగా కానిస్టేబుళ్ల పాసింగ్ ఔట్ పరేడ్

(మొదటి పేజీ తరువాయి)

విజయవంతంగా పూర్తి చేసుకున్న వీరు తర్వాత తెలంగాణ పౌరుల సేవలో 8,047 మంది కానిస్టేబుల్స్ ఉన్నారు. కాగా ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డిజిపి జితేందర్ ముఖ్య అతిధిగా హాజరయ్యారు. హైదరాబాద్‌లోని రాజా బహదూర్ వెంట్రామిరెడ్డి పోలీస్ శిక్షణ సంస్థ (రాష్ట్ర పోలీసు అకాడమీ)లో శిక్షణ ముగించుకుని పాసింగ్ ఔట్ పరేడ్‌లో పాల్గొన్న 1211 మహిళా కానిస్టేబుళ్ల నుంచి డిజిపి గౌరవ వందనం స్వీకరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసులు తమ విధులను ఉద్యోగంగా భావించరాదని, బాధితులకు న్యాయం చేసేందుకు దృఢసంకల్పంతో పనిచేయాలని సూచించారు. అంకుటిత దీక్షతో విధులు నిర్వహించినప్పుడే పోలీసులకు ప్రజల్లో గౌరవం లభిస్తుందన్నారు. ఉన్నత చదువులు పూర్తి చేసుకున్న వారు సైతం కానిస్టేబుళ్లుగా ఉద్యోగంలో చేరడం గర్వంగా ఉందన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు ద్వారా ఎంపికైన కానిస్టేబుళ్లకు గతంలోనే సిఎం రేవంత్ రెడ్డి ఎల్‌బి స్టేడియంలో నియామక పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో పోలీసు అకాడమీ డైరెక్టర్, డిజిపి అభిలాష బిస్త్‌తో పాటు ఉన్నతాధికారులు పాల్గొన్నారు. శిక్షణలో ప్రతిభ కనబర్చిన కానిస్టేబుల్ అభ్యర్థులకు డిజిపి జితేందర్ ప్రశంసా పత్రాలను అందించారు.

**పరేడ్‌కు నాయకత్వం వహించిన సౌమ్యా..**

పాసింగ్ అవుట్ పరేడ్‌కు జనగాం జిల్లాకు చెందిన కానిస్టేబుల్ అభ్యర్థి యు.సౌమ్యా నాయకత్వం వహించారు. పాలకుర్తి మండలం తిరుమలగిరి గ్రామానికి చెందిన మల్లయ్య, అరుణ దంపతుల కూతురు సౌమ్యా బిటెక్ పూర్తి చేశారు. ఆ తరువాత సాఫ్ట్‌వేర్ రంగంవైపు వెళ్లారు. తల్లిదండ్రుల విజ్ఞప్తి మేరకు ఆమె తిరిగి పోలీసు కానిస్టేబుల్‌గా ఉద్యోగం సాధించారు. 9 నెలల శిక్షణ కాలంలో అన్ని పరీక్షల్లో టాపర్‌గా నిలిచి ట్రోఫీని గెలిచారు. పాసింగ్ అవుట్ పరేడ్ కమాండర్‌గా ఎంపిక కావడం తనకు గర్వంగా ఉందని సౌమ్యా పేర్కొన్నారు.

## అదానీపై క్రిమినల్ కేసులు

(మొదటి పేజీ తరువాయి)

గ్రూపు రూ.2 లక్షలకోట్లమేరకు నష్టపోయింది. సౌరవిద్యుత్ సరఫరా కాంట్రాక్టులను దక్కించుకోవడానికి మేలు చేసినందుకుగాను భారత అధికారులకు అదానీ గ్రూపు రూ.2,200 కోట్లు (265 మిలియన్ డాలర్లు) లంచాలు గుప్పించిందని ప్రాసిక్యూటర్లు ఆరోపించారు. ఈ కాంట్రాక్టుల ద్వారా 20 సంవత్సరాల కాలంలో భారీ ఎత్తున రూ.200 కోట్ల మేరకు లాభాలు అదానీ కంపెనీ సంపాదించుకుంటుంది. ఈ లాభాలకోసమే భారత్‌లో రూ.2,200 కోట్ల మేరకు లంచాలు ఇచ్చారు. వీటిలో భారీగా ఆంధ్రప్రదేశ్, ఒడిశా అధికారులకే ముడుపులు ముట్టాయి. ఇందులో ఆంధ్రప్రదేశ్ అధికారులకు రూ.1,750 కోట్లు లంచాలుగా చెల్లించారని కోర్టు డాక్యుమెంటులో ప్రాసిక్యూటర్లు పేర్కొన్నారు. తప్పుడు సమాచారం వ్యాప్తిచేసి అమెరికా ఇన్వెస్టర్లను వలలో వేసుకుందనీ, భారీగా వందల కోట్లరూపాయలు లాభాలు సంపాదించేందుకు అదానీ సౌరవిద్యుత్ కంపెనీ ప్రయత్నం చేసిందని న్యూయార్క్ ప్రాసిక్యూటర్లు రెండు కేసులు నమోదు చేశారు. ఈ వ్యవహారాలలో గౌతమ్ అదానీ భాగస్వామిగా ఉన్నారని ప్రాసిక్యూటర్లు పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వానికి చెందిన సోలార్ ఎనర్జీ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (ఎస్ఇసిఐ) సౌరవిద్యుత్ ఉత్పత్తి టెండర్లు అదానీకి ఇచ్చింది. ఈ నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్, ఒడిశా,ఛత్తీస్‌గఢ్, తమిళనాడు మధ్య అమ్మకం ఒప్పందాలు చేసుకునేందుకు 2021 జులై నెలలో, డిసెంబరు నెలలో ఎస్ఇసిఐ నేరుగా రంగంలోకి దిగింది. న్యూయార్క్ ప్రాసిక్యూటర్ల డాక్యుమెంట్లలో న్యూఢిల్లీకి చెందిన అజురే పవర్ పేరు కూడా ఉంది. ఈ సంస్థ నాలుగు గిగావాట్ల విద్యుత్ సరఫరా చేసేందుకు టెండరు గెలుచుకుంది.

అదానీ గ్రూపు 2021లో 8,000 మెగావాట్ల కాంట్రాక్టును గెలుచుకుంది. స్థానికంగా ఆ విద్యుత్‌ను ఉపయోగించుకునేందుకు రాష్ట్రాలు ఆఫర్ చేసే ధరలు అదానీ గ్రూపుకు గిట్టలేదు. అదే సంవత్సరంలో అదానీ ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిని కలుసుకున్నారు. అప్పటి ప్రభుత్వం 7,000 మెగావాట్ల విద్యుత్‌ను కొనుగోలు చేసేందుకు అంగీకారం తెలియజేసింది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ అధికారులకు మొత్తం 7,000 మెగావాట్లవిద్యుత్‌కు గాను రూ.1,750 కోట్లు (200 మిలియన్ డాలర్లు) ముడుపులు చెల్లించారు. ఒడిశా ప్రభుత్వం కూడా అదేపద్ధతిలో 500 మెగావాట్లు విద్యుత్ కొనుగోలు చేసింది. ఈ విధంగా ఆంధ్రప్రదేశ్‌లో అధికారులకు సుమారు రూ.1,750 కోట్లు లంచాలుగా ఇచ్చారని కోర్టు డాక్యుమెంట్లలో ప్రాసిక్యూటర్లు పేర్కొన్నారు. లంచాలు, మోసాలు, అక్రమాలు, అడ్డదారుల్లో వ్యాపార సామ్రాజ్యాన్ని విస్తరించుకుంటున్నారని గౌతమ్ అదానీపై ఇప్పటికే అనేక ఆరోపణలు, దేశంలో ప్రధాన ప్రతిపక్షాలు సంయుక్త పార్లమెంటరీ కమిటీ వేసి విచారణ జరపాలని డిమాండ్లు వచ్చినప్పటికీ కేంద్ర ప్రభుత్వం పట్టించుకోలేదు. కానీ అక్రమ మార్గంలో అమెరికా ఇన్వెస్టర్లను లొంగదీసుకుని పెట్టుబడులు సేకరించేందుకు అదానీ గ్రూపు ప్రయత్నం చేసిందని న్యూయార్క్ కోర్టులో క్రిమినల్ కేసులు నమోదు కావడంతో అటు స్టాక్ మార్కెట్‌లో కూడా అదానీ గ్రూపు సుమారు రెండు లక్షల కోట్ల మేరకు తీవ్ర నష్టాలను చవిచూసింది.

**లంచాలు ఇవ్వలేదు : అదానీ గ్రూపు ఖండన**

న్యూయార్క్ కోర్టులో నమోదైన కేసులకు సంబంధించి అదానీ గ్రూపు ఒక సంజాయిషీ ప్రకటన విడుదల చేసింది. అమెరికాలో పెట్టిన కేసులు, వాటి తాలూకూ ఆరోపణలను తీవ్రంగా ఖండించింది. తాము ఎవ్వరికీ లంచాలు ఇవ్వలేదని బుకాయించింది. అమెరికా ప్రాసిక్యూటర్ల ఆరోపణలు నిరాధారమైనవని కొట్టిపారేసింది. ఈ విషయంలో తగినవిధంగా న్యాయ సహాయం తీసుకుని ముందుకు వెళతామని ప్రకటించింది. నిజం నెమ్మదిగా నిగ్గుతేలుతుందని ప్రకటనలో పేర్కొంది. అదానీ గ్రీన్ ఎనర్జీ లిమిటెడ్ 600 మిలియన్ డాలర్ల బాండ్ల అక్రమ సేకరణ అంశాన్ని తిరస్కరించింది. ఈ కేసు నేపథ్యంలో తమ అనుబంధ సంస్థలు బాండ్ల ఆఫరింగ్‌ను ముందుకు తీసుకువెళ్ళకూడదని నిర్ణయించుకున్నట్లు అదానీ గ్రూపు అధికార ప్రతినిధి తెలిపారు. గౌతమ్ అదానీ గ్రూపు 85.5 బిలియన్ డాలర్ల సంపదతో ప్రపంచ కోటీశ్వరుల జాబితాలో 18వ స్థానంలో ఉన్నారు.

## జెపిసి దర్యాప్తు చేయాల్సిందే

(మొదటి పేజీ తరువాయి)

పిలుపు ఇచ్చింది. దేశంలో పేద ప్రజల సమస్యలు వదిలిపెట్టి పెట్టుబడిదారీ సంపన్నవర్గ ప్రాణమిత్రులకు మేలు చేసే విధానాలు ప్రధానమంత్రి నరేంద్రమోదీ అనుసరిస్తున్నారని విమర్శించింది. అదానీ చేసిన అపరాధాలు, మోదీకి, అదానీకి మధ్య ఉన్న సన్నిహిత మిత్రుత్వం, బిజెపి అనుసరిస్తున్న పెట్టుబడిదారీ అనుకూల నమూనా ఆర్థిక విధానాలను ఎండగట్టేందుకు, ఈ వ్యవహారంపై దర్యాప్తు చేసేందుకు జెపిసి నియామకం జరగాలని కోరుతూ పార్టీ శాఖలు దేశవ్యాప్తంగా నిరసన ప్రదర్శనలు చేయాలని గురువారంనాడు విడుదల చేసిన ఒక ప్రకటనలో సిపిఐ జాతీయ కార్యదర్శి వర్గం పిలుపు ఇచ్చింది. భారత అధికారులకు 250 మిలియన్ డాలర్లకంటే ఎక్కువ మొత్తాన్ని లంచాలుగా ఇచ్చే పథకాన్ని గౌతమ్ అదానీతోపాటు ఆయన వ్యాపార సహచరులు అమలు చేశారన్న దోషారోపణలపై అమెరికా న్యాయస్థానం క్రిమినల్ కేసులు దాఖలు చేసిందంటే బిజెపి, నరేంద్రమోదీ పరిపాలనలో దేశ అధికారగణాల్లో ఏ స్థాయిలో అవినీతి, అక్రమాలు, మోసాల కుళ్ళు ఎంత లోతుగా పేరుకుపోయిందో అర్థమవుతోందని, పాలకపార్టీ అవినీతికి ఇది మరో నిలువెత్తు నిదర్శనమని సిపిఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా ఆ ప్రకటనలో విమర్శించారు. ఈ నేరాల్లో రాజకీయ తంత్రం, ఆర్థిక అక్రమాలు పెనవేసుకుపోయాయని కూడా ఈ కేసు పత్రాలలో పేర్కొన్నారని, అదానీ గ్రూపు వ్యాపార సామ్రాజ్యంలో అక్రమాలకు, అవినీతికి నిలయంగా ఉందని దీర్ఘకాలంగా ఆరోపణలు చుట్టుముట్టే ఉన్నాయని, ఇప్పుడు కొత్తగా న్యూయార్క్ కోర్టులో రెండు క్రిమినల్ కేసులు వీటికి అదనంగా వచ్చి చేరాయని డి.రాజా విమర్శించారు. స్టాక్ మార్కెట్‌ను తనకు అనుకూలంగా మలచుకున్న అక్రమాలను, ఆర్థిక దుర్మార్గాలను వరుస క్రమంలో హిండెన్‌బర్గ్ బహిర్గతం చేసిందని, ఎక్కడా బహిర్గతం చేయని అప్పులు, అదానీ గ్రూపు కంపెనీల విలువను గాలిబుడగలా పెంచేసిందని వెల్లడించిందని గుర్తుచేశారు. ఈ మధ్యనే స్టాక్ మార్కెట్‌ను కూడా తన కంపెనీ ప్రయోజనాలకు అనుకూలంగా మలచుకున్నారన్న ఆరోపణలపై సెబీ దర్యాప్తు వివాదంలో కూడా ఆయన చిక్కుకున్నారని, ఈ కేసులో సెబీ చీఫ్ మాధబి బచ్ భాగస్వామ్యం కూడా గణనీయంగా ఉందన్న ఆరోపణలపై అందరిదృష్టీ కేంద్రీకృతమైందని గుర్తుచేశారు. ''

## తక్షణమే అరెస్టు చేయాలి

(మొదటి పేజీ తరువాయి)

ఆరోపణలతో ఆయన భారతీయ, అమెరికా చట్టాలను ఉల్లంఘించినట్లు స్పష్టమైందన్నారు. 'ఏక్ హై తో సేఫ్ హై' అని ప్రధాని మోదీ ఇటీవల పదే పదే చేసిన నినాదాన్ని ఉటంకిస్తూ ప్రధాని, అదానీ ఒక్కటే అని అందుకే భారతదేశంలో వారు సురక్షితంగా ఉన్నారని ఎద్దేవా చేశారు. అదానీని తక్షణమే అరెస్టు చేసి విచారణ జరపాలని, సెబీ ఛైర్‌పర్సన్ మాధవబి పురి బచ్‌ను ఆ పదవి నుంచి తొలగించి, దర్యాప్తు చేయాలని డిమాండ్ చేశారు. ఈ అంశాన్ని సోమవారం నుంచి ప్రారంభమయ్యే పార్లమెంటు శీతాకాల సమావేశాలలో లేవనెత్తుతామని, ఈ విషయంలో ప్రతిపక్షాలన్నీ ఒకే మాటపై ఉన్నాయని, అందరం కలిసి దీనిని లేవనెత్తుతామన్నారు. అదానీ గ్రూప్ కార్యకలాపాలపై సంయుక్త పార్లమెంటరీ కమిటీని వేయాలని రాహుల్‌గాంధీ పునరుద్ఘాటించారు. మోదీ ప్రభుత్వం రక్షిస్తున్నందున అదానీని భారతదేశంలో అరెస్టు చేయడం లేదా విచారణ చేయడం జరగదని తాను గ్యారంటీ ఇస్తానన్నారు. అదానీ అంశాన్ని పదే పదే ప్రస్తావించినా ఏమీ కాలేదని అడిగిన ప్రశ్నకు రాహుల్ గాంధీ స్పందిస్తూ తాను అదానీ అంశం లేవనెత్తిన తరువాత అనేక విషయాలు జరిగాయని అన్నారు. ప్రధానమంత్రి విశ్వసనీయత దెబ్బతిన్నదని, దేశమంతటికీ ప్రధాని, అదానీ ఒక్కటేనని తెలిసిపోయిందని, తాము ప్రతి ఒక్కరినీ, వారి నెట్‌వర్క్ మొత్తాన్ని బహిర్గతం చేస్తామని, అందులో మాధబి బచ్ మొదటి ఉదాహరణ అని వివరించారు. భారత్ అదానీ పట్టులో ఉన్నదని, భారత్‌ను అదానీ నియంత్రిస్తున్నాడని, తాము వారిని వదిలిపెట్టే ప్రసక్తే లేదని రాహుల్‌గాంధీ స్పష్టం చేశారు. అదానీ అరెస్టు కాబోరని, ఎందుకుంటే ఆయనను ప్రధాని రక్షిస్తున్నారని తాము దేశానికి చూపించాలనుకుంటున్నామని, రూ.2వేల కోట్ల కుంభకోణం తరువాత కూడా అదానీ అరెస్టు లేదా ఆయనకు వ్యతిరేకంగా విచారణ జరగదని, అందుకు తాను గ్యారంటీ అని చెప్పారు. కొన్ని బిజెపి యేతర రాష్ట్రాల పేర్లను కూడా అమెరికా ప్రాసిక్యూటర్‌లు వెల్లడించడాన్ని ప్రస్తావించగా, ఎక్కడ జరిగినా, అక్కడ ఏ ప్రభుత్వం ఉన్నా, విచారణ జరగాల్సిందేనని, కానీ అవినీతిలో భాగస్వాములైన వారిని అరెస్టు చేయాల్సిందేనని స్పష్టం చేశారు.

**జెపిసి వేయాల్సిందే : ఖర్గే**

అదానీ గ్రూప్ కార్యకలాపాలపై విదేశాలలో పెట్టుబడులు, భారత్‌లో సంస్థాగత క్షీణత సహా అన్ని కోణాలలో సంయుక్త పార్లమెంటరీ కమిటీ(జెపిసి)తో విచారణ జరిపించాలని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే డిమాండ్ చచేశారు. తక్షణమే అదానీతో విచారణను ప్రారంభించాలని అన్నారు. భారతీయ వ్యాపారిని ఇతర దేశం తప్పుబట్టినప్పుడు, అంతర్జాతీయ వేదికపై దేశ ప్రతిష్ఠకు భంగం కలిగిందన్నారు. గౌతమ్‌అదానీ, ఇతరులను అమెరికా సెక్యూరిటీ ఎక్స్ఛేంజెస్ కమిషన్ (ఎస్ఇసి) తప్పుపట్టడం ద్వారా కాంగ్రెస్ పార్టీ 2023 జనవరి నుంచి మోదానీ కుంభకోణాలపై విచారణ డిమాండ్‌ను రూఢీ చేస్తుందని ఎఐసిసి ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేశ్ అన్నారు.

## అద్భుతమైన పాలన

(మొదటి పేజీ తరువాయి)

రూ. 18 వేల కోట్ల వ్యవసాయ రుణాలు, ఆర్‌టిసి ఉచిత ప్రయాణాలు, ఇందిరమ్మ ఇళ్ల పథకం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రూ. 500 గ్యాస్, 50 వేల ఉద్యోగాల భర్తీ లాంటి అనేక కార్యక్రమాలు చేపట్టిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. ఈ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు ప్రజల్లోకి విస్తృతంగా తీసుకపోవాలని నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. అందుకోసం ప్రభుత్వం విజయోత్సవాలు చేపట్టిందన్నారు. ప్రతిపక్ష బిఆర్‌ఎస్, బిజెపిలు ప్రభుత్వంపైన విపరీతంగా దుష్ప్రచారం చేస్తున్నాయన్నారు. వాటిని సమర్థవంతంగా తిప్పికొట్టాలన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో పార్టీ విజయానికి అన్ని విధాలుగా గట్టిగా కృషి చేయాలని పార్టీ శ్రేణులకు మహేశ్ కుమార్ గౌడ్ పిలుపునిచ్చారు.

**కుల గణన అడ్డుకోవాలని కొందరు ప్రయత్నం చేస్తున్నారు : భట్టి విక్రమార్క**

కుల గణన అడ్డుకోవాలని కొందరు ప్రయత్నం చేస్తున్నారని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మండిపడ్డారు. కొందరు దోపిడీ దారులు కులగణనపై అబద్ధపు ప్రచారాలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. ఎందరు కుట్ర చేసినా కుల గణనను విజయవంతం చేస్తామని అన్నారు. కుల గణన చారిత్రాత్మక విజయమన్నారు. దేశానికి తెలంగాణ మోడల్‌గా కుల గణన నడుస్తుందన్నారు. వనరులు ప్రజలకు సమానంగా పంచాలని కోరుకునే వారు కుల గణనకు మద్దతు తెలపాలని భట్టి విక్రమార్క కోరారు. నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించేందుకు ప్రభుత్వం రాగానే టిజిపిఎస్‌సి ప్రక్షాళన చేసి, 50 వేల ఉద్యోగాలు భర్తీ చేశామన్నారు. పదేళ్లలో గ్రూప్ 1 పరీక్షలు సరిగ్గా నిర్వహించాలేక గాలికి వదిలేశారని విమర్శించారు. బిఆర్‌ఎస్ నేతల కుటిల ప్రయత్నాలను తట్టుకొని, ఉద్యోగాల భర్తీ చేస్తున్నామన్నారు. మహిళ సంఘాలకు వడ్డీ లేని రుణాలు అందిస్తూ, ఆ వడ్డీని సైతం ప్రభుత్వం కట్టనుందని చెప్పారు. మహిళ సంఘాలతో వెయ్యి మెగా ఓల్ట్ విద్యుత్ ఉత్పత్తికి ఒప్పందం చేసుకున్నామన్నారు.

## జెపిసి గడువు పెంచాల్సిందే

(మొదటి పేజీ తరువాయి)

త్వరలోనే సభ్యులకు పంపిస్తామన్నారు. దీనిపై జెపిసిలో ప్రతిపక్ష సభ్యులు తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. నినాదాలు చేస్తూ బైటికి వచ్చారు. కొందరు స్పీకర్ ఓం బిర్లాను కలిసి జోక్యం చేసుకోవాలని కోరారు. పార్లమెంటు శీతాకాల సమావేశాలు ప్రారంభమయ్యే సోమవారం నుంచి వారంలో చివరి రోజున నివేదిక సమర్పించాలని జెపిసిని లోక్‌సభ కోరింది. ఇప్పటికే వక్ఫ్ సవరణ బిల్లును శీతాకాల సమావేశాలలో ఆమోదించాల్సిన బిల్లుల జాబితాలో ప్రభుత్వం చేర్చింది. జెపిసి నివేదిక సమర్పించిన వెంటనే ఆ ప్రక్రియను ప్రారంభించాలని భావించింది. ప్రభుత్వ ఆలోచనకు అనుగుణంగా జెపిసి ఛైర్మన్ జగదాంబికాపాల్ పని చేస్తున్నారని గతంలో కూడా ప్రతిపక్ష సభ్యులు ఆరోపించారు. జెపిసి పని నుంచి తాము తప్పుకుంటామని కూడా ఒక దశలో హెచ్చరించారు.ఏ మాత్రం సమయం ఇవ్వకుండా ప్రతి రోజు నిరంతరం జెపిసి సమావేశాలు ఏర్పాటు చేసి, ఛైర్మన్ బలవంతంగా నెట్టుకుపోతున్నారని వారు ఆరోపించారు. తమను కనీసం పట్టించుకోవడం లేదన్నారు. ఈ విషయంలో గతంలో ప్రతిపక్ష సభ్యులు కొందరు లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాను కలిసి విజ్ఞప్తి చేశారు.

# ప్రమాణాలతో కూడిన వైద్యం ప్రభుత్వ బాధ్యత

## రాష్ట్రంలో వైద్యసేవలను మరింత విస్తృతం చేస్తాం
## వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ్మ



**ప్రజాపక్షం/మంచిర్యాల బ్యూరో :** తెలంగాణ రాష్ట్రంలో పేదవాడి ఆరోగ్యం కోసం ప్రమాణాలతో కూడిన వైద్యం అందించడం ప్రభుత్వ బాధ్యతగా తీసుకుందని, రాష్ట్రంలో అవసరమైన చోట్ల వైద్య సేవలను మరింత విస్తృతపరుస్తామని తెలంగాణ రాష్ట్ర వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ, శాస్త్ర సాంకేతిక శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ్మ స్పష్టం చేశారు. గురువారం మంచిర్యాల జిల్లా కేంద్రంలోని ఐబి చౌరస్తాలో 300 కోట్ల రూపాయల నిధులతో మంజూరైన సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మాణానికి రాష్ట్ర ఐటి పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్‌బాబు, టిజిఎం ఐడిసి ఎండి హేమంత్ బొర్కడే, జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, జిల్లా అదనపు కలెక్టర్ సబావత్ మోతీలాల్, మంచిర్యాల శాసనసభ్యుడు కొక్కిరాల ప్రేంసాగర్‌రావులతో కలిసి భూమి పూజ నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో మంత్రి మాట్లాడుతూ, ఉత్తర తెలంగాణ ప్రాంతంలో మంచిర్యాల సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మాణం ద్వారా ప్రజలకు మెరుగైన వైద్య సేవలను అందిస్తామని, ఆసుపత్రి నిర్మాణానికి తాను శంకుస్థాపన చేయడం అదృష్టంగా భావిస్తున్నాని అన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో ఆరు పడకలను 30 పడకలకు అప్‌గ్రేడ్ చేయడంతో పాటు రాష్ట్రంలో ఏడు వేలకుపైగా వైద్య సిబ్బందిని నియమించడం జరిగిందని, సుమార్ 54వేల మంది నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు కల్పించడం జరిగిందని మంత్రి తెలిపారు. ప్రతి 30 నుండి 35 కిలోమీటర్లకు ఒక ట్రామా కేంద్రం ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని, రాష్ట్ర వ్యాప్తంగా 74 ట్రామా కేంద్రాలు ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదించడం జరిగిందని తెలిపారు. రోడ్డు ప్రమాదాల కారణంగా ప్రజలు ప్రాణాపాయానికి గురికాకుండా బ్లాక్‌స్పాట్ ప్రాంతాలలో అంబులెన్స్‌లను అందుబాటులో ఉంచేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. మంచిర్యాల జిల్లాలోని కిడ్ని డయాలసిస్ కేంద్రంలో పది పడకలను 30 పడకలకు పెంచడంతో పాటు డయాబెటిక్ వ్యాధిగ్రస్తుల సంక్షేమంపై ప్రత్యేక చర్యలు తీసుకుంటామని తెలిపారు. జిల్లాలో అదనంగా 29 ఉపకేంద్రాల ఏర్పాటుతో పాటు మంచిర్యాల నియోజకవర్గంలోని వెంకట్రావుపేట, చెన్నూర్ నియోజకవర్గంలోని అంగ్రాజ్‌పల్లిలలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఉత్తర తెలంగాణాల నాలుగు క్యాన్సర్ కేంద్రాలు, వస్కులర్ సెంటర్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని మంత్రి వెల్లడించారు.

**అధికారులు సమన్వయంతో పనిచేస్తున్నారు**
**రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్‌బాబు**

రాష్ట్రంలో ప్రభుత్వం సంవత్సర కాలంలో అనేక రంగాలలో అభివృద్ధి సాధించిందని, ఈ క్రమంలోనే ఈనెల 19వ తేది నుండి డిసెంబర్ 7వ తేది వరకు ప్రజాపాలన ప్రజా విజయోత్సవాల కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని, ఈ అభివృద్ధిలో అధికారులు సమన్వయంతో పనిచేస్తున్నారని తెలంగాణ రాష్ట్ర ఐబి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్‌బాబు అన్నారు. మంచిర్యాలలో ఏర్పాటు చేస్తున్న సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి ద్వారా ఏడు నియోజకవర్గాలు, మహారాష్ట్ర, చత్తీస్‌ఘడ్ ఇతర రాష్ట్రాల నుండి వైద్య సేవల నిమిత్తం వచ్చే ప్రజలకు అందుబాటులో అన్ని సేవలను అందించడం జరుగుతుందని అన్నారు. మంచిర్యాలలో వరద ప్రభావిత ప్రాంతాలు ముంపునకు గురికాకుండా 262 కోట్ల రూపాయల వ్యయంతో కరకట్ట నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. జిల్లాలో పారిశ్రామిక వాడల అభివృద్ధికి ఇండస్ట్రియల్ ఎస్టేట్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవడంతో పాటు చిన్న మధ్యతరహా పరిశ్రమల అభివృద్ధిని ప్రోత్సహించడం జరుగుతుందని తెలిపారు. మంచిర్యాల శాసనసభ్యుడు కొక్కిరాల ప్రేంసాగర్ రావు మాట్లాడుతూ, మంచిర్యాల జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేస్తున్న సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి దాదాపు 15 లక్షల మందికి ఉపయోగపడుతుందని , ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్ళలేని వారికి ఉచితంగా వైద్యసేవలు అందించడం జరుగుతుందని తెలిపారు. ఆసుపత్రి ఏర్పాటు కొరకు ప్రభుత్వం 300 కోట్ల రూపాయలు మంజూరు చేసిందని 225 పడకలతో మాతా శిశు, 425 పడకలతో ప్రభుత్వ ఆసుపత్రి కలిపి నిర్మించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ కార్యక్రమాలలో తెలంగాణ మినిమమ్ వేజ్‌బోర్డు చైర్మన్ జనక్‌ప్రసాద్, మంచిర్యాల రాజస్వ మండల అధికారి శ్రీనివాస్‌రావు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ హరీష్‌రాజ్, ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపల్ ఎండి సులేమాన్, సంబంధిత శాఖల అధికారులు, పోలీసు అధికారులు, ప్రజాప్రతినిధులు, అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

# వ్యవసాయానికి మరింత చేయూత

## వ్యవసాయ మంత్రి తుమ్మలతో రైతు కమిషన్ సమావేశం



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** వ్యవసాయానికి మరింత చేయూతను ఇచ్చే దిశగా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందుకు సంబంధించి గురువారం సచివాలయంలో తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ, రైతు కమిషన్ చైర్మన్ ఎం.కోదండరెడ్డి, ఇతర సభ్యులతో వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆదర్శరైతుల నియామకము, వ్యవసాయ పనులకు ఉపాధిహామీ పథకం అనుసంధానం, వ్యవసాయ యంత్రాల పనిముట్లపై జిఎస్‌టి ఎత్తివేత, విత్తనచట్టంలో మార్పులు, రైతులు, ఉత్పత్తిదారుల ఆర్గనైజేషన్‌లను శక్తివంతము చేసే దిశగా తీసుకోవాల్సిన అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ, ఆదర్శరైతుల నియామకంపై కమిషన్ సభ్యుల సూచనలను అన్నిటినీ క్రోడీకరించి ఒక నివేదిక సమర్పించాల్సిందిగా వ్యవసాయ శాఖ అడిషనల్ డైరెక్టర్‌ను ఆదేశించారు. ఈ అంశాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తానని కమిషన్ సభ్యులకు హామీ ఇచ్చారు. కమిషన్ చర్చించిన మిగతా అంశాలన్ని కేంద్ర ప్రభుత్వ పరిధిలోనివని, విత్తనచట్టంలో మార్పులు, వ్యవసాయ యంత్రాలు, పనిముట్లపై జిఎస్టీ ఎత్తివేయాల్సిందిగా కేంద్రప్రభుత్వానికి ఇదివరకే విజ్ఞప్తి చేశామన్నారు. వ్యవసాయరంగానికి ఉపాధిహామి పథకాన్ని అనుసంధానం అంశాలు కేంద్రప్రభుత్వ పరిశీలనలో ఉందని, ఇందుకు సంబంధించి వివిధ మార్గాలలో కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామని వారికి హామీ ఇచ్చారు.

ఆత్మ (అగ్రి టెక్నాలజీ మేనేజ్‌మెంట్ ఏజెన్సీ) కమిటీల నియమకాన్ని చేపట్టి, త్వరలో వాటి ద్వారా సైతం విస్తరణ కార్యక్రమాలు చేపట్టి వ్యవసాయ రంగానికి నూతనోత్తేజం కల్పించే దిశలో ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. కమిటీల ద్వారా నిర్వహించే కార్యక్రమాలకు మార్గ నిర్దేశం చేయాల్సిందిగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కమిషన్ సభ్యులను కోరారు.

# మా సమస్యలను పరిష్కరించండి

## మీడియా అకాడమీ చైర్మన్‌కు మహిళా జర్నలిస్టుల వినతి



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** మీడియా సంస్థల్లో వృత్తిపరంగా మహిళా జర్నలిస్టులు ఎదుర్కొంటున్న వివిధ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం (టియుడబ్ల్యుజె) మహిళా సంక్షేమ కమిటీ గురువారం తెలంగాణ రాష్ట్ర మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్‌రెడ్డికి విజ్ఞప్తి చేసింది. ప్రతినిధి బృందంలో టియుడబ్ల్యుజె మహిళా సంక్షేమ కమిటీ బాధ్యులు కె.రాజేశ్వరి, కె.అజిత, ఎ.అరుణ, వి.యశోద, సూర్యకుమారి, ప్రతిభ, సాజిదాబేగంలతో కూడిన ప్రతినిధి బృందం గురువారం హైదరాబాద్‌లోని బిఆర్‌కె భవన్‌లో అకాడమీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డిని కలిసి ఒక విజ్ఞాపన పత్రాన్ని అందజేసింది. ప్రతి మీడియా సంస్థలో మహిళలకు 33 శాతం అక్రెడిటేషన్లు ఇవ్వాలనే నిబంధన, ప్రతి మీడియా సంస్థలో ఇంటర్నల్ కంప్లైంట్స్ కమిటీ ఉండాలనే నిబంధనను కచ్చితంగా అమలుచేయాలని వారు కోరారు. విశాఖ గైడ్‌లైన్స్ ప్రకారం ప్రతి మీడియా సంస్థలోనూ జెండర్ సెన్సిటివిటీ వర్క్‌షాప్స్‌ను నిర్వహించేందుకు చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. ఐసిసి మార్గదర్శకాలు పాటించని సంస్థలకు అక్రెడిటేషన్లు ఇవ్వరాదనే నిబంధనను తీసుకురావాలని, ఐసిసిలో ఇచ్చే ప్రతి ఫిర్యాదును మీడియా అకాడమీ దృష్టికి కూడా తీసుకువచ్చేలా అకాడమీ ఆవరణలో ఫిర్యాదుల బాక్స్‌ను ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రతి మీడియా సంస్థలో పనిచేస్తున్న మహిళా ఉద్యోగుల జాబితాను కచ్చితంగా ఆరు నెలలకోసారి మీడియా అకాడమీకి సమర్పించేలా చర్యలు చేపట్టాలన్నారు. ఇళ్ల స్థలాల కేటాయింపులో మహిళా జర్నలిస్టులకు 33 శాతం రిజర్వేషన్ కచ్చితంగా అమలు చేయాలని, అక్రెడిటేషన్‌లతో సంబంధం లేకుండా మహిళా జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు, హెల్త్ కార్డులు మంజూరీ చేయాలన్నారు. మీడియా సంస్థల్లో పనిచేసే మహిళా ఉద్యోగులకు రాత్రి వేళల్లో తప్పనిసరిగా రవాణా సౌకర్యం కల్పించాలన్నారు. మహిళా జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు చేపడతామని చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి సానుకూలంగా స్పందించారు.

**ప్రతీ జర్నలిస్ట్ ప్రయోజనాలు కాపాడుతాం**
**మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్ రెడ్డి**

అర్హులైన ప్రతి జర్నలిస్టు ప్రయోజనాల కోసం తెలంగాణ మీడియా అకాడమీ పనిచేస్తుందని అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్‌రెడ్డి తెలియజేశారు. న్యూస్ ప్రొడ్యూసర్స్‌ను జర్నలిస్టులుగా గుర్తించాలని, ప్రభుత్వం జర్నలిస్టులకు అందించే సంక్షేమ కార్యక్రమాలను వర్తింపజేయాలని కోరుతూ తెలంగాణ న్యూస్ ప్రొడ్యూసర్స్ అసోసియేషన్ (టిఎన్‌పిఎ) ప్రతినిధి బృందం గురువారం అకాడమీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డిని ఆయన కార్యాలయంలో కలిసి వినతిపత్రాన్ని అందించారు. టెలివిజన్ న్యూస్ రంగంలో ఆన్‌లైన్ ప్రొడ్యూసర్లుగా పిలవబడే ప్యానెల్ ప్రతినిధుల కృషి, వారి పనితీరు గురించి చైర్మన్‌కు వివరించారు. ఈ సందర్భంగా న్యూస్ ప్రొడ్యూసర్స్ బృందం కోరిన విధంగా న్యూస్ కోసం పనిచేసే ప్రతీ ఒక్కరినీ జర్నలిస్టులుగా పరిగణించే విధంగా విధానాలు తీసుకువస్తామని, కొత్త ప్రభుత్వంలో జర్నలిస్టుల సంక్షేమం కోసం కృషి చేస్తున్నామని అకాడమీ చైర్మన్ శ్రీనివాసరెడ్డి తెలిపారు. చైర్మన్‌ను కలిసిన వారిలో టిఎన్‌పిఎ అధ్యక్షులు జోగిరెడ్డి, ప్రధాన కార్యదర్శి నాంపల్లి మురళి, సహాయ కార్యదర్శి సందీప్ కూర్మాచలం, కోశాధికారి మల్లికార్జున్ కార్యవర్గ సభ్యులు లెనిన్, హనుమంతు తదితరులు ఉన్నారు.

## గత బిఆర్‌ఎస్ ప్రభుత్వానిది గడీల పాలన..

# కాంగ్రెస్‌ది ప్రజల మధ్య పాలన

## గాంధీభవన్‌లో ముఖాముఖి కార్యక్రమంలో డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క
## సమస్యల పరిష్కారానికి అక్కడికక్కడే ఆదేశాలు



**ప్రజాపక్షం / హైదరాబాద్ :** గత బిఆర్‌ఎస్ ప్రభుత్వం గడీల మధ్యన పరిపాలించగా, నేడు కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం, సిఎం, డిప్యూటీ సిఎం, యావత్ మంత్రివర్గం ప్రజల మధ్యన పరిపాలన చేస్తున్నదని, ఇవన్నీ ప్రజల విజయాలని డిప్యూటీ ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క అన్నారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ప్రజలతో మమేకం అవుతూ కార్యకర్తలు, ప్రజల అభిప్రాయాలను తెలుసుకుని పరిష్కరించేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు. గాంధీభవన్‌లో గురువారం ప్రజలు, కార్యకర్తలతో ముఖాముఖి కార్యక్రమం సందర్భంగా డిప్యూటీ సిఎం భట్టివిక్రమార్క మాట్లాడారు. రాష్ట్రంలో విద్య, వైద్యంపై ప్రజా ప్రభుత్వం దృష్టి నిలిపిందని, అందులో భాగంగా అనేక అభివృద్ధి, సంక్షేమ చర్యలు చేపట్టిందని వివరించారు. పరిశ్రమలు, ఉత్పత్తి అంటే ఆదానీ మాత్రమే అనుకునేవారని, కాంగ్రెస్ ప్రభుత్వం వారిని కిందికి దించి స్వయం సహాయక సంఘాల సభ్యులతో 10 మెగావాట్ల సోలార్ పవర్ ఉత్పత్తికి రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందం చేసుకుందని డిప్యూటీ సిఎం వివరించారు. ఆర్‌టిసి బస్సులు కొనుగోలు చేసి వాటిని మహిళా సంఘాలకు అప్పగించి వారు ఆర్‌టిసికి బస్సులు లీజుకు ఇచ్చి ఆదాయం పొందేలా చూస్తామని అన్నారు. కులగణన చారిత్రాత్మక నిర్ణయమని, దీనిని అడ్డుకోవాలని దోపిడీదారులు సర్వేపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆగయన ఆగ్రహం వ్యక్తం చేశారు. సర్వే పూర్తయితే ఇన్నాళ్లు దోచుకున్న వారి ఆటలు సాగవని, ఫ్యూడల్ వ్యవస్థ నుంచి బయటికి తెచ్చి సమ సమాజ నిర్మాణానికి ప్రజా ప్రభుత్వం పునాదులు వేస్తుందన్నారు.

**సమస్యల పరిష్కారానికి అక్కడికక్కడే ఆదేశాలు**

డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క నిర్వహించిన ముఖాముఖిలో వినతులు వెల్లువెత్తాయి. సుమారు 300 మంది వివిధ సమస్యలను డిప్యూటీ సిఎంకు వివరించారు. మొదట బృందాలుగా వచ్చిన వారితో డిప్యూటీ సిఎం సమావేశం అయ్యారు. పరీక్షలు నిర్వహించి, ఫలితాలు వెల్లడించినా ఇంకా పోస్టింగ్‌లు ఇవ్వలేదని జూనియర్ లెక్చరర్స్ అభ్యర్థులు విన్నవించగా సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తానని డిప్యూటీ సిఎం హామీ ఇచ్చారు. ట్రాన్స్‌కో, జెన్‌కోలో ఖాళీగా ఉన్న డైరెక్టర్లు, డిప్యూటీ డైరెక్టర్ల, ఇంజనీర్ల ఖాళీలను భర్తీ చేయాలని సంబంధిత శాఖ ఉద్యోగులు కోరారు.

పలు సమస్యలపై ఐదు బృందాలు డిప్యూటీ సిఎంకు విజ్ఞప్తి చేయగా సంబంధిత అధికారులను వివరణ కోరుతూ లిఖితపూర్వక ఆదేశాలు జారీచేశారు. అనంతరం ప్రజలు, కార్యకర్తల సమస్యలు విని సంబంధిత అధికారులకు సమస్యలు పరిష్కరించాలని డిప్యూటీ సిఎం ఆదేశాలు జారీ చేశారు.

# డిసెంబర్ 7న రాష్ట్ర వ్యాప్త 'ఆటో బంద్'

## తెలంగాణ రాష్ట్ర ఆటో డ్రైవర్స్ యూనియన్స్ జెఎసి కన్వీనర్ బి.వెంకటేశం



**ప్రజాపక్షం / హైదరాబాద్ :** గత పదేళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఆటో డ్రైవర్ల సమస్యల పరిష్కరంలో కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ డిసెంబర్ 7వ తేదీన రాష్ట్ర వ్యాప్త ఆటో బంద్ నిర్వహించనున్నట్లు తెలంగాణ రాష్ట్ర ఆటో డ్రైవర్స్ యూనియన్స్ జెఎసి కన్వీనర్ బి.వెంకటేశం ప్రకటించారు. అదే రోజు హైదరాబాద్‌లో లక్ష మంది రవాణా కార్మికులతో భారీ ర్యాలీ, బహిరంగసభను నిర్వహిస్తామని ఆయన వెల్లడించారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో మానిఫెస్టోలో ఆటో డ్రైవర్లకు ఇచ్చిన హామీలను నెరవేర్చకపోవడం దుర్మార్గమని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లోఉన్న ఆటో డ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ రాష్ట్ర ఆటో డ్రైవర్స్ యూనియన్స్ జెఎసి రాష్ట్ర సదస్సు హైదరాబాద్ బషీర్‌బాగ్‌లోని దేశోద్ధారకభవన్‌లో గురువారం జరిగింది. సదస్సులో జెఎసి నేతలు బి.వెంకటేశం (ఎఐటియుసి), పి.శ్రీకాంత్ (సిఐటియు), వి.ప్రవీణ్ (టియుసిఐ), ఎంఎ.సలీమ్ (యుటిఎడిడబ్ల్యూఎ), ఎ.సత్తిరెడ్డి (టిఎడిఎస్), వి.మారయ్య (బిఆర్‌టియు) తోపాటు ఎఐటియుసి సీనియర్ నాయకులు వి.ఎస్.బోస్, బిఆర్‌టియు అధ్యక్షులు రాంబాబు యాదవ్ తదితరులు పాల్గొన్నారు. సదస్సులో నాయకులు ఎ.బిక్షపతి యాదవ్, ఎస్.అశోక్, సిహెచ్. జంగయ్య (ఎఐటియుసి), లింగంగౌడ్ (టియుసిఐ), లక్ష్మణ్ (సిఐటియు), ఎండి.నజీర్ (యుటిఎడిడబ్ల్యూఎ)పాల్గొన్నారు.

# విద్యార్థుల అస్వస్థతకు కోడిగుడ్లే కారణం

## సరఫరా చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి
## ఎఐటియుసి డిమాండ్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** నారాయణపేట్ జిల్లా మాగనూరు ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల అస్వస్థత గురికావడానికి వారు తిన్న కోడిగుడ్లే కారణమని, స్కూల్‌కు వీటినిసరఫరా చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) రాష్ట్ర అధ్యక్షురాలు పి.ప్రేంపావని, ప్రధాన కార్యదర్శి జంపాల రవీందర్, ఉప ప్రధాన కార్యదర్శి సత్తెనపల్లి విజయలక్ష్మి, గౌరవాధ్యక్షురాలు డి.కమలారెడ్డిలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ ఘటన పట్ల వారు విచారాన్ని వ్యక్తంచేశారు. ఈ ఘటనకు వంట కార్మికులు ఏమాత్రం బాద్యులు కాదని, అస్వస్థతకు గురైన విద్యార్థులు పూర్తిగా కోలుకునే వరకు ప్రభుత్వమే బాధ్యత వహించాలని కోరారు.మాగనూరు ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజనం చేసిన తర్వాత 100 మంది విద్యార్థులు వాంతులు చేసుకుని తీవ్ర అస్వస్థతకు గురికావడానికి వారి భుజించిన కోడిగుడ్లే కారణమని వైద్యులు తేల్చినట్లు సమాచారమని తెలిపారు.

# విద్యార్థులు చదువుతోపాటు సమాజాన్ని చదవాలి

## ఎఐఎస్‌ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి 'గ్యార నరేష్'



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** విద్యార్థులు చదువుతో పాటు సమాజాన్ని సైతం చదవాలని అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఎఐఎస్ఎఫ్) రాష్ట్ర సహాయ కార్యదర్శి గ్యార నరేష్ సూచించారు. అప్పుడే భవిష్యత్ ఎలాంటి కష్టాలు వచ్చినా సునాయాసంగా ఎదుర్కొనే ధైర్యం వస్తుందన్నారు. గురువారం ఎఐఎస్‌ఎఫ్ హైదరాబాద్ జిల్లా సమితి ఆధ్వర్యంలో నిజాం కళాశాలల్లో సభ్యత్వ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా విచ్చేసిన నరేష్ మాట్లాడుతూ దేశ స్వాతంత్రం కోసం ఆవిర్భవించిన ఏకైక విద్యార్థి సంఘం ఎఐఎస్‌ఎఫ్ నాటి నుంచి నేటి వరకు విద్యారంగంలోని అపరిష్కృత సమస్యల పరిష్కారానికి మొక్కవోని ధైర్యంతో అవిశ్రాంత పోరాటాలను చేస్తోందన్నారు. విద్యార్థులు ఈ సంఘంలో సభ్యులుగా చేరి తమ సమస్యల పరిష్కారానికి ఉద్యమించాలని , ఎఐఎస్‌ఎఫ్ జెండా విద్యార్థులకు అండగా ఉంటుందని తెలిపారు. పాలకులు విద్యను వ్యాపారం చేస్తూ ప్రభుత్వ విద్యను విశ్వవిద్యాలయాలను పూర్తిగా నిర్వీర్యం చేస్తున్నారన్నారు. పేద,మధ్యతరగతి విద్యార్థులు చదివే విశ్వవిద్యాలయాలకు ప్రభుత్వం సరైన నిధులు కేటాయించకుండ ఇబ్బందులకు గురిచేస్తురని ఆగ్రహం వ్యక్తం చేశారు. 1268 మంది ప్రొఫెసర్స్ ఉండాల్సిన ఉస్మానియా యూనివర్సిటీలో కేవలం 354 మంది ప్రొఫెసర్స్‌తో నడుస్తుందని టీచింగ్ నాట్ టీచింగ్ పోస్టులు భర్తీ చేయడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయని విమర్శించారు. గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చిన విద్యార్థులకు నిజాం కళాశాలలో సరైన హాస్టల్ సౌకర్యం లేకపోవడంతో అనేకమంది విద్యార్థినీ విద్యార్థులు విద్యకు దూరమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు చైతన్య యాదవ్, సహాయ కార్యదర్శి అనిల్ కుమార్, నిజాం కళాశాల కన్వీనర్ సుశాంత్, నాయకులు, జ్ఞానేశ్ , శివ,శిరీష, శ్వేత, హరీష్ , ఫైజాం పాల్గొన్నారు.

# బిసి రిజర్వేషన్లపైనే బహిరంగ విచారణ

## డెడికేటెడ్ బిసి కమిషన్ చైర్మన్ బూసాని వెంకటేశ్వరరావు



**ప్రజాపక్షం/హనుమకొండ ప్రతినిధి :** తెలంగాణ స్థానిక సంస్థలలో వెనుకబడిన తరగతుల రిజర్వేషన్ల గుర్తింపు పేర్కొనే అంశంపై ఉమ్మడి వరంగల్ జిల్లాకు సంబంధించి బహిరంగ విచారణ చేపట్టినట్లు డెడికేటెడ్ బిసి కమిషన్ చైర్మన్, రిటైర్డ్ ఐఎఎస్ అధికారి బూసాని వెంకటేశ్వర రావు అన్నారు. గురువారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో తెలంగాణ వెనుకబడిన తరగతుల డెడికేటెడ్ కమిషన్ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్రంలో స్థానిక సంస్థలలో వెనుకబడిన తరగతుల రిజర్వేషన్ల గుర్తింపు పేర్కొనే అంశంపై ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలో వివిధ బిసి కుల సంఘాల ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు, ఇతర కుల సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు, రాజకీయ పార్టీల ప్రతినిధులు, ప్రజల నుండి ఫిర్యాదుల స్వీకరణకు బహిరంగ విచారణ నిర్వహించారు. ఈ సందర్భంగా డెడికేటెడ్ బిసి కమిషన్ చైర్మన్, రిటైర్డ్ ఐఎఎస్ బూసా వెంకటేశ్వరరావు, కార్యదర్శి, ఐఎఫ్ఎస్ అధికారి బి.సైదులు అభ్యర్థనలను స్వీకరించారు. వివిధ బిసి కులసంఘాల ప్రతినిధులు తమ కులాలకు రిజర్వేషన్ల శాతాన్ని పెంచాలని, రిజర్వేషన్ శాతం పెంపుతో రాజకీయాల్లో పోటీ చేసే అవకాశం తమ కులాలకు దక్కుతుందని, విద్య ఉద్యోగ రాజకీయ అవకాశాల్లో తమకు సరైన ప్రాతినిధ్యం లభించడంలేదని, రిజర్వేషన్ శాతాన్ని పెంచినట్లయితే తమ కులాలకు సరైన న్యాయం జరుగుతుందని, జనాభా దామాషా ప్రకారం తమ కులాలకు రిజర్వేషన్, ప్రభుత్వ అవకాశాలు కల్పించే విధంగా కమిషన్ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి అమలయ్యేవిధంగా కృషి చేయాలని డెడికేటెడ్ బిసి కమిషన్ చైర్మన్ వెంకటేశ్వరరావుకి విన్నవించారు. ఈ సందర్భంగా కమిషన్ చైర్మన్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ తెలంగాణ స్థానిక సంస్థలలో వెనుకబడిన తరగతుల రిజర్వేషన్ గుర్తింపు పేర్కొనే అంశంపై డెడికేటెడ్ బిసి కమిషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా బహిరంగ విచారణ చేపట్టామని పేర్కొన్నారు. ఈ బహిరంగ విచారణలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వివిధ బిసి కులసంఘాల ప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, ఇతర కుల సంఘాల ప్రతినిధులు, ప్రజల నుండి అభిప్రాయాలు, విజ్ఞప్తులను స్వీకరించినట్లు చెప్పారు. ఈ బహిరంగ విచారణ సందర్భంగా హనుమకొండ జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి, బీసి సంక్షేమ శాఖ డిడి రమేష్, బిసి సంక్షేమ శాఖ హనుమకొండ డిడి జి.రాంరెడ్డి, వరంగల్, మహబూబాబాద్, ములుగు, భూపాలపల్లి, జనగామ జిల్లాల బిసి సంక్షేమ శాఖ అధికారులు పుష్పలత, నరసింహస్వామి, రవీందర్ రెడ్డి, శైలజ, రవీందర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# ప్రభుత్వం ఇచ్చిన జి.ఓ 60 అమలు చేయాలి

## మున్సిపల్ స్టాఫ్ అండ్ ఔట్‌సోర్సింగ్ వర్కర్స్ యూనియన్.. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఏసురత్నం



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలకు అనుగుణంగా కార్మికుల వేతనాలు పెంచాలని కమిషనర్ ఆఫ్ డైరక్టర్ మున్సిపల్ అడ్మినిస్టేషన్(సిడిఎంఎ) శ్రీదేవికి తెలంగాణ రాష్ట్ర మున్సిపల్ స్టాఫ్ అండ్ ఔట్‌సోర్సింగ్ వర్కర్స్ యూనియన్(ఎఐటియుసి) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఏసురత్నం విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్‌లోని మాసబ్ట్యాంక్‌లోని సిడిఎంఎ కార్యాలయంలో గురువారం కమిషనర్ శ్రీదేవిని ఏసురత్నం, యూనియన్ రాష్ట్ర కార్యదర్శి వనంపల్లి జైపాల్ రెడ్డిలు కలిసి వినతిపత్రం అందచేశారు. అనంతరం ఏసురత్నం మాట్లాడుతూ రాష్ట్రంలో మున్సిపల్ కార్పొరేషన్‌లు, మున్సిపాలిటీలు, నగరపంచాయతీలలో పనిచేస్తున్న ఉద్యోగులు, కార్మికులకు కనీస వేతనాలు రూ.26వేలకు పెంచాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం కనీస వేతనాలు పెంచేంత వరకు గత రాష్ట్ర ప్రభుత్వం జి.ఓ 60ను 2021లో విడుదల చేసిందన్నారు. రాష్ట్రంలో ఉన్న మున్సిపాలిటీలలో పనిచేస్తున్న వివిధ కేటగిరీల వారీగా కార్మికులకు జి.ఓ 60 ప్రకారం వేతనాలు ఇవ్వాలన్నారు. రాష్ట్రంలో కొన్ని మున్సిపాలిటీలలో రెండు పూటల పని విధానాన్ని నిర్వహిస్తున్నారని, ఈ విధానాన్ని రద్దు చేసి, కార్మికులను పనిగంటలు కొనసాగించాలన్నారు. కార్మికులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని కోరారు.

# మరోసారి కాళేశ్వరం కమిషన్ విచారణ షురూ!

## * నేడు విధులకు హాజరు అవుతున్న జస్టిస్ పిసి ఘోష్
## * పక్షం రోజుల పాటు రాజధానిలోనే మకాం



**ప్రజాపక్షం / హైదరాబాద్ :** కాళేశ్వరం కమిషన్ విచారణ మరో సారి తెరపైకి రానుంది. కమిషన్ పదవి కాలాన్ని పొడిగిస్తూ ప్రభుత్వం ఇటీవల నిర్ణయం తీసుకున్న నేపథ్యంలో కమిషన్ చీఫ్ జస్టిస్ పిసి ఘోష్ శుక్రవారం బిఆర్‌కెఆర్ భవన్ లోని తన కార్యాలయానికి హాజరు కానున్నారు. అయితే విచారణ ఎప్పటి నుండి ప్రారంభిస్తారు? ఈసారి ఎవరెవరిని విచారిస్తారన్న దానిపై నేడో రేపో కొలిక్కి వచ్చే అవకాశం ఉంది. ఇప్పటి వరకు నీటి పారుదల శాఖ ఇఎన్‌సిలు, మాజీ ఇఎన్‌సిలు, చీఫ్ ఇంజినీర్లు, ఎస్ఇల క్రాస్ ఎగ్జామినేషన్ జరగగా ఈసారి మాత్రం బిఆర్‌ఎస్ పార్టీ పెద్ద నాయకులను కూడా పిలుస్తారా? అన్న ప్రశ్నలు తెరపైకి వస్తున్నాయి. ఎందుకంటే ఇప్పటి వరకు క్రాస్ ఎగ్జిమినేషన్ పరంగా విచారించగా పలువురు ఇఎన్‌సిలు మాజీ సిఎం కెసిఆర్, నీటిపారుదల శాఖ మాజీ మంత్రి హరీష్ రావుల పేర్లు ప్రస్తావిస్తూ వారి ఆదేశాల మేరకే తాము పనిచేశామని చెప్పడంతో ఇక వారిని విచారణకు పిలుస్తారా? విచారణను ఎలా ముందుకు తీసుకువెళ్తారు? అన్న దానిపైనా ప్రస్తుతం అందరి దృష్టి కేంద్రీకృతం అవుతోంది. ఆ ఇద్దరు మాజీ కీలక ప్రజా ప్రతినిధులను విచారణకు హాజరు కావాల్సిందిగా సమన్లు పంపనున్నట్లు తెలుస్తోంది.


తెలంగాణ ప్రభుత్వం
పోలీస్ శాఖ, ఎడిజిపి, ఒపిఎస్., గ్రేహౌండ్స్, తెలంగాణ, హైదరాబాద్.
C.No. 527-06/B1/S1/GHs/TG/2024 ఓపెన్ టెండర్ ప్రకటన తేది: 20.11.2024
అందించాల్సిన అర్టికల్ పేరు: బుల్లెట్ ప్రూఫ్ జాకెట్స్ మరియు బుల్లెట్ ప్రూఫ్ హెల్మెట్స్, సుమారు అవసరమైన పరిమాణం: 30 & 30, బిడ్ ప్రారంభ తేది & సమయం: 25.11.2024న 1100గం.లకు, ఆఖరి తేది & సమయం: 16.12.2024న 1700గం.ల వరకు, మరిన్ని వివరాలకు వెబ్‌సైట్ http://tgpolice.org ను సంప్రదించవచ్చు.
సం/- అడిషినల్ డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ తరపున, ఆపరేషన్స్, గ్రేహౌండ్స్, టిజి, హైదరాబాద్.
DIPR R.O. No. : 473-DP/CL/ADVT/1/2024-25, Date: 21-11-2024



సూపరింటెండింగ్ కార్యాలయం :: మోడర్న్ ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రి
పెట్లబుర్జ్, హైదరాబాద్ - తెలంగాణ రాష్ట్రం.
లేఖ నం. Peshi/MGMH/2024/1484-3 టెండర్ ప్రకటన తేది: 21.11.2024
ఒక సంవత్సర కాలానికి గాను ఆసుపత్రి ఆవరణలో రోగుల నిమిత్తం క్యాంటీన్‌ను నడిపేందుకు సీల్ టెండర్లను ఆహ్వానించడమైనది. 01. హైదరాబాద్, ఎంజిఎంహెచ్, పేషి వద్ద టెండర్ ఫారముల విక్రయం తేది:23.11.2024 నుండి 28.11.2024 వరకు అన్ని పని వేళలలో ఉ.11.00గం.ల నుండి మ.3.00గం.ల లోపు జిఎస్‌టితో సహా రూ.1150.00 నగదు చెల్లింపుతో టెండర్లు విక్రయించబడును. 02. సీల్ టెండర్ల దాఖలుకు తేది: 29.11.2024న మ.2.00గం.లలోపు (డ్రాఫ్ సీల్డ్ టెండర్ బాక్స్) పేషీ వద్ద సమర్పించవలెను మరియు ఈ టెండర్లను తేది: 29.11.2024న మ.3.00గం.లకు ప్రారంభించబడును. మొత్తం ఇఎండి రూ.50,000/- లు హెచ్‌డిఎస్, ఎంజిఎంహెచ్, హైదరాబాద్ పేరుతో డిమాండ్ డ్రాఫ్ట్‌ను డిపాజిట్ చేయవలెను.
సం/- సూపరింటెండింగ్, మోడర్న్ ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రి, పెట్లబుర్జ్, హైదరాబాద్.
DIPR R.O. No. : 6887-PP/CL/ADVT/1/2024-25, Date: 21-11-2024

షో కేస్

# వ్యవసాయం

## తగ్గిన పత్తి ఎగుమతులు



పత్తి ఎగుమతులు 2023–24 సీజన్‌లో తగ్గాయి. 2022–23 ఆర్థిక సంవత్సరంలో 3 మిలియన్ బేల్స్ ఎగుమతికాగా, గత ఆర్థిక సంవత్సరం ఇది 2.8 మిలియన్ బేల్స్‌గా నమోదైంది. పత్తి ఎగుమతుల విలువ 2021– 22 ఆర్థిక సంవత్సరంలో 6.8 బిలియన్ డాలర్లుకాగా, 2021–22 ఆర్థిక సంవత్సరంలో 10.78 మిలియన్ డాలర్లకు చేరింది. 2022–23 ఆర్థిక సంవత్సరంలో 5.66 మిలియన్ డాలర్లకు తగ్గింది. 2023–24లో 6.78 మిలియన్ డాలర్లు. 2024–25 ఆర్థిక సంవత్సరానికిగాను ఇప్పటి వరకూ జరిగిన ఎగుమతుల విలువ 1.63 మిలియన్ డాలర్లు మాత్రమే. సుమారుగా మరో నాలుగున్నర నెలల సమయం ఉన్నందున, అప్పటిలోగా ఎగుమతులు పుంజుకుంటాయని మార్కెట్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. కాగా, అక్టోబర్ ఒకటో తేదీతో ప్రారంభమైన ప్రస్తుత సీజన్‌లో పత్తి ధర తగ్గింది. అంతర్జాతీయ మార్కెట్‌లో బేల్ సగటు ధర రూ. 57,000గా ఉంది. గత ఏడాది ఇదే సమయానికి పత్తి బేల్ ధర 62,500 రూపాయలుగా ఉంది. కాగా, పత్తి ఎగుమతుల తగ్గుదలకు, మార్కెట్ రేట్ పతనానికి ఎన్నో అంశాలు కారణమవుతున్నాయి. అనుకూలంగాలేని వాతావరణ పరిస్థితుల నుంచి పత్తిపంటకు పడుతున్న తెగుళ్ల వరకూ ఎన్నో సమస్యలు ఎదురవుతున్నాయి. అదే విధంగా అమెరికా అధ్యక్ష ఎన్నికలు, రష్యా–ఉక్రేన్ యుద్ధం వంటి పలు అంశాలు మార్కెట్ ధరల్లో భారీ వ్యత్యాసానికి కారణమవుతున్నాయి.

## చదువుతో పనేముంది?



ఆలోచనతోపాటు ఆచరణ కూడా ఉంటే జీవితంలో ఉన్నత శిఖరాలు చేరుకోవడం కష్టమేమీ కాదని మధ్యప్రదేశ్‌లోని హర్దా జిల్లాకు చెందిన ప్రగతిశీల రైతు మధుసూదన్ థాకడ్ నిరూపిస్తున్నాడు. పదో తరగతితోనే చదువుకు స్వస్తిచెప్పాడు. 200 ఎకరాల్లో కూరగాయలు పండిస్తూ, ఏటా కోట్ల రూపాయలు సంపాదిస్తు న్నాడు. అతని వినూత్న సాగు విధానాలు, ఆధునిక పద్ధతుల ద్వారా అందుకుంటున్న విజయాలు మిగతా రైతులకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్నాయి. టమాటా, వెల్లుల్లి, మిరపకాయలు, క్యాప్సికం, అల్లం వంటి అధిక డిమాండ్ ఉన్న పంటలపై అతను దృష్టి పెట్టాడు. విజయం అనేది విద్యార్హతల ద్వారా లభించేది కాదని రుజువు చేస్తున్నాడు. సాంప్రదాయ వ్యవసాయం నుండి ఉద్యానవనానికి మారడం ద్వారా వేసిన సాహసోపేతమైన అడుగు అతని జీవితాన్ని పూర్తిగా మార్చివేసింది. రైతు కుటుంబంలో జన్మించిన థాకడ్‌కు బాల్యం నుంచి వ్యవసాయ విధానాలను దగ్గర నుంచి చూశాడు. తన తండ్రి సాంప్రదాయ వ్యవసాయాన్ని సాగిస్తూ, పడుతున్న కష్టాలను గమనించాడు. వ్యవసాయం పై లోతైన అవగాహన ఉన్నప్పటికీ, పూర్తికాల వృత్తిగా ఎంచుకోవడం అంత తేలికైన విషయం కాదు. దానివల్ల వచ్చే సవాళ్లు, కష్టాలు అతనికి బాగా తెలుసు. అయినప్పటికీ, భూమిపై ఉన్న మ క్కువ, కుటుంబ వారసత్వం, తనపై తనకు ఉన్న నమ్మకం థాకడేను వ్యవసాయం వైపు మొగ్గు చూపేలా చేసింది. అయితే, తండ్రి అనుసరిస్తున్న సాంప్రదాయ విధానాల వల్ల లాభం లేదని అర్థమైన అతను, సరికొత్త పద్ధతులను అనుసరించాలని నిర్ణయించుకున్నా డు. ఒక రకంగా ఇది సాహసోపేతమైన నిర్ణయమే. కానీ, వెనకడుగు వేయడానికి సిద్ధంగాలేని అతను లాభదాయమైన సాగు మొదలుపెట్టాడు. తన 200 ఎకరాల్లో 150 రకాలను హార్టికల్చర్‌కే కేటాయించి, అనేక రకాల పంటలు పండించడం మొదలు పెట్టాడు. మిరపకాయలు, క్యాప్సికమ టమాటా, వెల్లుల్లి, అల్లం అతని సాగులో ప్రధాన పంటలు. అతని ప్రయత్నం ఫలించింది. అధిక దిగుబడికి సరికొత్త సాగు విధానాలను అమలు చేస్తూ, వ్యవసాయ రంగంలో దూసుకెళుతున్నాడు. కోట్లకు పడగలెత్తిన థాకడ్‌ను నేడు ఎంతో మంది ఆదర్శంగా తీసుకొని, అతని మార్గంలోనే నడుస్తున్నాడు. కాలానికి అనుకూలంగా వ్యవసాయ విధానాల్లో మార్పులు చేస్తూ, ఆధునిక విధానాలను అమలు పరుస్తూ, సాంకేతికతను అందిపుచ్చుకుంటూ ముందుకు సాగడమే థాకడ్ విజయ రహస్యం.




## పర్యావరణంపై అతిపెద్ద సదస్సు 'కాప్29'లో సాధించింది ఏమిటి?

ఐక్యరాజ్య సమితి ఆధ్వర్యంలో, పర్యావరణంపై జరిగే అతిపెద్ద సదస్సు 'కాప్29'. అజర్‌బైజాన్ రాజధాని బాకూలో ఈనెల 11న మొదలైన సదస్సు 22వ తేదీ వరకూ కొనసాగనుంది. రష్యా, ఇరాన్ దేశాల మధ్య ఉండే ఆసియా దేశమైన అజర్‌బైజాన్ ఈ మెగా సదస్సుకు ఆతిథ్యం ఇవ్వడం విశేషం. 'కాన్ఫరెన్స్ ఆఫ్ పార్టీస్'కు సంక్షిప్త రూపమే 'కాప్'. ఇప్పటి వరకూ 28 సదస్సులు జరిగాయి. ఇప్పుడు 29వ సదస్సు జరుగుతున్నది. కాబట్టి దీనిని 'కాప్29'గా వ్యవహరిస్తున్నారు. ఈ సమావేశానికి సాధారణంగా వివిధ దేశాల అధ్యక్షులు, ప్రధానమంత్రులు హాజరవుతారు. అయితే, కార్బన ఉద్గారాలు అత్యధికంగా ఉండే కొన్ని దేశాల అధినేతలు ఈ సంవత్సరం






సమావేశానికి హాజరుకావడం లేదు. అమెరికా అధ్యక్షుడు జోబైడెన్, చైనా నేత జి జిన్‌పింగ్, ఫ్రాన్స్ అధ్యక్షుడు ఎమ్మాన్యుయెల్ మేక్రాన్ ఈ సమావేశానికి రాలేదు. పర్యావరణంపై యూరోపియన్ కమిషన్ అధ్యక్షురాలు ఉర్సులా వాన్ డి లెయాన్ సైతం గైర్హాజరయ్యారు. ఆమె స్థనంలో కమిషనర్ వోప్కే హోక్‌స్ట్రా హాజరయ్యారు. ఐరోపా దేశాలకు ఈ సదస్సుపై ఏమాత్రం చిత్తశుద్ధి ఉందో చెప్పడానికి ఇంతకంటే నిదర్శనం ఏముంటుంది? 2015లో పారిస్ (ఫ్రాన్స్) వేదికగా జరిగిన సదస్సులో చేసిన తీర్మానాన్ని అనుసరించి, ఉష్ణోగ్రతలు 1.5 డిగ్రీల సెల్సియస్ కంటే ఎక్కువ పెరగకుండా నిరోధించాలి. ఈ ఒప్పందానికి ప్రపంచ నాయకులు కట్టుబడి ఉండాలి. మరో రకంగా చెప్పాలంటే, అన్ని దేశాల అధినేతలు తమతమ దేశాల్లో విడుదలయ్యే కర్బన ఉద్గారాలను కట్టడి చేయాలి. ఈ ఒప్పందంలో భాగంగా 2025 నాటికి అభివృద్ధి చెందుతున్న దేశాల కోసం నగదు సహాయం లక్ష్యాలను కొత్తగా నిర్దేశించుకోవాలి. ఈ సాయాన్ని అభివృద్ధి చెందుతున్న దేశాలు కర్బన ఉద్గారాలు తగ్గించడానికి ఉపయోగిస్తాయి. అయితే, ఇప్పటి వరకూ జరిగిన సదస్సులేవీ అనుకున్న లక్ష్యాలను ఏమాత్రం అందుకోలేకపోయాయి. అందుకే, ఈసారి సదస్సుపైన కూడా అనుమానాలు పెరుగుతున్నాయి. 2030 నాటికి వాతావరణ పరిరక్షణకు ఆర్థిక సాయం మొత్తాన్ని ఏడాదికి ఒక ట్రిలియన్ డాలర్ల కంటే ఎక్కువగా ఉండేలా చూడాలని ఆఫ్రికన్ దేశాలు కోరుతున్నాయి. పేదరికంలో మగ్గుతున్న అనేక ఇతర దేశాల అభిప్రాయం కూడా ఇదే. చైనాతోపాటు కొన్ని గల్ఫ్ దేశాలను కూడా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థలలో చేర్చారు. అందువల్ల ఈ సహకారం అందించడానికి ఈ దేశాలకు మినహాయింపు ఉంటుంది. అయితే, సహాయం మొత్తాన్ని పెంచడంతోపాటు, ఈ దేశాలను కూడా ఆర్థిక సాయంలో భాగస్వాములను చేసినప్పుడే ఏడాదికి ట్రిలియన్ డాలర్ల నిధి సాధ్యమవుతుందని యూరోపియన్ యూనియన్ వాదిస్తున్నది. ఎవరు, ఎంతెంత ఇవ్వాలన్నది ఇంకా తేలలేదు. ఒక స్పష్టమైన నిర్ణయానికి వచ్చే అవకాశం కనిపించడం లేదు. నిజానికి ధనిక దేశాలు అందచేయాల్సిన సాయంపై తీర్మానం సిద్ధమైంది. సౌదీ అరేబియా వేదికగా జరిగిన కాప్ 16లో 25 పేజీల డ్రాఫ్టను రూపొందించగా, ఈసారి అది 10 పేజీలకు కుదించుకుపోయింది. ఎప్పటి మాదిరిగానే కీలకాంశాలు ఇందులోనూ కనిపించడం లేదు. అధిక దేశాలు, కర్బన ఉద్గారాలు ఎక్కువగా విడుదల చేస్తున్న దేశాలు చెల్లించాల్సిన మొత్తాలను ఏకరువు పెట్టడం, 1.3 ట్రిలియన్ డాలర్లను సేకరించాలని తాజాగా నిర్ణయించడం మినహా కొత్తదనం అంటూ ఏదీ లేదు. చెల్లింపులను ప్రస్తావించడం, లక్ష్యాలను నిర్దేశించడం తప్ప, చెల్లింపులు జరపకపోతే ఏం చేయాలన్న విషయాన్ని ఎక్కడా ప్రస్తావించలేదు. ఎప్పటి మాదిరిగానే సమావేశం మొదలైంది. శుక్రవారం ముగుస్తుంది. వాతావరణ కాలుష్యం... గ్లోబల్ వార్మింగ్ సమస్యలు అక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందమే.

### తలసరి కర్బన ఉద్గారాలు ఆసియాలోనే అధికం



ప్రపంచ వ్యాప్తంగా కర్బన ఉద్గారాలు ఆసియా ఖండంలోనే అధికం. గ్లోబల్ కార్బన్ బడ్జెట్ విడుదల చేసిన గణాంకాలను అనుసరించి, ఇటీవల కాలంలో కర్బన ఉద్గారాలు ప్రమాదకర స్థాయికి చేరుతున్నాయి. ఫలితంగా సాధారణ జీవనశైలి మారుతున్నది. సమాజంలోని అన్ని రంగాలపైనా పర్యావరణం తీవ్ర ప్రభావం చూపుతున్నది. సింగపూర్ అత్యధికంగా 27.7 శాతం ఉద్గారాలతో నంబర్ వన్ స్థానాన్ని ఆక్రమించింది. దీనితోపాటు ఆసియా ఖండానికే చెందిన ఖతార్ (26.7 శాతం), యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (25.8 శాతం), కువైట్ (24.5 శాతం), బ్రూనై (21.7 శాతం) కర్బన ఉద్గారాలతో వరుసగా రెండు నాలుగు ఐదు స్థానాల్లో ఉన్నాయి. మాల్టా (ఐరోపా) 19.4 శాతం, సౌదీ అరేబియా (ఆసియా) 17.3 శాతం, బెల్జియం (ఐరోపా) 17.2 శాతం, అమెరికా (ఉత్తర అమెరికా) 16.5 శాతం, ఒమన్ (ఆసియా) 15.4 శాతం కర్బన ఉద్గారాలతో ఆరు నుంచి పది స్థానాల్లో కొనసాగుతున్నాయి. ఈ జాబితాలో భారత్‌ది 91వ స్థానం. భారత్‌లో తలసరి ఉద్గారాలు 1.7 శాతంగా నమోదైంది.

## పెట్టుబడిదారీ వ్యవస్థకు కాలం చెల్లింది...

**సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు**




**ప్రజాపక్షం/హసన్‌పర్తి :** పెట్టుబడిదారీ వ్యవస్థకు కాలం చెల్లిందని, కమ్యూనిజమే ప్రత్యామ్నాయంగా కనిపిస్తున్నదని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాస రావు అన్నారు. గురువారం హసన్ పర్తి మండల సిపిఐ సమితి సమావేశం నేదునూరి రాజమౌళి అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథిగాతక్కళ్లపల్లి శ్రీనివాస రావు మాట్లాడుతూ ప్రపంచంలో పెట్టుబడిదారీ వ్యవస్థకు ప్రత్యామ్నాయ సిద్ధాంతాన్ని కారల్ మార్క్స్ కనుగొన్నాడని ఆ సిద్ధాంతమే ప్రపంచంలో దోపిడీ నుండి మానవాళి విముక్తికి మార్గం చూపిందన్నారు. పెట్టుబడిదారీ వ్యవస్థ రోజు రోజుకు సంక్షోభంలోకూరుకుపోతున్నదని, పెట్టుబడిదారీ వ్యవస్థ పతనంతో ప్రపంచ యువత ప్రత్యామ్నాయంగా ఎర్ర జెండా వైపు చూస్తున్నదని తెలిపారు. ఇప్పటికే క్యూబా, వియత్నం, చైనా తదితర దేశాలు కమ్యూనిస్టు దేశాలుగా ఉండి అభివృద్ధిలో దూసుకుపోతున్నాయని, ఇటీవల అమెరికాలో జరిగిన అధ్యక్ష ఎన్నికలలో పార్టీ ఆఫ్ సోషలిజం అండ్ లిబరేషన్ పార్టీ తరపున పోటీ చేసిన అభ్యర్థి క్లాడియ డీల క్రూజ్‌కు ఒక లక్షా ఏడు వేలఓట్లు లభించాయని తెలిపారు. అలాగే మన పొరుగు దేశాలైన నేపాల్‌లో, శ్రీలంకలో వామపక్ష ప్రభుత్వాలు ఏర్పడ్డాయని తెలిపారు. భారత కమ్యూనిస్టుపార్టీ ఆవిర్భవించి 100 సంవత్సరాలు డిసె ంబర్ 26కు పూర్తి చేసుకుంటున్నదన్నారు.జాతీయ ప్రజాతంత్ర విప్లవం లక్ష్యంగా, సోషలిజం ధ్యేయంగా, సామాజిక న్యాయం లౌకిక వాదం, ప్రజాస్వామ్య పరిరక్షణ ఉద్యమంలో సిపిఐ కీలక పాత్ర పోషించిందన్నారు. స్వాతంత్ర పోరాటంలో సిపిఐ అనేక త్యాగాలు చేసిందని, ఎంతోమంది అమరవీరులను అందించిన చరిత్ర సిపిఐదన్నారు.హసన్ పర్తి ప్రాంతంలోఎర్రజెండానీడన పోరాడిన పాడి మల్లారెడ్డి, తోకల కొమురా రెడ్డి, పాడి చంద్రారెడ్డి, గంగిళ్ల లింగా రెడ్డి, రేణుకుంట్ల ఐలయ్య, నేదునూరి చెన్నయ్య లాంటి వీరులు అమరులై చిరస్థాయిగా నిలిచారన్నారు. ఎల్లాపూర్ సిపిఐ కార్యాలయానికి తక్కళ్లపల్లి శ్రీనివాస రావు శంకుస్థాపన చేశారు. జిల్లా సిపిఐ కార్యదర్శి కర్రె బిక్షపతి, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు నేదునూరి జ్యోతి, రాష్ట్ర సమితి సభ్యులు ఆదరి శ్రీనివాస్, సీనియర్ నాయకులు మోతే లింగారెడ్డి, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి మద్దెల ఎల్లేష్, గిరిజన రాష్ట్ర కార్యదర్శి మాలోత్ శంకర్, కాజీపేట మండల సిపిఐ కార్యదర్శి మునిగాల బిక్షపతి, బికెఎం యు జిల్లా కార్యదర్శి కర్రె లక్ష్మణ్, సిపిఐ హసన్‌పర్తి మండల కార్యదర్శి మెట్టు శ్యాంసుందర్ రెడ్డి, సహాయకార్యదర్శులుదోమరాకేష్, రేణిగుంట్ల రాజయ్య, రేణుకుంట్ల దుర్గా ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.



### డిసెంబర్ 30న నల్లగొండలో సభ

**సిపిఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు**

**ప్రజాపక్షం/కోదాడ:** భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ 100 సంవత్సరాలు అడిగిడుతున్న సందర్భంగా డిసెంబర్ 30న నల్లగొండలో జరుగు బహిరంగ సభను వందలాది సంఖ్యలో సిపిఐ నాయకులు, కార్యకర్తలు పాల్గొని జయప్రదం చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. భారత కమ్యూనిస్టు పార్టీ దేశంలో 1925 డిసెంబర్ 36న ఉత్తరప్రదేశ్ కాన్పూర్‌లో స్థాపించబడి ఆనాటి నుండి కాన్పూర్ మీరట్ కేసులు ఎదుర్కొని భారత దేశ స్వాతంత్ర్యంలో కీలకపాత్ర వహించి ప్రాణ త్యాగాలు చేసిన పార్టీ భారత కమ్యూనిస్టు పార్టీ అని కొనియాడారు. అంతకు ముందు పార్టీ కార్యాలయంలో బహిరంగ సభ పోస్టర్‌ను ఆవిష్కరించారు. సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు మేకల శ్రీనివాసరావు, పట్టణ కార్యదర్శి ఎస్‌కె లతీఫ్, సీపీఐ సీనియర్ నాయకులు పైడిమర్రి వెంకటనారాయణ, డివిజన్ కార్యదర్శి ఉప్పతల శ్రీనివాస్, షేక్ మోసిన్, ఎఐవైఎఫ్ నాయకులు ఎస్‌కె జానీమియా, మీరా పాల్గొన్నారు.

### మతోన్మాద బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్ శక్తులకు వ్యతిరేకంగా పోరాడాలి



**ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి :** మతోన్మాద బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్, సంఘ్ పరి వార్ శక్తులకు వ్యతిరేకంగా పోరాడాలని సిపిఐ జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం పిలుపునిచ్చారు. గురువారంగోదావరిఖని ప్రెస్ క్లబ్‌లో వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో మతోన్మాద వ్యతిరేక సదస్సులో సిపిఐ జిల్లా కార్యదర్శి తాండ్రముఖ్య అతిధిగా మాట్లాడారు. బిజెపి అధికారంలోకి వచ్చిన 10సంవత్సరాల కాలంలో మతోన్మాదం పెచ్చురిల్లి పోతుందని, ప్రజలకు ఇచ్చిన హామీలను గాలికొదిలి మతాల మధ్య కులాల మధ్య మారణ హోమన్ని సృష్టిస్తున్నదన్నారు. మతోన్మాదం గురించి వామపక్ష పార్టీలుగా ప్రజల్ని చైతన్యం చేయాల్సిన అవసరం ఉందన్నారు.

### అక్రమ అరెస్టు..అప్రజాస్వామిక చర్య



**ప్రజాపక్షం/రాజన్నసిరిసిల్లప్రతినిధి:** అర్థరాత్రి అక్రమంగా అరెస్ట్ చేయడం ముమ్మాటికీ అప్రజాస్వామిక చర్య అని ఏఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి అంగూరి రంజిత్ అన్నారు. బుధవారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జిల్లా పర్యటనకి ఆయనను అరెస్టు చేయడాన్నీ ఖండించారు. ఆయన మాట్లాడారు. గత బిఆర్‌ఎస్ ప్రభుత్వం చేసిన తప్పిదాలను, ప్రజా పాలనా అని చెప్పుకునే కాంగ్రెస్ ప్రభుత్వం కూడా చేయడం బాధాకరమన్నారు. బకాయిలు, ఫీజు రియంబర్స్మెంట్ విడుదల చేయడంలో ప్రభుత్వ నిర్లక్ష్యం సరి కాదన్నారు. ప్రైవేట్ బడ్జెట్ కళాశాలల యాజమాన్యాలు కూడా సిబ్బందికి జీతాలు ఇవ్వలేక, భవన కిరాయిలు చెల్లించలేక ఆర్థిక ఇబ్బందులతో కష్టతరం అవుతుందన్నారు. పెండింగ్ ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయి విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

### ప్రజా శ్రేయస్సు కోసం పోరాడేది కమ్యూనిస్టు పార్టీ

**జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్**



**ప్రజాపక్షం/ మధిర :** ప్రజలు ఎదుర్కొన్న సమస్యలు, బానిసత్వం నుండి విముక్తి కోసం పోరాటం చేసిన ఏకైక పార్టీ భారత కమ్యూనిస్టు పార్టీ(సిపిఐ) అని ఆ పార్టీ ఖమ్మం జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్ కొనియాడారు. గురువారం మధిర మండలం మల్లవరం గ్రామంలో సిపిఐ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు.ఈ సందర్భంగా తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధులు మందడపు వెంకయ్య, మంగమ్మ దంపతులకు ఆయన చేతుల మీదుగా సభ్యత్వాన్ని అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ 1945వ సంవత్సరంలో ఆంధ్ర మహాసభ సంఘంలో సభ్యుడిగా చేరి ఆనాటి నుండి నేటి వరకు కమ్యూనిస్టు పార్టీ సభ్యుడిగా దాదాపు 78 సంవతర్సాల పాటు సభ్యత్వం స్వీకరించిన వెంకయ్యలాంటి సీనియర్ కామ్రేడ్ తన చేతుల మీదుగా సభ్యత్వాన్ని అందించడం సంతోషించదగ్గ విషయమన్నారు. వెంకయ్య లాంటి కమిట్మెంట్ ఉన్న కామ్రేడ్స్ జీవితాన్ని ప్రస్తుత యువత అనుచరించాల్సిన అవసరం ఉందన్నారు. 1948 సంవత్సరంలో తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం జరుగుతున్న సమయంలో మల్లవరం, జాలిముడి గ్రామాలు పోరాట వీరుల కేంద్రాలుగా మారిన విషయాన్ని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు. బానిసత్వం నుండి విముక్తి చేయటానికి, వెట్టిచాకిరిని తొలగించడానికి ఈ దేశంలో పోరాటం నడిపించిన ఏకైక పార్టీ సిపిఐ అని కొనియాడారు. యువత సిపిఐ చరిత్ర తెలుసుకుని ఆపార్టీలో సభ్యులుగా చేరడానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు. సిపిఐజిల్లా కార్యవర్గ సభ్యులు జమ్ముల జితేందర్‌రెడ్డి, రామాంజనేయులు, మందడపు రాణి, జిల్లా సమితి సభ్యులు ఏనుగు గాంధీ, మడుపల్లి లక్ష్మణ్, మల్లవరం గ్రామ శాఖ నాయకులు మందడపు నాగకృష్ణ, మచ్చ, పద్మ, మందడపు పుల్లయ్య,, మందడపు కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

### అరచేతిలో వైకుంఠం చూపిస్తున్న ప్రభుత్వం

**భారత జాతీయ మహిళా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షురాలు సృజన**




**ప్రజాపక్షం/నర్సాపూర్:** నర్సాపూర్ సిపిఐ పార్టీ కార్యాలయంలో సమాఖ్య 22వ మహాసభలనునిర్వహించారు. మహిళలపై దాడులు ఎక్కువైతున్న నేపథ్యంలో ఎక్కడ అఘాయిత్యాలు జరిగితే మహిళలకు గత,ప్రస్తుత ప్రభుత్వం ఉచిత హామీలతో మహిళలను మోసం చేశారని అన్నారు. ప్రభుత్వ కార్యాలయాలలో కూడా ఉద్యమించే సత్తా ఉన్నదన్నారు. మహిళా సమైక్యాలలో సభ్యత్వం తీసుకోవడం వల్ల ఎన్నో ప్రయోజనాలున్నాయని తెలియజేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది గడుస్తున్నా పింఛన్లు పెంచలేదని, వికలాంగులకు కూడా పెంచలేదన్నారు. హామీలపై నిలదీయవలసిన అవసరం ఉందన్నారు. వీటన్నింటిని నిలదీయడానికి మహిళా సమైక్యలో ఒక నాయకురాలు ఉండాలన్నారు.గ్రామ గ్రామాన కమిటీలు వేసి ధర్నాలు చేయాలని ఆమె పిలుపునిచ్చారు. మహిళా సమైక్య ద్వారా ఎన్నో పోరాటాలు చేసిన ఫలితంగా ఇప్పుడున్న మహిళలకు కొన్ని పథకాలు అమలు చేసుకున్నామన్నారు.మహిళలందరూ భారత జాతీయ మహిళా సమైక్యలో సభ్యులుగా చేరాలని అన్నారు. ఈనెల 23న హైదరాబాద్ బషీర్బాగులో మహిళా సమైక్య సదస్సును నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మహిళా సమైక్య రాష్ట్ర సహాయ రాష్ట్ర సహాయ కార్యదర్శి పై మీద బేగం, జిల్లా నాయకురాలు విజయలక్ష్మి, సిపిఐ మెదక్ జిల్లా కార్యదర్శి ఖాలేక్, సిపిఐ నాయకులు నాగరాజు, సాయిలుపాల్గొన్నారు.

### ప్రజా సమస్యల పరిష్కారంలో ప్రభుత్వాలు దోబూచులాట

**ఎస్ఎఫ్ఐడబ్ల్యు రాష్ట్ర కార్యదర్శి ఏపూరి లతాదేవి**



**ప్రజాపక్షం/సత్తుపల్లి :** ప్రజా సమస్యల పరిష్కారంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దోబూచులాడుతున్నాయని అఖిల భారత మహిళా సమాఖ్య ఎస్ఎఫ్ఐడబ్ల్యూ రాష్ట్ర కార్యదర్శి ఏపూరి లతాదేవి విమర్శించారు. గురువారం వేంసూరుమండల తహశీల్దార్ కార్యాలయం ముందు సాదు రామలక్ష్మి అధ్యక్షతన జరిగిన సమావేశంలో లతాదేవి ముఖ్య అతిథిగా మాట్లాడారు. రాష్ట్రంలో లక్షలాది మంది ఒంటరి, వితంతు మహిళలు అనేక సమస్యలతో బాధపడుతున్నారని, వారి సమస్యల పరిష్కారానికి ఎస్ఎఫ్ఐడబ్ల్యూ ఆధ్వర్యంలో జరిగే పోరాటాలకు సిద్ధంకావాలని పిలుపునిచ్చారు. మోడి ప్రభుత్వం అధికారంలోకి రెండవ సారి వచ్చిన అనంతరం ప్రజల సమస్యలు మరింత పెరిగాయన్నారు. నిత్యావసరాల ధరలు కొండెక్కాయని, పేదలు ఏమి కొన,తిన లేని స్థితిలో ఉన్నారని మండిపడ్డారు. ప్రధాని మోడి తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ తాటి నిర్మల, శ్రామిక మహిళా ఫోరం రాష్ట్ర కో కన్వీనర్ సిహెచ్ సీతామహలక్ష్మి మాట్లాడుతూదేశం,రాష్ట్రంలో మహిళలకు భద్రత కరువైందన్నారు. ప్రతి మండలంలో ఒక పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేయాలని, ప్రతి గ్రామానికి మహిళా పోలీస్‌ను నియమించాలని, గ్రామాలలో యద్దేశ్చగా నడుస్తున్న బెల్ట్ షాపులను మూసివేయాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం బికెఎంయూఖమ్మంజిల్లా వర్కిం గ్ ప్రెసిడెంట్ దండు ఆదినారాయణ, మహిళా సమైక్య ఎస్ఎఫ్ఐడబ్ల్యూ సత్తుపల్లి డివిజన్ కన్వీనర్ ఎస్‌కే రంజాన్, బి రామలక్ష్మి, సూరమ్మ, సత్యవతి, వెంకటమ్మ, అంజమ్మ, సుజాత, నాగలక్ష్మి, సీతమ్మ, భాగ్యమ్మ, సరోజిని, కుమారి తదితరులు పాల్గొన్నారు.

**ఒంటరి, వితంతు మహిళల కమిటీ ఎన్నిక**

అధ్యక్షులుగా సాదు సూరమ్మ, కార్యదర్శిగా కనపర్తి సుజాత,ఉపాధ్యక్షురాలిగా నాగలక్ష్మి, సహాయ కార్యదర్శిగా కళ్యాణి ,మల్లు నాగలక్ష్మి మరో 15 మందితోఎన్నుకున్నారు.

# వీడియో కాన్ఫరెన్స్ ద్వారా క్రాస్ ఎగ్జామినేషన్ ఎలా చేయగలం ?

### యాసిన్ మాలిక్ కేసులో సిబిఐ పిటిషన్‌పై సుప్రీం ప్రశ్న

### అజ్మల్ కసబ్ కేసు విచారణ కూడా న్యాయబద్ధంగానే జరిగిందని వెల్లడి



**న్యూఢిల్లీ :** వేర్పాటువాది యాసిన్ మాలిక్‌ను కోర్టులో వ్యక్తిగతంగా హాజరుపర్చాలన్న ఆదేశాల మేరకు సిబిఐ దాఖలు చేసిన పిటిషన్‌పై సుప్రీంకోర్టు గురువారం విచారణ జరిపింది. మన దేశంలో ఉగ్రవాది అజ్మల్ కసబ్ కేసు విచారణ కూడా న్యాయబద్ధంగానే జరిగిందని గుర్తుచేసింది. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా క్రాస్ ఎగ్జామినేషన్ ఎలా చేయగలమని ప్రశ్నించింది. 1990లో శ్రీనగర్ శివారులో నలుగురు ఎయిర్‌ఫోర్స్ సిబ్బంది హత్య కేసు, 1989లో రుబయా సయీద్ (అప్పటి హోంమంత్రి ముఫ్తీ మహమ్మద్ సయీద్ కుమార్తె) కిడ్నాప్ కేసులో వేర్పాటువాది యాసిన్ మాలిక్ ప్రధాన నిందితుడిగా ఉన్నారు. ఈ కేసుల విచారణకు మాలిక్ వ్యక్తిగతంగా హాజరుకావాలని జమ్మూ కోర్టు గతంలో ఆదేశించింది. అయితే, ఈ ఆదేశాలను సవాల్ చేస్తూ సిబిఐ సుప్రీంకోర్టును ఆశ్రయించింది. దీనిపై గతంలో విచారణ జరిపిన అత్యున్నత న్యాయస్థానం జమ్మూ కోర్టు ఉత్తర్వులపై స్టే విధించింది. తాజాగా గురువారం మరోసారి విచారణ జరిపింది. ఈసందర్భంగా సిబిఐ తరపున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదనలు వినిపిస్తూ.. భద్రతా కారణాల రీత్యా మాలిక్‌ను జమ్మూకు తీసుకెళ్లలేం. సాక్ష్యుల భద్రత కూడా మాకు ముఖ్యమే. గతంలో ఓ సాక్షిని హత్య చేశారు. లాయర్‌ను పెట్టుకోకుండా మాలిక్ ట్రిక్స్ ఉపయోగిస్తున్నాడు. అతడు సాధారణ క్రిమినల్ కాదు. లష్కరే తోయిబా వ్యవస్థాపకుడు హాఫీజ్ సయీద్‌తో అతడికి సంబంధాలున్నాయి. గతంలో చాలాసార్లు సయీద్‌ను కలిసేందుకు పాక్‌కు వెళ్లాడు. ఇలాంటి కేసుల్లో మేం కేవలం పుస్తకాల్లో ఉన్నట్లు చేయలేం అని పేర్కొన్నారు. దీనికి ధర్మాసనం బదులిస్తూ కీలక వ్యాఖ్యలు చేశారు. కోర్టుకు తీసుకెళ్లకపోతే వీడియో కాన్ఫరెన్స్‌లో క్రాస్ ఎగ్జామినేషన్ ఎలా చేయగలం? జమ్మూలో ఇంటర్నెట్ సదుపాయం అంతంతమాత్రంగానే ఉంటుంది. మన దేశంలో ఉగ్రవాది అజ్మల్ కసబ్‌కు కూడా పారదర్శక విచారణ ఎదుర్కొనేలా అవకాశాలు కల్పించాం అని వ్యాఖ్యానించింది. అనంతరం ఈ కేసు తదుపరి విచారణను వచ్చే గురువారానికి వాయిదా వేసింది. ఉగ్రవాదులకు నిధులు సమకూర్చిన కేసులో యాసిన్ మాలిక్‌కు జీవితఖైదు పడిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం అతడు తీహార్ జైలులో శిక్ష అనుభవిస్తున్నాడు. గతేడాది జులైలో అతడు ఉన్నట్టుండి సుప్రీంకోర్టులో కన్పించడం సంచలనంగా మారింది. ఎలాంటి ఆదేశాలు లేనప్పటికీ యాసిన్ మాలిక్‌ను కోర్టుకు తీసుకురావడంపై ధర్మాసనం తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేసింది. దీనిపై అప్పట్లో పలువురు తీహార్ జైలు అధికారులపై వేటు కూడా పడింది.



# ఎగ్జిట్ పోల్స్ వంచన!

### సర్వేల అంచనాలకు భిన్నమైన ఫలితాలొస్తాయ్: ప్రతిపక్షం

### మహారాష్ట్రలో గెలుపుపై మహాయుతి, మహా వికాస్ అఘాడీ దీమా

**న్యూఢిల్లీ:** మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు ఒకే దశలో ముగిశాయి. పోలింగ్ పూర్తి అయిన వెంటనే ఎగ్జిట్ పోల్స్ వెలువడ్డాయి. చాలా సర్వేలు ఎన్డీయేకు మొగ్గు చూపాయి. కొన్ని మాత్రం ఎవరికీ పూర్తి మెజారిటీ రాదన్నాయి. ఒక సర్వే మాత్రమే మహా వికాస్ అఘాడీ(ఎంవీయే) గెలుపును అంచనా వేసింది. ఎగ్జిట్ పోల్స్‌పై రాజకీయ పార్టీలకే నమ్మకం కుదరడం లేదు. అవి మోసపూరితమని, వంచన అని విమర్శలు గుప్పిస్తున్నాయి. ఇంతకు ముందు హర్యానా, జమ్మూకశ్మీర్ ఫలితాలు ఎగ్జిట్ పోల్స్ అంచనాలకు పూర్తి భిన్నంగా వెలువడ్డాయి. హర్యానాలో ఎన్డీయే, జమ్మూకశ్మీర్‌లో నేషనల్ కాన్ఫరెన్స్ గెలిచాయి. ఎగ్జిట్ పోల్స్ మాత్రం కాంగ్రెస్‌ను విజేతగా పేర్కొన్నాయి. తాజాగా తొమ్మిది సర్వేల్లో ఆరు... మహాయుతి గెలుపును అంచనా వేయగా, మూడు సర్వేల్లో ఎవరికీ పూర్తి మెజారిటీ రాదని తేలింది. ఒకటి మాత్రమే ఎంవీయే గెలుస్తుందని పేర్కొంది. శనివారం ఓట్ల లెక్కింపు వేళ బీజేపీ, కాంగ్రెస్, శివసేన, నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ వర్గాల మధ్య మాటలతూటాలు పేలుతున్నాయి. గెలుపుపై ఎవరికి వారు దీమాగా ఉన్నారు. పోటాపోటీగా ప్రకటనలు చేస్తున్నారు.

**మహాయుతి వర్సెస్ ఎంవీయే**

మహారాష్ట్రలో ఓటింగ్ శాతం పెరగడంపై మహాయుతి, ఎంవీయే భిన్నస్వరాలు వినిపిస్తున్నాయి. ఓటింగ్ శాతం పెరిగితే తమకు కలిసివస్తుందని బీజేపీ నేత, ఉప ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ అన్నారు. అయితే ప్రస్తుత పరిపాలనపై ప్రజల్లో అసంతృప్తితోనే ఓటింగ్ శాతం పెరిగిందని, ఇది తమ గెలుపును సూచిస్తోందని ఎంవీయే నేతలు చెబుతున్నారు. ఓటింగ్ శాతం పెరిగిన ప్రతిసారీ బీజేపీకి, ఎన్డీయేకి లబ్ధి చేకూరుతుందని, ఈసారీ అదే జరుగుతుందని ఫడ్నవీస్ నమ్మకంగా చెప్పారు. 2019 ఎన్నికల్లో 61.74 శాతం పోలింగ్ జరుగగా ఈసారి 65శాతం పోలింగ్ నమోదైంది. మరోవైపు ఈ ఎగ్జిట్ పోల్స్‌ను మోసపూరితమైనవిగా శివసేన (ఉద్ధవ్) ఎంపీ సంజయ్ రౌత్ దుయ్యబట్టారు. ఎంవీయే విజయం తథ్యమన్నారు. హర్యానా, జమ్మూకశ్మీర్ అసెంబ్లీలకు జరిగిన ఎన్నికలతోపాటు సార్వత్రిక ఎన్నికలప్పుడు తప్పుడు అంచనాలు వెలువడటాన్ని గుర్తుచేశారు. బీజేపీ 400 మార్కును దాటుతుందన్న అంచనా తారుమారైందని, ఇండియా ఐక్యసంఘటన సత్తా చాటిందని రౌత్ అన్నారు. ప్రజలు ప్రతిసారీ తమ మనస్సులోని మాట వెల్లడించరంటూ ఎవరికి ఓటు వేసింది ప్రజలు చెప్పరన్న ఉద్దేశంతో సంయ్ రౌత్ వ్యాఖ్యానించారు. 'నాలుగు వేల మందిని సర్వే చేసి వీరు గెలుస్తారు... వారు విజయం సాధిస్తారని అంటారు కానీ ఫలితాలు అందుకు పూర్తి భిన్నంగా వెలువడతాయి. హర్యానాలో కాంగ్రెస్ గెలుస్తుందన్నారు కానీ ఏం జరిగింది? మోదీకి లోక్‌సభలో 400 సీట్లు వస్తాయన్నారు... వచ్చాయా? మేము ఇప్పుడు 160165 స్థానాల్లో గెలుస్తాం... వేచిచూడండి' అని సంజయ్ రౌత్ అన్నారు.

ఫడ్నవీస్, రౌత్ మాత్రమే కాదు ఎన్డీయే, ఎంవీయేకు చెందిన అనేక మంది నేతలు ఇదే తరహా ప్రకటనలు చేస్తున్నారు. కాంగ్రెస్ మహారాష్ట్ర అధ్యక్షుడు నానా పటోలే స్పందిస్తూ ఎంవీయే గెలుస్తుందని నొక్కిచెప్పారు. బీజేపీ కూటమిపై ప్రజలు కోపంగా ఉన్నారు కాబట్టే ఓటింగ్ శాతం పెరిగిందన్నారు. బీజేపీ నేత మిలింద్ డియోరా తమ కూటమి గెలుపుపై దీమాగా ఉన్నారు. సంఖ్యలు వదిలేయండి... గెలిచేది మేమే... లోక్‌సభలో తగిలిన ఎదురు దెబ్బతో... ఈసారి విజయాన్ని అందుకునేందుకు ఏ అవకాశాన్ని వదులుకోకపోవడమే నా విశ్వాసానికి కారణమని ఆయన చెప్పారు. కాగా మహారాష్ట్ర అసెంబ్లీలో 288 స్థానాలు ఉండగా, మెజారిటీ మార్కు 145.

## ఎదురుకాల్పుల్లో మావోయిస్టు మృతి

**చింతూరు (అల్లూరి జిల్లా):** ఒడిశాలోని మల్కన్‌గిరి జిల్లాలో చాలాకాలం తర్వాత మావోయిస్టుల కదలికలు ప్రారంభమయ్యాయి. ఎదురుకాల్పుల్లో ఓ మావోయిస్టు మృతి చెందాడు. ఓ జవాను కూడా గాయపడినట్టు తెలిసింది. వివరాలివి. మల్కన్‌గిరి జిల్లాలోకి పొడియా బ్లాక్‌లోని జినెల్‌గూడ అటవీప్రాంతం గుండా కొందరు మావోయిస్టులు ప్రవేశిస్తున్నారని పోలీసు దళాలకు సమాచారం అందింది. దీంతో డీవీఎఫ్ జవానులు గాలింపు చర్యలు చేపట్టారు. అటవీ ప్రాంతంలో మావోయిస్టులకు జవానులకు మధ్య బుధవారం రాత్రి ఎదురుకాల్పులు జరిగాయి. ఓ మావోయిస్టు మృతి చెందాడు. ఇద్దరు మావోయిస్టులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఎదురుకాల్పుల్లో గాయపడిన జవానును ఆసుపత్రికి తరలించినట్టు తెలిసింది. ఇదిలా ఉండగా, ఎంవీ 79 క్యాంపు నుంచి సమీపంలోని అడవుల్లో మావోయిస్టులు ఉన్నారన్న సమాచారం అందడంతో గురువారం ఉదయం జిల్లా పోలీసులు, సీఆర్పీఎఫ్ దళాలు సంయుక్తంగా గాలింపు చర్యలు చేపట్టాయి.

# మణిపూర్ అంతటా 'అఫ్‌స్పా' అమలు

### 10మంది 'కుకీ' ఎమ్మెల్యేల డిమాండ్

**ఇంఫాల్ /గువహతి :** మణిపూర్ రాష్ట్రం అంతటా 'అఫ్‌స్పా'ను పొడిగించాలని బిజెపి నేతృత్వంలోని అధికార కూటమికి చెందిన ఏడుగురు శాసనసభ్యులు సహా మణిపూర్ అసెంబ్లీకి చెందిన 10మంది కుకీ ఎమ్మెల్యేలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దోచుకెళ్లిన ఆయుధాలను తిరిగి స్వాధీనం చేసుకునేందుకు అఫ్‌స్పాను మణిపూర్ రాష్ట్ర వ్యాప్తంగా అమలును పొడిగించాల్సిన అవసరాన్ని వారు నొక్కిచెప్పారు. నవంబరు 14న కేంద్రం హింస చెలరేగిన జిరిబం సహా మణిపూర్‌లోని ఆరుగురు పోలీస్‌స్టేషన్ల ప్రాంతాలలో ఆర్మడ్ ఫోర్సెస్ స్పెషల్ పవర్స్ యాక్ట్ (అఫ్‌స్పా)ను తిరిగి విధించిన విషయం తెలిసిందే. నిరవధికంగా హింస ప్రజ్వరిల్లుతున్న నేపథ్యంలో కేంద్ర హోం మంత్రిత్వ శాఖ ఈ నిర్ణయం తీసుకుంది. అయితే ప్రస్తుతం మణిపూర్ రాష్ట్రంలోని 13 పోలీస్ స్టేషన్ల పరిధి మినహాయించి రాష్ట్రం అంతటా 'అఫ్‌స్పా' విధించబడి ఉన్నది. కుకీ కి చెందిన 10మంది శాసనసభ్యులు గురువారం విడుదల చేసిన ఒక సంయుక్త ప్రకటనలో మాట్లాడుతూ నవంబరు 14, 2024న విధించబడిన అఫ్‌స్పా విధింపు ఆదేశాలపై తక్షణమే ఒక సమీక్ష జరిపి ఆ చట్టాన్ని ఇదివరకు మినహాయించిన మిగతా 13 పోలీస్ స్టేషన పరిధిలో కూడా తిరిగి విధించాలని ప్రభుత్వాన్ని కోరారు. గత ఏడాది మే 3వ తేదీ నుంచి మెయితీలు లూటీ చేసి ఎత్తుకెళ్లిన 6,000కు పైగా అధునాతన తుపాకులను వెంటనే స్వాధీనం చేసుకునేందుకు మణిపూర్ రాష్ట్రం అంతటా అఫ్‌స్పాను విధించాల్సిన అవసరాన్ని వారు నొక్కిచెప్పారు. ఆ ఆయుధాల మూలంగానే మణిపూర్ రాష్ట్రంలో హింస చెలరేగుతున్నందున్న చర్యలు వారిపై చర్యలు చేపట్టేందుకు అఫ్‌స్పా విధింపు అవశ్యమన్నారు. మెయితీ కమ్యూనిటీ వారు తమకు ఎస్‌టి స్టేటస్ కల్పించాలని డిమాండ్ చేస్తున్న నేపథ్యంలో ఆ డిమాండ్‌ను నిరసిస్తూ కుకీ జాతీయులు మణిపూర్ రాష్ట్రంలోని కొండ జిల్లాలలో గిరిజన సంఘీభావ ప్రదర్శనను నిర్వహించడంతో మే 23, 2023వ తేదీ నుంచి మణిపూర్ రాష్ట్రంలో కుకీ, మెయితీల మధ్య జాతి హింస చెలరేగిన వి షయం తెలిసిందే. అప్పటి నుంచి ఇప్పటి వరకు ప్రజ్వరిల్లుతున్న హింసలో 220మందికి పైగా ప్రజలు మరణించారు.కేంద్ర ప్రభుత్వం, మణిపూర్ రాష్ట్ర ప్రభుత్వం రెండూ రాష్ట్రంలో సాధారణస్థితి నెలకొల్పేందుకు రాజకీయపార్టీలతో చర్చలు జరిపి అవసరమైన అన్ని రకాల చర్యలు తప్పనిసరిగా తీసుకోవాలని, అశాంతి సృష్టించబడిన ప్రాంతంలో శాంతిని పునరుద్ధరించాలని కుకీ శాసనసభ్యులు, బిజెపికి చెందిన 5గురు, జెడి(యు)కు చెందిన ఇద్దరు శాసనసభ్యులు విడుదల చేసిన ఒక ప్రకటనలో ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేశారు.




# పార్లమెంట్ శీతాకాల సమావేశాలలో ఆమోదానికి 15 బిల్లుల జాబితా



**న్యూఢిల్లీ :** నవంబరు 25 (సోమవారం) నుంచి ప్రారంభం కానున్న పార్లమెంట్ శీతాకాల సమావేశాలలో ప్రవేశపెట్టి ఆమోదించడం కోసం కేంద్ర ప్రభుత్వం 15కీలక బిల్లుల జాబితాను అందజేసింది. వాటిలో అత్యంత కీలకమైన వక్ఫ్ చట్టం స వరించడం సహా 5 కొత్త బిల్లులు ఉన్నాయి. 5 కొత్త ముసాయిదా చట్టాలలో సహకార విశ్వ విద్యాలయం ఏర్పాటు చేయడం కూడా ఉంది. వక్ఫ్ (సవరణ) బిల్లు సహా పెండింగ్ బిల్లులను రెండు సభలలో తీర్మానం చేసి ఆమోదించిన తర్వాత వాటి నివేదికను లోక్‌సభకు అందజేశారు. శీతాకాల సమావేశాల మొదటి వారం చివరి రోజున కమిటీ తన నివేదికను లోక్‌సభకు అందజేయడం తప్పనిసరి. కాగా ఈ శీతాకాల సమావేశాలు డిసెంబరు 20వ తేదీకి ముగియనున్నాయి. పంజాబ్ కోర్టుల (సవరణ)బిల్లు డబ్బును పెంచడానికి (కేసు ద్రవ్య విలువను నిర్వచించబడినది) ప్రభుత్వం ప్రవేశపెట్టడం, పరిశీలన చేయడం, ఆమోదించడం కోసం ఢిల్లీ జిల్లా కోర్టుల అప్పిలేట్ జురీస్‌డిక్షన్‌ను ప్రస్తుతం ఉన్న రూ.3లక్షల నుంచి రూ.20లక్షలకు పెంచడానికి ఉద్దేశించిన మరోబిల్లును జాబితాలో పొందుపరిచారు. మర్చెంట్ షి ప్పింగ్ బిల్లు నూతన ముసాయిదా చట్టాన్ని కూడా ప్రభుత్వం ప్రవేశపెట్టే ఆలోచనలో ఉన్నది. వీటితో పాటు కోస్టల్ షిప్పింగ్ బిల్లు, భారతీయ రేవుల బిల్లును కూడా కేంద్ర ప్రభుత్వం జాబితాలో చే ర్చింది. వక్ఫ్ (సవరణ) బిల్లు, ముసల్మాన్ వక్ఫ్(ర ద్దు) బిల్లు సహా 8 బిల్లులు లోక్‌సభలో పెండింగ్‌లో ఉన్నాయి.

# ఔట్‌సోర్సింగ్ ద్వారా ప్రభుత్వ ఉద్యోగాలు 'ఆర్థిక కుట్ర'

### తక్షణమే ఈ ప్రతిపాదనను ఉపసంహరించుకోవాలి : అఖిలేష్ యాదవ్



**లక్నో :** ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించడం బిజెపి ప్రభుత్వ ఎజెండాలోనే లేదని సమాజ్‌వాది పార్టీ (ఎస్‌పి) అధ్యక్షుడు అఖిలేష్ యాదవ్ విమర్శించారు. ఔట్‌సోర్సింగ్ ద్వారా ప్రభుత్వ ఉద్యోగాల్లో నియామకాలు చేపట్టడం 'ఆర్థిక కుట్ర' అని మండిపడ్డారు. ఈ చర్య అట్టడుగు వర్గాల ప్రజలకు వ్యతిరేకమన్నారు. ఓ న్యూస్‌పేపర్, యాడ్‌ను సామాజిక మాధ్యం ఎక్స్‌లో అఖిలేష్ షేర్ చేస్తూ తహసీల్దార్, నాయబ్ తహసీల్దార్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్,లేఖపాల్ పోస్టులను ఔట్‌సోర్సింగ్ ద్వారా భర్తీ చేశారని ధ్వజమెత్తారు. ఈ చర్యల వల్ల రాజ్యాంగంలో ఉద్యోగ రిజర్వేషన్ల హక్కులను హరిస్తున్నారన్నారు. కమీషన్లన్నీ ఒకేచోట నుండి వచ్చేలా మొత్తం 'ప్రభుత్వాన్ని' బిజెపి ఔట్‌సోర్స్ చేస్తే మంచిదని, ఇలా చేయడం ద్వారా రిజర్వేషన్లకు మంగళం పాడుతూ తక్కువ సంఖ్యలో ఉద్యోగాలు ఇవ్వడానికి బిజెపికి పెద్దగా ఇబ్బంది పడాల్సిన అవసరం రాదు అని అఖిలేష్ ఎద్దేవా చేశారు. కాషాయ పార్టీ ఎజెండాలో ఉద్యోగాలు లేవని తాము ఎప్పటి నుంచో చెబుతున్నామని, అయినా మరొక్కసారి గుర్తుచేస్తున్నామన్నారు. ఔట్‌సోర్సింగ్ అనేది 'పిచ్‌దే (వెనుకబడినవారు), దళితులు, అల్పసంఖ్యాక్ (మైనారిటీలు)' (పిఎడి)కు వ్యతిరేకంగా ఆర్థిక కుట్రేనని మండిపడ్డారు. వెంటనే ఈ ప్రతిపాదనను ఉపసంహరించుకోవాలని, ఈ ప్రతిపాదనను బిజెపి తక్షణమే ఉపసంహరించుకోవాలని, రాజ్యాంగం కల్పించిన ఉద్యోగ రిజర్వేషన్ల హక్కును హరించరాదని అఖిలేష్ పేర్కొన్నారు.

# ఢిల్లీలో పూల్ వెహికిల్ విధానం

### వాయు కాలుష్యం ఎఫెక్ట్.. ఉద్యోగులకు కేంద్రం కీలక సూచనలు



**న్యూఢిల్లీ :** దేశ రాజధాని నగరంలో వాయు కాలుష్యం తీవ్రత కొనసాగుతోంది. గాలి నాణ్యత క్షీణిస్తుండటంతో కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. కాలుష్య స్థాయిని తగ్గించేందుకు షిఫ్టుల్లో పని చేసే ఉద్యోగులకు సమయం విషయంలో వెసులుబాటు కల్పించింది. వాహనాల నుంచి వెలువడే కాలుష్యాన్ని నియంత్రించేందుకు కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, సిబ్బంది పూల్ వెహికల్ విధానాన్ని అనుసరించాలని కోరింది. అలాగే, ప్రజా రవాణాను వినియోగించాలని కేంద్ర సిబ్బంది వ్యవహారాల మంత్రిత్వశాఖ సూచించింది. ఢిల్లీలోని కేంద్ర ప్రభుత్వ మంత్రిత్వశాఖలు, విభాగాలు, సంస్థల కార్యాలయాలు ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 5.30గంటల వరకు; ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 6.30గంటల వరకు పనిచేస్తాయని పేర్కొంది. ఆఫీసర్లు, సిబ్బంది ఈ సమయాలను పాటించాలని కోరింది. ఆఫీసర్లు/సిబ్బంది వ్యక్తిగత వాహనాల్లో పూలింగ్ విధానాన్ని ప్రోత్సహించాలని సూచించింది. మరో వైపు, కఠిన నిబంధనలు అమలు చేస్తుండటంతో దాదాపు వారం రోజుల తర్వాత నేడు ఢిల్లీలో వాయు నాణ్యత కాస్త మెరుగుపడింది. గురువారం ఉదయం 9గంటల సమయానికి వాయు నాణ్యత సూచీ(ఎక్యూఐ) 376గా ఉన్నట్లు కేంద్ర కాలుష్య నియంత్రణ బోర్డు తెలిపింది. ఢిల్లీలో కాలుష్యం బారి నుంచి ఆరోగ్యాన్ని కాపాడుకొనేలా నవంబర్ 18న సెంట్రల్ సెక్రటేరియట్ సర్వీస్ (సిఎస్ఎస్) అధికారుల సంఘం వర్క్ ఫ్రమ్ హోమ్, పని సమయాల్లో వెసులుబాటు, ఎయిర్ ప్యూరిఫైర్లు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేసింది. ఉద్యోగుల్లో శ్వాస సంబంధిత సమస్యలు, కంటి సమస్యలు, అలసట తదితర ఇబ్బందులు రావడంతో పనిలో ఉత్పాదకతపై ప్రభావం పడుతోందని కేంద్ర ప్రభుత్వానికి రాసిన లేఖలో పేర్కొంది. ఈ నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకోవడం గమనార్హం.

# 11 మందితో ఆప్ తొలి జాబితా విడుదల

**న్యూఢిల్లీ :** వచ్చే ఏడాది ఫిబ్రవరిలో ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఈ తరుణంలో అధికార ఆమ్ ఆద్మీపార్టీ తొలిజాబితాను విడుదల చేసింది. 11 మంది అభ్యర్థుల పేర్లను ప్రకటించింది. బిజెపి, కాంగ్రెస్ నుంచి బయటకు వచ్చి ఇటీవలే ఆప్ తీర్థం పుచ్చుకున్నవారు అందులో ఆరుగురు ఉన్నారు. బ్రహ్మ సింగ్ తన్వర్, అనిల్ ఝా, బీబీ త్యాగి బిజెపి మాజీ నేతలు కాగా.. చౌధరీ జుబైర్ అహ్మద్, వీర్ ధింగన్, సుమేష్ షోకీన్ కాంగ్రెస్ నుంచి ఆప్‌లో చేరారు. ఇదిలా ఉంటే.. మద్యం కుంభకోణం కేసులో ఆరోపణలు ఎదుర్కొని.. జైలుకు వెళ్లి వచ్చిన ఆప్ అధినేత అరవింద్ కేజ్రీవాల్ ప్రజలు మళ్లీ తనకు విశ్వసనీయత సర్టిఫికెట్ ఇచ్చేవరకూ సిఎం పదవిలో ఉండబోనని కొన్ని నెలల క్రితం ప్రకటించిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం ఆయన ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేసి, రానున్న ఎన్నికల కోసం పార్టీ ముందుకు నడిపిస్తున్నారు. ఇక ఈ ఎన్నికల సమయంలో నేతలు పార్టీలు మారుతున్నారు. ఢిల్లీ మంత్రిగా పనిచేసిన కైలాశ్ గహ్లోత్ కొద్దిరోజుల క్రితం భాజపాలో చేరారు.

## జార్ఖండ్, మహారాష్ట్రలో గెలుస్తాం: కాంగ్రెస్

**లక్నో:** మహారాష్ట్ర, జార్ఖండ్ రాష్ట్రాల్లో కచ్చితంగా గెలిచి తీరుతామని కాంగ్రెస్ నేత సురేంద్ర రాజ్‌పుత్ ధీమా వ్యక్తం చేశారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ 'ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో 400 స్థానాలను కాంగ్రెస్‌నే గెలుస్తుందని, అధికారం చేపడుతుందని ఎగ్జిట్‌పోల్స్ వెల్లడించాయి. అయితే ఇలాంటి గద్దర్ల వల్ల ప్రజలకు ఎలాంటి అభిప్రాయం ఉన్నా... మాకు మాత్రం మహారాష్ట్రలో మహా వికాస్ అఘాడీ కూటమినే ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందని నమ్ముతున్నాం. ఆ రాష్ట్రంలో మహిళలు, రైతులు, యువకులు మహాయుతి కూటమి తిరిగి అధికారంలోకి రావాలని కోరుకోవడం లేదు. జార్ఖండ్‌లో తిరిగి అధికారంలోకి వస్తాం. మహారాష్ట్రలో మార్పుకు కృషి చేశాం. ఆ విధమైన మార్పు తీసుకొస్తామని విశ్వసిస్తున్నాం' అని ఆయన అన్నారు.

# కాగ్ అధిపతిగా సంజయ్ మూర్తి ప్రమాణం



**న్యూఢిల్లీ :** భారత కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్)గా ఉన్నత విద్య మాజీ కార్యదర్శి కె. సంజయ్ మూర్తి ప్రమాణ స్వీకారం చేశారు. గురువారం రాష్ట్రపతి భవన్‌లోని గణతంత్ర మంటపంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్మ సంజయ్‌తో ప్రమాణం చేయించారు. కార్యక్రమానికి ఉప రాష్ట్రపతి జగదీప్ ధనఖర్, కేంద్ర విద్యాశాఖమంత్రి ధర్మేంద్ర ప్రధాన్, వాణిజ్య, పరిశ్రమల శాఖమంత్రి పీయూష్ గోయల్, ఇతర ఉన్నతాధికారులు హాజరయ్యారు. ఇప్పటి వరకు కాగ్ అధిపతిగా కొనసాగిన గిరీష్ చంద్ర ముర్ము పదవీకాలం ఈనెల 20వ తేదీతో ముగిసింది. దీంతో ఆ స్థానంలో కేంద్ర ప్రభుత్వం కె. సంజయ్ మూర్తి పేరును సోమవారం ప్రతిపాదించింది. కాగా, ఆంధ్రప్రదేశ్‌లోని అమలాపురం మాజీ ఎంపి కెఎస్‌ఆర్ మూర్తి కుమారుడు సంజయ్ మూర్తి. 1964 డిసెంబరు 24న జన్మించిన ఆయన.. మెకానికల్ విభాగంలో ఇంజినీరింగ్ చదివారు. 1989లో ఐఎఎస్ అధికారిగా హిమాచల్ ప్రదేశ్ కేడర్‌కు ఎంపికై, ఆ తర్వాత కేంద్ర సర్వీసుల్లో పనిచేశారు. 2021 సెప్టెంబరు నుంచి జాతీయ ఉన్నత విద్యా కార్యదర్శిగా పనిచేస్తూ, కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన విద్యావిధానం అమలులో క్రియాశీలక పాత్ర పోషించారు. ఐఎఎస్ అధికారిగా వచ్చే నెలలో ఉద్యోగ విరమణ చేయాల్సిఉండగా, సంజయ్ సేవలను గుర్తించిన కేంద్రం ఈ కీలక బాధ్యతలు అప్పగించింది. ఈ స్థానంలో నియమితులైనవారు గరిష్ఠంగా ఆరేళ్లు కానీ, 65 ఏళ్ల వయసు వరకు కానీ కొనసాగడానికి వీలుంది. సంజయ్ మూర్తి తండ్రి కెఎస్‌ఆర్ మూర్తి 1996లో కాంగ్రెస్ తరఫున అమలాపురం నుంచి లోక్‌సభకు ప్రాతినిధ్యం వహించారు. అంతకు ముందు ఆయన కూడా ఐఎఎస్ అధికారిగా కేంద్ర ప్రభుత్వంలో కార్యదర్శి స్థాయిలో సేవలందించారు.



# మేము కలిసి ఉండలేం : ధనుష్ దంపతులు

**చెన్నై:** విడాకుల కేసు విచారణలో భాగంగా నటుడు ధనుష్, ఆయన సతీమణి ఐశ్వర్య తాజాగా చెన్నై ఫ్యామిలీ వెల్ఫేర్ కోర్టు ఎదుట హాజరయ్యారు. తాము కలిసి ఉండాలనుకోవడం లేదని, విడిపోవాలని నిర్ణయించుకున్నామని న్యాయస్థానానికి తెలిపారు. విడిపోవడానికి గల కారణాలను వారు వివరించారు. ఇద్దరి వాదనలు విన్న కోర్టు తుది తీర్పును ఈనెల 27కు వాయిదా వేసింది. సూపర్‌స్టార్ రజనీకాంత్‌కు ఐశ్వర్య పెద్ద కుమార్తె. చదువుకునే రోజుల్లో ధనుష్ అక్క, ఐశ్వర్యకు మంచి స్నేహితురాలు. అలా, వీరిద్దరి మధ్య స్నేహం కుదిరింది. కొంతకాలానికి అది ప్రేమగా మారింది. పెద్దల అంగీకారంతో 2004 నవంబర్ 18న వారి వివాహం జరిగింది. 18 ఏళ్ల వైవాహిక బంధానికి స్వస్తి పలుకుతూ తాము విడిపోవాలనుకుంటున్నామని దాదాపు రెండేళ్ల క్రితం ధనుష్ ఐశ్వర్య ప్రకటించారు. పరస్పర అంగీకారంతోనే తాము ఈ నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. '18 ఏళ్లపాటు స్నేహితులుగా, భార్యాభర్తలుగా, తల్లిదండ్రులుగా, శ్రేయోభిలాషులుగా అర్థం చేసుకొని మా ప్రయాణం కొనసాగించాం. ఇప్పుడు మేము వేర్వేరు దారుల్లో ప్రయాణించేందుకు సిద్ధమయ్యాం. ఐశ్వర్య, నేనూ విడిపోవాలని నిర్ణయం తీసుకున్నాం' అని 2022లో ధనుష్ పోస్ట్ పెట్టారు. విడాకుల కోసం ఈ ఏడాది ఆరంభంలో చెన్నైలోని ఫ్యామిలీ వెల్ఫేర్ కోర్టును ఆశ్రయించారు. ఇప్పటికే చాలామార్లు ఈ కేసు విచారణకు రాగా... వీరిద్దరూ హాజరుకాలేదు. దీంతో వీరిద్దరూ తిరిగి కలుస్తారని అందరూ భావించారు. తాజా విచారణతో ఈ జంట విడిపోవడానికే నిర్ణయించుకున్నట్లు స్పష్టమైంది.

### మానవ అంతరిక్ష ప్రయాణంలో

# పరస్పర సహకారానికి భారత్-ఆస్ట్రేలియా సంతకం

### భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) వెల్లడి




**బెంగళూరు :** ఇరు దేశాల మధ్య అంతరిక్ష కార్యకలాపాలలో సహకారాన్ని మరింత పటిష్టం చేసుకునేందుకు భారత అంతరిక్ష పరిశోధన కేంద్రం (ఇస్రో), ఆస్ట్రేలియా అంతరిక్ష సంస్థ (ఎఎస్ఎ) అమలు ఒప్పందం (ఐఎ) కుదుర్చుకున్నట్లు గురువారం ఇస్రో తెలియజేసింది. 'ఇరుదేశాల మధ్య జరిగిన ఈ ఒప్పందం గగన్‌యాన్ మిషన్‌ల కోసం సిబ్బంది, సిబ్బంది మాడ్యూల్ రికవరీపై రెండు దేశాల అంతరిక్ష సంస్థల మధ్య సహకారాన్ని అనుమతిస్తుంది. ఇది దేశం యొక్క మొట్టమొదటి సిబ్బందితో కూడిన అంతరిక్ష ప్రయాణ కార్యక్రమం' అని ఇస్రో గురువారం నాడు ఇక్కడ విడుదల చేసిన ప్రకటన తెలియజేసింది. నవంబరు 20న జరిగిన ఈ అమలు ఒప్పందంపై హ్యూమన్ స్పేస్ ఫ్లైట్ సెంటర్ (హెచ్ఎస్ఎఫ్‌సి) డైరెక్టర్ డికె.సింగ్ బెంగళూరుకు చెందిన భారత అంతరిక్ష పరిశోధన కేంద్రం తరపున సంతకంచేయగా, కాన్‌బెర్రాకు చెందిన ఆస్ట్రేలియా అంతరిక్ష సంస్థ తరపున స్పేస్ కేపబులిటీ బ్రాంచ్ (ఎస్‌సిబి) జనరల్ మేనేజర్ జర్రోద్ పోవెల్ సంతకం చేశారని ఇస్రో పేర్కొంది. భారతదేశం, ఆస్ట్రేలియా శాశ్వతమైన వ్యూహాత్మక భాగస్వాములుగా ఉన్నాయని, రెండు అంతరిక్ష సంస్థలు సన్నిహితంగా పనిచేస్తున్నాయని, ప్రస్తుత, భవిష్యత్తు కార్యక్రమాలను అన్వేషించడానికి ఇరు దేశాలు కట్టుబడి ఉన్నాయని భారత అంతరిక్ష పరిశోధన సంస్థ అమలు ఒప్పందం గురించి వివరించింది

ఇండియన్ బ్యాంక్ Indian Bank ALLAHABAD
సింధి కాలనీ బ్రాంచ్
హెచ్.నం.1-8-50/జి, ప్లాట్ నం.12, పి.జి. రోడ్డు, స్ట్రీట్ నం.12, కృష్ణానగర్ కాలనీ, సికింద్రాబాద్

అనుబంధం-4-ఎ (నిబంధన 8(6) చూడుము)
స్థిర ఆస్తుల విక్రయానికి అమ్మకం ప్రకటన

సెక్యూరిటైజేషన్ అండ్ రికన్‌స్ట్రక్షన్స్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం 2002 మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్ నిబంధనలు) 2002, నిబంధన 8(6) కింద స్థిర ఆస్తుల విక్రయం కొరకు ఇ-వేలం అమ్మకం ప్రకటన.
శ్రీ తుమ్మల అనంతపద్మనాభం & శ్రీమతి తుమ్మల శారదాబాయ్, రంగారెడ్డి జిల్లా జిహెచ్ఎంసి ఎల్‌బి నగర్ సర్కిల్ కింద సరూర్‌నగర్ మండలం, మన్సూరాబాద్ గ్రామం, శివగంగ కాలనీలో వ్యాపించియున్న ప్లాట్ నం.29పై 'బి ఎస్ రెసిడెన్సీ'లో మూడవ అంతస్తులో ప్లాట్ నం.301. (రుణగ్రహీత / హామీదారు యొక్క పేరు చిరునామా) నుంచి సెక్యూరిటీ క్రెడిటార్ ఇండియన్ బ్యాంక్, సింధికాలనీ బ్రాంచ్‌కు బకాయి పడిన మొత్తం 16.11.2024 నాటికి రూ.10,24,520/- (పది లక్షల ఇరవైనాలుగు వేల ఐదు వందల ఇరవై రూపాయలు మాత్రమే) లను తిరిగి రాబట్టేందుకు సెక్యూరిటీ క్రెడిటార్ ఇండియన్ బ్యాంక్, సింధికాలనీ బ్రాంచ్ అధీకృత అధికారి ద్వారా లాంఛనంగా స్వాధీనంలోకి తీసుకోబడినదైన సెక్యూర్డ్ క్రెడిటార్‌కు తనఖాపెట్టిన/అధీనం చేసిన ఈ కింద పేర్కొన్న స్థిర ఆస్తిని 'ఎక్కడ ఉన్నది ఉన్నట్లుగా', 'ఉన్నది ఉన్నట్లుగా' మరియు 'అక్కడ ఉన్నది ఏమైనా ప్రాతిపదికపై 23.12.2024న విక్రయించబడునని ఇందుమూలంగా సాధారణ ప్రజానీకం మరియు ప్రత్యేకించి రుణగ్రహీత(లు) మరియు హామీదారు(లు)కు తెలియజేయడమైనది. ఇ-వేలం విధానం ద్వారా విక్రయానికి ఉద్దేశించిన ఆస్తి యొక్క నిర్దిష్ట వివరాలు ఈ కింద పేర్కొనడమైనది:
ఆస్తి యొక్క పూర్తి వివరాలు: రంగారెడ్డి జిల్లా, జిహెచ్ఎంసి ఎల్‌బి నగర్, రంగారెడ్డి జిల్లా కింద సరూర్‌నగర్ మండలం, మన్సూరాబాద్ గ్రామం, శివగంగ కాలనీ వద్ద ఉన్న సర్వే నం.66/8లో వ్యాపించియున్న ప్లాట్ నం.29పై 300 చదరపు గజాల మొత్తం కొలత నుండి 41.80 చదరపు మీటర్లకు సమానమైన 50 చదరపు గజాల కొలత అవిభాజ్య భూమి వాటాతో కలిసి 957 చదరపు అడుగుల (ఉమ్మడి ప్రదేశం మరియు కారు పార్కింగ్ సహా) ప్లింత్ ఏరియా కలిగిన "బిఎస్ రెసిడెన్సీ" లో మూడవ అంతస్తుపై నం.301 నివాసిత ఫ్లాట్ మొత్తంగా. 3వ అంతస్తు, ఫ్లాట్ నం.301 యొక్క హద్దులు: ఉత్తరం: ఓపెన్ టు స్కై, దక్షిణం: ఓపెన్ టు స్కై, తూర్పు: కారిడార్ & లిఫ్ట్, పడమర: ఓపెన్ టు స్కై.

| | |
|---|---|
| పూర్వపు రుణభారం | ఏమీలేవు |
| రిజర్వు ధర | రూ.46.00 లక్షలు |
| ఇఎండి మొత్తం | రూ.4.60 లక్షలు |
| బిడ్ పెంపుదల మొత్తం | రూ.10,000/- |
| ఇ-వేలం తేదీ&సమయం | 23.12.2024 ఉ.10:00 నుంచి సా.05:00 గం. వరకు |
| ఆస్తి యొక్క ఐడి నం. | IDIB50336295321 |

తేదీ : 16-11-2024, ప్రదేశం: హైదరాబాద్ సం/-అధీకృత అధికారి

ఆన్‌లైన్ బిడ్‌లో పాల్గొనేందుకు దయచేసి మా ఇ వేలం సర్వీస్ ప్రొవైడర్ పిఎస్‌బి అలియాన్స్ ప్రైవేట్ లిమిటెడ్ యొక్క వెబ్‌సైట్ (https://www.ebkray.in)ను సందర్శించగలరని బిడ్డర్లకు సూచించడమైనది. సాంకేతిక సహాయానికి దయచేసి 8291220220కు కాల్ చేయగలరు. రిజిస్ట్రేషన్ స్థితి మరియు ఇఎండి స్థితి కొరకు దయచేసి support.ebkray@psballiance.com కు మెయిల్ చేయగలరు. ఆస్తి వివరాలు మరియు ఆస్తి ఫొటోగ్రాఫ్ మరియు వేలం నియమ నిబంధనల కొరకు దయచేసి https://www.ebkray.in లో చూడగలరు. మరియు ఈ పోర్టల్‌కు సంబంధించిన వివరాల కోసం దయచేసి పిఎస్‌బి అలియాన్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఫోన్ నం. 8291220220 లో సంప్రదించగలరు. https://www.ebkray.in వెబ్‌సైట్‌లో ఆస్తి కొరకు వెదుకుతున్నప్పుడు పైన తెలిపిన ఆస్తి ఐడి సంఖ్యను ఉపయోగించాల్సిందిగా బిడ్డర్లకు సూచించడమైనది.
సంప్రదించు వ్యక్తి : 1. (అధీకృత అధికారి పేరు మరియు మొబైల్‌నం.) దీపక్ కె శ్రీవాస్ #
2. (అధీకృత అధికారి పేరు మరియు మొబైల్‌నం.) గూడూరు రవికిరణ్ 7995077910

ప్రజాపక్షం
PRAJAPAKSHAM
శుక్రవారం, నవంబరు 22

## రష్యా – ఉక్రేన్ యుద్ధం విస్తరిస్తుందా?

రష్యా–ఉక్రేన్ యుద్ధం నవంబర్ 19న 1000వ రోజులో ప్రవేశించింది. అదేరోజు మధ్యాహ్నం ఉక్రేన్ అధ్యక్షుడు జెలెన్స్కీ రష్యా భూభాగం లోపలికి చొచ్చుకుపోగలిగిన దీర్ఘశ్రేణి మిస్సిలీలను (ఎటిసిఎంఎస్) తొలిసారి ప్రయోగించాడు. పదవీ విరమణ చేయనున్న అమెరికా అధ్యక్షుడు జో బైడన్ అంతకు రెండురోజుల క్రితమే ఆ మిస్సిలీలు ప్రయోగించేందుకు అనుమతి ఇచ్చాడు. దాంతో రష్యా అధ్యక్షుడు పుతిన్, అంతకుముందు అణ్వస్త్రరాజ్యాల మధ్య అంగీకారం కుదిరిన అణ్వస్త్ర ప్రయోగ నిరోధక స్థాయిని తగ్గిస్తున్నట్లు ప్రకటించాడు. ఒక అణ్వస్త్ర దేశం తమపై నేరుగా కాకపోయినా మూడవదేశంద్వారా తమ దేశంలోకి అణుశక్తి చోదిత మిస్సిలీలను ప్రయోగిస్తే వాటిని నిరోధించేందుకేగాక, ప్రయోగించేందుకు తమకుగల హక్కును రష్యా వినియోగించుకోవచ్చునన్నమాట. అంటే ఉక్రేన్ యుద్ధం మరింత విధ్వంసక దశలో – అనగా మూడవ ప్రపంచ యుద్ధం లాంటి పరిస్థితిలోకి దారితీస్తుందా? అనే భయసందేహాలు సహజంగానే వ్యక్తమైనాయి. కాని 60రోజుల్లో (జనవరి 20) డోనాల్డ్ ట్రంప్ అమెరికా అధ్యక్ష బాధ్యతల్లోకి రానున్నందున, రష్యా–ఉక్రేన్ యుద్ధాన్ని ముగిస్తానని ప్రకటించి ఉన్నందున, 'లేదు' అని ఆ ప్రశ్నకు జవాబు చెప్పుకోవచ్చు. అయితే గతవారం వైట్‌హౌస్‌లో అధికార మార్పిడిపై ట్రంప్‌తో బైడన్ సమావేశం తదుపరి రెండ్రోజులకు ఆయన ఉక్రేన్ అధ్యక్షునికి రష్యాపైకి దీర్ఘశ్రేణి మిస్సిలీల ప్రయోగించటానికి అనుమతి ఇవ్వటం సందేహాలకు తావిస్తున్నది. ఎందుకంటే ట్రంప్ నిలకడలేని మనిషి. జెలెన్స్కీకి అమెరికా నుంచి క్రియాశీలంగా సహాయం కొనసాగించాలన్న బైడన్ సలహాకు ట్రంప్ ప్రాధాన్యత ఇవ్వలేదని చెప్పబడుతున్నది. 'నా పద్ధతిలో నేను చర్యలు తీసుకుంటానని' మాత్రమే ట్రంప్ చెప్పాడని అంటున్నారు. జనవరి 20 తర్వాత అమెరికా వైఖరిలో మార్పు ఉంటుందని జెలెన్స్కీకి కూడా తెలుసు. ఆయన ఈ వారంలో యూరోపియన్ పార్లమెంటులో ప్రసంగిస్తూ, ట్రంప్ అధికారం చేబట్టాక 'దౌత్య మార్గాల ద్వారా యుద్ధం ముగుస్తుందని' అన్నారు. తాను 'వాస్తవికమైన 'శాంతి'ని కోరుకుంటున్నట్లు చెప్పారు. అదే నిజమైతే ఇప్పుడు అణుశక్తి చోదిత దీర్ఘశ్రేణి మిస్సిలీలు ఎందుకు ప్రయోగించినట్లు? లాండ్‌మైన్‌లు ఎందుకు అమర్చుతున్నట్లు? అంటే యుద్ధం ముగింపజేసేందుకు ట్రంప్‌కు ఆయన ప్లాన్ ఆయనకుందన్న మాట. రష్యాను బలహీనమైన స్థితిలోకి నెట్టటం ఆ వ్యూహంలో భాగం కావచ్చు. కొత్త అధ్యక్షునికి ఉక్రేన్ యుద్ధంపై 'శాంతి ప్రణాళిక' ఏదో ఉందని తెలిసి కూడా బైడన్ తన అధికారం చివరి రోజుల్లో రష్యాపైకి దీర్ఘశ్రేణి మిస్సిలీల ప్రయోగించటానికి తనకుతానుగా అనుమతించి ఉండడు. ట్రంప్ లోపాయకారి సమ్మతి ఉండి ఉంటుంది. ట్రంప్ ఉక్రేన్‌పై శాంతిని విధించటంలో రష్యాకు లబ్ది చేకూర్చితే రష్యా విస్తరణ కాంక్ష పెరుగుతుందని నాటో సభ్యులుగా ఉన్న హంగరీ వంటి తూర్పు యూరప్ రాజ్యాలు, కొన్ని స్కాండినేవియన్ దేశాలు ఆందోళన చెందుతున్నాయి. ఈ రెండు నెలల్లో రష్యాకు సాధ్యమైనంత ఎక్కువ నష్టం కలిగించే పనిలో ఉన్నాడు జెలెన్స్కీ. అతనికి అమెరికా ఆర్థిక సహాయం వెనువెంటనే నిలుపు చేసే వీలు లేకుండా బైడన్ కొన్ని చట్ట సంబంధ మార్పులు చేశాడట. అందువల్ల ట్రంప్ వెంటనే చర్య తీసుకునే అవకాశం లేదు – చట్టాల్లో మార్పులకు కొంత సమయం పడుతుంది. రెండోవైపున రష్యా, ఇరానియన్ డ్రోన్‌లు, ఉత్తరకొరియా ఫిరంగిగుళ్లు, 11వేలమంది కొరియన్ సైన్యం, చైనా మద్దతుతో – శాంతి చర్చలలోపే సాధ్యమైనంత ఎక్కువ ఉక్రేన్ భూభాగాన్ని ఆక్రమించుకునే పనిలో ఉంది.

ఉక్రేన్ భూభాగంనుండి రష్యా సైన్యాల ఉపసంహరణ, మిలటరీ విధ్వంసానికి రష్యా పూర్తి పరిహారం షరతులు విధించి పుతిన్‌తో చర్చలు నిరాకరిస్తూ వస్తున్న జెలెన్స్కీ తాజాగా తాను చర్చలకు సిద్ధమంటున్నారు. ఉక్రేన్ నుండి రష్యా సైన్యాల సంపూర్ణ ఉపసంహరణ, భవిష్యత్‌లో రష్యన్ చొరబాటునుండి తమ భద్రతకు నాటోనుంచి హామీ డిమాండ్‌లను పునరుద్ఘాటిస్తున్నాడు. ఉక్రేనియన్ ప్రయోజనాల రక్షణ అంటూ ఆయన వేటిని ప్రస్తావిస్తున్నాడో అవి యూరప్ భద్రతతో కూడా ముడిపడి ఉన్నాయి. నాటోలో సభ్యత్వంకోసం ఉక్రేనియన్ అధ్యక్షుని ప్రయత్నం, అదే జరిగితే నాటో సైన్యాలు తమ సరిహద్దులో తిష్టవేస్తాయన్న రష్యా భయం ఈ యుద్ధానికి మూలం. ఉక్రేన్‌లో రష్యన్‌లు మెజారిటీగా ఉన్న ప్రావిన్స్‌లో వారి స్వపరిపాలన సమస్య ఉండనే ఉంది. అలాగే నల్ల, మధ్యధరా సముద్రాల్లో రష్యన్ నౌకల స్వేచ్ఛా ప్రయాణం వంటి సమస్యలూ ఉన్నాయి. రష్యా భద్రతపై రష్యా, నాటోదేశాల మధ్య ఉన్న ఒప్పందాలను అవి ఉల్లంఘించటం, ఉక్రేన్‌ను రష్యాపైకి కవ్వించి ఆర్థిక, సైనిక సహాయం అందిస్తూ నాటో కూటమి రష్యా పై సాగిస్తున్న ప్రాక్సీయుద్ధం వగైరా సమస్యలన్నీ చర్చల బల్లపైకి వస్తాయి. అంతిమ పరిష్కారాలు ఎలా జరిగినా ట్రంప్ వాటిలో ముందుగా అమెరికా ప్రయోజనాల రక్షణనే కోరుకుంటాడు.

# 'రేవంతన్న'ను చూడాలని ఉంది!



ఎస్‌కె జకీర్
సీనియర్ జర్నలిస్ట్
9052631212

''రేవంతన్నను చూడడంకోసం వచ్చినం'' అని నవంబర్ 19న వరంగల్ ఆర్ట్స్ కాలేజీ మైదానంలో విజయోత్సవ సభకు వచ్చిన జనంలో కొందరు యువకులు అన్నారు. ''మాకోసం సిఎం సారు మంచి పనులు చేస్తున్నడు'' అని ఒక మహిళ చెప్పింది. రైతుబంధు గురించి అడిగినప్పుడు ''పైసలన్నీ కెసిఆర్ కుటుంబం లూటీ చేసుకు పోయినంక రేవంత్ సార్ మాత్రం ఏం చేస్తడు'' అని యువ రైతు ఆగ్రహంతో చెప్పాడు. ''రుణమాఫీ కెసిఆర్ చేయలే. రేవంత్ సారు చేసిండు'' అని కొందరు అన్నారు. వీళ్లంతా సిద్ధిపేట, జనగామ, నర్సంపేట, పరకాల, హుజురాబాద్, సిరిసిల్ల, వేములవాడ, కరీంనగర్ తదితర ప్రాంతాల నుంచి హాజరయినవారు.

'రైతుబంధు' అమలు చేయలేదన్న కోపాన్ని కొందరు రైతులు ప్రదర్శించినా, కాంగ్రెస్ ప్రభుత్వంపై అది 'వ్యతిరేకత'గా మారడం లేదని నాకు అర్థమైంది. 'రైతు భరోసా' పేరిట రైతులను ఆదుకోవడానికి జరుగుతున్న ప్రయత్నాల గురించి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చేసిన ప్రకటనలను సిఎం సభకు వచ్చిన వాళ్లలో కొందరు గుర్తు చేశారంటే వారి చైతన్య స్థాయిని అంచనా వేయవచ్చు. ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డికి కలిసి వస్తున్న అంశాలేమిటంటే, అనేక కార్యక్రమాలను పూర్తి చేయకుండానే కెసిఆర్ వదిలేశారు. వాటిని ఒక్కొక్కటిగా పూర్తి చేసుకుంటూ పోవాలని సిఎం భావిస్తున్నారు.

'కెసిఆర్ ఆనవాళ్ళను తుడిచేస్తా' అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఏ ముహూర్తాన ప్రతిన పూనారో గానీ, క్రమంగా ఆ పరిస్థితులు నెలకొంటున్నవి. కెసిఆర్...జవహర్ లాల్ నెహ్రూ, ఇందిరాగాంధీ, రాజీవ్ గాంధీ, పివి వంటి వారి స్థాయికి వెళ్లిన వ్యక్తి కాదు. వాళ్లంతా ఈ దేశంకోసం, ప్రజల బాగుకోసం విప్లవాత్మక చర్యలు అమలు చేశారు. అనేక తరాలపాటు వాళ్ళను ఈ దేశం గుర్తు చేసుకుంటుంది. వాళ్ళను మరచిపోవడానికి సాధ్యంకాని పనులు చేశారు. కనుక వాళ్ళ ఆనవాళ్ళు తుడపడం కష్టం. కానీ కెసిఆర్ 'ఆనవాళ్లు' అంటే ఏమిటి? కొన్ని నిర్మాణాలు, కొన్ని భవనాలు, కొన్ని కట్టడాలు, ఫ్లై ఓవర్లు, కాళేశ్వరం, 'ఓటు బ్యాంకు' రైతుబంధు....ఇలాంటివేనా? తెలంగాణ ప్రజల సామాజిక, ఆర్థిక పరిస్థితుల్లో వచ్చిన పెనుమార్పు లు ఏమిటి? ప్రపంచంలోనే గొప్ప మానవ నిర్మిత కట్టడంగా చెప్పుకున్న కాళేశ్వరం సంగతేమిటి?

కెసిఆర్‌ను ప్రజలు నెమ్మదిగా మరచిపోయేలా అద్భుతమైన ప్రణాళికలను రేవంత్ రెడ్డి అమలు చేస్తున్నారు. కెసిఆర్ మినహా మరెవ్వరూ ఆ పార్టీలో 'కమాండర్ ఇన్ చీఫ్' స్థాయి మనిషి లేనందున, కెటిఆర్ ఆ స్థాయిని అందుకునే పరిస్థితి కనిపించనందున ఈ దుస్థితి వచ్చింది. ఇంకో రెండు జన్మలయినా కెసిఆర్ పేరు చెప్పుకొని 'కాయలు అమ్ముకోవాల'ని బిఆర్‌ఎస్ ప్రయత్నిస్తున్నది.

'యాదాద్రి' అని పలకడానికి మనం ఎంత తంటాలు పడ్డామో! 'యాదగిరిగుట్ట'గా రేవంత్ రెడ్డి ప్రభుత్వం పేరు మార్చాక మనకు సౌకర్యంగా మారింది. అసలు యాదాద్రి, భద్రాద్రి వంటి నామకరణం చేసిన మనిషి ఇప్పుడు 'మ్యాప్'లో కనిపించడం లేదు. ఒక దశలో తెలంగాణలో చిన జీయర్ స్వామి హవా ఏమిటో మనం కనులారా చూసాం. తనతో పొసగనందున 'స్వామి'ని శంకరగిరి మాన్యాలకు కెసిఆర్ పంపించేశారు. నాడు చినజీయర్‌పై అనుగ్రహానికి, నేడు ఆయనపై ఆగ్రహానికి కారణమేమిటో 'పెద్దసారే' వివరించవలసి ఉన్నది. తానే 'దేవుడి'నని నమ్మే వ్యక్తి, మరొకరు దేవుని ప్రతినిధిగా ఎట్లా ఒప్పుకుంటారు? అంతేగా! కెసిఆర్‌కు తనపై తనకు విపరీతమైన నమ్మకం. అదే ఆయనను దెబ్బతీసింది. దాన్ని ఆయన ఒప్పుకోడానికి సిద్ధంగా లేరు.

ఇదిలా ఉండగా వరి దిగుబడిలో తెలంగాణ కొత్త చరిత్రను నమోదు చేసింది. ఇది రేవంత్ ప్రభుత్వ పనితీరుకు అద్దం పడుతున్న ది. కాళేశ్వరం ప్రాజెక్ట్ మరోసారి హాట్ టాపిక్ అయ్యింది. కాళేశ్వరంలోని మూడు బ్యారేజ్‌లు పని చేయకపోయినా రికార్డ్ స్థాయిలో వరి ఉత్పత్తి జరగడం కెసిఆర్ ను ఆయన పార్టీని ఇరుకున పెట్టింది. 'బి ఆర్ఎస్ ప్రచారం పటాపంచలైంది. వరి దిగుబడి రైతులు సాధించిన విజయం. ఈ ఖరీఫ్ సీజన్ లో 153 లక్షల మెట్రిక్ టన్నుల వరి దిగుబడి వచ్చింది. దేశ చరిత్రలోనే ఈ రేంజ్ లో వరి పంట దిగుబడి రావడం ఇదే మొదటిసారి. ఈ సీజన్ లో 66 లక్షల 77 వేల ఎకరాల్లో వరి సాగు జరిగితే, కాళేశ్వరం ప్రాజెక్ట్ లోని మూడు బ్యారేజ్‌లు పని చేయకున్నా దండిగా పంటలు పండాయి'' అని సిఎం రేవంత్ ట్వీట్ చేశారు.

వరి దిగుబడిలో తెలంగాణ రికార్డ్ సృష్టించినట్లు ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, శ్రీధర్ బాబు, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, పొంగులేటి, పొన్నం, సీతక్క, జూపల్లి వివిధ సందర్భాలలో వ్యాఖ్యానించారు. ''66.77 లక్షల ఎకరాల్లో 153 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి అయ్యింది'' అని తెలంగాణ పౌరసరఫరాల శాఖ సగర్వంగా ప్రకటించింది. కాగా వరి దిగుబడి రికార్డు తమ ఘనతేనని బిఆర్‌ఎస్ క్లెయిమ్ చేస్తే అందులో నిజమేమిటో తెలుసుకోలేని దుస్థితిలో రైతులు లేరు. అధికారంలో ఉన్నంతకాలం కెసిఆర్ పార్టీకి పట్టిందల్లా బంగారంగా కనిపించింది, అధికారం కోల్పోగానే 'గంగ వెర్రులెత్తుతున్నది' అని కాంగ్రెస్ పార్టీ నాయకులు విమర్శిస్తున్నారు.



''మీ చుట్టూ ఉన్నవారికన్నా ఎక్కువ కాంతితో వెలిగిపోవడం అన్నది ఎవరికీ పుట్టుకతో అబ్బే నేర్పు కాదు. అందరినీ ఎట్లా ఆకట్టుకోవాలో నేర్చుకోవాలి. మిగతా వారిలో లేని ఏదో ఒక ప్రత్యేకత మీలో ఉండాలి. అది మీ రూపు రేఖలు కావచ్చు. మీరు ధరించే దుస్తులు కావచ్చు. మాట తీరు కావచ్చు. ప్రవర్తన కావచ్చు. ప్రత్యర్థుల ఎత్తులు చిత్తు చేయడంలో చాణక్యం కావచ్చు. ఇందులో ఏదో ఒక లక్షణం, ప్రజలు మీ గురించి మాట్లాడుకునేలా చేస్తుంది. ఒకసారి మీ ప్రత్యేకత జనం మనసులో చోటుచేసుకుంటే మీకొక స్థానం దొరుకుతుంది. మీ నక్షత్రానికి ఆకాశంలో ప్రత్యేక స్థానం లభిస్తుంది.'' అని 1492–1556 కాలానికి చెందిన తత్వవేత్త పియెత్రో ఆరెటినో అన్నాడు.

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా కాంగ్రెస్ పార్టీలో మిగతావారికన్నా ఎక్కువ కాంతితో వెలిగిపోతున్నారు. 'పియెత్రో ఆరెటినో' చెప్పిన లక్షణాలు రేవంత్‌కు పుట్టుకతో రాలేదు. కెటిఆర్ వలె 'ముఖ్యమంత్రి కొడుకు' అనే గుర్తింపు లేదు. వారసత్వ రాజకీయాల నుంచి రాలేదు. కానీ ఎంతో కఠోర దీక్ష చేస్తే తప్ప, మరెంతో అభ్యాసంచేస్తే తప్ప ఈ స్థాయికి చేరుకోవడం సాధ్యం కాదు. సరే, అందరూ చెప్పుకునే విధంగా కొంత అదృష్టమూ కలిసి రావచ్చు. తెలంగాణ రాష్ట్ర రాజకీయాలన్నీ పదకొండు నెలలుగా తన చుట్టే తిప్పుకోవడం రేవంత్‌రెడ్డికే సాధ్యమైందని పరిశీలకులు అంటున్నారు.

ఇదేమీ మామూలు విషయం కాదు. ఆయన చాతుర్యం, చాణక్యం, ఎత్తులు, జిత్తులు, వాక్పటిమ, పోరాడేతత్వం, రాజీలేని వైఖరి కారణంగానే ఇది సాధ్యమైంది.

'కెసిఆర్ అనే మొక్కను తెలంగాణలో మళ్ళీ మొలవనివ్వను' అని అనడం అంటే దానికి చాలా తెగువ, తెంపరితనం కావాలి. తగిన అధ్యయనం, ఆయుధాలు, సరంజామా తనతో ఉండాలి. ''ఈయన కన్నా ఆయనే నయం. మా మాట చెల్లుబాటు కావడం లేదు. పొంగులేటి మాట తప్ప ఎవరి మాటా వినే పరిస్థితిలో 'సిఎం లేడు'' అని ఒక మంత్రి, ఇటీవల ఒక గెట్ టు గెదర్ కార్యక్రమంలో తనతో సంభాషించినట్లు బిఆర్‌ఎస్ నాయకుడొకరు నాకు చెప్పాడు. ఆ మంత్రి పేరు ఆయన చెప్పలేదు. బిఆర్‌ఎస్ నాయకుని పేరు నేను వెల్లడించను.

బిఆర్‌ఎస్ నాయకుడు విశ్వసనీయవ్యక్తి అని నాకు నమ్మకం. అతను అబద్ధం చెప్పడు. సదరు 'మంత్రి'కి సిఎం.రేవంత్ రెడ్డిపై ఏ కారణంగానో అసంతృప్తి ఉన్నది. అసమ్మతి కూడా ఉండవచ్చు. ఇక్కడ సమస్య అంతా డబ్బుతో ముడిపడి ఉన్నది. కొందరు మంత్రులు, కాంగ్రెస్ ప్రముఖులు చాలా కాలంగా ఆకలితో నక నక లాడుతూ ఉన్న మాట నిజం. కానీ అధికారం రాగానే ఆకలి తీర్చుకోవడానికి' తప్పు దారి పడితే, త్వరలో సదరు మంత్రో, నాయకుడో అత్యంత త్వరగా అపఖ్యాతి పాలుకావడం తథ్యం. తెలంగాణ మిగులు రాష్ట్రం నుంచి అప్పుల ఊబిలోకి కూరుకుపోవడానికి కెసిఆర్ అండ్ కో కారణమని తెలంగాణ సమాజానికి అర్థమైపోయింది.

కనుక నిధుల లేమితో సర్కారును నడపడం దినదిన గండంగా ఉన్న వేళ 'తమ ఆకలి'కి ప్రాధాన్యమివ్వడం, అందుకు సిఎం.రేవంత్ నిరాకరిస్తుండడం కొందరు అధికార పార్టీ ప్రముఖులకు ఆగ్రహం కలిగించవచ్చు. శంషాబాద్ ఎయిర్ పోర్టులో 'సిఎం రేవంత్ రెడ్డి పట్ల ఒక మంత్రి తీవ్ర అసంతృప్తి'ని తనతో పంచుకున్నట్లు కొంతకాలం కిందట బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ తెలిపారు. ఆయన కూడా సదరు మంత్రి పేరు వెల్లడించలేదు. అసంతృప్త మంత్రుల పేర్లు బయటకు రాకపోయినా వాళ్ళెవరో అంచనా వేయడం కష్టం కాదు.

రేవంత్ రెడ్డి పరిపాలనాపరమైన లోటుపాట్లు ఏమి ఉన్నా, ఆయన బృందంలోని మంత్రులు సిఎంకు బాసటగా నిలబడవలసి ఉన్నది. సిఎం కూడా ఒంటెత్తు పోకడలకు పోకుండా మంత్రులను, పార్టీ ముఖ్యులను విశ్వాసంలోకి తీసుకొని నడవవలసి ఉన్నది. బిఆర్‌ఎస్‌కు ఉన్న వెసులుబాటు, కాంగ్రెస్ పార్టీకి ఉండదు. బిఆర్‌ఎస్‌లో అన్నీ కెసిఆరే. ఆయన 'ఫత్వా' జారీ చేస్తే కిక్కురుమనకుండా అమలు చేయవలసిందే. కాంగ్రెస్ జాతీయ పార్టీ కనుక, ఢిల్లీ 'అనుగ్రహం' తప్పనిసరి. పార్టీ హైకమాండ్‌ను, ఇటు తన సహచర మంత్రులను ముఖ్యమంత్రిగా ఉన్న నాయకుడు సమన్వయం చేసుకోవాలి. ఎక్కడ, కొంత చిక్కు వచ్చినా మొదటికే మోసం వస్తుంది. కాకలు తీరిన కాంగ్రెస్ నాయకులందరినీ వెనుక బెంచీల్లోకి నెట్టివేసి పిసిసి అధ్యక్షునిగా పార్టీని ఎన్నికల్లో విజయపథాన నడిపించిన రేవంత్, అధికారంలోకి రావడానికి తానొక్కడే కారణమన్న అభిప్రాయం తొలగించుకోవలసి ఉంటుందని కొందరు సీనియర్లు 'గుసగుసలాడుతున్న' సంగతి గ్రహించాలి. వీలైనంత త్వరగా మంత్రివర్గ విస్తరణ చేపట్టగలిగితే, రేవంత్ పార్టీపైనా,ప్రభుత్వంపైనా మరింత సాధికారత వస్తుందని విశ్లేషకులు అంటున్నారు.

## అట్లాస్ సైకిల్ నుంచి అసెంబ్లీదాకా..

మట్టి మనిషిలో కాంతి దీపం ఆయన. నిజాం ముష్కర పాలనపై తిరుగుబాటు జెండా ఎగురవేసిన దిశాలి. మాట తూటాతో అగ్నిజ్వాలై ఎగిసిపడిన యుద్ధకెరటం గుర్రం యాదగిరిరెడ్డి. అట్లాస్ సైకిల్ నుంచి ఆరంభమైన జీవితం. అసెంబ్లీ మెట్లదాక కొనసాగింది. నిజాయితీకి నిలువుటద్దమై... జనవాళి మదిలో జననాయకుడు అయ్యారు గుర్రం. ఎరుపులోని మెరుపు ఉంది పోరాడే సాయుధ సమర శక్తి ఉంది. గుర్రం భాసించే వాడు. గమనం.. గమ్యం.. ఘర్షణ కెరటాలను అధిమించి ఎర్రని వేగుచుక్కగా నిలిచాడు గుర్రం. ఎర్రసంద్రంలో.. ఎరుపెక్కిన అరుణ పతాకాన్ని ఎగరవేసి నిజాం పాలనపై పోరు సాగించి ఎర్రని నిప్పుల కుంటిలో వెలిగాడు యాదగిరిరెడ్డి. నిజాంపై నిప్పులు చెరిగి ఖాసీంరజ్వీ దుర్ఘటనలు ఎదిరించి ఎర్రని జెండా ఎగరవేశారు. సుద్దాల యుద్ధ యోధుడు గుర్రం. ప్రజల్లో అగ్ని కెరటమై ప్రకాశించాడు గుర్రం. జీవన సంగ్రామంలో ... గాయాల మదిలో గేయమై ప్రజల హృదాయాల్లో నిలిచారు. మార్క్సిజం మాటలతో.. లెనినిజం బాటలో ప్రయాణం సాగించిన తొలిపొద్దు గుర్రం యాదగిరి రెడ్డి. నికార్సు అయిన రాజకీయ నాయకుడిగా ఎర్ర చొక్క తెల్లని ధోతిని ధరించి... జనం మదిలో స్వప్నమై నిలిచాడు. గుర్రం రాంరెడ్డి లక్ష్మమ్మ రెండవ పుత్రుడుగా జన్మించారు. అవమానాలను ఎదిరించి పోరు సాగించారు. ఎగసిపడిన కెరటంలా దూసుకెళ్ళాడు. స్వామి వివేకానంద చెప్పిన మాటల్లో చెప్పాలంటే.. కెరటం లేచి పడినందుకు కాదు.. పడిలేచినందుకు.. ఇది అక్షరాల గుర్రం యాదగిరి రెడ్డికి వర్తిస్తుంది... అవమానాల మూటలో ఎర్ర జెండాను హత్తుకొని ఎత్తిన జెండాను దించలేదు.. స్వేచ్ఛా గీతమై... ప్రజల హృదయాల్లో ప్రజల మనిషిగా నిలిచాడు. మానవత్వం కీళ్ళు విరిచి మంటల్లో ఊరేగుతున్న యుగంలో మానవతను చాటిన జనం మనిషి. నవంబర్ 22, 2019న భౌతికంగా యాదగిరి రెడ్డి దూరమైనప్పటికి ఆయన జ్ఞాపకాలు ప్రజలమదిలో నిలిచిపోయాయి.

యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండలం సుద్దాల గ్రామానికి చెందిన గుర్రం యాదగిరిరెడ్డి రామన్నపేట ఎమ్మెల్యేగా 15 ఏళ్ల పాటు ప్రజలకోసం పనిచేశారు.



22న గుర్రం యాదగిరి రెడ్డి 5వ వర్ధంతి

ప్రజల మధ్యే ఉంటూ వారి కష్ట సుఖాలను గమని స్తూ ఆదర్శ జీవితం గడిపారు. ఎలాంటి ఆస్తిపాస్తులు సంపాదించుకోకుండా నేటి తరానికి మార్గదర్శిగా నిలిచారు. 13వ ఏటనే తెలంగాణ సాయుధ పోరాటానికి ఆకర్షితుడై బాల సంఘంలో చేరారు. 75 ఏళ్లపాటు కమ్యూనిష్టు పార్టీలో వివిధ పదవులు పోషించారు. అప్పటి రామన్నపేట అసెంబ్లీ నియోజకవర్గం నుంచి వరసగా మూడుసార్లు తెదేపా మిత్రపక్షం తోడ్పాటుతో ఎమ్మెల్యేగా గెలుపొందారు. సుద్దాల గ్రామానికి చెందిన సుద్దాల హనుమంతు, కాశ లక్ష్మయ్య, గూడ పుల్లయ్య నాయకత్వంలోని బాలసంఘంలో యాదిగిరిరెడ్డి చేరి 11వ ఆంధ్ర మహాసభకు వెళ్ళారు. 1946లో దొడ్డి కొమురయ్య మరణాంతరం కె.రామచంద్రారెడ్డి, దూదిపాళ సత్తిరెడ్డి న్యాయకత్వంలో సుద్దాల, వెలమజాల మధ్యలో వాలెంటరీల శిక్షణ శిబిరంలో పాల్గొన్నారు. 1948లో మోత్కూర్, అమనబోలు, ముస్తలపల్లి పోలీస్ స్టేషన్లపై దాడికి దిగినవారులో ఉన్నారు. సూర్యనారాయణ దళంలో గెరిల్లా శిక్షణ పొంది 14వ ఏటనే దళ ఆర్గనైజర్ అయ్యారు. గడ్డం అమీన్‌కు వ్యతిరేకంగా పోరాటం చేసారు. 1948 సెప్టెంబర్ పోలీస్ చర్య తర్వాత వీరి దళం సేర్వి ప్రాంతానికి వలస పోయింది. సైన్యం జరిపి న దాడుల్లో సూర్యనారాయణ, హనుమయ్య, రాంరెడ్డి మరణించారు. పెంటయ్య మారుపేరుతో 1949 నుండి 1951 వరకు దళాన్ని యాదగిరి రెడ్డి ఆర్గనైజర్‌గా ముందుకు నడిపించారు. 1952లో స్వగ్రామం సుద్దాలకు వచ్చి స్థానికుడైన జాలిగామ శేషగిరి రావు భూ జాగీర్‌పై పోరాటం చేసి భూ పంపిణీ చేశారు. 1966లో రామన్నపేట సిపిఐ కార్యదర్శిగా పనిచేసి 1970లో అడ్డగూడూర్‌లో జరిగిన 560 ఎకరాల భూపంపిణిలో పాల్గొన్నారు. రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడుగా, ఉపాధ్యక్షుడిగా, పత్తిరైతుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా పనిచేశారు. నల్గొండ జిల్లా రైతు సంఘం అధ్యక్షుడిగా ప్రధాన కార్యదర్శిగా రైతు సమస్యలపై అనేక పోరాటాలు చేశారు. సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడిగా, కార్యదర్శివర్గ సభ్యుడిగా, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడిగా చాలా కాలం పనిచేశారు. తొలిసారిగా 1977లో సాధారణ ఎన్నికల్లో రామన్నపేట ఎమ్మెల్యేగా పోటిచేసి ఓడిపోయారు.ఆ తర్వాత 1985లో మిత్రపక్షమైన టిడిపి తో కలిసి కాంగ్రెస్ అభ్యర్థి కొమ్ము పాపయ్యపై విజయం సాధించారు.

1989, 1994లో కాంగ్రెస్ అభ్యర్థి ఉప్పునూతన పురుషోత్తంపై యాదగిరి రెడ్డి ఎంఎల్‌గా మూడవ సారి విజయభేరి మోగించారు. రామన్నపేట ఎంఎల్ఏగా యాదగిరి రెడ్డి నియోజకవర్గ అభ్యర్థికోసం ఎంతగానో కృషిచేశారు. నియోజకవర్గ పరిధిలో సాగునీరు, త్రాగు నీరు, విద్యుత్, గ్రామీణ రహదారులు వంటి అభివృద్ధి కార్యక్రమాలు చేసి ప్రజాదరణ పొందారు. స్వగ్రామం సుద్దాలలో పశు వైద్యశాల, విద్యుత్ సబ్‌స్టేషన్, ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రం, ప్రాథమిక ఉన్నత పాఠశాలల ఏర్పాటుకు పాటుపడ్డారు. మోత్కూర్ బిక్కేరు వాగుపై వంతెన, అమలుగోలు వద్ద మూసినదిపై వంతెన నిర్మాణం ఈయన హయాంలోనే నిర్మితమయ్యాయి. నియోజకవర్గ పరిధిలోని అనేక గ్రామాల్లో పేదలకు స్వంత ఇళ్ళ నిర్మాణం, రహదారుల నిర్మాణం, చెరువులు, కుంటల అభివృద్ధికి, విద్యాసంస్థల అభివృద్ధి చేశారు.

గుర్రం రాంమోహన్ రెడ్డి
సెల్. 7981018644

## యువభారతాన్ని నైపుణ్యనిధిగా మార్చాలి

ఏ దేశానికీ లేని ఓ అద్భుత వనరు భరతమాత చెంత ఉన్న ది. యువశక్తి అత్యధికంగా ఉన్న దేశంగా భారత్ ముందు వరుసలో ఉంటూ యువభారత్‌గా పిలువబడుతున్నది. ఆఫ్రికాలో ప్రజల సగటు వయస్సు 19 ఉండగా చైనాలో 40, యు ఎస్‌లో44, ఇటలీలో 48, జర్మనీలో 46, జపాన్‌లో దాదాపు 50గా నమోదు అవుతున్నది. భారత్‌లో జనాభా సగటు వయస్సు 29గా లెక్కించబడింది. యువ జనాభా అత్యధికం గా ఉండడం వరంగా మారాలంటే డిజిటల్ యుగానికి సమానంగా, అంతర్జాతీయ స్థాయి విద్యాబోధనలు నిరంతరం కొనసాగాలి. విద్యా విధానంలో నాటి పాత పోకడలే కొనసాగితే భారత యువశక్తి శాపంగా మారి దేశం అశాంతికి కేంద్రంగా మారు తుందని గమనించాలి.

ఎనిమిది బిలియన్లకుపైగా ఉన్న ప్రపంచ జనాభాలో భారత జనాభా 1.4 బిలియన్లు దాటింది. నేటి విద్యావిధానం ప్రపంచ స్థాయి నవ్య శాస్త్రసాంకేతిక శాస్త్రాల స్థాయికి చేరడానికి భారతదేశ విద్యా వ్యవస్థలో సమూల మార్పులు అవసరమని గుర్తుంచుకోవాలి. పాఠ్యాంశాల్లో మార్పులు, ఆధునిక ప్రయోగశాలల ఏర్పాటు, టీచర్ల నియామకాలు, అప్‌డేట్ కావడానికి ఉపాధ్యాయులకు కాలానుగుణంగా శిక్షణ, ఉపాధ్యాయుల వేతనాలు, పాఠశాలల విస్తరణ, ఆధునిక సదుపాయాలు తక్షణమే అవసరం అవుతాయని తెలుసుకోవాలి. అప్‌డేట్ కాని యువత ఔట్‌డేట్ అవుతుందని మన అనుభవం స్పష్టం చేస్తున్నది. భారత దేశ వ్యాప్తంగా 1.4 మిలియన్ల పాఠశాలలు ఉండగా సదుపాయాలు మాత్రం అరకొరగానే ఉన్నా యి. భారత్‌లో 10–20 ఏండ్ల వయస్సు కలిగిన బాలలు/యువత 200 మిలియన్ల మంది ఉన్నారు. ఆధార్, యుపిఐ చెల్లింపులు, డిజిటల్ లాకర్ సొకర్యాల్లో ముందున్న డిజిటల్ భారతం పాఠశాల నైపుణ్య విద్యా ప్రమాణాల్లో వెనుకబడి ఉందని నిపుణులు వాపోతున్నారు. డిజిటల్, ఎఐ విప్లవానికి తగిన విద్యాబోధన భారతానికి అందని ద్రాక్షే అవుతున్నది.



**ఆధునికతకు తగిన సిలబస్ రూపకల్పన:**

నాణ్యమైన విద్య, ఆ విద్యకు తగిన శాస్త్ర సాంకేతిక నైపుణ్యాలు బోధించని యెడల మన యువ జనాభా దేశానికి పెనుశాపంగా మారి నిరుద్యోగం మరింత విజృంభిస్తుంది. మన ప్రస్తుత విద్యా విధానాన్ని తక్షణమే పునర్ సమీక్షించాల్సిన అగత్యం ఏర్పడింది. నాణ్యమైన ఉపాధ్యాయులు, పాఠశాల వసతులు, నిరంతర సిలబస్ రూపకల్పనలు, కొత్త పోకడలకు శాస్త్ర సాంకేతిక విజ్ఞానం దారులు, ప్రభుత్వాల పట్టుదల లాంటివి కొనసాగాలి. అగ్ర రాజ్యాల యువత రేపటి కలలను సాకారం చేసుకోవడానికి నేడే నాంది పలుకుతుండగా, భార తం మాత్రం ఓల్డ్ ఈజ్ గోల్డ్ అనే నానుడికి లోబడి పాత సిలబస్‌లు, అరకొర అర్హతలకు అతుక్కుపోతూ ఉపాధ్యాయులు, పాఠశాలల నత్తనడకన బోధనలు కొనసాగుతున్నాయి. రేపటి యువత అవకాశాలకు నేడే నైపుణ్య పెట్టుబడి పెట్టాలని మరిచి పోతున్నాం, మారడానికి మీన మేషాలు లెక్కిస్తున్నాం.

**పాఠశాల స్థాయిలోనే కంప్యూటర్ పరిజ్ఞాన బీజాలు నాటాలి:**

ప్రతి భారతీయ విద్యార్థి చేతికి ఆధార్ కార్డు వలె ఒక కంప్యూటర్ అందజేయాలని, ఆ విద్యార్థి వేలి ముద్రలతోనే పని చేసే విధంగా రూపొందించాలని, అమ్మడానికి/మార్చుకోవడానికి వీలులేకుండా తయారు చేయాలని, అనవసర అంశాలు చూడడానికి తావులేకుండా ప్రత్యేక కంప్యూటర్లను పంపిణీ చేయాలని సూచిస్తున్నారు. అన్ని పాఠశాలలకు వైఫై కనెక్షన్, అపరిమిత డేటా వినియోగం అందుబాటులో ఉండేలా ఆధునీకరించాలి. కంప్యూటర్ విద్య నేర్పడానికి అర్హులైన శిక్షకులను నియమించి, ఉత్తమ ఫలితాలను సాధించిన విద్యార్థులకు ఆకర్షణీయ బహుమతులు ఇవ్వాలని ప్రతిపాదిస్తున్నారు. పాఠ్యాంశాలను దాటి నేర్చుకోవడానికి ఇష్టపడే యువత నుంచి అదనంగా ఫీజులు వసూలుచేస్తూ నేటి విద్యా విధానానికి అదనంగా కంప్యూటర్ లిటరసీ విద్యాబోధన కొనసాగాలి.

డిజిటల్ యుగంలో కంప్యూటర్ పరిజ్ఞానం కొరవడితే ఎంతటి డిగ్రీల చదువులైనా పనికిరాని పట్టాలే అవుతాయి. మారుతున్న కాలానికి యువశక్తిని కూడా తదనుగుణంగా మార్చాలి. ప్రపంచ స్థాయి శాస్త్రసాంకేతిక విజ్ఞానాలను యువభారతానికి బహూకరించాలి. రేపటి ప్రపంచానికి యువభార తం దారిదీపం కావడానికి నేడే నిర్దిష్ట పెట్టుబడులు దీర్ఘకాలికంగా పెట్టి యువభారతాన్ని నైపుణ్యనిధిగా మార్చాలి.

## తెలంగాణ ఉద్యమకారులకు న్యాయం జరిగిందా?

లేఖ

తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడి దశాబ్ద కాలం గడిచిన తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న వారికి అన్యాయం జరిగిందని అనేకమంది ఆందోళన వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్రం కోసం ఉద్యమాలు, పోరాటాలుచేసి జైళ్లకు పోయిన వారికి కాకుండా ఉద్యమంతో ఏ మాత్రం సంబంధం లేని వారికి పదవులు అధికారం దక్కుతున్నాయని అనేకమంది ఆవేదన వ్యక్తం చేశారు. రేవంత్ సర్కార్ వచ్చిన తర్వాత అసలైన తెలంగాణ వాదులకు న్యాయం జరుగుతుంది. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం కోసం గొంగళి ఏసుకొని గజ్జె కట్టి ఊరు ఊరు తిరిగి ప్రజలను జాగృతం చేసిన గద్దర్ కూతురుకు తెలంగాణ సాంస్కృతిక రథసారథి గా నియమించడం తెలంగాణ వాదులందరూ హర్షించదగ్గ విషయం. తెలంగాణ కవులకు రచయితలకు కళాకారులకు దక్కిన గౌరవంగా భావిస్తున్నారు.

తెలంగాణ రాష్ట్ర గీతం 'జయ జయహే తెలంగాణ జననీ జయకేతనం' అనే గీతాన్ని రాష్ట్రగీతంగా అధికారికంగా ప్రకటించారు. అన్ని భాషలలో రాసిన 'ప్రతిజ్ఞ' కవి పేరు గతంలో ఎక్కడ కన్పించేది కాదు. ఇప్పుడు ప్రతి పుస్తకంలో నల్లగొండ జిల్లా కవి పైడిమర్రి వేంకటసుబ్బారావు కన్పిస్తుంది. పదివేలకు పైగా కొత్త ఉపాధ్యాయులకు ఉద్యోగాలు దక్కాయి. ఎనిమిది వేలకు పైగా గ్రూప్ 4 ఉద్యోగాలు వచ్చాయి. తెలంగాణలో దాదాపు 50వేల మంది దాకా ప్రభుత్వ, పంచాయతీ రాజ్ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు బదిలీలు పదోన్నతులు పొందడం జరిగింది. గత మూడు దశాబ్దాలుగా కోర్టు కేసులతో సతమతమవుతూ మూడు,నాలుగు సార్లు ముఖ్యంగా శాసన మండలి ఎన్నికల సందర్భంగా వచ్చిన జీ.వోలతో పరిష్కారం కాని భాష పండితుల ఉన్నతీకరణ సమస్య సుప్రీం కోర్టులో కేసు డిస్మిస్ కావడంతో దాదాపు పదివేల మంది దాకా భాషోపాధ్యాయులకు, పిఈటీలకు పదోన్నతులు దక్కాయి.తెలంగాణ దశాబ్ది వేడుకలను 20 రోజుల పాటు పండుగ వాతావరణంలో నిర్వహించడానికి అధికార, ప్రతిపక్ష పార్టీలు తెలంగాణ దశాబ్ది ఉత్సవాల కమిటీలను ఏర్పాటు చేసి పెద్ద ఎత్తున నిర్వహించారు.

తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడితే ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యలకు పరిష్కారం లభిస్తుందని ఎన్నెన్నో కలలు కన్న వారికి నిరాశ, నిస్పృహలు మిగిలాయి. తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ముఖ్య నినాదం నియామకాలు. నిరుద్యోగ యువత తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడగానే ఎంతో ఆనంద పడ్డారు. నిరుద్యోగులందరికి ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని కోటి ఆశలతో ఎదురు చూశారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఆధ్వర్యంలో ఉద్యోగ నియామకాలు చేయడానికి గ్రూప్ 1, గ్రూప్ 11, గ్రూప్ 111, గ్రూప్ 4 జూనియర్ లెక్చరర్స్, డిగ్రీ లెక్చరర్స్, పాలిటెక్నిక్ లెక్చరర్స్, గురుకుల పాఠశాలల టీచర్లు, లెక్చరర్స్, అసిస్టెంట్ సివిల్ ఇంజనీర్లు, డాక్టర్లు, పోలీసు కానిస్టేబుల్, ఎస్.ఐ పోస్టులకు నోటిఫికేషన్ జారీ చేసింది. కొన్ని నియమాల కోసం పరీక్షలను నిర్వహించింది.గ్రూప్ 4, కానిస్టేబుల్, సబ్ ఇన్స్పెక్టర్, రెసిడెన్షియల్ పాఠశాలల ఉపాధ్యాయుల, జూనియర్, డిగ్రీ కళాశాల రెసిడెన్షియల్ ఉపన్యాసకుల, సివిల్ ఇంజనీరింగ్ పోస్టులను భర్తీ చేశారు. గ్రూప్ 1, గ్రూప్ 3 పరీక్షలు ముగిసి ఫలితాల కోసం ఎదురు చూస్తున్నారు.గ్రూప్ 2 పోస్టుల కోసం డిసెంబర్‌లో పరీక్షలు నిర్వహించనున్నారు.

**పరిష్కారం కాని ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యలు:**

తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంలో ఎంతో ముందు ఉండి పోరాడిన ఉపాధ్యాయుల సమస్యలు ఎక్కడవేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉన్నాయని ఉద్యోగ, ఉపాధ్యాయులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఐదు డి.ఎ లకు ఒకే ఒక్క డి.ఎ విడుదల చేయడం ఉద్యోగ, ఉపాధ్యాయులకు నిరాశ, నిస్పృహాలకు గురి చేసింది. పిఆర్సీ ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నగదు రహిత ఆరోగ్య కార్డులను ఉద్యోగ, ఉపాధ్యాయులకు, విశ్రాంత ఉద్యోగ, ఉపాధ్యాయులకు వారిపై ఆధారపడిన వారికి జారీ చేస్తామని స్వయంగా తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి గారు ప్రకటించడంతో ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల నాయకులు కృతజ్ఞతలు తెలియజేశారు. తెలంగాణ రాష్ట్రంలోని 10జిల్లాలను 33 జిల్లాలుగా మార్చ డం ఉద్యోగ, ఉపాధ్యాయ సర్దుబాటు ప్రక్రియలో భాగంగా 317 జీ.వో తీసుకొని వచ్చి జూనియర్ ఉద్యోగ, ఉపాధ్యాయులకు మారుమూల ప్రాంతాలకు కేటాయించడం వలన తమ స్థానికతను కోల్పోయామని ఉద్యోగ, ఉపాధ్యాయులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్పౌజ్ కేసులు, వికలాంగుల కేసులు, పరస్పరం బదిలీలు కోరుకునే వారికి తెలంగాణ కేబినెట్ మంత్రులు బి.సి.సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఐ.టి.శాఖ మంత్రి శ్రీధర్ బాబు మొదలైన వారు 317 జీ.వో పై పూర్తి సమాచారం తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి గారికి సమర్పించారు. బి.ఇడి.,డి.ఇడి,పండిత శిక్షణ పూర్తి చేసిన వేలమంది నిరుద్యోగ ఉపాధ్యాయులకు డి.ఎస్సీ కోసం టెట్ పరీక్ష నిర్వహించి ప్రభుత్వ, పంచాయతీ రాజ్ పాఠశాలల్లో ఉపాధ్యాయుల పోస్టులను భర్తీ చేశారు. ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కోసం కేబినెట్ కమిటీని నియమించడం వలన త్వరలో తమ సమస్యలకు పరిష్కారం లభిస్తుందని ఉద్యోగ, ఉపాధ్యాయులు, విశ్రాంత ఉద్యోగ, ఉపాధ్యాయులు వారిపై ఆధారపడిన కుటుంబ సభ్యులు ఎదురుచూస్తున్నారు.

డాక్టర్ ఎస్‌విబి

# గ్రూప్–2 పరీక్ష షెడ్యూల్ విడుదల

## డిసెంబర్ 15,16 తేదీల్లో పరీక్షలు
## ఉదయం , మధ్యాహ్నం రెండు విడుతల్లో నిర్వహణ



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** గ్రూప్2 అభ్యర్థులకు తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టిజిపిఎస్‌సి) శుభవార్త చెప్పింది. గ్రూప్–2 పరీక్షలకు సంబంధించిన టిజిపిఎస్‌సి గురువారం తాజాగా షెడ్యూల్‌ను విడుదల చేసింది. డిసెంబర్ 15, 16 తేదీల్లో గ్రూప్2 పరీక్షలు నిర్వహించనుండగా, ఈ పరీక్షలకు సంబంధించి హాల్ టికెట్లు డిసెంబర్ 9వ తేదీ నుండి అందుబాటులో ఉండనున్నాయని వెల్లడించింది. అభ్యర్థులు తమ హాల్ టికెట్లను టిజిపిఎస్‌సి అధికారిక వెబ్ సైట్ నుండి డౌన్ లోడ్ చేసుకోవచ్చని సూచించింది. హాల్ టికెట్ డౌన్ లోడ్‌కు సంబంధించి ఏలాంటి సమస్యలు తలెత్తినా సంబంధింత అధికారులను సంప్రదించాలని పేర్కొంది. గ్రూప్–2 పరీక్షల నిర్వహాణకు సంబంధించి టిజిపిఎస్‌సి గతంలో షెడ్యూల్‌ను విడుదల చేయగా, అదే సమయంలో డిఎస్‌సి పరీక్షలు ఉండడంతో తమకు సన్నద్ధం అయ్యేందుకు సమయం కావాలన్నా అభ్యర్థులు విజ్ఞప్తి మేరకు ఈ పరీక్షలను వాయిదా వేసిన ప్రభుత్వం ఇప్పుడు తాజగా షెడ్యూల్‌ను విడుదల చేసింది.

**రెండు విడుతల్లో పరీక్షలు :** డిసెంబర్ 15, 16వ తేదీల్లో జరగనున్న పరీక్షలను రెండు విడుతల్లో నిర్వహించనున్నట్లు టిజిపిఎస్‌సి తెలిపింది. డిసెంబర్ 15వ తేదీన మొదటి విడుతలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు జనరల్ స్టడీస్, జనరల్ అబిలిటిస్, రెండవ విడుతలో మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం5.30 గంటలకు హిస్టరీ, పొలిటీ అండ్ సొసైటీ పరీక్షను నిర్వహించనున్నారు. 16వ తేదీ ఉదయం మొదటి విడుతలో 10 గంటల నుంచి మధ్యాహ్నం 12.30గంటల వరకు ఎకనామీ, డవలప్‌మెంట్, రెండవ విడుత మధ్యాహ్నం 3గంటల నుంచి సాయంత్రం 5.30గంటల వరకు తెలంగాణ మూమెంట్ అండ్ స్టేట్ ఫార్మేషన్ సబ్జెక్ పరీక్ష ఉంటుందని తెలిపారు. పరీక్ష సమాయానికి అరగంట ముందుగానే పరీక్షా కేంద్రాల గేట్లను మూసి వేయనున్న నేపథ్యంలో అభ్యర్థులు సకాలంలో పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు.

# ఇక గోల్డెన్ చారియట్ లగ్జరీ టూరిస్టు రైళ్లు

## * డిసెంబర్ 14 నుండి కర్నాటకలో నిర్వహణ





**ప్రజాపక్షం / హైదరాబాద్ :** ఐఆర్‌సిటిసి రైల్వే మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో గోల్డెన్ చారియట్ లగ్జరీ టూరిస్టు రైలు కర్నాటక రాష్ట్రంలోని పర్యాటక ప్రాంతాలలో నడువనుంది. 13 డబుల్ బెడ్, 26 ట్విన్ బెడ్ సామర్థ్యంతో రైలు దాని 40 క్యాబిన్లలో గరిష్టంగా 80 మంది అతిథులకు వసతి కల్పిస్తుంది. టూరిజం సందర్శించే గెస్ట్‌లకు ఈ రైలులో మరిన్ని సేవలను అందుబాటులో ఉంచారు. ముఖ్యంగా ఆన్‌బోర్డ్ సేవలను అందించడానికి రైలు క్యాబిన్‌లలో నెట్ ఫిక్స్, అమేజాన్ సేవలు, హాట్ స్టార్ మొదలైన ప్రైమ్ ఛానెల్‌లతో సహా వివిధ రకాల వై ఫై ఎనేబుల్ సబ్‌స్క్రిప్షన్‌లతో కూడిన స్మార్ట్ టివిలు ఇన్‌స్టాల్ చేశారు. ఈ రైలులో సిసి టివి కెమెరాలు, ఫైర్ అలారం సిస్టమ్‌తో పాటు అతిథులకు మెరుగైన భద్రతను అందించడం జరగనుంది. కాగా కర్నాటక, తెలుగు రాష్ట్రాల ప్రయాణికులతో పాటు విదేశీ అతిథులకు ఆన్‌బోర్డ్ వినోదం, విశ్రాంతి కోసం, గోల్డెన్ చారియట్‌లో ప్రత్యేక స్పా, సహా అనేక రకాల స్పా థెరపీలను ఆస్వాదించే అవకాశాన్ని ఈ రైలులో కల్పించారు. మొత్తంగా డిసెంబర్ 14 నుండి మార్చ్ ఒకటో తేదీ వరకు ఆరు రైళ్లు వేరు వేరు తేదీలలో నిర్వహిస్తున్నారు. ఉదా.. ప్రైడ్ ఆఫ్ కర్నాటక ట్రైన్‌ను డింబర్ 14 నుండి ఆరు రోజులు, ఐదు రాత్రులుగా నడిపించనుండగా, జెవెల్స్ ఆఫ్ సౌత్ రైలును డిసెంబర్ 21 నుండి ఐదు రాత్రులు, ఆరు రోజులు ఇలా జనవరి 4, 2025కు ఒకటి, అదే ఏడాది ఫిబ్రవరి ఒకటో తేదీకి మరొకటి, మార్చ్ 1న ఇంకో రైలును నడిపించనున్నారు. భోజన వసతి, మద్యం సహా పలు సౌకర్యాలను అందిస్తున్న ఈ రైలు ప్రయాణానికి ఒక్కో రైలుకు ఒక్కో ధరను నిర్ణయించనున్నారు. కాగా ఈ ప్రయాణాలకు ఒక్కొక్కరికీ రూ. లక్షల్లోనే ఛార్జ్ చేయనున్నారు.

# తెలంగాణ సిఎంను కలిసిన టిటిడి చైర్మన్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** తిరుమల తిరుపతి దేవస్థానం (టిటిడి) చైర్మన్ బిఆర్ నాయుడు తెలంగాణ ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డిని హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని ఆయన నివాసంలో గురువారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా టిటిడి బోర్డు ధర్మకర్తల మండలి చైర్మన్ తెలంగాణ సిఎంకు పట్టువస్త్రం అందజేశారు. అనంతరం టిటిడి ట్రస్ట్‌బోర్డు చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన తర్వాత కలిసిన బిఆర్ నాయుడును సిఎం రేవంత్ రెడ్డి శాలువాతో సత్కరించి, జ్ఞాపికను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

# కెసిఆర్ ఆనవాళ్లు చెరిపేయడం రేవంత్ రెడ్డి వల్లకాదు

## మాజీ మంత్రులు కమలాకర్, ఈశ్వర్, ఎంఎల్‌ఎ కౌశిక్ రెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** కెసిఆర్ ఆనవాళ్లు చెరిపేయడం రేవంత్ రెడ్డి వల్లకాదని మాజీ మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. తెలంగాణ భవన్‌లో గురువారం మాజీమంత్రి కొప్పుల ఈశ్వర్, ఎంఎల్‌ఎ పాడి కౌశిక్ రెడ్డిలతో కలిసి మీడియా సమావేశంలో మాట్లాడారు. సిఎం రేవంత్ రెడ్డి వేములవాడకు వస్తే ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు ఏమైనా ప్రకటిస్తారని ఆశించామని, ఎంత సేపు కెసిఆర్ ఆనవాళ్లు చెరిపేస్తాం అనడం తప్ప రేవంత్ కొత్తగా చెప్పిందేమీ లేదన్నారు. కెసిఆర్ పేరు చెరిపేయడానికి బ్లాక్ బోర్డు మీద చాక్‌పీస్ రాత కాదన్నారు. కెసిఆర్ పేరు తెలంగాణ ప్రజల గుండెల్లో సువర్ణాక్షరాలతో లిఖించిందన్నారు. ఈనెల 30న మళ్ళీ రేవంత్ రెడ్డి కరీంనగర్ వస్తానంటున్నారని, కనీసం అప్పుడైనా కరీంనగర్ జిల్లా పెండింగ్ పనుల పూర్తికి కార్యాచరణ ప్రకటించాలన్నారు. నవంబర్ 29న కెసిఆర్ అరెస్ట్ అయిన కరీంనగర్ అలగనూరు చౌరస్తాలో దీక్షా దివస్‌ను ఘనంగా నిర్వహిస్తామన్నారు. మాజీమంత్రి కొప్పుల ఈశ్వర్ మాట్లాడుతూ ప్రజలు అత్యాశకు పోయి కాంగ్రెస్‌కు ఓట్లేశామని ఇపుడు భాధ పడుతున్నారని అన్నారు. దమ్మొంటే తమ నేతలను అరెస్టు చేసి చూపించు అని సవాల్ విసిరారు. ఎంఎల్‌ఎ కౌశిక్ రెడ్డి మాట్లాడుతూ రేవంత్ రెడ్డి బెదిరింపులకు భయపడే వారు ఎవ్వరూ లేరన్నారు.

# గిరిజన సంక్షేమ హాస్టళ్లను సమర్ధవంతంగా నిర్వహించాలి

## గిరిజన సంక్షేమశాఖ కార్యదర్శి, కమిషనర్ ఎ. శరత్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** గిరిజన సంక్షేమ హాస్టళ్ల, గురుకులాలు, నిర్వహణకు సమర్థవంతమైన చర్యలు తీసుకోవాలని సంబంధింత అధికారులకు గిరిజన సంక్షేమశాఖ కార్యదర్శి, కమిషనర్ ఎ.శరత్ దిశా నిర్దేశనం చేశారు. గురువారం ఐటిడిఎ ప్రాజెక్టు అధికారులు, ఉప సంచాలకులు,జిల్లా గిరిజనాభివృద్ధి అధికారులు, ఆర్‌సిఓలు, గిరిజన గురుకులాల ప్రిన్సిపల్స్, ప్రధానోపాధ్యాయులు, వార్డెన్లతో వీడియో కాన్ఫరేన్స్ నిర్వహించారు. అదనపు సంచాలకులు సర్వేశ్వర్‌రెడ్డి, ట్రైకారు శంకర్ రావు,గిరిజన సంక్షేమ గురుకులాల అదనపుకార్యదర్శిమాధవిదేవి, గిరిజనసంక్షేమ విద్యాఉపసంచాలకులు చందన ఉన్నారు.

# ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీచర్లందరికీ ఓటు హక్కు ఉండాలి

## ఈసీకి నోటీసులు ఇచ్చిన హైకోర్టు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణ రాష్ట్రంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు ఎమ్మెల్సీ (ఉపాధ్యాయుల కోటా) ఎన్నికల్లో ఓటు హక్కు కల్పించకపోవడంపై దాఖలైన పిటీషన్ ను హైకోర్టు గురువారం విచారించింది వివరణ ఇవ్వాలంటూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతోపాటు ఎన్నికల సంఘానికి నోటీసులు ఇచ్చింది. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల టీచర్లకు కూడా ఓటు హక్కు కల్పించాలని కోరుతూ యాదాద్రి భువనగిరి జిల్లా బొమ్మల రామారం మండలం బండకాడిపల్లికి చెందిన సెకండరీ గ్రేడ్ టీచర్ బి.కృష్ణమూర్తి వేసిన ప్రజాహితవ్యాథన్ని చీఫ్ జస్టిస్ అలోక్ ఆరాధే ఆధ్వర్యంలోని డివిజన్ పెంచి బెంచి విచారించింది. ఉన్నత పాఠశాల టీచర్లతో సమానంగా పిటిషనర్లకు ఓటు హక్కు లేకపోవడం అన్యాయమని లాయర్ వాదించారు. అనంతరం ప్రతివాదులు తమ వాదనలతో కౌంటర్లు దాఖలు చేయాలని ఆదేశించిన హైకోర్టు తదుపరి విచారణను వాయిదా వేసింది.

# ఒకే కేసులో మూడు ఎఫ్ఐఆర్‌లపై పట్నం పిటిషన్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఒక నేరంపై 3 ఎఫ్ఐఆర్‌లు నమోదు చేయడాన్ని సవాలు చేస్తూ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి తరఫున ఆయన భార్య పట్నం శృతి గురువారం లంచ్ మోషన్ పిటిషన్ దాఖలు చేశారు. లగచర్ల గ్రామంలో పలువురు అధికారులపై దాడి చేశారంటూ బొమ్మరాస్‌పేట పోలీసు స్టేషన్‌లోనే మూడు ఎఫ్ఐఆర్లు నమోదు చేయడానికి ఆమె సవాల్ చేసిన పిటీషన్ను శుక్రవారం హైకోర్టు విచారణ చేయనుంది. ఒకసారి అరెస్టు చేసి జైలు నుంచి బయటికిరాకుండా రాజకీయ కచ్చ సాధింపునకు పాల్పడుతున్నారని ఆక్రమంలోనే చట్ట వ్యతిరేకంగా ఒకే నేరంపై మూడు ఎఫ్ఐఆర్లు నమోదు చేశారని పేర్కొన్నారు.

# బిఆర్ఎస్ ధర్నాకు హైకోర్టు అనుమతి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** మహబూబాబాద్ ఎమ్మార్వో కార్యాలయం ముందు ఈనెల 25న ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు బి.ఆర్.ఎస్ ధర్నా చేసేందుకు హైకోర్టు షరతులు తొక్కుకున్న అనుమతి ఇచ్చింది. లగచర్ల సంఘటనలో పోలీసుల తీరుపై నిరసనగా పార్టీ ఇచ్చిన పిలుపు మేరకు ఎమ్మార్వో కార్యాలయం ముందు శాంతియుత ధర్నాకు అనుమతి ఇవ్వకపోవడాన్ని సవాలు చేస్తూ బిఆర్ఎస్ యుజవన అధ్యక్షుడు వై.మురళీధర్‌రెడ్డి వేసిన కేసులో హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. శాంతియుతంగా ధర్నా చేయాలి రెచ్చగొట్టే ప్రసంగాలు చేయకూడదు నిబంధనలు ఉల్లంఘించకూడదు వీటిని ఉల్లంఘించిన పక్షంలో పోలీసులు తిరిగి హైకోర్టును ఆశ్రయించవచ్చు అని చెప్పింది. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల మధ్యలో ధర్నా చేసేందుకు అనుమతి ఇస్తూ ఉత్తరోలు జారీ చేసింది.

# నరేందర్‌రెడ్డి కేసులో హైకోర్టు తీర్పు వాయిదా

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** బీఆర్ఎస్ నాయకుడు, కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డిని పోలీసులు అరెస్టు చేసిన తీరుపై హైకోర్టు మరోసారి పలు ప్రశ్నలు సంధించింది. నరేందర్ రెడ్డిని అరెస్టు చేసిన తీరును ఎండగట్టింది. నరేందర్‌రెడ్డి పరారీలో లేనప్పుడు కేబీఆర్ పార్కులో ఎలా అరెస్టు చేస్తారని ప్రశ్నించింది. ఇంట్లోనే అరెస్టు చేశామని పోలీసుల తరఫున పబ్లిక్ ప్రాసిక్యూటర్ పల్లె నాగేశ్వర్‌రావు చెప్పడంతో స్పందిస్తూ, అదే నిజమైతే అరెస్టు చేసిన సమాచారాన్ని నరేందర్ రెడ్డి కుటుంబ సభ్యులకు కాకుండా థర్డ్ పర్సన్ సలీమ్‌కు ఎలా ఇచ్చారని ప్రశ్నించింది. కేబీఆర్ పార్క్‌లో వాకింగ్ చేసేందుకు వెళ్లినప్పుడు అరెస్టు చేయడానికి కారణాలు ఏమిటని కూడా ప్రశ్నించింది.అరెస్టు నిబంధనలను ఉల్లంఘించారని వ్యాఖ్యానించింది. ఇంట్లోనే అరెస్టు చేసి ఉంటే ఆయన భార్య లేదా పిల్లలు లేదా ఇంట్లో ఉండే ఇతర కుటుంబసభ్యులకు సమాచారం ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించింది. అరెస్టు చేసే ముందు సుప్రీం కోర్టు జారీ చేసిన మార్గదర్శకాలను అమలు చేయకపోవడాన్ని తప్పుపట్టింది. అరెస్టు ప్రక్రియను ఆక్షేపించింది. వికారాబాద్ జిల్లా లగచర్ల గ్రామంలో ఫార్మా సిటీ నిమిత్తం భూసేకరణ చేపట్టే క్రమంలో జిల్లా కలెక్టర్, ఇతర అధికారులు నిర్వహించిన సభలో రైతులు దాడికి పట్నం నరేందర్‌రెడ్డి ప్రధాన కారణమని పేర్కొంటూ ఆయనను పోలీసులు తొలి నిందితుడిగా కేసు నమోదు చేశారు. ఈ కేసులో ఈ నెల 13న కొడంగల్ కోర్టు జ్యుడిషియల్ రిమాండ్ ఉత్తర్వులను రద్దు చేయాలంటూ నరేందర్‌రెడ్డి దాఖలు చేసిన క్రిమినల్ పిటిషన్‌ను జస్టిస్ కె.లక్ష్మ ణ్ గురువారం విచారణ పూర్తి చేశారు. ఇరుపక్షాల వాదనలు ముగియడంతో తీర్పును వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు.

మాజీ ఎమ్మెల్యేను ఓ ఉగ్రవాదిలాగా ఎందుకు అరెస్టు చేయాల్సి వచ్చిందని హైకోర్టు ప్రశ్నించింది.

దాడికి గురైన అధికారుల గాయాలపై సమగ్ర వివరాలు ఎందుకు ఇవ్వలేదని అడిగింది. తీవ్ర గాయాలైనట్లు రిపోర్టు ఇచ్చి.. చిన్న గాయాలైనట్లు ఎలా రాస్తారనే సందేహాన్ని లేవనెత్తింది. పార్కులో వాకింగ్ చేస్తుండగా పోలీసులు అరెస్టు చేశారని, కింది కోర్టు యాంత్రికంగా రిమాండ్ ఉత్తర్వులు ఇచ్చిందని, వాటిని రద్దు చేయాలని నరేందర్‌రెడ్డి తరఫు సీనియర్ అడ్వొకేట్ గండ్ర మోహన్‌రావు వాదించారు. రాజకీయ కుట్రతో పిటిషనర్‌ను కేసులో ఇరికించారని చెప్పారు. రైతులను ఉసిగొల్పి అధికారులపై దాడికి నరేందర్‌రెడ్డి కారణమని పబ్లిక్ ప్రాసిక్యూటర్ పల్లె నాగేశ్వర్‌రావు ప్రతివాదన చేశారు. ఇరుపక్షాల వాదనలు పూర్తి కావడంతో హైకోర్టు తీర్పును రిజర్వు చేసింది. అయితే, లంచ్ తర్వాత తిరిగి పీపీ న్యాయమూర్తి ఎదుట హాజరై, పోలీసుల వద్ద వీడియో ఆధారాలు ఉన్నాయని, రిమాండ్ ఉత్తర్వులను రద్దు చేయవద్దని కోరారు. ఫార్మా కంపెనీల ఏర్పాటు వ్యవహారంపై అధికారులు నిర్వహించిన ప్రజాభిప్రాయ సేకరణకు కంటే ముందు నరేందర్ రెడ్డి తన అనుచరులతో సమావేశాన్ని నిర్వహించి సీఎం రేవంత్ రెడ్డి వచ్చినా, కలెక్టర్ వచ్చిన దాడి చేయాలని చెప్పారని ఆ వీడియోను పరిశీలించాలంటూ పెన్ డ్రైవ్ ను హైకోర్టుకు అందజేశారు.

ఈ పరిస్థితుల్లో పిటీషనర్ బయటకు వస్తే కేసు దర్యాప్తుపై ప్రభావం చూపే అవకాశం ఉందని చెప్పారు. దీనిపై స్పందించిన హైకోర్టు బయటకు వస్తే ఏమవుతుందని ప్రశ్నించింది. ఇరుపక్షాల వాదనలు ముగియడంతో హైకోర్టు తీర్పును తర్వాత వెలువరిస్తామని చెప్పింది.



## వికలాంగులు, వయోవృద్ధులు, ట్రాన్స్ జెండర్ల సాధికారతకు ప్రభుత్వం మరిన్ని చర్యలు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** వికలాంగులు, వయోవృద్ధులు, ట్రాన్స్ జెండర్ల సాధికారితకు ప్రభుత్వం పలు చర్యలు చేపడుతోందని మహిళా శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి అనితా రామచంద్రన్ అన్నారు. గురువారం సచివాలయంలో వికలాంగులు వయోవృద్ధులు, ట్రాన్స్ జెండర్ వ్యక్తుల సాధికారత శాఖ ఆధ్వర్యంలో సంయుక్త సహకార సమావేశం జరిగింది. మహిళా శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి అనితా రామచంద్రన్, సంచాలకులు బి. శైలజ, అమెరికాలోని జాన్ హాప్కిన్స్ యూనివర్సిటీ ప్రతినిధులు, యునైటెడ్ స్టేట్స్ ఏజెన్సీ ఇంటర్నేషనల్ డెవలప్‌మెంట్ ప్రతినిధులు, ప్రాజెక్ట్ ఎక్సలరేట్ సభ్యులు, తెలంగాణ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ప్రతినిధులు పాల్గొన్న ఈ సమావేశంలో ట్రాన్స్ జెండర్ వ్యక్తుల ఆరోగ్యం, హక్కుల పరిరక్షణకు సంబంధించి సమీక్షించారు. ఈ సందర్భంగా ట్రాన్స్‌జెండర్ల వైద్యం, ప్రభుత్వం చేపడుతున్న వివిధ ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలు, రాబోవు కాలంలో అమలు చేయబడే సంక్షేమ ప్రణాళికలపై చర్చించారు.ట్రాన్స్ జెండర్ వ్యక్తుల ప్రస్తుత ఆరోగ్య కార్యక్రమాలను మెరుగు పర్చడం, వారి సంక్షేమానికి చేపట్టనున్న కొత్త కార్యక్రమాలకు మద్దతు ఇవ్వడంలో తమ పూర్తి సహకారాన్ని అందిస్తామని వివిధ సంస్థల ప్రతినిధులు హామీ ఇచ్చారు.

# సిఎఫ్ఎస్ఎల్ పనితీరు భేష్



## కేంద్ర మంత్రి బండి సంజయ్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** భారతదేశంలో ఎక్కడ ఎలాంటి నేరాలు జరిగినా నిందితులను పట్టుకునేందుకు దోహదపడే వ్యవస్థ సెంట్రల్ ఫోరెన్సిక్ సైన్స్ లాబోరేటరీ (సిఎఫ్ఎస్ఎల్) అని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. హత్యలు, అత్యాచారాలు, దొంగతనాలతోపాటు నార్కోటిక్, సైబర్, మనీ లాండరింగ్ నేరాలకు పాల్పడిన దోషులను పట్టుకునేందుకు దొహదపడేలా ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఆధ్వర్యంలోని కేంద్ర ప్రభుత్వం అంతర్జాతీయ ప్రమాణాలతో సిఎఫ్ఎస్ఎల్ సంస్థను తీర్చిదిద్దిందని పేర్కొన్నారు. గురువారం మధ్యాహ్నం మాజీ ఎంఎల్‌ఎ ఎన్‌విఎస్ఎస్ ప్రభాకర్‌తో కలిసి రామాంతాపూర్ లోని సెంట్రల్ ఫోరెన్సిక్ సైన్స్ లాబోరేటరీ(సిఎఫ్ఎస్ఎల్), నేషనల్ సైన్స్ ఫోరెన్సిక్ లాబోరేటరీ(ఎన్‌సిఎఫ్ఎల్), సెంట్రల్ డిటెక్టివ్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ (సిడిటిఐ) సంస్థలను కేంద్ర మంత్రి సందర్శించారు. అధికారులతో సమావేశమై ఆయా విభాగాల పనితీరును అడిగి తెలుసుకున్నారు. దక్షిణ భారత దేశంలోనే ప్రతిష్టాత్మకమైన ఈ సంస్థలు హైదరాబాద్ లో ఉండటం గర్వకారణమన్నారు. దేశంలోని ఇతర రాష్ట్రాల నుండి వేలాది కేసుల పరిష్కారానికి ఈ సంస్థలను సంప్రదించడంతోపాటు నేర పరిశోధనకు అవసరమైన ప్రామాణిక పత్రాలను సిఎఫ్ఎస్ఎల్ అందజేస్తోందని అధికారులు కేంద్ర మంత్రికి వివరించారు. పోలీసులకు, పబ్లిక్ ప్రాసిక్యూటర్లకు, న్యాయవాదులకు ఇప్పటి వరకు 39,167 మందికి సిటిడిఐ అధికారులు ప్రత్యేక శిక్షణనివ్వడంతోపాటు సైబర్ నేరాలపై విద్యార్థులకు ప్రత్యేక అవగాహన కల్పిస్తున్న విషయాన్ని తెలుసుకున్న కేంద్ర మంత్రి సంస్థ అధికారులను ప్రత్యేకంగా అభినందించారు.

# ఆడబిడ్డకో న్యాయం... అదానీకో న్యాయమా?

## అమెరికాలో అదానీ కేసుపై స్పందించిన బిఆర్ఎస్ ఎంఎల్‌సి కవిత



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఆరోపణలపై ఆడబిడ్డకో న్యాయం, అదానీకో న్యాయమా? అని బిఆర్ఎస్ ఎంఎల్‌సి కల్వకుంట్ల కవిత ప్రశ్నించారు. ఈ మేరకు ఆమె ఎక్స్ వేదికగా ట్వీట్ చేశారు. అఖండ భారతంలో వేర్వేరు న్యాయాలు ఏమిటని ఆమె అభిప్రాయపడ్డారు. అదానీపై అమెరికాలో లంచం ఇవ్వజూపినట్లుగా కేసు నమోదు కావడంతో ఆమె స్పందించారు. ఆధారాలు లేకపోయినప్పటికీ ఆడబిడ్డను కాబట్టి అరెస్ట్ చేయడం ఈజీ అన్నారు. కానీ ఆధారాలు ఉన్నప్పటికీ అదానీని అరెస్ట్ చేయడం మాత్రం కష్టమా? అని ఎక్స్ వేదికగా ప్రశ్నించారు. ఎన్నిసార్లు ఆరోపణలు వచ్చినా ప్రధాని నరేంద్రమోదీ అదానీ వైపే ఉంటారా? అన్నారు. అఖండ భారతంలో సెలెక్టివ్ న్యాయం అందిస్తున్నారని, రాజకీయ ప్రత్యర్థులను సాక్ష్యాలు లేకుండానే అరెస్ట్ చేసి నెలల తరబడి జైల్లో ఉంచుతున్నారని, కానీ అదానీపై పదేపదే ఆరోపణలు వచ్చినా చర్యలు తీసుకోవడం లేదన్నారు. అదానీపై కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోకుండా ఆపుతోంది ఎవరు? అని ప్రశ్నించారు.

**వరుస ట్వీట్లతో ప్రభుత్వంపై కెటిఆర్ విమర్శలు**

బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కె.టి.రామారావు వరుస ట్వీట్లతో ప్రభుత్వంపై విమర్శలు గుప్పిస్తున్నారు. తాజాగా గురుకుల పాఠశాలలో విద్యార్థుల పరిస్థితిపై, అదానికి తెలంగాణలో పెట్టుబడులకు అనుమతి ఇవ్వడంపై, అలాగే మహబూబాబాద్ జిల్లా మానుకోటలో బిఆర్ఎస్ మహాధర్నాకు అనుమతి నిరాకరించడంపై ట్వీట్లు పెడుతూ ప్రభుత్వంపై విమర్శలు చేశారు. తెలంగాణలో విద్యార్థులు, రైతులు, నిరుద్యోగుల పరిస్థితి దారుణంగా ఉందంటూ ట్వీట్ చేశారు. దవాఖానల్లో విద్యార్థులు, చెరసాలలో రైతన్నలు, ఆందోళనలో నిరుద్యోగులు, జాగో తెలంగాణ అంటూ కెటిఆర్ ట్వీట్ చేశారు. అగ్రరాజ్యం అమెరికానే మోసం చేయాలని చూసిన ఘనుడు అదానీతో కాంగ్రెస్, బిజెపి అనుబంధం దేశానికి అవమానం, అరిష్టం అన్నారు. అదానీతో చేసుకున్న చీకటి ఒప్పందాలు అన్ని బయట పెట్టాలన్నారు. లగచర్ల బాధితులకు సంఘీభావంగా మహబూబాబాద్ జిల్లా మానుకోటలో బిఆర్ఎస్ తలపెట్టిన మహాధర్నాకు ప్రభుత్వం అనుమతి నిరాకరించడంపైనా కెటిఆర్ మండిపడ్డారు. శాంతియుతంగా సభ నిర్వహించుకుంటామంటే అవకాశం కూడా ఇవ్వని దుస్థితి ఎందుకు వచ్చిందన్నారు.

**ఈనెల 29న తెలంగాణ వ్యాప్తంగా దీక్షా దివస్..**

ఈనెల 29న తెలంగాణలోని అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో దీక్షా దివస్ నిర్వహించాలని పార్టీ శ్రేణులకు బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.టి.రామారావు పిలుపునిచ్చారు. తాను కరీంనగర్‌లో జరిగే దీక్షా దివస్లో పాల్గొంటానని తెలిపారు. వెల్లడించారు. తెలంగాణ ప్రజల స్వరాష్ట్ర సాధనలో అత్యంత కీలకమైన ఘట్టంగా దీక్షా దివస్ నిలుస్తుందన్నారు.

# తెలంగాణ పోలీసు అకాడమీకి ఐఎస్ఒ

## దేశంలోనే నెంబర్ ఒన్‌గా నిలిచిన పోలీసు శిక్షణా కేంద్రం



**ప్రజాపక్షం/హైదరాబాద్:** దేశంలోని పోలీసు శిక్షనా కేంద్రాలన్నింటిలోకన్న హైదరాబాద్‌లోని రాజా బహదూర్ వెంకట్రామిరెడ్డి పోలీస్ శిక్షణ సంస్థ (రాష్ట్ర పోలీసు అకాడమీ)కి అరుదైన గౌరవం దక్కింది. దేశంలోనే ఉత్తమ పోలీసు శిక్షణా కేంద్రంగా ప్రతిష్టాత్మక ఐఎస్ఒ సర్టిఫికెట్ లభించింది. ఈ సర్టిఫికెట్‌ను గురువారం జరిగిన కానిస్టేబుళ్ల దీక్షాంత్ పరేడ్ కార్యక్రమంలో గురువారం డిజిపి జితేందర్, అకాడమీ డైరెక్టర్ అభిలాష్ బిస్త్‌లకు ఐఎస్ఒ ప్రతినిధులు అందజేశారు. ఈ సందర్భంగా డిజిపి జితేందర్ మాట్లాడుతూ..తెలంగాణ పోలీసు అకాడమీకి ఐఎస్ఒ అవార్డు రావడం అకాడమీ డైరెక్టర్ అభిలాష బిస్త్‌తో పాటు అధికారుల కృషి ఉందన్నారు. అభిలాష బిస్త్ మాట్లాడుతూ.. ‘5 స్టార్ క్వాలిటీ రేటింగ్ సంపాదించిన భారతదేశంలో మొదటి అకాడమీగా అవతరించడం ద్వారా తెలంగాణ పోలీస్ అకాడమీ సగర్వంగా కొత్త జాతీయ ప్రమాణాన్ని నెలకొల్పిందన్నారు.అకాడమీలో డిఎస్‌పి, ఫోరెన్సిక్ సైంటిస్టు, ఎఎస్ఐ, ఎస్ఐ, హెడ్‌కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లతో పాటు ఇతర విభాగాలకు చెందిన పబ్లిక్ ప్రాసిక్యూటర్ ప్రమోటర్లు, కస్టమ్స్, ఎక్సైజ్ అధికారులు, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు, తెలంగాణ రాష్ట్రంతో పాటు ఇతర రాష్ట్రాల నుండి అభ్యర్థనపై ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్లకు శిక్షన ఇస్తున్నామన్నారు. అకాడమీలో నాణ్యత, పర్యావరణం, శక్తి, ఆహార భద్రత అంశాలలో ఐఎస్ఒ లభించడం గర్వంగా ఉందన్నారు.

# మంగోల్ రిఫైనరీకి మేఘా వెస్సెల్స్

## సొంత యూనిట్లలో పరికరాల తయారీ
## తొలి విడత ఎగుమతి ప్రారంభం
## జెండా ఊపి ప్రారంభించిన మంగోల్ రిఫైనరీ సిఈఓ దశదావా

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** మంగోలియా దేశంలో నిర్మిస్తున్న మంగోల్ గ్రీన్ ఫీల్డ్ రిఫైనరీకి అవసరమైన కీలక పరికరాలైన వెస్సెల్స్ (ఫ్లషింగ్ ఆయిల్ డ్రమ్)ను సొంత యూనిట్లలో మేఘా ఇంజనీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్టక్చర్స్ లిమిటెడ్( ఎంఈఐఎల్) తయారు చేసి ఎగుమతి ప్రారంభించింది. వెస్సెల్స్ రవాణాను మంగోల్ రిఫైనరీ సిఈఓ అల్ట్రన్సైజ్ దశదావా గురువారం హైదరాబాద్‌లోని ఎంఈఐఎల్ వెస్సెల్ తయారీ విభాగంలో జెండా ఊపి లాంఛనంగా ప్రారంభించారు. మంగోలియాలో గ్రీన్ ఫీల్డ్ ఆయిల్ రిఫైనరీని ఎంఈఐఎల్ నిర్మిస్తున్న విషయం తెలిసిందే. ఈ రిఫైనరీ నిర్మాణానికి మన దేశం సంపూర్ణ సంహకారం అందిస్తోంది. ఈ కార్యక్రమంలో ఇంజనీర్స్ ఇండియా లిమిటెడ్ (ఈఐఎల్ ) ప్రతినిధి వికల్ప్ పాలివాల్, ఎంఈఐఎల్ డైరెక్టర్ (హైడ్రోకార్బన్స్) పి. దొరయ్య, ఎంఈఐఎల్ హైడ్రో కార్బన్స్ విభాగం ప్రెసిడెంట్ పి.రాజేష్ రెడ్డి సహా పలువురు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంగోల్ రిఫైనరీ సిఈఓ దశదావా మాట్లాడుతూ మంగోల్ రిఫైనరీ నిర్మాణం మంగోలియాలో రిఫైనరీల అభివృద్ధిలో కీలక భూమికను పోషిస్తుందన్నారు. తమ దేశంలో ఇదే తోలి రిఫైనరీ అని తెలిపారు. ఈ రిఫైనరీ మంగోలియా రిఫైనరీలలో ఒక మైలు రాయి వంటిదన్నారు. ఇది తమ దేశంలో హైడ్రో కార్బన్ రంగ అభివృద్ధి, పారిశ్రామిక పురోగతి, ఆర్థిక రంగ అభివృద్ధికి దోహదం చేస్తుందని ఆశభావం వ్యక్తం చేశారు. ఎంఈఐఎల్ నుంచి రవాణా అవుతున్న వెస్సెల్స్‌తో మంగోల్ రిఫైనరీలో కీలక నిర్మాణ దశ ప్రారంభమవుతుందన్నారు.

ఈ రిఫైనరీ నిర్మాణం భారత్, మంగోలియా దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలను మరింత బలోపేతం చేస్తుందని దశదావా అన్నారు. ఎంఈఐఎల్ డైరెక్టర్ పి. దొరయ్య మాట్లాడుతూ మంగోల్ రిఫైనరీలో ఉపయోగించే వెస్సెల్స్‌లో మొదటిది సరఫరా చేయటం సంతోషంగా ఉందన్నారు. మంగోలియాలోని వాతావరణ పరిస్థితులను ఎదుర్కొంటూ తమ సిబ్బంది కఠినతరమైన రిఫైనరీని సకాలంలో పూర్తి చేసేందుకు చిత్తశుద్ధితో పనిచేస్తున్నారని తెలిపారు.

# ఆర్‌టిసి కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

## డిప్యూటీ సిఎంకు ఎస్‌డబ్ల్యూయు ఐఎన్‌టియుసి నేత కె.రాజిరెడ్డి వినతి

**ప్రజాపక్షం /హైదరాబాద్ :** టిజి ఆర్‌టిసి కార్మికుల సమస్యలు పరిష్కరించాలని టిజిఎస్‌ఆర్‌టిసి ఎస్‌డబ్ల్యూయు (ఐఎన్‌టియుసి) ప్రధాన కార్యదర్శి నేత కె.రాజిరెడ్డి డిప్యూటీ సిఎం మల్లు భట్టివిక్రమార్కను కోరారు. ఈ మేరకు గురువారం గాంధీభవన్‌లో ప్రజావాణి సందర్భంగా రాజిరెడ్డితో పాటు ఎస్‌డబ్ల్యూయు నాయకులు వెంకటయ్యగౌడ్, ఎల్.ఎన్.రెడ్డి, రామస్వామిగౌడ్‌లు డిప్యూటీ సిఎంను భటిక్కమార్కను, టిపిసిసి అధ్యక్షులు బి.మహేశ్‌కుమార్‌గౌడ్‌ను వేర్వేరుగా కలిసి వినతి పత్రం అందజేశారు. ఆర్‌టిసిలో విలీన ప్రక్రియను పూర్తిచేయాలని, యూనియన్లకు అనుమతించి గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహించాలన్నారు. కారుణ్య నియామకాలను రెగ్యులర్ ప్రాతిపదికన నియమించాలని వినతిపత్రంలో పేర్కొన్నారు.

# 29న బిఆర్ఎస్ దీక్ష దివాస్

## కరీంనగర్‌లో పాల్గొనున్న కెటిఆర్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** బిఆర్ఎస్ ఆధ్వర్యంలో ఈ నెల 29న నిర్వహించనున్న దీక్ష దివాస్‌ను రాష్ట్ర వ్యాప్తంగా అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో ఘనంగా నిర్వహించాలని పార్టీ శ్రేణులకు కార్యనిర్వాహక అధ్యక్షులు కె.తారక రామారావు పిలుపునిచ్చారు. కరీంనగర్‌లో జరిగే దీక్ష దివాస్ కార్యక్రమంలో తను పాల్గొనున్నట్లు ఆయన వెల్లడించారు. 2009,నవంబర్ 29వ తేదీన భారత రాష్ట్ర సమితి (అప్పటి టిఆర్ఎస్) అధ్యక్షులు కెసిఆర్ చేపట్టిన ఆమరణ నిరాహార దీక్షతో మలిదశ ఉద్యమం ఉవ్వెత్తిన ఎగిసి స్వరాష్ట్ర సాధనకు బలమైన పునాదులు వేసిందన్నారు.

## శివాలయం మట్టిరోడ్డుకు భూమిపూజ



**ప్రజాపక్షం/వెల్దండ :** మండలకేంద్రంలోని శివునిగుట్టమీద వెలిసిన శివయ్యస్వామి దర్శనానికి వెళ్లాలంటే సరైనరోడ్డుమార్గంలేక భక్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. భక్తుల విన్నపం మేరకు కాంగ్రెస్‌పార్టీ నాయకులు సింగిల్‌విండోడైరెక్టర్ మట్టవెంకటయ్యగౌడ్ తన సొంతఖర్చులతో రోడ్డును గురువారం మాజీసర్పంచ్ యెన్నంభూపతిరెడ్డితోకలిసి వెంకటయ్యగౌడ్ పనులను ప్రారంభించారు. ఈసందర్భంగా వెంకటయ్యగౌడ్ మాట్లాడుతూ అత్యంత పురాతనమైన శివాలయంకావడంలో భక్తులు పూజలు చేసేందుకు వెళుతుండేవారు. అక్కడికి వెళ్లాలంటే రహదారిలేక ఇబ్బందులు పడుతున్నారని తనదృష్టికి రావడంతో భక్తుల సౌకర్యార్థం వెంటనే పనులు ప్రారంభించినట్లు తెలిపారు. కార్యక్రమంలో తిరుపతిరెడ్డి, వెంకటేష్, వెంకట్‌రెడ్డి, అల్వాల్‌రెడ్డి, కిష్టాల్, పురుషోత్తమచారి, శ్రీను, శేఖర్, దాసరి మహేష్, బాదేపల్లి రామకృష్ణ, పరమేష్, డేవిడ్, మట్టశేఖర్, మట్టశ్రీను, రామస్వామి, తుంగశ్రీను, తదితరులు పాల్గొన్నారు.

## హెరిటేజ్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం



**ప్రజాపక్షం/మహమ్మదాబాద్ :** రైతులు వ్యవసాయంతో పాటు పాడి పరిశ్రమను అభివృద్ధి చేసుకోవాలని హెరిటేజ్ వెటరినరీ డాక్టర్ పవన్ కుమార్ తెలిపారు. గురువారం మండల పరిధిలోని మంగంపేట గ్రామంలో హెరిటేజ్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు వ్యవసాయంతో పాటు పడి పశువులను అభివృద్ధి చేసుకోవాలని, అలాగే పశువులకు వచ్చే వ్యాధుల పట్ల అప్రమంతంగా ఉండాలని సూచించారు. పశువుల ఆరోగ్యం కోసం హెరిటేజ్ డైరీ ద్వారా అన్ని రకాల వ్యాధులకు మందులు ఉచితంగా ఇస్తూ నివారణకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటూ ఉచిత పశు వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. నులిపురుగుల నిర్మూలన యొక్క ప్రాముఖ్యత, వంధ్యత్వంలో ఖనిజ మిశ్రమం ఉపయోగం, పాలల్లో కొవ్వు, ఎన్ఎన్ఎఫ్ కోసం సమతుల్య దానా తాము సూచించిన మోతాదులో వాడాలని తెలిపారు.పశువులకు ఇన్సూరెన్స్ తప్పక చేయించుకోవాలని సూచించారు. అనంతరం ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ పవన్ కుమార్, హెరిటేజ్ నంచర్ల డైరీ మేనేజర్ హాజి శరీఫ సూపర్ వైజర్ చిన్నయ్య, పాల సేకరణ ప్రతినిధి నరసింహారెడ్డి, పాడి రైతులు పాల్గొన్నారు.

## జిల్లా స్థాయి చెకిముకి పోటీలకు విద్యార్థులు



**ప్రజాపక్షం/అడ్డాకుల :** మండల కేంద్రంలోని ప్రధానోపాధ్యాయులు జ్యోతి పర్యటనలో నిర్వహించిన మండల స్థాయి చెకుముఖి పోటీలకు అడ్డాకుల, కందూర్ , పొన్నకల్, రాచా, శాఖపూర్, కన్మనూర్ ఉన్నత పాఠశాలల నుండి 27 మంది విద్యార్థులు పాల్గొన్నారు. కందూర్ ఇంగ్లీష్ మీడియం, అడ్డాకుల తెలుగు మీడియం ఉన్నత పాఠశాల విద్యార్థులు విజేతలుగా నిలిచి జిల్లా స్థాయి పోటీలకు అర్హత సాధించారు. ప్రైవేట్ పాఠశాల నుండి ఒక్కరే పాల్గొనడం వల్ల అడ్డాకుల గ్రామర్ స్కూల్ విద్యార్థులు మొదటి స్థానంలో నిలిచారు. పోటీలలో పాల్గొన్న విజేతలకు ఎంఈఓ, వి. కురుమూర్తి,ప్రధానోపాధ్యాయురాలు జ్యోతి చేతుల మీదుగా విద్యార్థులకు ప్రశంస పత్రాలను అందజేశారు. నిర్వాహకులు ఈసువయ్య, నాగ మద్దిలేటి, అనిల్ కుమార్, ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు నీలిమ, విజయ కుమార్, కరుణాకర్ పాల్గొన్నారు.

## గ్రామీణ విద్యార్థులకు సైతం సైన్స్‌పై పట్టు పెరిగేలా ప్రోత్సాహం



**ప్రజాపక్షం / వనపర్తి ప్రతినిధి :** గ్రామీణ ప్రాంతంలో చదువుకునే విద్యార్థులకు సరైన సైన్స్ కిట్ లేకపోవడం వల్ల సైన్స్ సబ్జెక్ట్‌లో వెనుకబడి పోతుంటారని వారిలోని సాంకేతిక నైపుణ్యాన్ని వెలికి తీసేందుకు జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు సైన్స్ కిట్లు మంజూరు చేయడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి అన్నారు. జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో స్థానిక సూర్యచంద్ర ప్యాలెస్ హైస్కూల్‌లో గురువారం నుండి మూడు రోజుల పాటు నిర్వహించనున్న 52వ రాష్ట్ర బాల వైజ్ఞానిక దర్శిని , 12వ ఇన్స్పిరేషన్ అవార్డుల కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ లాంఛనంగా ప్రారంభించారు. పాఠశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ సైన్స్ అంటే నిజం అని ఇది జీవితంలో చాలా ముఖ్యమైనదన్నారు. భారత రాజ్యాంగంలో సైతం వైజ్ఞానిక రంగాన్ని అభివృద్ధి చేయాలని సూచించబడిందని గుర్తు చేశారు. విద్యార్థులు ఈ వైజ్ఞానిక ప్రదర్శనలో పాల్గొని స్ఫూర్తి పొంది భవిష్యత్తులో ఐఐటి ఎయిమ్స్ వంటి గొప్ప కళాశాలల్లో సీట్లు సంపాదించి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. వనపర్తి జిల్లాకు ఉన్న విద్యాపర్తి జిల్లా పేరును మరింత బలోపేతం చేయాలని కోరారు. కార్యక్రమం అనంతరం కలెక్టర్ విద్యార్థులు తయారు చేసిన విజ్ఞాన ప్రదర్శనలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో వనపర్తి మార్కెట్ యార్డ్ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్ , జిల్లా సైన్స్ ఆఫీసర్ శ్రీనివాస్ , మండల విద్యా అధికారులు , ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు , విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## సదర్ ఉత్సవాలకు ఎమ్మెల్యేకు ఆహ్వానం

**ప్రజాపక్షం / మక్తల్ రూరల్ :** నారాయణపేట జిల్లా కేంద్రంలో ఈ నెల 25న ప్రతిష్టాత్మకంగా జరగనున్న సదర్ ఉత్సవాల్లో పాల్గొనాల్సిందిగా మక్తల్ ఎమ్మెల్యే డా. వాకిటి శ్రీహరిని అఖిల భ ఆరత యాదవ మహసభ జిల్లా బృందం ఆహ్వానించింది. ఎమ్మెల్యే నివాస గృహంలో కలిఇసి ఆయనను శాలువాతో సత్కరించి 25వ తేదీ సాయంత్రం జిల్లా కేంద్రంలో జరిగే ఉత్సవాలకు హాజరు కావాలని కోరారు. ఈ సందర్భంగా యాదవ సంఘం నేతలు మాట్లాడుతూ సదర్ ఉత్సవాలను అధికారికంగా నిర్వహించాలని సీఎం రేవంత్ రెడ్డి నిర్ణయం తీసుకోవడం హర్షించదగిన విషయమన్నారు. ఈ కార్యక్రమంలో అఖిల భారత యాదవ మహసభ జిల్లా అధ్యక్షుడు బాలప్ప యాదవ్ , కన్వీనర్ రఘువీర్ యాదవ్ , మక్తల్ నియోజకవర్గ అధ్యక్షుడు నర్సిములు యాదవ్ , తదితరులు పాల్గొన్నారు.



# అల్పాహారంలో పురుగులు

### మాగనూర్ జడ్‌పి పాఠశాలలో విద్యార్థులకు ఫుడ్‌పాయిజన్

**ప్రజాపక్షం / మహబూబ్ నగర్ ప్రతినిధి :** నారాయణ పే ట జిల్లా మాగనూర్ జెడ్‌పి ఉన్నత పాఠశాలలో ఫుడ్ పాయిజన్‌తో అస్వస్థతకు గురై మహబూబ్ నగర్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులకు గు రువారం ఉదయం అందించిన అల్పాహారం రైస్ పొంగల్ లో పరుగులు ఉన్నట్లు మీడియాలో వచ్చిన వార్తల గురించి విచారణ చెయ్యడానికి స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్‌కు అదేశాలు జారీ చెయ్యడం జరిగింది. జిల్లా కలెక్టర్ ఆదేశాల ననుసరించి స్థానిక సంస్థల అదన పు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, ఆర్‌డిఒ నవీన్, మున్సిపల్ కమిషనర్ మహేశ్వర్ రెడ్డి, ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ మనోజ్‌తో కలిసి ఆసుపత్రిని సందర్శించి చికిత్స పొందుతున్న విద్యార్థులు, తల్లి దండ్రులతో మాట్లాడారు. ఉదయం జరిగిన సం ఘటనపై విచారించారు. ఆహార పదార్థాలు ల్యాబ్ టెస్ట్‌కు పంపించాలని ఆయన ఆదేశించారు. ఉదయం రైస్ పొం గల్ అల్పాహారంలో పురుగు ఉందని చికిత్స పొందుతున్న ఒక విద్యార్థి ఆసుపత్రి వార్డ్ నర్స్ దృష్టికి తీసుకు వచ్చారు. వార్డ్ నర్స్ ఆసుపత్రి సూపరింటెండెంట్ దృషికి తీసుకురాగానే వెంటనే పొంగల్ బదులు ఉప్మా అల్పాహారం అం దించారు. ఉదయం జరిగిన సంఘటనతో స్టోర్ రూంలో ఉన్న బియ్యం, పప్పులు పరిశీలించగా ఎటువంటి పురుగు లు కనిపించలేదు. వాటిని తిరిగి నాణ్యతా పరీక్షకు పొంగ ల్‌తో పాటుగా ల్యాబ్ టెస్ట్‌కు పంపించారు. ల్యాబ్ టెస్ట్‌లో ఆహార పదార్థాల్లో నాణ్యతా లోపం లేదని ప్రాథమికంగా నిర్ధారించారు. ఆసుపత్రిలో రోగులు అందిస్తున్న ఆహారం నాణ్యతలో ఎటువంటి ఫిర్యాదులకు ఆస్కారం లేకుండా తగుచర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆసుపత్రిలో రోగులకు అందిస్తున్న భోజనం స్థానిక సంస్థల అదనపు కలెక్టర్‌తో సహా అధికారులు స్వయంగా రుచి చూసి భోజ నం చేశారు. భోజనంలో ఎటువంటి నాణ్యతా లోపం లేద ని సంతృప్తి వ్యక్తం చేశారు. మాగనూర్ జడ్.పి. ఉన్నత పా ఠశాలలో ఫుడ్ పాయిజన్‌తో అస్వస్థతకు గురై 15 మంది విద్యార్థులు చికిత్స కోసం. బుధ వారం సాయంత్రం 7:30 గంటలకు మహబూబ్ నగర్ ఆసుపత్రి లో అడ్మిట్ అయ్యా రు. జిల్లా కలెక్టర్ బుధ వారం రాత్రి ఆసుపత్రిని సందర్శిం చి విద్యార్థులను పరామార్శించి వారితో మాట్లాడి వారికి అందిస్తున్న వైద్య సహాయం ప్రత్యేక శ్రద్ధతో కొనసాగించాలని ఆసుపత్రి సూపరింటెండెంట్, డాక్టర్లను ఆదేశించారు. ప్రస్తుతం చికిత్స పొందుతున్న వారి పరిస్థితి నిలకడగా ఉందని తెలిపారు.





### డిఇఒ సస్పెండ్, ముగ్గురు అధికారులకు షోకాజ్ నోటీసులు

మండల కేంద్రంలోని జడ్‌పి హైస్కూల్‌లలో గురువారం విద్యార్థులకు పురుగుల అన్నం వడ్డించారు. బుధవారం స్కూల్‌లో ఫుడ్ పాయిజన్ జరిగిన విషయమై జిల్లా కలెక్టర్ సిక్త పట్నాయక్ గురువారం ఉద యం పాఠశాలను సందర్శించారు. ఉపాధ్యాయ బృందం , విద్యార్థులతో ఫుడ్ పాయిజన్‌పై వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం వంటగదిని , బియ్యాన్ని పరిశీలించారు. ఇద్దరు టీచర్లను వంట ఏజెన్సీని రద్దు చేసినట్లు తెలిపారు. జిల్లా అధికారుల పర్యవేక్షణలో హాస్టల్ సిబ్బందితో మధ్యాహ్న భోజనం ఏర్పాట్లు చేయాలని సూచించి వెళ్లిపోయారు. ఆర్‌డిఒ, డిఇఒ , ఎంపిడిఒ ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ల పర్యవేక్షణలో మధ్యాహ్న భోజనం చేయించారు. అన్నంలో పురుగులు రావడంతో విద్యార్థులు అన్నం తినకుండా పారవేసి ఆందోళనకు దిగారు. అధికారులు మళ్లి ప్రైవేట్ బియ్యాన్ని తెప్పించుకొని వండి నాలుగు గంటలకు విద్యార్థులకు అన్నం పెట్టారు. ఇంటికి వెళ్లే క్రమంలో విద్యార్థులు సస్పెండ్ చేసిన టీచర్ల సస్పెన్షన్‌ను ఎత్తివేయాలంటూ రోడ్డుపై బైఠాయించా రు. ఉపాధ్యాయుల ప్రోత్సాహంతోనే విద్యార్థులు ఆందోళన చేస్తున్నారన్న ఆరోపణలు రావడంతో సస్పెన్షన్ వేటు ఉన్న ఉపాధ్యాయుడు మాపై ఏ మాత్రం గౌరవం ఉన్న ఆందోళనను విరమించి మీ ఇళ్లకు వెళ్లాలని చెప్పడంతో వి ద్యార్థులు మౌనంగా వెళ్లిపోయారు. విద్యార్థి సంఘాల నాయకులు పాఠశాల ను సందర్శించి మరోసారి ఇలాంటి ఘటనలు పునరావృత్తం అయితే ఆందోళ న చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. సిపిఎం పార్టీ నాయకులు, మక్తల్ మా జీ శాసన సభ్యులు రాంమోహన్ రెడ్డి , పాఠశాల సందర్శించారు.

## విద్య, వైద్యం, ఉపాధి, భూమి, ఇల్లు పేద ప్రజలకు అందివ్వాలి

**ప్రజాపక్షం / వీపనగండ్ల :** కనీస అవసరాలైన విద్యా, వైద్యం , ఉపాధి, భూమి, ఇల్లు తెలంగాణలోని పేద ప్రజలకు రాష్ట్ర ప్రభుత్వం అందించాలని కోరుతూ స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ధర్మ సమాజ్ పార్టీ నాయకులు వినతి పత్రం అందజేశారు. జిల్లా నాయకులు బలరాం మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో తెలంగాణ ప్రజలకు కనీస అవసరాలు విద్యా వైద్యం ఉపాధి భ ఊమి ఇల్లు ఈ ఐదింటిని అందించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని , కార్పొరేట్ కంపెనీలకు వేల ఎకరాలు ఇవ్వడానికి ఉన్న భూమి పేద ప్రజలకి ఇవ్వడానికి లేదా అని ప్రశ్నించారు. ఇకనుండైనా ప్రభుత్వం కాలక్షేపణ ఏయకుండా అర్హులైన వారందరికి 2 ఎకరాల సాగు భూమి 200 గజాలలో 4 గదుల ఇల్లు నిర్మించి పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యనభ్యసించడానికి ప్రతి గ్రామంలో కార్పొరేట్ స్థాయిలో కేజీ టూ పీజీ వరకు పాఠశాలలు ఏర్పాటు చేయాలని పేద ప్రజల ఆరోగ్య బాగు కోసం అమెరికాలాంటి ప్రభుత్వ ఆసుపత్రులు నిర్మించాలని అధికార కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు రామకృష్ణ, నాయకులు నాగరాజు, మనికుమార్ , అంజి, శేఖర్ , జీవరత్నం , శివ , రాఘవేందర్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు ప్రశంసా పత్రాలు

**ప్రజాపక్షం/వీపనగండ్ల :** జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో మండల స్థాయిలో నిర్వహించిన చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్‌లో గెలుపొందిన విద్యార్థిని విద్యార్థులకు మండల విద్యాధికారి నర్సింహ ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ టాలెంట్ టెస్ట్‌లో మండల పరిధిలోని కల్వరాల జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన అభినవ్ , లోకేష్ , యశ్వంత్ మొదటి స్థానంలో నిలిచి జిల్లా స్థాయికి ఎంపికైనట్లు నిర్వాహకులు తెలిపారు.

## కొనుగోలుకేంద్రం పరిశీలన



**ప్రజాపక్షం/కల్వకుర్తి :** పట్టణంలోని మార్కెట్‌యార్డులో ప్రారంభించిన వరిధాన్యం కొనుగోలుకేంద్రాన్ని గురువారం పిఎసిఎస్‌చైర్మన్ తలసాని జనార్దన్‌రెడ్డి వైస్‌చైర్మన్ శ్యామ్‌తోకలిసి పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు వరిధాన్యాన్ని తాలులేకుండా నాణ్యతతో తీసుకురావాలన్నారు. ఆయనవెంట వ్యవసాయ మార్కెట్‌కార్యదర్శి భగవంతు, ఏఓ సురేష్, డైరెక్టర్ వెంకటయ్య, రైతులు లక్ష్మారెడ్డి, దామోదర్‌రెడ్డి, శివయ్య, శంకర్, సిఇఓ వెంకట్‌రెడ్డి ఉన్నారు.

## ట్రాఫిక్‌పై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం



**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్‌టౌన్ :** పట్టణంలోని ఈశ్వర్‌కాలనీలోగల శ్రీచైతన్య టెక్నో పాఠశాలయందు ప్రతినెల నిర్వహించే స్మార్ట్‌లివింగ్‌ప్రోగ్రాంలో భాగంగా నవంబర్‌నెలకు సేఫ్‌ఇండియా కార్యక్రమం నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్యఅతిథిగా నాగర్‌కర్నూల్ పట్టణట్రాఫిక్ ఎస్ఐ కల్యాణ్‌యాదవ్ పాల్గొని రోడ్డు భద్రత గురించి, ట్రాఫిక్ నియమ నిబంధనలగురించి విద్యార్థులకు వివరించారు. కార్యక్రమ అనంతరం విద్యార్థులు , ఉపాధ్యాయులు ట్రాఫిక్ నియమ నిబంధనలగురించి పట్టణంలోని వీధులలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో శ్రీచైతన్య విద్యాసంస్థల ఎజిఎంఎస్ భాస్కర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ రాజీవ్‌ప్రియదర్శన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఇసుక ట్రాక్టర్‌పై కేసు నమోదు

**ప్రజాపక్షం/వీపనగండ్ల :** తూముకుంట ఓంకారేశ్వర వాగు నుండి అక్ర మంగా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్‌ను పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ కె.రాణి తెలిపారు. తూముకుంట గ్రామానికి చెందిన మీసాల వెంక టయ్య అనే వ్యక్తి తన ట్రాక్టర్ ద్వారా వాగు నుండి అక్రమంగా ఇసుకను తరలిస్తుండగా సమాచారం అందుకున్న పోలీసులు వాగు వద్దకు వెళ్లి ఇ సుకను తరలించడానికి సిద్ధంగా ఉంచిన ట్రాక్టర్‌ను పట్టుకొని పోలీస్ స్టేష న్ కుతరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వివరించారు. మండలంలో ఎవరైనా ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తే కఠిన చర్యలలు తప్పవని ఎస్ఐ హెచ్చరించారు.

## నేడు బిసి కమిషన్ చైర్మన్ రాక



**ప్రజాపక్షం / నారాయణపేట ప్రతినిధి :** సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన తరగతుల వారి పరిస్థితులను తెలుసుకోవడానికి బిసి కమిషన్ చై ర్మన్ వారి సభ్యులు ఈ నెల 22న మహబూబ్‌నగర్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు ప్ర జాభిప్రాయ సేకరణ నర్విహించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ సిక్త ప ట్నాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని సమస్త వెనుకబడిన తరగతుల ప్రజానీకం బీసీ కమిషన్ బృందానికి ఆయా కులాల స్థితిగతులపై త మ అభిప్రాయాలను అందజేయవాల్సిందిగా కోరారు. వ్యక్తులు నమోదుత నమోదు కాని సంఘాలు తమ వాదనలకు మద్దతుగా తమ వద్ద ఉన్న స మాచారం, సమర్పణలు , అభ్యర్థనలు , సలహాలు, ఆక్షేపణలను కమిషన్ ముందు హాజరై తెలియజేయవచ్చని అన్నారు. దరఖాస్తుదారులు ధృవీకరణ అఫీడవిడ్ రూ. 20 నాన్ జ్యూడిషియల్ స్టాంప్ పేపర్ పై 6 పత్రాలను సమర్పించాలని తెలిపారు. మరిన్ని వివరాలకు ఈ నోటిఫికేషన్ కు సంబంధించి పూర్తి సమాచారం వెబ్ సైట్ పై ప్రకటన లభ్యంగా ఉంటుందని తెలిపారు.

## మద్యం తాగి వాహనాలు నడిపిన నలుగురుకి జైలు శిక్ష



**ప్రజాపక్షం / పెబ్బేరు :** మద్యం సేవించి వాహనాలు నడిపిన నలుగురు వ్యక్తులను గురువారం వనపర్తి కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి కేసు విచారించి మద్యం తాగి వాహనాలు నడిపిన నలుగురు వ్యక్తులకు మూడు రోజుల జైలు శిక్ష విధించడం జరిగింది. మద్యం సేవించి వాహనాలు నడిపితే చర్యలు తీసుకుంటామని ఎస్ఐ హరిప్రసాద్ తెలిపారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించిన కలెక్టర్



**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్‌ప్రతినిధి :** నాగర్‌కర్నూల్ మండలం ఎండబెట్ల గ్రామంలో మెప్మా ఆధ్వర్యంలో కొనసాగుతున్న ధాన్యం కొనుగోలుకేంద్రాన్ని జిల్లా కలెక్టర్ బదావత్‌సంతోష్ గురువారం సందర్శించారు. రైతులనుండి ఇప్పటివరకు సేకరించిన ధాన్యం నిల్వల గురించి కేంద్రాల నిర్వాహకులను జిల్లా కలెక్టర్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. రైతుల సౌకర్యార్థం కేంద్రంలో అందుబాటులో ఉంచిత సదుపాయాలను పరిశీలించారు. కేంద్రానికి ధాన్యం తీసుకువచ్చిన రైతులను పలకరించి , కొనుగోలుకేంద్రాల్లో ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అని ఆరాతీశారు. రైతులు సౌకర్యార్థం కేంద్రాల్లో అన్ని సదుపాయాలను అందుబాటులో ఉంచాలని, ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నారు. వరిధాన్యం సన్నరకం, దొడ్డరకమా అని గుర్తించే యంత్రంతోచేసే విధానాన్ని పరిశీలించారు. తేమశాతం పరిశీలించిన వెంటనే ధాన్యాన్ని కొనుగోలుచేసి మిల్లులకు తరలించేలా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. మిల్లర్ల వద్ద ఏమైనా ఇబ్బందులు ఎదురవుతున్నాయా రైతులను అడిగి ఆరా తీశారు. ఎక్కడకూడా తరుగు, తాలుపేరిట కోతలువిధించకుండా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. గన్నిబ్యాగుల కొరత నెలకొనకుండా చూడాలని, నిర్దేశిత మిల్లులకు వెంట వెంటనే ధాన్యం తరలింపుకోసం లారీలు అందుబాటులో ఉండేలా ప్రణాళికబద్ధంగా కృషిచేయాలని హితవు పలికారు. కార్యక్రమంలో డిప్యూటి తహసీల్దార్ రాఘవేందర్‌రెడ్డి, ప్యాక్స్ సిఇఓ శ్రీనివాసులు, రైతులు పాల్గొన్నారు.

### అంగన్‌వాడికేంద్రం తనిఖీ

**ప్రజాపక్షం/వెల్దండ :** గర్భిణిలకు, బాలింతలకు అంగన్‌వాడికేంద్రంలోని పౌష్టికాహారాన్ని అందించాలని నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ బదావత్‌సంతోష్ అన్నారు. మండలకేంద్రంలోని 2వ అంగన్‌వాడికేంద్రాన్ని గురువారం కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీచేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని అన్ని అంగన్‌వాడికేంద్రాలను తప్పనిసరిగా ఉదయం 9గంటలనుండి సాయంత్రం 4గంటలవరకు కచ్చితంగా నిర్వహించాలని , 3 సంవత్సరాలలోపు పిల్లలందరికి బాలామృతంతో పాటు మంచి పౌష్టికాహారం అందజేసివారి ఎదుగుదలను ఎప్పటికప్పుడు గమనిస్తుండాలన్నారు. విద్యార్థులరికార్డులను పరిశీలించారు.

### బిసి వసతిగృహం పరిశీలన

మండలకేంద్రంలోని బిసిబాలుర వసతిగృహాన్ని నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ బదావత్‌సంతోష్ గురువారం ఆకస్మికంగా తనిఖీచేశారు. స్టోర్‌రూమ్, కిచెన్, టాయిలెట్స్, ఆఫీస్, స్టాఫ్‌రూమ్‌లు తదితర వాటిని పరిశీలించారు. స్టోర్‌రూమ్‌లో నిల్వ ఉంచి సన్నబియ్యం, ఇతర సరుకుల నాణ్యతను , విద్యార్థులకోసం వండిన మధ్యాహ్న బోజాన్ని పరిశీలించారు. అనంతరం హాస్టల్ విద్యార్థులతో మాట్లాడి వారికి మెనూ ప్రకారం భోజనం పెడుతున్నారాలేనిది అడిగి తెలుసుకున్నారు. హాస్టల్ సంక్షేమ అధికారి వంటవారితో మాట్లాడి విద్యార్థులు అందిస్తున్న ఆహరంలో నాణ్యత పాటిస్తున్నదిలేనిది తెలుసుకున్నారు. విద్యార్థులపట్ల నిర్లక్ష్యం వహిస్తే కఠినచర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు. కలెక్టర్‌వెంట జిల్లాబిసి సంక్షేమశాఖ అధికారి ఖాజఅప్సర్‌నాజిమ్‌ఆలీ, కల్వకుర్తి ఆర్‌డిఓ శ్రీను, వెల్దండ తహసీల్దార్ కార్తీక్‌కుమార్, ఎంపిడిఓ సత్యపాల్, వార్డెన్ రామకృష్ణ, అంగన్‌వాడిసూపర్‌వైజర్ , అంగన్‌వాడిటీచర్ మాసమ్మ ఉన్నారు.

### దివ్యాంగులు నిరుత్సాహపడొద్దు

ప్రస్తుతకాలంలో దివ్యాంగులమని నిరుత్సాహపడొద్దని , వికలత్వం అనేది శరీరానికే తప్ప మనసుకు, ఆలోచనకుకాదని నిరూపించాలని జిల్లా కలెక్టర్ బదావత్‌సంతోష్ అన్నారు. డిసెంబర్ 3న ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం నాగర్‌కర్నూల్ జిల్లా సంక్షేమశాఖ ఆధ్వర్యంలో నాగర్‌కర్నూల్ జిల్లాపరిషత్ బాలుర ఉన్నత పాఠశాలక్రీడామైదానంలో విభిన్న, ప్రతిభావంతులక్రీడాపోటీలకు జిల్లా కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరైజెండాఊపి దివ్యాంగుల క్రీడలను ప్రారంభించారు. డిడబ్ల్యూఓ రాజేశ్వరి సంబంధిత అధికారులు దివ్యాంగులతోకలిసి జ్యోతి ప్రజ్వలనచేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ట్రైసైకిల్ పరుగు, చెస్, క్యారమ్, షార్ట్‌పుట్ ఆటలపోటీలు నిర్వహించగా కలెక్టర్ దివ్యాంగులను ఉత్సాహపర్చేందుకు షార్ట్‌పుట్ క్రీడాపోటీల్లో కలెక్టర్‌సైతం పాల్గొన్నారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమశాఖ అధికారిణి రాజేశ్వరి, వ్యాయామ ఉపాధ్యాయులు సుభాషిని, జిల్లా దివ్యాంగుల సంఘం సభ్యులు, దివ్యాంగ క్రీడాకారులు పాల్గొన్నారు.

## జడ్చర్లలో ఘనంగా పాసింగ్ ఔట్ పరేడ్

**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ ప్రతినిధి :** జిల్లా పోలీస్ శిక్షణా కేంద్రం, జడ్చర్ల నందు 270 మంది ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకి చెందిన ఎస్‌సిటి పిసిఎస్ 9 నెలల ఇండక్షన్ ట్రైనింగ్ పూర్తి చేసుకున్న సందర్భంగా పాసింగ్ అవుట్ పరేడ్ ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కొత్తకోట శ్రీనివాస్ రెడ్డి, ఐపిఎస్, విజిలెన్స్, ఎన్ఫోర్స్మెంట్ , ఎక్స్ అఫిషియో ప్రిన్సిపాల్ సెక్రెటరీ ఆఫ్ హాజరైనారు. ఈ సందర్భంగా డిజిపి మాట్లాడుతూ ఈ పాసింగ్ అవుట్ పరేడ్ శిక్షణ, క్రమశిక్షణా ప్రాముఖ్యతను ప్రతిబింబిస్తుంది. ఈ 9 నెలల కఠోర శిక్షణతో మీరు మంచి ప్రదర్శనని ఇచ్చారు. ఇంత మంచి శిక్షణ అందించి మిమ్మల్ని పూర్తిస్థాయి పోలీసుగా రూపొందించిన ఈ డిటిసి సిబ్బందికి నా యొక్క అభినందనలు తెలిపారు. ప్రజలలో ఈరోజుకు పోలీస్ శాఖ మీద ఉన్న గౌరవం, అభిమానం రాష్ట్రంలో గాని దేశంలో గాని ఏ శాఖకు లేదని అన్నారు. ప్రజలు ప్రశాంతంగా రాత్రిపూట నిద్రపోవాలంటే మనం మేల్కోని పనిచేస్తున్నామని, వారు ప్రశాంతంగా పండుగలు ఉత్సవాలు జరుపుకోవాలని మనం మన ఇండ్లలో పండుగలు పబ్బాలను పక్కనపెట్టి వాళ్ల యొక్క ప్రశాంతత కోసం పనిచేస్తున్నాం. అందుకనే పోలీసు శాఖకు అంతటి గౌరవం ఉందన్నారు. పోలీసు ఉద్యోగం అనేది అన్ని ఉద్యోగాల లాగాకాకుండా కుటుంబ ధర్మం కన్నా వృత్తి ధర్మంనికి ఎక్కువ ప్రాముఖ్యత ఇవ్వాల్సి ఉంటుంది. ఎందుకంటే ప్రజలకు ప్రత్యక్షంగా సేవలు చేయాల్సి ఉండాలి. ఇంకో విధంగా చెప్పాలంటే అనుక్షణం ప్రజలతో మమేకమై ప్రజల జీవితాల్లో భాగస్వాములై వారికి రక్షణ కల్పించాల్సిన బాధ్యత మనది అన్నారు. ఈ కార్యక్రమాన్ని ఇంత చక్కగా నిర్వహించిన డిటిసి వైస్ ప్రిన్సిపాల్ నరసింహులు ని డిజిపి ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో జోన్ 7 జోగులాంబ , డిఐజి ఎల్ఎస్ చౌహాన్ ఐపీఎస్, జిల్లా ఎస్పీ డి.జానకి, వనపర్తి జిల్లా ఎస్పీ రావుల గిరిధర్, ఐపీఎస్ డిటిసి ప్రిన్సిపాల్ రాములు, ఎఆర్ అదనపు ఎస్పీ సురేష్ కుమార్, డిటిసి వైస్ ప్రిన్సిపాల్ నర్సింలు, ఎఆర్ డిఎస్పి శ్రీనివాస్, డిసిఆర్‌బి డిఎస్పి రమణారెడ్డి, ఇతర పోలీసు ఉన్నత అధికారులు ఎస్సిటి పిసిఎస్ పోలను కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



## ప్రాపర్టీ నేరాల నియంత్రణపై దృష్టి

### జిల్లా ఎస్‌పి యోగేష్



**ప్రజాపక్షం / నారాయణపేట ప్రతినిధి :** జిల్లా పరిధిలో నిత్యం శాంతి భద్రతలు పరిరక్షిస్తూ , ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని , ప్రాపర్టీ నేరాల నియంత్రణపై దృష్టి సారించి ఆ కేసులలో సరైన సాక్షధరలను సేకరించి సాకేతికతను జోడించి త్వరగా కేసులను చేదించాలని ఎస్పీ తెలిపారు. గురువారం జిల్లా ఎస్పీ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో ఎస్పి యోగేష్ జిల్లా పోలీసు అధికారులతో నెలవారి నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పెండింగ్ లో ఉన్న కేసులలో గ్రేవ్ , నాన్ గ్రేవ్ కేసుల గురించి అధికారులను అడిగి తెలుసుకొని పెండింగ్ కేసులను న్యాయ అధికారులతో సమన్వయం చేసుకుంటూ పెండింగ్ కేసులను త్వరగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. పెరుగుతున్న టెక్నాలజీని అందిపుచ్చుకోవాలి ఛాలెంజ్ గా విధులు నిర్వహించి ప్రజల మన్ననలు పొందాలని తెలిపారు. సామాజిక అంశాలపై లోకల్ పోలీసులు, షీ టీమ్స్ , పోలీస్ కళా బృందం వారు విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఎస్పి ఎన్. లింగయ్య, సిఐలు శివశంకర్ , దస్రు నాయక్ , రాంలాల్ , చంద్రశేఖర్ , రాజేందర్ రెడ్డి, ఎస్ఐలు వెంకటేశ్వర్లు, రాజు, కుర్మయ్య, రాంలాల్ , రమేష్ , ఎస్ఎం నవీద్ , మురళి, భాగ్యలక్ష్మి రెడ్డి, ఆశోక్ బాబు, సునిత, వసంత, ఐటి కోర్ టీం తదితరులు పాల్గొన్నారు.



## క్రమశిక్షణతోనే ఉన్నత స్థితి

### పాల్వంచ డిఎస్‌పి సతీష్‌కుమార్

**ప్రజాపక్షం/పాల్వంచ:** క్రమశిక్షణతో కూడిన విద్య ఉన్నత స్థితికి చేర్చుతుందని పాల్వంచ డిఎస్‌పి సతీష్‌కుమార్ అన్నారు. గురువారం కొత్తగూడెం వైద్య కళాశాలలో ర్యాగింగ్‌పై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈకార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆయన హాజరై మాట్లాడుతూ ర్యాగింగ్ దుష్ప్రభావాలను ర్యాగింగ్ చేసే విద్యార్థులకు తెలియజేసి వారిలో మార్పు కోసం ప్రయత్నించాలన్నారు. ఎందరో అమాయక విద్యార్థులు ర్యాగింగ్ వల్ల తమ ఆత్మహత్య చేసుకుని వారి తల్లిదండ్రులకు వేదన మిగిల్చారని, అందుకు కారణమైన ర్యాగింగ్‌కు వ్యతిరేకంగా ప్రతి విద్యార్థి నడుం బిగించి అంకిత భావంతో ర్యాగింగ్‌పై అవగాహన ప్రతి ఒక్కరికి కల్పించాలని అన్నారు. పోలీసులు కళాశాలలోని విద్యార్థులతో మార్పు తీసుకురావాలనే సదుద్దేశంతో అవగాహనసదస్సు ఏర్పాటు చేశామన్నారు. భవిష్యత్తులో విద్యార్థులు ఎవరైనా ర్యాగింగ్‌కు పాల్పడితే చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకోబడతాయని హెచ్చరించారు. ఈకార్యక్రమంలో పాల్వంచ సిఐ వినయ్‌కుమార్, టౌన్ ఎస్ఐ సుమన్, జిల్లా షీ టీమ్స్ ఎస్ఐ రమాదేవి, కళాశాల ప్రిన్సిపాల్ రాజ్‌కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

## సర్వే వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు

**ప్రజాపక్షం/భద్రాచలం :** సర్వేలో సేకరించిన కుటుంబాల వివరాలను గోప్యంగా , పకడ్బందీగా ఆన్‌లైన్ చేయాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. గురువారం ఐడిఓసిలో కంప్యూటర్ ఆపరేటర్లకు నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి హాజరైన ఆయన పలు సూచనలు చేశారు. ఆన్‌లైన్ చేసే ఆపరేటర్లు ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా వివరాలు నమోదు చేయాలని చెప్పారు. ఎంట్రీ ఆపరేటర్లు అత్యంత కీలకంగా వ్యవహరించాలని, ఫార్మట్ల ఆధారంగా వివరాలు నమోదు చేయాలని అన్నారు. అంశాల వారిగా ఒకట్రెండు సార్లు సరి చూసుకుని నమోదు ప్రక్రియను ముందుకు తీసుకెళ్లాలని చెప్పారు. సూపర్వైజర్లు, ప్రత్యేకాధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో సిపిఓ సంజీవరావు, మాస్టర్ ట్రైనీలు తదితరులు పాల్గొన్నారు.

## 24న నవోదయ మోడల్ పరీక్ష

**ప్రజాపక్షం/బూర్గంపాడు:** గత 19 సంవత్సరాల నుండి ప్రతి సంవత్సరం నవోదయలో సీట్లు సాధిస్తున్న బ్రిలియంట్ నవోదన కోచింగ్ వారి ఆధ్వర్యంలో ఈ సంవత్సరం కూడా 2024–2025 జనవరిలో జరగబోయే నవోదయ మెయిన్ పరీక్ష వ్రాయబోవు విద్యార్థులకు పరీక్షపై అవగాహన కల్పించుటకు ఈ నవోదయ మోడల్ పరీక్షను నిర్వహించడం జరుగుతుందని బ్రిలియంట్ నవోదయ కోచింగ్ ఛైర్మన్, గురు బ్రహ్మ అవార్డు గ్రహీత డాక్టర్ బిఎన్ఆర్ అన్నారు.ఆయన మాట్లాడుతూ ఈనెల 24వ తేదీ ఉదయం 9:30నిముషాలకు భద్రాచలం ఆర్‌టిసి బస్ స్టాండ్ వెనుక సిద్దార్ధ ఒకేషనల్ జూనియర్ కాలేజ్‌నందు నిర్వహించనున్నట్లు తెలిపారు.

## ప్రజాపాలనలో నియంతృత్వ పోకడలు

**ప్రజాపక్షం/కారేపల్లి:** కాంగ్రెస్ ప్రభుత్వంలో మాటలలో ప్రజాపాలన అంటూ నియంతృత్వ పోకడలు పోతుందని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కొండబోయిన నాగేశ్వరరావు విమర్శించారు. బుధవారం కారేపల్లిలో విలేకరులతో మాట్లాడుతూ నియంతృత్వ పోకడలతో గత పాలకులకు ప్రజలు తగిన బుద్ధి చెప్పారని, అదే వ్యవహార శైలీని కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తుందన్నారు. లగచర్ల ఫార్మసిటీకి భూ సేకరణ విషయంలో ప్రభుత్వం నియంతృత్వంగా వ్యవహరించడం మానుకోవాలన్నారు. పేదలు భూములు ఇవ్వమని నిరసన తెల్పితే వారిని జైలులో పెట్టి భయభ్రంతులకు గురి చేయడం దేనికి నిదర్శమన్నారు. లగచర్లలో బాధితులను కలవటానికి వెళ్తున్న వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి రమావత్ శ్రీరామ్‌నాయక్, రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు మూడు శోభన్ నాయక్ ఇతర ప్రజాసంఘాల నాయకులను పోలీసులు అడ్డుకోని అరెస్టు చేయడం అప్రజాస్వామ్యమన్నారు. అక్రమంగా అరెస్ట్ చేసినవారినందరినీ వెంటనే భేషరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లగచర్లలో భూ సేకరణ మానుకోవాలని లేకుండా ప్రజాసంఘాల ఆధ్వర్యంలో పోరాటం ఉధృతం చేస్తామన్నారు.

## జాకీర్ సులేమాన్‌కు అభినందనలు



**ప్రజాపక్షం/పాల్వంచ:** పాల్వంచ మార్కెట్ ఏరియాలో గల స్టార్ చిల్డ్రన్ హైస్కూల్ విద్యార్థి జాకీర్ సులేమాన్ 10వ తరగతి బుధవారం నాడు మోహినాబాద్ గ్రౌండ్ హైదరాబాద్‌లో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్‌లో ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ 2024 కప్‌ను గెలుచుకున్నట్లు కరస్పాండెంట్ జి భాస్కర రావు, ప్రిన్సిపాల్ జి శ్రీనివాసరెడ్డి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విజేతకు అభినందనలు తెలిపారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ విద్యార్థులు క్రీడలలో పాల్గొనాలని, క్రీడలలో పాల్గొనడం వల్ల మానసిక ఎదుగుదలతో పాటు సోషల్ స్కిల్స్, ఓర్పు, ఏకాగ్రత కాంపిటేటివ్ స్పిరిట్ వంటివి పెంపొందుతాయని పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో జి స్వరూప, జి రమాదేవి, కే మహేశ్వరి, ఝాన్సీ, ప్రశాంతి, స్వాతి, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

## 25న కౌన్సెలింగ్ నిర్వహణ

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఖమ్మం ప్రభుత్వ వైద్యకళశాల నందు రెండు సంవత్సరాల డిప్లొమా ఇన్ అనాస్తిసియా టెక్నిషియన్, డిప్లొమా ఇన్ మెడికల్ టెక్నిషియన్ కొర్సుల్లో చేరుటకు దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు నవంబర్ 25న కౌన్సిలింగ్ నిర్వహిస్తున్నట్లు ప్రభుత్వ వైద్యకళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.రాజేశ్వరరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ వైద్య కళాశాల ప్రజ్ఞా సమావేశ మందిరంలో మొదటి విడత కౌన్సిలింగ్ ఈనెల 25న నిర్వహించనున్నట్లు తెలిపారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్స్‌తో సకాలంలో హాజరు కావాలని తెలిపారు. మెదటి విడత కౌన్సిలింగ్‌లో మిగిలిన ఖాళీలకు నవంబర్ 30న కౌన్సిలింగ్ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కౌన్సిలింగ్‌లో బైపిసి విద్యార్థులకు మొదటి ప్రాధాన్యత, ఎంపిసి మొదలగు వారికి తదుపరి ప్రాధాన్యతతో సీట్ల కేటాయింపు ఉంటుందని ప్రిన్సిపాల్ తెలిపారు.

## ఇవిఎం తనిఖీ



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఇవిఎం గోడౌన్‌ను జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తనిఖీ చేశారు. గురువారం కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ కలెక్టరేట్ ఆవరణలోని ఇవిఎం గోడౌన్‌ను అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డితో కలిసి తనిఖీ చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ ఎల్లప్పుడు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. తాళం వేసిన గోడౌన్‌లో, సీళ్లను పరిశీలించి డబుల్ లాక్ సిస్టం ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. భద్రతా సిబ్బంది షిఫ్ట్‌ల వారీగా విధులు నిర్వహిస్తున్న సమయాన్ని అడిగి తెలుసుకుని రిజిస్టర్‌ను పరిశీలించారు. అనంతరం తనిఖీ రిజిస్టర్‌లో కలెక్టర్ సంతకం చేశారు. ఎన్నికల విభాగం పర్యవేక్షకులు సిహెచ్ స్వామి, కలెక్టరేట్ ఎన్నికల డిటి అన్సారి, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పౌష్టికాహారం పౌరుడి హక్కు

### తెలంగాణ రాష్ట్ర ఫుడ్ కమిషన్ సభ్యులు ఆనంద్, జ్యోతి




**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** దేశంలో ప్రతి పౌరుడు పౌష్టికాహారం స్వీకరించడం రాజ్యాంగం కల్పించిన హక్కు అని ఆ చట్టాన్ని పక్కాగా అమలు చేయాల్సి ఉంటుందని తెలంగాణ రాష్ట్ర ఫుడ్ కమిషన్‌సభ్యులు ఓరుగంటి ఆనంద్, భూక్యా జ్యోతిలు తెలిపారు. గురువారం ఫుడ్ కమిషన్ సభ్యులు ఓరుగంటి ఆనంద్, భూక్యా జ్యోతిలు కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఆహార భద్రత చట్టం అమలుపై పి. శ్రీనివాసరెడ్డితో కలిసి సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఖమ్మంజిల్లాలో ఆహార భద్రత చట్టం అమలుకు తీసుకుంటున్న చర్యలు, ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన మధ్యాహ్నం భోజనం అందించేందుకు చేపట్టిన చర్యలు, ప్రభుత్వ పాఠశాలల్లో ఏర్పాటు చేస్తున్న న్యూట్రిగార్డెన్ మొదలగు వివరాలను అధికారులు కమిషన్ సభ్యులకు వివరించారు.ఫుడ్ కమిషన్ సభ్యులు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థుల శారీరక అభివృద్ధికి అవసరమైన పోషకాలను పరిగణలోకి తీసుకుంటూ నిపుణులు మధ్యాహ్న భోజన మెమోను తయారు చేయడం జరిగిందన్నారు. శనివారం మెనూ ప్రకారం వెజిటబుల్ బిర్యాని రావడం లేదని, వారానికి రెండు కోడిగుడ్లు మాత్రమే వస్తున్నాయని క్షేత్ర స్థాయి పరిశీలనలో తేలిందన్నారు. పాఠశాలల్లో పిల్లలకు నాణ్యమైన పౌష్టికాహారం అందించడం, మండల విద్యాశాఖాధికారులు, పాఠశాల హెడ్ మాస్టర్లపై ఉందని కమిషన్ సభ్యులు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల కులాల వారీగా అటెండెన్స్ స్వీకరణ గుర్తించామని ఇటువంటి అంశాలు పునరావృతం కాకుండా చూడాలని తెలిపారు. విద్యార్థులకు అవసరమైన వైద్య పరీక్షలను నిర్వహించాలని తెలిపారు. రెసిడెన్షియల్ పాఠశాలలకు తక్కువ సైజు కోడిగుడ్లు సరఫరా చేసే కాంట్రాక్టర్లకు మెమో జారీ చేసి తీసుకున్న చర్యలపై 15 రోజులలో నివేదిక సమర్పించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలు, రెసిడెన్షియల్ విద్యా సంస్థలకు సరఫరా చేసే బియ్యం నాణ్యతతో ఉండేలా చూడాలన్నారు. జిల్లాలో అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ బాగుందని ప్రశంసించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు సమన్వయంతో పనిచేస్తూ ప్రభుత్వ ఆసుపత్రుల్లో అధికంగా ప్రసవాలు జరిగేలా చూడాలన్నారు. జిల్లాలోని హాస్టల్స్, ప్రభుత్వ పాఠశాలల్లో, ప్రైవేటు హోటల్స్‌లో ఫుడ్ సేఫ్టీ అధికారులు నిరంతరం తనిఖీలు చేస్తూ నివేదికలు అందించాలన్నారు.ఆహార భద్రత చట్టం భంగం కలిగితే లబ్దిదారులు ఫిర్యాదులు చేస్తే 25 శాతం ఫైన్‌తో చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. జెడ్పిసిఈవో దీక్షారైనా, డిఆర్‌డివో సన్యాసయ్య, జిల్లా పౌర సరఫరాల అధికారి చందన్ కుమార్, పౌర సరఫరాల మేనేజర్ జి. శ్రీలత, జిల్లా ఎస్సి అభివృద్ధి అధికారి కె. సత్యనారాయణ, డిఈవో సోమశేఖర శర్మ, జిల్లా సంక్షేమ అధికారి రాంగోపాల్‌రెడ్డి, డిఎంఅండ్‌హెచ్‌వో కళావతిబాయి,బిసి అభివృద్ధి అధికారి జి.జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

## విద్యతోనే సమాజంలో ఉన్నత స్థానం

### కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్



**ప్రజాపక్షం/చింతకాని:** విద్యతోనే సమాజంలో ఉన్నత స్థానం సాధించవచ్చని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. గురువారం చింతకాని మండలం పందిళ్ళపల్లి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలను కలెక్టర్ ఆకస్మిరంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలోని తరగతి గదులు తిరుగుతూ ఉపాధ్యాయుల భోధనా ప్రక్రియను పరిశిలించారు.6వ తరగతిగదిలో ఇంగ్లీష్ పాఠాన్ని విద్యార్థులతో కలిసి విన్నారు. అనంతరం ఉపాధ్యాయుడి అవతారమెత్తి బోర్డుపై ఇంగ్లీష్ పాఠాన్ని ,గ్రామర్‌ను పిల్లలకు సులువుగా అర్ధమయ్యేలా భోధించారు.విద్యార్థులతో కలిసి నేలపై కూర్చోని డిజిటల్ తరగతులు వీక్షించి మారుతున్న టెక్నాలజీ వల్ల పిల్లలకు మంచి,చెడు విద్యార్థులకు వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులనుద్దేశించి కలెక్టర్ మాట్లాడుతూ జీవితంలో నిర్దేశించుకున్న లక్ష్యాల సాధన దిశగా విద్యార్థులు ఇప్పటి నుంచే కృషి చేయాలన్నారు.పౌష్టికాహారం తీసుకోవాలని జంక్ ఫుడ్ తినే అలవాట్లు తగ్గించుకోవాలన్నారు.జిల్లాలో 50 ప్రభుత్వ పాఠశాలల్లో కిచెన్ గార్డెన్‌లు ఏర్పాటు చేసి కూరగాయలు పండిస్తున్నామని విద్యార్థులు కిచన్ గార్డెన్‌లను సంరక్షించే భాధ్యత తీసుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు,ఉపాధ్యాయులు,విద్యార్థులు పాల్గొన్నారు.

## గొల్లపూడికి సైబర్‌క్రైమ్ పోలీసులు

## అదుపులో ఇద్దరు యువకులు?

**ప్రజాపక్షం/ ఖమ్మం / వైరా :** సైబర్ క్రైమ్ నేరానికి సంబంధించి హైదరాబాద్ పోలీసులు వైరా మండలం గొల్లపూడి గ్రామానికి చెందిన ఇద్దరు యువకులను అదుపులోకి తీసుకుని విచారించినట్లు సమాచారం. గురువారం తెల్లవారుజామున గొల్లపూడి చేరుకున్న పోలీసులు ఇద్దరు సాఫ్ట్‌వేర్ ఉద్యోగులను అదుపులోకి తీసుకుని విచారించిన అనంతరం వదిలేశారని తెలుస్తుంది. ఈ ఇద్దరు యువకులు విదేశాల నుంచి సాఫ్ట్‌వేర్ కొనుగోలు చేసి అధిక మొత్తానికి సైబర్ క్రైమ్ నేరగాళ్లకు విక్రయించారనే ఆరోపణ నేపథ్యంలో విచారణ సాగించారని సమాచారం. మూడునెలల క్రితం మహారాష్ట్రకు చెందిన పోలీసులు సైతం ఇదే వ్యవహారంపై గొల్లపూడిలో పర్యటించి ఆ ఇద్దరు యువకుల బ్యాంకు ఖాతాలను సైతం పరిశీలించారు. పోలీసులు అదుపులోకి తీసుకుని వదిలేసిన ఇద్దరు యువకులు మరికొంత మంద ఇంజనీరింగ్ విద్యార్థులకు పని కల్పించే నేపంతో సాఫ్ట్‌వేర్‌ను కొనుగోలు చేసి సవరణల అనంతరం సైబర్ నేరగాళ్లకు విక్రయించారని వీరి బ్యాంకు ఖాతాల్లో కూడా పెద్ద మొత్తంలో నగదు నిల్వ ఉన్నట్లు పోలీసులు గ్రహించారు. స్థానికంగా కూడా ఇటీవల కాలంలో పెద్ద మొత్తంలో ఆస్తులు కొనుగోలు చేసినట్లు స్థానికులు తెలిపారు. గొల్లపూడికి హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు రావడం ఈ ప్రాంతంలో కలకలం సృష్టించింది.

# సమాజం పట్ల విశ్వసనీయత తప్పనిసరి



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** సమాజం పట్ల విశ్వసనీయత పెంపొందించేలా ప్రజాసేవకు అంకితం కావాలన మల్టీజోన్ 1 ఐజిపి ఎస్. చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. తొమ్మిదినెలల బేసిక్ ఇండక్షన్ శిక్షణను పూర్తి చేసుకున్న 263 ఏఆర్, సివిల్ ట్రైనీ పోలీస్ కానిస్టేబుళ్ల పాసింగ్ అవుట్ పరేడ్ (దీక్షాంత్ పరేడ్) గురువారం సిటీ పోలీస్ శిక్షణా కేంద్రంలో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి పోలీస్ కమిషనర్ సునీల్ దత్, భద్రాద్రి కొత్తగూడెం ఎస్‌పి రోహిత్‌రాజ్ లు హాజరయ్యారు. ముఖ్య అతిథిగా మల్టీ జోన్ 1 ఐజిపి చంద్రశేఖర్‌రెడ్డి తొలుత ట్రైనీ కానిస్టేబుళ్ల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం విధి నిర్వహణలో వివక్ష చూపమని తమ సేవలతో దేశ ప్రతిష్టతను పెంచుతామని శిక్షణ పూర్తి చేసుకున్న కానిస్టేబుళ్లు ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా ఐజిపి చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ సమాజానికి అత్యున్నతమైన సేవలు అందించే అవకాశం ఉన్న పోలీస్ శాఖలో చేరి శిక్షణ పూర్తి చేసుకున్న కానిస్టేబుళ్లు ఈరోజు నుంచి పూర్తి బాధ్యతలు నిర్వహించేందుకు నియమించబడ్డారన్నారు. అప్పగించిన బాధ్యతలను సక్రమంగా సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రధానంగా ప్రజల రక్షణ మన బాధ్యత అని వారి హక్కులను, ఆత్మగౌరవం భంగం కలుగకుండా ప్రజలతో మంచి నడవడికను అలవాటు చేసుకోవాలన్నారు. పోలీస్ ఉద్యోగంలో క్రమశిక్షణ అనేది చాలా ముఖ్యమనే విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలన్నారు. నిత్యం పని ఒత్తిడి, ప్రతికూల పరిస్థితులలో బాధ్యతలు నిర్వహించాల్సి ఉంటుంది కాబట్టి ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి ఫిట్‌నెస్ చాలా ముఖ్యమైందన్నారు. పట్టుదలతో శిక్షణ పూర్తి చేసుకున్న కానిస్టేబుళ్లు అంకితభావంతో సేవలు అందిస్తూ వృత్తి పరమైన జీవితంలో ఉన్నతస్థాయికి చేరాలని ఆకాంక్షించారు. నేరాల నియంత్రణ, కొత్త టెక్నాలజీ వినియోగంలో తెలంగాణ రాష్ట్ర పోలీసులకు మంచి గుర్తింపు ఉందని శిక్షణ కాలంలో నేర్చుకున్న కొత్త చట్టాలను సమర్ధవంతంగా అమలు చేయాలని తెలిపారు. నేరం,విచారణ, ఫోరెన్సిక్ సైన్స్, ఫోరెన్సిక్ మెడిసిన్, అవుట్ డోర్స్, ఫిజికల్ ట్రైనింగ్, స్క్వాడ్ డ్రిల్, ఆర్మ్స్ డ్రిల్, లాఠీ డ్రిల్, టియర్ గ్యాస్, మాబ్ ఆపరేషన్లు, వెపన్ ట్రైనింగ్, ఫీల్డ్ క్రాఫ్ట్, ట్రాఫిక్ డ్రిల్, ఫస్ట్ ఎయిడ్, ఇండోర్, అవుట్ డోర్ అన్ని అంశాలను క్రమ పద్ధతిలో నేర్చుకుని శిక్షణను విజయవంతంగా పూర్తి చేశారని ఐజిపి తెలిపారు. రాచకొండకు చెం దిన ఏఆర్ కానిస్టేబుళ్లు పి. రఘు, కె. కిషోర్, రామగుండంకు చెందిన సివిల్ కానిస్టేబుళ్లు జి. ప్రశాంత్, ఎం. నవీన్ కుమార్, డి. ప్రదీప్, బెస్ట్ ఆల్‌రౌండర్ కె. హరీష్ తదితరులు జ్ఞాపికలను అందుకున్నారు.అడిషనల్ డిసిపిలు అడ్మిన్ నరేష్‌కుమార్, ప్రసాదరావు, ఏఆర్ అడిషనల్ డిసిపిలు కుమారస్వామి, విజయ్‌బాబు, ఏసిపిలు రమణమూర్తి, తిరుపతిరెడ్డి, రఘు, రెహ్మాన్, రవి, శ్రీనివాసులు, సాంబరాజు, నర్సయ్య, సుశీల్ సింగ్, పోలీస్ అసోసియేషన్ అధ్యక్షులు శ్రీనివాస్, డా॥ జితేందర్ తదితరులు పాల్గొన్నారు.

# ఐక్యత దిశగా న్యూడెమోక్రసీ పార్టీలు

**ప్రజాపక్షం/ఖమ్మం:** కమ్యూనిస్టు ఉద్యమం పలు చీలికల తర్వాత బలహీనపడింది. ఉమ్మడి ఖమ్మం జిల్లాతో పాటు రాష్ట్రంలోని కొన్ని పరిమితమైన ప్రాంతాలలో పట్టు కలిగిన సిపిఐ, ఎంఎల్, న్యూడెమోక్రసీ మూడు చీలికల తర్వాత బలహీనపడింది. గతంలో ఇల్లందు ఎంఎల్ఏ స్థానాన్ని ఐదుసార్లు గెలుచుకున్న ఆ పార్టీ ఉనికి ఇప్పుడు ప్రశ్నార్థకమవుతున్న వేళ మళ్లీ ఐక్యత దిశగాఅడుగులు వేస్తున్నారు. గతేడాది సిపిఐ(ఎంఎల్) ప్రజాపంథా, సిపిఐ(ఎంఎల్)ఆర్ఐ, పిసిసి సిపిఐ(ఎంఎల్) ఐక్యమై సిపిఐ(ఎంఎల్) మాస్‌లైన్‌గా అవతరించాయి. అదే దిశలో సిపిఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీగాకొనసాగుతున్న రెండు పార్టీలు ఇప్పుడు ఐక్యత దిశగా అడుగులు వేస్తున్నాయి. రాష్ట్రంలో పైలా వాసుదేవరావు నాయకత్వంలోని సిపిఐ(ఎంఎల్) ప్రజాపంథాలో పలుమార్లు బేధాభిప్రాయాల కారణంగా చీలికలు ఏర్పడ్డాయి. చివరకు సిపిఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీగా రాష్ట్రంలో పలు ప్రాంతాలలో ప్రజాసంబంధాలు కలిగి ఇల్లందుతో పాటు మరికొన్ని చోట్ల బలమైన రాజకీయ పునాది కలిగి ఉంది. ఈనేపథ్యంలో న్యూడెమోక్రసీలో చీలిక ఏర్పడి సాధినేని వెంకటేశ్వరరావు రాష్ట్ర కార్యదర్శిగా ఓ వర్గం చీలిపోయింది. సూర్యం, డివి కృష్ణ, పోటు రంగారావు తదితరులు న్యూడెమోక్రసీ పేరుతో రాజకీయ కార్యకలాపాలు కొనసాగించాయి. ఆ తర్వాత డివి కృష్ణ నేతృత్వంలోని న్యూడెమోక్రసీలో కూడా చీలిక ఏర్పడి డివి కృష్ణ రాష్ట్ర కార్యదర్శిగా, పోటు రంగారావు సహాయ కార్యదర్శిగా న్యూడెమోక్రసీ నుంచి విడివడి సిపిఐ(ఎంఎల్) ప్రజాపంథాగా మారారు. అవశేష సిపిఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీకి పోటు సూర్యం రాష్ట్ర కార్యదర్శిగా కొనసాగుతున్నారు. మూడు ఎంఎల్ పార్టీలు ఐక్యమై మాస్‌లైన్‌గా ఏర్పడిన తర్వాత సాధినేని వెంకటేశ్వరరావు నేతృత్వంలోని సిపిఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ పోటు సూర్యం నేతృత్వంలోని న్యూడెమోక్రసీ ఐక్యం కావాలని నిర్ణయించినట్లు సమాచారం. ఈ దిశగా తొలి విడత సమావేశం కూడా జరగగా ప్రజా సంఘాలను తొలుత ఐక్యం చేయాలని ఆ తర్వాత పార్టీల విలీనంపై నిర్ణయం తీసుకోవాలని నిర్ణయించారు. ఒక రకంగా రాష్ట్ర రాజకీయాలలో ముఖ్యంగా వామపక్ష శ్రేణులకు సంబంధించి ఇది శుభపరిణమంగా చెప్పుకోవచ్చు. కమ్యూనిస్టు ఉద్యమం బలపడి చీలికల తర్వాత విమర్శలకు గురవుతుండడం కమ్యూనిస్టులుఐక్యం కావాలన్న బుద్ధిజీవుల నినాదానికి అగుణంగా ఈ నిర్ణయం జరిగిందన్న భావన వ్యక్తమవుతుంది. పాలకులపై ప్రజల్లో వ్యతిరేకత పెరుగుతున్న వేళ ఆందోళనలు నిర్వహించే పార్టీలు ఐక్యమై ఉద్యమాలు నిర్వహిస్తే పాలకుల ఆలోచనల్లో మార్పు, అనుకూల నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంటుంది.

## అక్రమ అరెస్టుపై ఖండన




**ప్రజాపక్షం/ ఖమ్మం :** వికారాబాద్ జిల్లా లగచర్లలో రైతులను పరామర్శించేందుకు వెళ్తున్న వామపక్ష నేతలను అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని టియుసిఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జి. రామయ్య, కె. శ్రీనివాస్ లు తెలిపారు. గురువారం ఖమ్మంలో వామపక్ష నేతల అరెస్టును నిరసిస్తూ నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా రామయ్య మాట్లాడుతూ ఫార్మాకంపెనీల కోసం రైతులపై నిర్బంధాన్ని ప్రయోగించి భూములు గుంజుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు ఒక మాట, ప్రతిపక్షంలో ఉన్నప్పుడు మరో మాట చెప్పిందని గిరిజనుల భూములు గుంజుకోవాలని ప్రయత్నిస్తే ప్రతిఘటన తప్పదన్నారు. లక్ష్మినారాయణ, బొమ్మకంటి రమేష్, శ్రీనివాస్, దాసు, రమేష్, తిరపయ్య పాల్గొన్నారు.

# వరి కొయ్యలను కాల్చొద్దు..కలియ దున్నాలి



**ప్రజాపక్షం/ఏన్కూరు:** వరి కోతలు కోసిన అనంతరం వరి కొయ్యలు కాల్చకుండా కలియదున్నాలని మండల వ్యవసాయశాఖ అధికారి నర్సింహారావు రైతులకు అవగాహన కల్పించారు. మండలంలోని అన్ని గ్రామాల్లో వరి కోత కోస్తున్న పొలాలను ఆయన సందర్శించి వరి కోత కోస్తున్న పొలాలను ఆయన సందర్శించి వరి కోత తరువాత వరి కొయ్యలను కాల్చడం వలన కలిగే నష్టాలను రైతులకు ఆయన వివరించారు. ఈస ందర్భంగా ఆయన రైతులతో మాట్లాడుతూ సూక్ష్మ పోషకాలకు వాతావరణం కాలుష్యం నేలలో కలియదున్నితే మేలని అన్నారు. గతంలో పశువులు ఎక్కువగా ఉండటంతో రైతులు వరి చేనులను కొడవళ్ళతో మొదళ్ళ వరకు కోసేవారని ప్రస్తుతం సాగు విధానంలో అనేక మార్పులు చోటు చేసుకున్నాయన్నారు. యంత్రాలను విడివిగా వినియోగం చేయడంతో పశువుల సంఖ్య గణనీయంగా తగ్గి పోయిందన్నారు. దీంతో హార్వెస్టర్ ద్వారా వరి కోతలు కోయడం ద్వారా కొయ్యలు మిగిలి పోతున్నాయని ఆయన అన్నారు. ఈ క్రమంలో పొలం దున్నే సమయంలో నాగళ్ళకు అడ్డుపడుతున్నాయని, రైతులు వరి కోయలను కాల్చి వేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈవోలు బాలకృష్ణ, శ్రీకాంత్, నవ్య, లహరి, అశో, భవ్య తదితరులు పాల్గొన్నారు.

## రేపు ఎఐబిఇ నమూనా పరీక్ష

**ప్రజాపక్షం/ఖమ్మంలీగల్ :** ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ (ఐఎల్) ఖమ్మం జిల్లా యూనిట్ ఆధ్వర్యంలో ఈనెల 23న ఆలిండియా బార్ ఎగ్జామ్ (ఏఐబిఈ) నమూనా పరీక్ష నిర్వహిస్తున్నట్లు ఐఏఎల్ ఖమ్మంజిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎస్‌కె లతీఫ్, ఓరుగంటి శేషగిరిరావు తెలిపారు. ఖమ్మం నగరంలోని మానేరు లా కళాశాలలో ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు పరీక్ష జరుగుతుందన్నారు. దీనికి ప్రిన్సిపల్‌గా రాష్ట్ర ఐఏఎల్ బాధ్యులు, సీనియర్ న్యాయవాది పెమ్మసాని పట్టాభి వ్యవహరిస్తారని లతీఫ్, శేషగిరి తెలిపారు. దీనిని ఎక్కువ మంది వినియోగించుకోవాలని వారు కోరారు. ప్రకటన విడుదల చేసిన వారిలో సీనియర్ న్యాయవాది పారుపల్లి అమర్‌చంద్ సహా పలువురు ఐఏఎల్ బాధ్యులు ఉన్నారు.

# అధికారుల అత్యుత్సాహానికి మూగజీవాలు బలి

### సెల్ టవర్ తొలగించాలంటూ వేడుకోలు

### సెల్ టవర్ నిర్మాణంలో మున్సిపల్ అధికారుల చేతివాటం నిజమేనా?

**ప్రజాపక్షం/సత్తుపల్లి :** కొందరు అధికారుల అత్యుత్సాహం నోరులేని జీవాలకు ప్రాణ సంకటంగా మారాయి. అమ్యామ్యాలకు అలవాటు పడిన అధికారులు ఒక ప్రదేశంలో ఏర్పాటు చేయాల్సిన సెల్ టవర్‌ను మరో ప్రదేశంలో ఏర్పాటు చేయటంతో ప్రజలు గగ్గోలు పెడుతున్నారు. సెల్ టవర్ నుండి వస్తున్న అధిక కేడియోషన్‌కి పక్షులు మృత్యువాత పడటంతో సెల్ టవర్ నిర్మాణం తొలగించాలని తెలిపిన అధికారుల స్పందించకపోవటంతో అధికారుల తీరుతో విసుగు చెందిన ప్రజలు స్థానిక ఎంఎల్ఏ దృష్టికి విషయాన్ని తీసుకెళ్ళారు. తక్షణమే స్పందించిన ఎంఎల్ఏ స్థానిక మున్సిపల్ అధికారులను మందలించటంతో హుటాహుటిన సెల్ టవర్‌ను తొలగించే ప్రయత్నం చేశారు. ఈ నేపద్యంలో సదరు సెల్ టవర్ ఏర్పాటు చేసిన ఇంటి యజమానికి మున్సిపల్ అధికారులకు ఘర్షణ జరిగింది. ఈ సందర్భంగా సదరు ఇంటి యజమాని భహిరంగంగానే మున్సిపల్ అధికారులపై విమర్శలు గుప్పించాడు. 6నెలల నుండి కనిపించని అడ్రస్ మార్పు ఇప్పుడెలా కనిపించిందటూ నిలదిశాడు. అప్పుడు సెల్ టవర్ కంపెని వారితో ఏమైనా మిలాఖత్ అయ్యారా అని నిలదిశాడు. మున్సిపాలిటీ కమిషనర్, టౌన్ ప్లానింగ్ అధికారులకు మొత్తం తెలుసునని అంతా వారి కనుసన్నలలోనే జరిగిందని భహిరంగంగానే విమర్శలు గుప్పించారు. తన వద్ద పూర్తి ఆదారాలు ఉన్నాయని త్వరలోనే ఈ విషయంపై జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తానని , మున్సిపాలిటి అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. 6 నెలల నుండి సెల్ టవర్ నిర్మాణం జరుగుతున్నా స్పందించని అధికారులు ఎం దుకు మౌనంగా ఉన్నారని, ఎవరెవరికి ఎంతెంత అమ్యామ్యాలు అందాయని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. అడ్రస్ మారిందని తెలిసి కూడా అధికారు లు మౌనంగా ఉండటానికి కారణం జేబులు నిండటమేనా అని , జేబులు నింపుకుంది ఎవరూ అనేది నిగ్గు తేల్చి సదరు అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు, పలు పార్టీల నాయకులు డిమాండ్ చేస్తున్నారు.







## సిఎం సహాయనిధి అందజేత



ప్రజాపక్షం/చంపాపేట : సిఎం సహాయనిధి పేద మధ్యతరగతి ప్రజలకు వరమని జిహెచ్ఎంసి కాంగ్రెస్ పార్టీ ఫ్లోర్ లీడర్ దరిపల్లి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. లింగోజిగూడకు చెందిన జావిడి మదన్‌కు మంజూరైన సిఎం సహాయనిధి చెక్కును గురువారం ఆయన అందజేశారు కార్యక్రమంలో పల్సం శ్రీధర్‌గౌడ్, యశ్వంత్ కుమార్, కందికంటి శ్రీధర్‌గౌడ్, కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

# మహానగరి

## డ్రైనేజీ సమస్య పరిష్కరిస్తాం



ప్రజాపక్షం/యాచారం : మండల పరిధిలోని నానక్‌నగర్ గ్రామంలో డ్రైనేజీ సమస్యలను పరిష్కరించడానికి కృషి చేస్తామని ఎంపిడిఓ శ్రీలత అన్నారు. గురువారం మండ ల పరిధిలోని నానక్‌నగర్ గ్రామాన్ని ఎఇ సూర్యవంశీ, గ్రామ ప్రత్యేకాధికారి సుభాష్, పంచాయతీ కార్యదర్శి రమ్యతో కలిసి పరిశీలించారు. ఈ సంధర్భంగా ఎంపిడిఓ మాట్లాడుతూ గ్రామంలోని మురికి నీటిని బయటకు పంపడానికి తగిన కార్యచరణను రూపొందిస్తున్నట్లు తెలిపారు.

## రైతు ఆర్థికంగా రాణించేందుకు కృషి

### చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య



ప్రజాపక్షం/షాబాద్ : రైతు ఆర్థికంగా రాణించేందుకు ప్రభుత్వం కృషి చేస్తున్నట్లు చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య అన్నారు. గురువారం షాబాద్ మండల పరిధిలోని సర్దార్‌నగర్ మార్కెట్‌లో యార్డ్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జిల్లా గ్రంథాలయ శాఖ చైర్మన్ మధుసుదన్‌రెడ్డి, జిల్లా డిసిఎంఎస్ చైర్మన్ పట్లోల కృష్ణా రెడ్డి, మార్కెట్ యార్డ్ అధికారిణి సుజాతతో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో చింపుల సత్యనారాయణరెడ్డి, వెంకట్ రెడ్డి, జంగయ్య, కావలి చంద్రశేఖర్, అశ్విణి, స్వరూప నర్సింలు పాల్గొన్నారు.

## కళాశాల నిర్మాణానికి దాతలు విరాళాలు ఇవ్వడం అభినందనీయం

### షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

ప్రజాపక్షం/షాద్‌నగర్ : జూనియర్ కళాశాల నిర్మాణానికి దాతలు విరాళాలు ఇవ్వడం అభినందనీయం అని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. గురువారం షాద్‌నగర్ ప్రాంతానికి చెందిన తుమ్మల నర్సింహ్మలు, అతని కుమారుడు వినయ్ కుమార్ యాదవ్ రూ.51 వేల నగదు విరాళంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌కు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శంకర్ మాట్లాడుతూ షాద్‌నగర్‌లో విద్యార్థులకు విద్యాలయం ఏర్పాటుకు ప్రభుత్వంతో పాటు దాతల సహకారం సంతోషంగా ఉందన్నారు. ప్రతి ఒక్కరూ ఇలాంటి సేవ కార్యక్రమాలు చేయాలని తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ప్రతాప్ రెడ్డి, మాజీ జడ్పిటిసి మామిడి శాంసుందర్ రెడ్డి, పార్టీ నాయకులు తదితరులు ఉన్నారు.

## శానిటేషన్ స్పెషల్ డ్రైవ్ ప్రారంభం



ప్రజాపక్షం/రాజేంద్ర నగర్ : బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో శానిటేషన్ పనులు గురువారం ప్రారంభమైయ్యారు. పనులను కమిషనర్ బి.శరత్‌చంద్ర పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ శానిటేషన్ స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా ప్రభుత్వ పాఠశాలలు, హాస్టళ్లు, హాస్పటల్స్ పరిసరాల పరిశుభ్రత కార్యక్రమాలు జరుగుతున్నాయన్నారు. కార్యక్రమంలో ఎఇ రాజ్‌కుమార్, వార్డు ఆఫీసర్లు పాల్గొన్నారు

## పర్యావరణ పరిరక్షణ పేరుతో నిధుల దుర్వినియోగం



ప్రజాపక్షం/నార్సింగి: మణికొండ మున్సిపాలిటీలో పర్యావరణ పరిరక్షణ పేరుతో నిధుల దుర్వినియోగం జరిగిందని బిఆర్ఎస్ మణికొండ అధ్యక్షుడు సీతారాం దూళిపాళ్ల పేర్కొన్నారు. గురువారం బిఆర్ఎస్ నాయకులు చంద్రకాంత్ గౌడ్, మాల్యాద్రి నాయుడు, అందె లక్ష్మణ్ రావుల ఆధ్వర్యంలో మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని డివైడర్లపై నాటిన మొక్కలను పరిశీలించారు. అనంతరం మణికొండ మున్సిపల్ కమిషనర్ ప్రదీప్ కుమార్‌ను కలిసి నాటిక మొక్కలకు నీళ్లు పోసి పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ నవీన్ కుమార్, ముత్తగి లక్ష్మయ్య, ఉపేందర్నాథ్ రెడ్డి, యాలల కిరణ్, షేక్ ఆరీఫ్, జైరాం, బోడ్డు శ్రీధర్, భాను తదితరులు పాల్గొన్నారు.

## దేవాలయం నిర్మాణానికి సహకారం



ప్రజాపక్షం/యాచారం : మండల పరిధిలోని మేడిపల్లి నక్కర్త గ్రామ పంచాయతీలోని నక్కర్త యాదవ సంఘం మల్లన్న దేవాలయం నిర్మాణానికి సహకారం అందిస్తానని అదిబట్ల మున్సిపల్ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మర్రి నిరంజన్‌రెడ్డి అన్నారు. గురువారం నక్కర్త యాదవ సంఘం నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు మర్రి నిరంజన్‌రెడ్డిని అయన స్వగృహంలో కలిశారు. కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి ముంత జంగయ్య, కాంగ్రెస్ నాయకులు ముచ్చర్ల సంపత్, యాదవ సంఘం నాయకులు వంగూరి జంగయ్య, శివ మోడి, బేత జంగయ్య, జమ్మగుండాలు, పోలమోని సురేశ్ యాదవ్, దశ్ యాదవ్, యాదవ సంఘం నాయకులు తదితరులు పాల్గోన్నారు.

## ఎర్రకుంట చెరువు అభివృద్ధి చేస్తాం



ప్రజాపక్షం/రాజేంద్ర నగర్ : బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 16వ డివిజన్ ఎర్రకుంట చెరువును అభివృద్ధి చేస్తామని డిప్యూటీ మేయర్ పూలపల్లి రాజేందర్‌రెడ్డి, స్థానిక కార్పొరేటర్ షాపురం పుష్పా శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. గురువారం చెరువు వద్ద ప్రారంభమైన కాంక్రీట్ బెడ్ పనులను పరిశీలించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ గత ఏడాది కాలంగా ఎర్రకుంట చెరువులో మట్టి, వ్యర్థ పదార్థాలు, చెత్తను తొలగించి చెరువు నిండేలా చేసి చెరువు చుట్టు ఫెన్సింగ్ ఏర్పాటు చేయటం జరిగిందన్నారు. 15 రోజుల్లో వాకింగ్ ట్రాక్ పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు టీంకురెడ్డి, కాలనీవాసులు పాల్గొన్నారు.

## భావితరాలకు మనసంప్రదాయాలు

### మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యానాయుడు

### శిల్పారామంలో ఘనంగా 'లోక్ మంథన్'



ప్రజాపక్షం/హైదరాబాద్ : శిల్పారామంలో నాలుగు రోజుల పాటు నిర్వహించనున్న లోక్ మంథన్ కార్యక్రమం గురువారం ఘనంగా ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌ను మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యానాయుడు ప్రారంభించారు. కార్యక్రమంలో కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి, తెలంగాణ రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వెంకయ్యానాయుడు మాట్లాడుతూ భారతదేశ భిన్నత్వంలో ఏకత్వాన్ని మరింత బలోపేతం చేయడం, భారతీయ కళలు, సంస్కృతిని పెంపొందించడానికి భావిభారత నిర్మాణాన్ని స్థాపించడంలో యావత్ జాతికి తమ సేవలను అందించడమే కాకుండా మన సాంప్రదాయాల గొప్పతనాన్ని భావితరాలకు అందిస్తూ .. సాంస్కృతిక దిగ్గజాలను గౌరవించడంలో లోక మంథన్ విశిష్టమైన సేవలను అందిస్తుడటం గొప్ప విషయమని అన్నారు. లోకమంథన్ మనందరి ఆలోచనలు, మనందరి భవిష్యత్తు, మన సంస్కృతి, సంప్రదాయాలు, మన విధానాలు, మన జీవన విధానం, తదితర అంశాలపై చర్చించాలనేది ఓ గొప్ప ఆలోచన అన్నారు. మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ ప్రతి రెండేళ్లకోసారి జరిగే లోక మంథన్ కార్యక్రమానికి దక్షిణ భారతదేశంలోనే మొదటిసారి హైదరాబాద్ శిల్పారామం వేదిక కావడం, ఈ కార్యక్రమంలో తెలంగాణ సాంస్కృతిక శాఖ భాగస్వామ్యం కావడం చాలా సంతోషంగా ఉందన్నారు. మన సాంసృతిక ఏకత్వాన్ని చాటిచెప్పేందుకు కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు వివిధ వృత్తులు, రంగాలకు చెందిన కళాకారుల సాదర స్వాగతం పలుకుతున్నానన్నారు. భారతీయ శాస్త్రీయ కళారూపాలను ప్రజలకు తెలియజేప్పలా కృషి చేస్తున్నందుకు లోక మంథన్ నిర్వహకులను అభినందించారు. గిరిజన వర్గాన్ని విద్య, వైద్య, ఆర్థిక, సామాజిక పరంగా అభివృద్ధి చేయడం, వారి కళలను, సంప్రదాయాన్ని ప్రోత్సహించడం, ప్రపంచం ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారం అందించడం లక్ష్యంగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమం విజయవంతం కావాలని ఆకాంక్షిస్తున్ననని యన పేర్కొన్నారు.

## 24న ఇరిసెట్ 67వ వార్షికోత్సవం

### ఘనంగా నిర్వహించేందుకు అధికారుల ఏర్పాట్లు

ప్రజాపక్షం/హైదరాబాద్ : సికింద్రాబాద్ తార్నాకలో ఉన్న ఇండియన్ రైల్వేస్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సిగ్నల్ ఇంజనీరింగ్ అండ్ టెలికమ్యూనికేషన్స్(ఇరిసెట్) రైల్వే సిగ్నలింగ్ అండ్ టెలికమ్యూనికేషన్ రంగాలలో శిక్షణ ఇవ్వడంలో ప్రత్యేకత కలిగి ఉంది. భారతీయ రైల్వేలోని ఎనిమిది కేంద్రీకృత శిక్షణా సంస్థలలో ఒకటిగా ఉన్న ఇరిసెట్ సంస్థ 24 నవంబర్ 2024 నాటికి 67 సంవత్సరాలను పూర్తి చేసుకోనున్న క్రమంలో ఇనిస్టిట్యూట్ వార్షిక దినోత్సవం ఈనెల 24న ఘనంగా నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ వార్షిక దినోత్సవ కార్యక్రమంలో బాగంగా ప్రముఖ వ్యక్తుల నుండి సందేశం, ఇనిస్టిట్యూట్ నిర్వహణలోనున్న ఉన్నత వ్యక్తుల ప్రసంగాలతోపాటు ప్రతిభావంతులైన ట్రైనీలకు అవార్డుల పంపిణీ చేయడంతో పాటు టెక్నికల్ మ్యాగజైన్ విడుదల చేయనున్నారు. కార్యక్రమానికి హాజరయ్యే వారిలో ఇన్‌స్టిట్యూట్ కు చెందిన అధ్యాపకులు, సిబ్బంది, ట్రైనీలు, రైల్వే మంత్రిత్వ శాఖ నుండి ప్రముఖులు పరిశ్రమ జోనల్ రైల్వేల నుండి ప్రతినిధులు పాల్గొననున్నారు.




## ఎల్‌బి నగర్ నియోజకవర్గ అభివృద్ధికి సహకారం అందిస్తా

### టిపిసిసి ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీ గౌడ్

ప్రజాపక్షం/ఎల్‌బి నగర్ : ఎల్‌బి నగర్ నియోజకవర్గ పరిధిలోని డివిజన్ కాలనీలలో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ప్రభుత్వంతో మాట్లాడి నిధుల సాధనకు సహకరిస్తానని టిపిసిసి ప్రచార కమిటీ చైర్మన్, మాజీ ఎంపీ మధుయాష్కీ గౌడ్ పేర్కొన్నారు. బుధవారం రాత్రి వనస్థలిపురం డివిజన్ కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో వివిధ కాలనీ సంక్షేమ సంఘాలు, సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ ప్రతినిధులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మధుయాష్కీ గౌడ్ పాల్గొన్నారు. ఈ మేరకు ఆయా కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు తమ సమస్యలను వివరించారు. కొత్త డ్రైనేజీ వ్యవస్థతో పాటు, పాడైపోయిన పాత వాటి స్థానంలో తిరిగి కొత్తగా డ్రైనేజీ వ్యవస్థలు నిర్మించాలని కోరారు. రోడ్లు, కమ్యూనిటీ హాల్లో నిర్మాణాలు చేపట్టాలని పేర్కొన్నారు. సీనియర్ సిటిజన్స్ కూడా తమ సమస్యలను విన్నవించారు. కార్యక్రమంలో వనస్థలిపురం డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కుట్ల నర్సింహా యాదవ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు నేల పాటి రామారావు, పాశం అశోక్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



## పోలీసు ఉద్యోగం పవిత్రమైనది..



### హైదరాబాద్ సిపి సివి ఆనంద్

ప్రజాపక్షం/హైదరాబాద్ : పోలీస్ ఉద్యోగం ఒక పవిత్రమైన ఉద్యోగం అని, పోలీసు ఏ ఒక్క రోజు పనిచేయకున్న సమాజం నడవదు అని హైదరాబాద్ పోలీసు కమిషనర్ సివి ఆనంద్ తెలిపారు. గురువారం పేట్లబురుజులోని సిఎఆర్ మైదానంలో జరిగిన స్టైపెండరీ క్యాడెట్ ట్రైనీ పోలీసు కానిస్టేబుల్స్ 'దీక్షాంత్ పరేడ్'కు సివి ఆనంద్ ముఖ్యఅతిధిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిస్వార్థంగా నిజాయితీతో సేవ చేసినప్పుడే పోలీసుల పట్ల ప్రజలకు నమ్మకం పెరుగుతుందన్నారు. శిక్షణార్థులు సాంకేతికతను మెరుగుపరచుకుని చట్టాలపై అవగాహన పెంచుకుంటూ మానసికంగా, శారీరకంగా సన్నద్ధం కావాలన్నారు. ఉద్యోగంలో క్రమశిక్షణతో పాటు ప్రజలను హక్కులను కాపాడుతూ వారి పట్ల మర్యాదగా వ్యహరించాలన్నారు. పోలీస్‌స్టేషన్‌కు వచ్చే బాధితులు, మహిళలు, పిల్లలు, వృద్దుల పట్ల నిస్వార్థంగా వ్యవహరించాలన్నారు. ప్రతిచర్య పోలీసుశాఖ గౌరవ ప్రతిష్టలు పెంచేలా ఉండాలని, వృత్తిపరంగా ఇతరులకు ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు. శిక్షణ పూర్తి చేసుకున్న కానిస్టేబుళ్లు ప్రజలకు మెరుగైన సేవలు అందించి మంచి పేరు తెచ్చుకోవాలన్నారు. పోలీస్ ఉద్యోగంలో అనేక సవాళ్లు ఎదురవుతాయని, వాటిని ఎదుర్కొని పరిష్కరించేందుకు ఎల్లప్పుడు సిద్ధంగా ఉండాలన్నారు. ప్రజలకు సేవ చేసేందుకు పోలీస్‌శాఖలో ఉద్యోగం సాధించడం గొప్ప అవకాశంగా భావించాలన్నారు. విధి నిర్వహణలో వత్తిడితో చెడు అలవాట్లు నేర్చుకుంటారు, వాటికి దూరంగా ఉండాలని తెలిపారు. జీత భత్యాలననుసరించి మన స్థాయిని బట్టి డబ్బుల విషయములో సర్థుకుపోవాలి కాని పోలీసులు ఎలాంటి అవినీతికి పాల్పడకూడదన్నారు. దీక్షాంత్ పరేడ్‌లో వివిధ జిల్లాలకు చెందిన 747 మంది కానిస్టేబుల్ అభ్యర్థులు పాల్గొన్నారు. కార్యక్రమంలో సిఎఆర్ డిసిపి రక్షిత కృష్ణమూర్తి, అదనపు డిసిపిలు మద్దిపాటి శ్రీనివాసరావు, ఆనంద్‌లతో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.

## వాడవాడలా శతజయంతి ఉత్సవాలు

### సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రవీంద్రచారి పిలుపు



ప్రజాపక్షం/సరూర్ నగర్ : సిపిఐ వంద సంవత్సరాల శతజయంతి ఉత్సవాలను ఎల్బీనగర్ నియోజకవర్గంలో వాడవాడలా ఘనంగా జరపాలని పార్టీ శ్రేణులకు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అందోజు రవీంద్రచారి పిలుపునిచ్చారు. గురువారం సిపిఐ ఎల్బీనగర్ నియోజకవర్గం జనరల్ బాడీ సమావేశంలో రవీంద్రచారి మాట్లాడుతూ ఈనెల 26 న కొత్తపేటలోని బాబు జగ్జీవన్‌రావు హాల్లో జరుగు నియోజకవర్గ జనరల్ బాడీ సమావేశాన్ని జయప్రదం చేయాలని కోరారు. దేశంలో 100 సంవత్సరాలు చరిత్ర కలిగిన పార్టీ ఏదైనా ఉందంటే అది భారత కమ్యూనిస్ట్ పార్టీ మాత్రమేనన్నారు. బలహీన వర్గాల కోసం, రైతులు, కార్మికుల సమస్యలపై, నిత్యవసర వస్తువుల ధరలు పెరుగుదలపై ఎప్పటికప్పుడు ప్రభుత్వాన్ని, ఎండగడుతూ ప్రజా సమస్యలను తీర్చడంలో సిపిఐ ముందున్నదన్నారు. విద్యార్థి ఉద్యోగ, మహిళా సమస్యల పైన పోరాటాలు చేసిన చరిత్ర భారత కమ్యూనిస్టు పార్టీది అన్నారు. లౌకిక ప్రజాస్వామ్యాన్ని కాపాడుకుంటూ ప్రజలను మతోన్మాదం వైపు వెళ్లకుండా జాగ్రత్తపరిచి సంపూర్ణ స్వాతంత్రం కోసం దేశ స్వాతంత్రం పోరాటంలోనే నినదించినటువంటి పార్టీగా లౌకిక ప్రజాస్వామ్యాన్ని కాపాడడానికి, కాపాడడంతో పాటు ఎర్రకోటపై ఎర్రజెండా ఎగరవేసే దిశగా పార్టీని గ్రామస్థాయి నుంచి బలోపేతం చేస్తూ వంద సంవత్సరాల చరిత్రను ప్రజలకు తెలియజేస్తూ ఉద్యమ కార్యచరణ రూపొందించుకొని భవిష్యత్ పోరాటాలకు సిద్ధం కావాలని పార్టీ శ్రేణులు పిలుపునిచ్చారు. సమావేశంలో ఎల్బీనగర్ నియోజకవర్గం కన్వీనర్ సామిడి శేఖర్ రెడ్డి, రంగారెడ్డి జిల్లా ఎన్ఎఫ్ఐడబ్ల్యూ కార్యదర్శి పైమీద, సరూర్‌నగర్ మండలం కార్యదర్శి బాతరాజు నరసింహ్మా, హయత్ నగర్ మండల సమితి కార్యదర్శి శేషరాజు పల్లి శ్రీదేవి, మండల సహాయ కార్యదర్శులు శోభన్, రాములు గౌడ్, కందుల సుధాకర్, మండల శాఖ కార్యదర్శులు, గోల్కొండ, నాగరాజు సౌజన్య, రాంపాక సౌజన్య మండల, కార్యవర్గ సభ్యులు, జయంత్ తదితరులు పాల్గొన్నారు.

## ఏకమైతేనే చట్టసభల్లో రిజర్వేషన్లు

### ఆర్.కృష్ణయ్య

ప్రజాపక్షం/సరూర్ నగర్ : బిసి భవనంలో బిసి సంఘం జాతీయ అధ్యక్షులు ఆర్.కృష్ణయ్య ఆధ్వర్యంలో బిసి సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం జన్మదిన వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ బిసి నాయకులంతా ఏకమై చట్ట సభలలో 50 శాతం రిజర్వేషన్లు సాధించాలని పిలుపునిచ్చారు. బిసిలు రాజకీయంగా బలపడినప్పుడే అనుకున్న రిజర్వేషన్లు పొందుతాం అన్నారు. అనంతరం గుజ్జ సత్యం జన్మదినం సందర్భంగా ప్రముఖ గాయకులు రూపొందించిన ఆల్బం విడుదల చేశారు. బిసి సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, గౌరిగ మల్లేష్, వేముల రామకృష్ణ, అంజి, పగిల సతీష్, పృధ్వి, సురేష్, సూర్యనారాయణ, ఆర్య, నరేందర్, ఉదయ్, నిఖిల్ తదితరులు పాల్గొన్నారు.



## బిసిలు ఎంతమందో తెలిస్తే అవకాశాలకు ఆస్కారం

### రాష్ట్ర బిసి కమిషన్ చైర్మన్ నిరంజన్

ప్రజాపక్షం/రంగారెడ్డి ప్రతినిధి: సమాజంలో వెనకబడిన బలహీనవర్గాల ప్రజలు ఎంతమంది ఉన్నారో తెలిస్తే వారికి అవకాశాలు కల్పించేందుకు ఆస్కారం ఉంటుందని రాష్ట్ర బిసి కమిషన్ చైర్మన్ గోపిశెట్టి నిరంజన్ అన్నారు. గురువారం ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో వెనుకబడిన తరగతుల సామాజిక,ఆర్థిక, విద్యాపరమైన స్థితిగతులు, వెనుకబాటుతనం, వారికి కల్పించాల్సిన అవకాశాలు తదితర అంశాలపై అధ్యయనం నిమిత్తం రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ కార్యాలయ సముదాయ భవనంలోని సమావేశ మందిరంలో బిసి కమిషన్ బహిరంగ విచారణ చేపట్టింది. ఇందులో భాగంగా వివిధ కుల సంఘాలు, వ్యక్తులు, సంస్థలతో విజ్ఞాపనాలను స్వీకరించిన అనంతరం బిసి కమిషన్ చైర్మన్ నిరంజన్ మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ రాష్ట్రంలో వెనుకబడిన తరగతుల పరిస్థితులను తెలుసుకొని వారి హక్కుల రక్షణ కోసం కృషి చేసేందుకు రాష్ట్ర బిసి కమిషన్ బహిరంగ విచారణలు నిర్వహిస్తున్నదని, ఇప్పటివరకు 7 విచారణలు పూర్తి చేయగా, ఇది 8వదన్నారు. ఈ నెల 26 వరకు కమిషన్ బహిరంగ విచారణలు ఆయా జిల్లాల్లో కొనసాగుతాయని చెప్పారు. హక్కుల పరిరక్షణకు బిసి కమిషన్ పనిచేస్తుందన్నారు. రాష్ట్రంలో నిర్వహిస్తున్న సమగ్ర కుల సర్వే చారిత్రాత్మక నిర్ణయం అని, దీనివల్ల రాష్ట్ర జనాభాలో బిసిలు ఎంతమంది ఉన్నారో తెలుస్తుందన్నారు. గురువారం నిర్వహించిన బహిరంగ విచారణ సందర్భంగా పలు బిసి సంఘాలు వినతిపత్రాలు అందజేశారు. ఈ బహిరంగ చర్చలో 72 పిటిషన్లు అందాయని నిరంజన్ తెలిపారు. రెండు సంవత్సరాల తొమ్మిది నెలల కాల పరిమితిలో బిసి కమిషన్ బిసిలకు న్యాయం చేసేందుకు కృషి చేస్తుందని ఆయన తెలిపారు. కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమసింగ్, బిసి కమిషన్ సభ్యులు రాపోలు జయప్రకాష్, తిరుమలగిరి సురేందర్, బాలలక్ష్మీ, మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా అదనపు కలెక్టర్,డిఆర్ డిఓ శ్రీలత,రంగారెడ్డి మేడ్చల్ మల్కాజ్గిరి, వికారాబాద్ జిల్లాల జిల్లా బిసి సంక్షేమ శాఖ తోపాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.




### స్థానిక సంస్థల్లో బిసిల రిజర్వేషన్లు పెంచాలి

#### రంగారెడ్డి బిసి హక్కుల సాధన సమితి

స్థానిక సంస్థల్లో బిసిల రిజర్వేషన్లు పెంచాలని రంగారెడ్డి బిసి హక్కుల సాధన సమితి ఆధ్వర్యంలో బిసి కమిషన్ చైర్మన్ గోపిశెట్టి నిరంజన్‌కు గురువారం వినతిపత్రం అందజేశారు. బిసి హక్కుల సాధన సమితి రంగారెడ్డి జిల్లా ప్రధానకార్యదర్శి పల్నాటి యాదయ్య మాట్లాడుతూ ఇడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు రద్దు చేయాలని, ఐదు శాతం జనాభాలేని వారికి 10 శాతం రిజర్వేషన్లు కల్పించడం వలన బిసిలకు నష్టం కలుగుతున్నదని తెలిపారు. కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు కేతరాజు నర్సింహ్మా, ప్రధానకార్యదర్శి పల్నాటి యాదయ్య, నాయకులు మరబోయిన నరేందర్, సదానందం గౌడ్, గడ్డమీది నర్సింహా, ఆయిల యాదయ్యగౌడ్, ఆనంద్ గౌడ్, విజయానందం గౌడ్, పన్నడి శ్రీను, గోదెల రామకృష్ణగౌడ్ తదితరులు పాల్గొన్నారు.



## నృత్య ప్రదర్శన చేసిన విద్యార్థులకు అభినందనలు

ప్రజాపక్షం/నాగారం: అయోధ్యలోని రామాలయంలో బాలరాముని ప్రాంగ ణంలో మేడ్చల్ జిల్లా నాగారం మున్సిపాలిటీ సెరినిటీ పాఠశాల విద్యార్థులైన చిరంజీవులు బి.సాయి అనుభవి, సాయి వైభవి, జాహ్నవిలు భారత్ ఆర్ట్స్ అకాడమీ నేతృత్వంలో సంగీత నృత్య ప్రదర్శన చేయ దం పూర్వజన్మ సుకృతమని స్కూల్ కరస్పాండెంట్ నోముల జంగిరెడ్డి అన్నారు. బహుమతులు పొందడం గర్వకారణమని ముఖ్య కార్యదర్శి నోముల వసంత అన్నారు. వాని వారు అభినందించారు.



# మహానగరి

## రూ.20లక్షలతో సిసి రోడ్డు పనులు

ప్రజాపక్షం/నాగారం: మున్సిపా లిటీని ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానని మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి అన్నారు.గురు వారం నాగారం మున్సిపాలిటీ పరిధిలోని16వ వార్డు రాజ్‌సుఖ్ నగర్ కాలనీలో మున్సిపల్ సాధారణ నిధు లు రూ.20 లక్షలతో సిసి రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. మౌలిక వస తుల కల్పనకు పాటుపడుతూ అన్ని వార్డులను అభివృద్ధి చేస్తానని అన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ మల్లేష్ యాదవ్, కాలనీవాసులు, పాల్గొన్నారు.



## 24న ఉద్యమకారుల ఆత్మీయ సమ్మేళనం

ప్రజాపక్షం/అల్వాల్ : తెలంగాణ రాష్ట్ర సాధన కోసం అలుపెరగని పోరా టంచేసిన తెలంగాణ ఉద్యమకారుల ఫోరం మల్కాజిగిరి నియోజకవర్గం ఆత్మీయ సమ్మేళనం ఈనెల 24న సంజీవరెడ్డి గార్డెన్ మచ్చ బొల్లారం డివిజన్ లో జరుగు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర అధ్యక్షులు చీమ శ్రీనివాస్ ప్రధాన కార్యదర్శి పట్లోళ్ల సురేందర్ రెడ్డి హాజరు కాను న్నారని మల్కాజిగిరి నియోజకవర్గం అధ్యక్షులు పుట్నాల కృష్ణ వెల్లడించారు. ఈ సందర్భంగా తెలంగాణ ఉద్యమకారుల ఆశయాలను ప్రభుత్వం నెరవే ర్చాలని ఈ ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేసుకోవడం జరుగుతుంది. ఉదయం 9 గంటల నుంచి బోనాలు బతుకమ్మ వేడుకలు ఊరేగింపుగా ఉంటాయని, అనంతరం మల్కాజ్గిరి నియోజకవర్గం పార్టీలకు అతీతంగా ఉద్యమకారులకు సన్మాన కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని కోరారు. ఈ కార్యక్రమంలో ఉద్యమకారులు శోభన్ బాబు, సంతోష్, డోలి సుదీర్, వెంకటేష్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.





## టిపిఒ వీరస్వామికి ఆత్మీయ వీడ్కోలు

ప్రజాపక్షం/బోడుప్పల్ : బోడుప్పల్ మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారి వీర స్వామి బదిలీ కావడంతో గురువారం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం లో ఆత్మీయ వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేశారు. బదిలీపై వెళ్తున్న టిపిఓను మున్సిపల్ కమిషనర్ రామలింగం శాలువాతో సత్కరించి మెమోంటో అందజే శారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ టిపిఒ సిబ్బంది సహకారం తో అత్యంత బాధ్యాతయుతమైన విధులను నిర్వర్తిస్తూ, అత్యుత్తమ సేవలు అందించారని కొనియాడారు. అనంతరం టీపీఓ వీరస్వామి మాట్లాడుతూ గత రెండు సంవత్సరాలలో బోడుప్పల్‌లో పనిచేయడం చాలా సంతోషంగా ఉందని, ప్రజాప్రతినిధులు, ప్రజల సహకారం మరువలేనిదన్నారు. కమిష నర్, సిబ్బంది అందించిన సహకారానికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ వెంకట్ నాగేంద్ర,ఆర్ఓ విజయేందర్ రెడ్డి, శానిటరీ ఇన్స్పెక్టర్లు ఎస్.ఎన్.రెడ్డి, కమలాకర్, టౌన్ ప్లానింగ్ సిబ్బంది బూడిద రాజు గౌడ్, మధు, నరేష్ యాదవ్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## చర్లపల్లి కేంద్ర కారాగారంలో 'రిట్రీట్'

ప్రజాపక్షం/చర్లపల్లి: చర్లపల్లి కేంద్ర కారాగారంలో రిట్రీట్(పునశ్చరణ)కార్య క్రమం గురువారం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జైళ్ల శాఖ ఐజి ఎన్ మురళిబాబు, హైదరాబాద్ ఉ ప ప్రాంత అధికారి డాక్టర్ డి శ్రీనివాస్ విచ్చేసి కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడుతూ రానున్న సంవత్సరంలో జైళ్ల శాఖ అభివృద్ధి గూర్చి సిబ్బంది ని ఆరు గ్రూపులుగా విభజించి వారి సూచనలు తీసుకుని రాష్ట్ర స్థాయిలో ఉన్నత అధికారులతో చర్చించి నిర్ణయాలు తీసుకుంటామని, గత సంవత్సర కాలంలో జైళ్ల శాఖలో చాలా అభివృద్ధి చెందిందని కొనియాడారు. ముఖ్య అతిథులుగా విచ్చేసిన మేడ్చల్ జిల్లా డైరెక్టర్ ఆఫ్ మెడికల్ అండ్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ రఘునాథస్వామి మాట్లాడుతూ తెలంగాణ జైళ్ల శాఖ చేస్తున్న సంస్కరణలు, ఖైదీల సంక్షేమం, వసతులు బాగున్నాయని అన్నారు. ఈ కార్య క్రమంలో వ్యవసాయక్షేత్రం, కేంద్ర కారాగారం పర్యవేక్షణాధికారులు జి. సమ్మయ్య,జి రామచంద్రం, డిప్యూటీ పర్యవేక్షణాధికారులు, జైలర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.




## శామీర్‌పేట పోలీస్‌స్టేషన్‌ను సందర్శించిన డిజిపి

ప్రజాపక్షం/శామీర్‌పేట : తెలంగాణ రాష్ట్ర డిజిపి జితేందర్ ఐపిఎస్ శామీర్ పేట పోలీస్‌స్టేషన్‌ను ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా శామీర్ పేట ఇన్స్‌పెక్టర్ శ్రీనాథ్ డిజిపి జితేందర్‌కు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం పోలీస్‌స్టేషన్‌లో కేసుల దర్యాప్తు వివరాలు, పరిష్కార మార్గాలను అడిగి తెలుసుకున్నారు. అలాగే స్టేషన్‌లో పచ్చదనంతో నిండిపోయిన చెట్లను చూసి ఇన్స్‌పెక్టర్ శ్రీనాథ్‌ను, సిబ్బం దిని అభినందించారు. అనంతరం ఇన్స్‌పెక్టర్ శ్రీనాథ్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర డిజిపి పోలీస్‌స్టేషన్‌ను సందర్శించడం సంతోషంగా ఉందని అన్నారు. డిజిపి వెంట మేడ్చల్ డిసిపి కోటిరెడ్డి, పేట్‌బ షీరాబాద్ ఎసిపి రాములు, డిఐ గంగాధర్, ట్రాఫిక్ ఎసిపి వెంకట్‌రెడ్డి, ట్రాఫిక్ ఇన్స్‌పెక్టర్ హనుమాన్‌గౌడ్, ఎస్ఐ లు, సిబ్బంది పాల్గొన్నారు.






## నాలా పనుల్లో నిర్లక్ష్యం- స్థానికుల బైఠాయింపు

ప్రజాపక్షం/మల్కాజిగిరి : మల్కాజిగిరి డివిజన్ బాలసరస్వతినగర్‌లో వరద నీటి నివారణకు నాలా పనుల ప్రతిపాదనల విషయంలో జిహెచ్ఎంసి మల్కా జిగిరి సర్కిల్ కార్యాలయం ఎదుట స్థానికులతో కల్సి స్థానిక కార్పొరేటర్ శ్రవణ్ బైఠాయించి నిరసన వ్యక్తం చేసారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ నాలా పనుల కోసం తాను గత ఏడాది జిహెచ్ఎంసి ప్రధాన కార్యాలయంలోని ల్యాండ్ అక్విజేషన్ విభాగ అధికారిని సంప్రదించి ప్రతి పాదనలను తయారు చేయించానని, ఆ తర్వాత ఈ పనులు ప్రారంభించే తదుపరి చర్యల నిమిత్తం పూనుకోవాల్సిన మల్కాజిగిరి సర్కిల్ డిప్యూటి కమి షనర్ రాజు నిర్లక్ష్యగా సంబంధించిన ఫైలును తన వద్దే పెట్టుకొని ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. సుమతి, లక్ష్మి, గీతా, సుబ్బారావు, రమేష్, మహేష్, నవీన్, మోహన్‌లాల్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## ఏడాది వేడుకల్లో పాటలతో కళాయాత్ర

ప్రజాపక్షం/మేడ్చల్ ప్రతినిధి : తెలంగాణా రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటై ఏడాది పూర్తైన సందర్భంగా జిల్లాలో కొనసాగునతున్న ప్రజా పాలనప్రజా విజయో త్సవాల్లో భాగంగా గురువారం కళాయాత్ర జరిగింది. తెలంగాణా సాంస్కృ తిక సారథి కళాకారుల బృందాలు తిమ్మాయిపల్లి, యాద్గార్‌పల్లి, ధర్మారం ప్రాంతాల్లో ప్రభుత్వ సంక్షేమ పథకాలపై పాటలతో ప్రచారం చేసారు. కార్యక్రమంలో పంచాయతి సెక్రటరీలు,బిల్ కలెక్టర్లు, తదితరులు పాల్గొన్నారు.

## వెక్కిరిస్తున్న పదేళ్లనాటి ఆర్‌యుబి నిర్మాణ శిలాఫలకం

* ప్రత్యామ్నాయం లేక నిలిచిపోతున్న వందలకొద్దీ వాహనాలు
* అంబులెన్స్, అగ్నిమాపక దళ వాహనాలకూ ఇదే పరిస్థితి






ప్రజాపక్షం/మల్కాజిగిరి : గత టిఆర్‌ఎస్ ప్రభుత్వం పదేళ్ల క్రితం రూ.32.02 కోట్ల వ్యయంతో అండర్ రైల్వే బ్రిడ్జి (ఆర్‌యుబి) నిర్మిస్తామంటూ శంకుస్థాపన చేసిన శిలాఫలకం నేటికీ ఒక్క అడుగైనా ముందుకు కదలక వెక్కి రిస్తోంది. నేరేడ్‌మెట్ చౌరాస్తా నుండి మల్కాజిగిరి వెళ్లే మార్గంలోని ప్రధాన రహదారిపై ఉన్న వాజ్‌పేయినగర రైల్వేగేట్ వద్ద ఇప్పటికీ ఆర్‌యుబి నిర్మాణం పూర్తి కాకపోవటంతో ఈ మార్గంలో వెళ్లే వాహనదారులకు శాపంగా మారింది. సమీప ప్రాంతవాసులు ప్రస్తుత ఎంపి, ఎమ్మెల్యేలు కనిపించినప్పుడల్లా ఆర్‌యుబి నిర్మాణం చేప ట్టాలని వినతిపత్రాలివ్వటం, హామీలు పొందటం నిత్యకృ త్యంగా మారింది. అప్పటి ప్రభుత్వం శిలాఫలకాలు వేయ టానికే పరిమితమై నిధులు కేటాయించ పోవటం, నిర్మాణ దిశగా ముందుకు వెళ్లకపోవటం దీనికి కారణమవుతోంది.

**ప్రత్యామ్నాయ మార్గంలేక అవస్థలు, అంబులెన్సులు సైతం**

నిత్యం రేయింబవళ్లు వందలాది వాహనాలు కుషాయి గూడ, ఈసిఐఎల్, వాయుపురి తదితర శివారు ప్రాంతాల నుండి సఫిల్‌గూడ, మల్కాజిగిరిల మీదుగా సికింద్రాబాద్ వైపు వెళ్లేందుకు ప్రధాన మార్గంలోని వాజ్‌పేయినగర్ రైల్వే లైన్ గేట్ పడిందంటే పది నిమిషాలకు పైగా రాక పోకలు నిలిచిపోయి అవస్థలకు గురవుతున్నారు. ఇలాం టి సందర్భాల్లో రెండు వైపులా కనీసం వందకు పైగా అర కిలో మీటరు వరకు ఆగి గేట్ ఎప్పుడు తెరుస్తారా అని వేచి చూడాల్సిందే. అత్యవసర పరిస్థితుల్లో ఆస్పత్రులకు, వెళ్లా ల్సి వచ్చే అంబులెన్స్, అగ్ని మాపక దళవాహనాలైనా ఈ పరిస్థితుల్లో ముందుకు కదలలేక సమయానికి చేరుకోలేక ఇబ్బందులకు గురైన సందర్భాలు తరచు చోటు చేసుకొం టున్నాయి. 2014 డిసెంబరు 3న కెసిఆర్ ముఖ్యమంత్రి గా ఉన్న టిఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో అప్పటి రాష్ట్ర ఇరిగేషన్ మంత్రి టి.హరీష్‌రావు, రవాణా మంత్రి పి. మహేందర్‌రెడ్డిలు మల్కాజిగిరి ఎంపి మల్లారెడ్డి, మేయర్ మాజీద్ హుస్సేన్ తదితరులు సమక్షంలో రూ.32.02 కోట్ల అంచనాతో రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మాణా నికి శంకుస్థాపన చేసారు. నేరేడ్‌మెట్ రైల్వే స్టేషన్ సమీ పంలో నేరేడ్‌మెట్ చౌరాస్తా నుండి సఫిల్‌గూడ రహదారి మార్గంలో ఉన్న రైల్వే లైను మీదుగా ప్రతి రోజు గూడ్స్, పాసింజర్, ఎక్స్‌ప్రెస్ రైళ్ల రాకపోకలు చేస్తుంటాయి. ఈ రహదారిపై నుండి ఉన్న రైల్వే లైను వెళుతుండటంతో వాహనదారులకు, పాదచారులకు రైళ్ల ప్రమాదాలకు గురి కాకుండా ఉండేందుకు ఈ మార్గంలో రైళ్ల రాక పోకలు చేసే సమయంలో రహదారిపై వెళ్లే వాహనాలను నిలిపి వేసేందుకు దశాబ్దాలకాలం క్రితమే రైల్వే గేట్ ఏర్పాటు చేసి అక్కడ ఉండే రైల్వే సిబ్బంది గేట్ మూసివేయటం, తెర వటం చేస్తుంటారు. గేట్ మూసేసిన తర్వాత ఒక రైలు వెళ్ళేందుకు కనీసం పదినుండి పదిహేను నిమిషాల సమయం, కొన్ని సందర్భాల్లో ఒకేసారి రెండు రైళ్లు వెళ్లే సందర్భాల్లో అరగంటకు పైగా గేట్ మూసి వేస్తుంటారు. ఇలాంటి సమయంలో రైల్వే లైనుకు ఇరు వైపులా వందకు పైగా ఆర్టీసీ, ద్విచక్ర, త్రిచక్ర వాహనాలు, కార్లతో పాటు అంబులెన్సు, అగ్నిమాపక దళవాహనాలు మార్గం లేక పోవటంతో రైల్వే గేట్ తెరిచేవరకు ఆగిపోతుంటాయి. శాసనసభ, లోకసభ ఎన్నికల సమయాల్లో పోటీ చేసే అభ్యర్థులు ప్రతిసారీ ఆర్‌యుబి నిర్మిస్తామంటూ హామీలి వ్వటం పరిపాటుగా మారిందే తప్ప ఇప్పటి వరకు పరి ష్కారం మాత్రం కాలేదు. పదేళ్ల గత ప్రభుత్వ నిర్లక్ష్యానికి గురైన వాజ్‌పేయినగర్ రైల్వేగేట్ సమీపంలో ఆర్‌యుబి నిర్మాణం పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

**ఎమ్మెల్యేను కల్సిన కాకతీయనగర్ ప్రతినిధులు**

వినాయకనగర్ డివిజన్ పరిధిలోని కాకతీయనగర్ రెసి డెంట్స్ అసోసియేషన్ ప్రతినిధులు మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖరరెడ్డిని కల్సి వినతిపత్రం సమర్పించారు. దీనికోసం గతంలో తాము అనేకసార్లు కోరినా, పదేళ్ల క్రితం ఆర్‌యుబి నిర్మాణానికి శంకుస్థాపన చేసినా ఇప్ప టికీ ఆ దిశగా పనులు ఏ మాత్రం ప్రారంభం కాలేదని అసోసియేషన్‌కు చెందిన బద్దం పరశురాంరెడ్డి, చందు, శ్రీనివాస్, సూరి, బాలకృష్ణ, ఫరీద్‌లు తెలిపారు. ప్రజల సహకారం ఉంటేనే ఆర్‌యుబి నిర్మాణం త్వరితగతంగా పూర్తవుతుందని, దీనికోసం కొన్ని ఇళ్లు తొలగించాల్సి వస్తోందని, 178 ఇళ్లను కూల్చాలని తొలి ప్రతిపాదనలను ఆర్ అండ్ బి, బల్దియా అధికారులతో మాట్లాడి కేవలం ఐదిళ్లకే పరిమితం చేసానని ఈ సందర్భంగా ఎమ్మెల్యే మర్రి రాజశేఖరరెడ్డి తెలిపారు.

## నేడు సిపిఐ కార్యాలయంలో స్టడీ సర్కిల్ ప్రారంభం

ప్రజాపక్షం/మేడ్చల్ ప్రతినిధి: ఈసిఐఎల్‌లోని సిపిఐ కార్యాలయంలో శుక్రవారం కెవిఎల్ మహేంద్ర సోషల్ స్టడీ సర్కిల్ పేరిట సామాజిక అధ్యయన కేంద్రాన్ని ప్రారంభిస్తున్నామని స్టడీ సర్కిల్ నిర్వహణ కమిటి కార్యదర్శి జి.దామోదర్ రెడ్డి తెలిపారు. ఈ ప్రారంభ కార్యక్రమానికి తెలం గాణా రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ రియాజ్ ముఖ్య అతిథిగా, సామాజిక రాజకీయ విశ్లేషకు లు మల్లేపల్లి లక్ష్మయ్య, విశిష్ట అతిథిగా శాస్త్రవేత్త డా.సోము మర్ల, మేడ్చల్ జిల్లా గ్రంథాలయ కార్య దర్శి సురేష్‌లు హాజరు కానున్నారని తెలిపారు.



## జాప్యం లేకుండా పనులు పూర్తి

### కార్పొరేటర్ ప్రభుదాస్

ప్రజాపక్షం/కాప్రా : ఎలాంటి జాప్యం లేకుండా నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ పనులు పూర్తి చేయాలని మీర్పేట్ హెచ్‌బి కాలనీ కార్పొరేటర్ జెరిపోతుల ప్రభుదాస్ సంబంధించిన కంట్రాక్ట ర్‌కు సూచించారు. డివిజన్‌లోని మంగాపురం కాలనీలో సిసి రోడ్డు పనులను జిహెచ్ఎంసి ఏఈ లింగారావు, వర్క్ ఇనస్పెక్టర్ చారి, కాలనీవా సులు కనకయ్య, గోపినాథ్, నారాయణ, విద్యా సాగర్, దామోదర్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, కృష్ణారెడ్డిలతో కల్సి గురువారం పరిశీలించారు.

## గృహ అనుమతులపై అధికారులు నిర్లక్ష్యం వహించొద్దు

### టౌన్ ప్లానింగ్ అధికారులను హెచ్చరించిన ఎమ్మెల్యే కెపి వివేక్



ప్రజాపక్షం/నిజాంపేట్ : గృహ అనుమతుల విషయంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తే చర్య లు తప్పవని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కెపి వివేక్ టౌన్‌ప్లానింగ్ అధికారులను అధికారులను హెచ్చ రించారు. గాజులరామారం సర్కిల్ కార్యాలయం లో టౌన్ ప్లానింగ్ అధికారులతో సమీక్ష సమా వేశం జరిగింది. ఈ సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే కెపి వివేక్ టౌన్ ప్లానింగ్ అధికారులు అవలంబిస్తున్న తీరుపై మండిపడ్డారు. ఈ సంద ర్భంగా గాజులరామారం డివిజన్ పరిధిలో ఇంటి నిర్మాణాల అనుమతుల విషయంలో టౌన్ ప్లానింగ్ అధికారులు నియమ నిబంధనలను పాటించకుండా వక్ఫ్, దేవాదాయ శాఖల పేరు చెప్పి అనుమతులు ఇవ్వకుండా దరఖాస్తు దారు లను ఇబ్బందులకు గురిచేయడం సరికాదని అన్నారు. కోర్టు ఉత్తర్వులను పాటించకుండా చేద్దాంలే, చూద్దాంలే అనే ధోరణిని వహించరాద ని, దరఖాస్తుదారులను ఇబ్బందులకు గురిచేస్తే సహించేది లేదని తక్షణమే అనుమతులను జారీ చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో మున్సి పల్ కమిషనర్ మల్లారెడ్డి, ఏసిపి రమేష్, టిపిఎస్ తుల్జాసింగ్, హెచ్ఏఎల్ కాలనీ వాసులు పాల్గొన్నారు.

**పెండింగ్ పనులు తక్షణం పూర్తి చేయాలి...**

పెండింగ్ పనులను తక్షణమే పూర్తి చేయాలని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కెపి వివేక్ అన్నారు. గాజులరామారం సర్కిల్ కార్యాలయంలో ఇంజ నీరింగ్ శాఖ అధికారులతో అభివృద్ధి పనుల పై సమీక్ష నిర్వహించారు. గాజులరామారం సర్కిల్ పరిధిలోని అన్ని డివిజన్‌లలో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులన్నింటిని ప్రజలకు ఇబ్బందులు కలగకుండా తక్షణమే పూర్తి చేయాల ని ఆదేశిం చారు. కార్యక్రమంలో కమిషనర్ మల్లారెడ్డి, డిఇ శిరీష, ఏఇలు కళ్యాన్, తిరు పతి పాల్గొన్నారు.

**కుత్బుల్లాపూర్‌లో అంతర్జాతీయ మత్స్యకారుల దినోత్సవ వేడుకలు...**

కుత్బుల్లాపూర్ చౌరస్తాలో అంతర్జాతీయ మత్స్యకారుల దినోత్సవ వేడుకలను తెలం గాణ ముదిరాజ్ మహాసభ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్య క్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే కెపి వివేక్ తెలం గాణ ముదిరాజ్ మహాసభ జెండాను ఎగురవే శారు. వివేక్ మాట్లాడుతూ తాను అసెంబ్లీ సమా వేశాలలో ముదిరాజ్‌లను బిసిడి నుండి బిసి ఏలోకి మార్చాలనే ముఖ్యమైన డిమాండ్‌ను ఇప్ప టి కే ప్రస్తావించానని తెలిపారు. రాబోవు రోజుల్లో కూడా ముదిరాజ్‌ల అభివృద్ధికి, అభ్యున్నతికి తాను కృషి చేస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో ముదిరాజ్ మహాసభ నాయకులు గుమ్మల స్వామి, బలరాం, రవిందర్ ముదిరాజ్, మదు సూదన్ రాజు, సత్యం ముదిరాజ్, రమేష్ ముది రాజ్, వేణు పాల్గొన్నారు.



## ఉప్పల్‌లో ఇద్దరు నకిలీ ఆర్టీవోలు

ప్రజాపక్షం/ఉప్పల్ : ఉప్పల్ లో నకిలీ ఆర్టీవోలుగా అధికారుల మంటూ తమ కాంక్రీట్ మిల్లర్ వాహనాలను ఆపి అక్రమంగా వసూలు చేస్తున్నారని మిల్లర్లు బాధితులు ఉప్పల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం ప్రతిరోజు ఉదయం తెల్లవారుజామున 4 గంట లకు ఉప్పల్, చిలకనగర్, నారపల్లి ఘట్కేసర్, మేడిపల్లి, జోడిమెట్ల, నాగోల్ పరిసర శివారు ప్రాంతాల్లో కాంక్రీట్ మిల్లర్ వాహనాలను ఆపి, పట్టుకొని కారు డ్రైవర్ వాహనదారుని దగ్గరికి వెళ్లి ఆర్టీవో కార్‌లో ఉన్నారంటూ వేల రూపాయలు వసూలు చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. నకిలీ ఆర్టీఓ లుగా అవతారమెత్తి డబ్బులు వసూలు చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకో వాలని బాధితులు పోలీసులకు విజ్ఞప్తి చేశారు.

## నూతన రైస్ మిల్లు ప్రారంభం

ప్రజాపక్షం/వికారాబాద్ ప్రతినిధి:వికారాబాద్ నియోజకవర్గంలోని ధారూర్ పిఎసిఎస్ ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన రైస్ మిల్లును ,1500 మెట్రిక్ టన్నుల గోదాములను ప్రారంభించిన స్పీకర్ ప్రసాద్‌కుమార్. ధారూర్ మండ లనికి సంబంధించిన 56 కళ్యాణలక్ష్మి ,షాధీముబారక్ చెక్కులను లబ్ధిదారు లకు అందజేశారు. ధారూర్ ,నాగసమందర్ గ్రామలో వరి కోనుగోలు కేంద్ర లను ప్రారంభించా రు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ ఎన్నికల సమ యంలోనే రాజకీ యలు మిగిలిన సమ యంల అందరం కలిసి ప్రజల అభి వృద్ధి కోసం పనిచే యాలి అన్నారు. వికారాబాద్ నియోజకవర్గంన్ని అన్ని రంగాలల అభివద్ది చేస్తాం అన్నారు. నూతన పరిశ్రమలను స్థాపించి యువతకు ఉద్యోగాలు కల్పించడానికి కృషి చేస్తామన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారంటీలలో మెజారిటీ అమలవుతున్నాయన్నారు. అర్హులైన రైతులందరికీ రైతు రుణమాఫీ అందుతుందని ,రైతులు టెన్షన్ పడాల్సిన అవసరం లేదు అన్నారు. త్వరలో మహిళలకు నెలకు 2500రూపాయలు సహాయం కూడా అందుతుందిఅన్నారు.



ప్రజలకు మంచి పనులు చేయడానికి అవసరమైన బలం రాష్ట ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డి అందించాలని మనం రోజు భగవంతుని ప్రార్థించాలి, ఎల్లప్పుడు అయురారోగ్యలతో ఉండాలని అందరం కోరుకోవాలి అన్నారు. ఈ ఏడాది మంచిరగా వర్షాలు కురిసాయి , బోర్లు బావులలో నీళ్లు బాగు న్నాయి. వరి సాగు బాగ పెరిగింది. రైతులు ఎక్కడి మంచి రెటు వస్తే అక్కడ అమ్ముకోండి అని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ చైర్మన్ సత్యనారాయణరెడ్డి , కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## హైదరాబాద్‌కు ఉత్తర దిశగా మెట్రో విస్తరించాలి

ప్రజాపక్షం/మేడ్చల్ ప్రతినిధి : మెట్రో రైలును హైదరాబాద్‌కు ఉత్తరదిశగా విస్తరించాలని బిజెపి మేడ్చల్ జిల్లా అర్బన్ జిల్లా ఇన్‌చార్జి అధ్యక్షుడు డాక్టర్ మల్లారెడ్డి కోరారు. గురువారం తూంకుం టలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో జిల్లా అర్బన్, రూరల్ ప్రధాన కార్యదర్శులు డి.విఘ్నేశ్వర్, డి.గిరివర్ధనరెడ్డి, ఈశ్వర్‌లతో కల్సి ఆయన మాట్లాడారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ హైదరాబాద్ జనాభాలో పేద, మధ్య తరగతి వర్గాలకు చెందిన ప్రజానీకం ప్రభు త్వ రవాణా వ్యవస్థపైనే ఆధారపడుతున్నారని, ఈ విషయంలో గ్రేటర్ హైదరాబాద్‌లో 40 శాతం మంది నిర్లక్ష్యానికి గురవుతున్నారన్నారు. రెండో దశ మెట్రో విస్తరణలో నగరానికి ఉత్తర ప్రాంతాలను రాష్ట్ర ప్రభుత్వం విస్మరించింద న్నారు. మిగతా ప్రాంతాలను విస్తరిస్తున్న మాదిరి ఉత్తర ప్రాంతాలకు సైతం మెట్రో సౌకర్యం కల్పిం చటం వల్ల వేలాది మంది ఉద్యోగులు, ఐటి నిపు ణులు, విద్యార్థులు, కార్మికులు ప్రయోజనం పొందుతారన్నారు. బాలానగర జీడిమెట్ల, ఖాజి పల్లి, మేడ్చల్, వంటి పారిశ్రామిక వాడలు, శామీ ర్‌పేటలోని జీనోమ్ వ్యాలీ, పోచారంలోని సాఫ్ట్ వేర్ సంస్థలు, వందలాది విత్తన సంస్థలు, విద్యా సంస్థలు ఇలా అనేక మంది మెట్రో ఉత్తర ప్రాంత విస్తరణతో ప్రయోజనం పొందుతారన్నారు. ఈ ప్రాంతాల్లో విద్యా సంస్థలు, పరిశ్రమలు, అత్యధి కంగా ఉన్నాయన్నారు. మెట్రోను బాలానగర్ నుండి షాపూర్‌నగర్, సూరారం మీదుగా గండి మైసమ్మ వరకు, జుబ్లి బస్టాండ్ నుండి బోయిన పల్లి నుండి సుచిత్ర, కొంపల్లి మీదుగా మేడ్చల్ వరకు, జుబ్లిబస్టాండ్ నుండి ఆల్వాల్ మీదుగా తూంకుంట వరకు, తార్నాక నుండి ఈసిఐఎల్ క్రాస్ రోడ్డు మీదుగా నాగారం, కీసర వరకు, ఉప్పల్ నుండి నారపల్లి, ఘట్‌కేసర్ మీదుగా యాదగిరిగుట్ట వరకు మెట్రో రైలును విస్తరించా లని కోరారు.

## కానిస్టేబుళ్ల శిక్షణ పూర్తి

### మల్టీజోన్-2 ఐజిపి సత్యనారాయణ

ప్రజాపక్షం/వికారాబాద్ ప్రతినిధి: వికారాబాద్ జిల్లా పోలీస్ శిక్షణ కేంద్రంలో ఈ రోజు 2024 సంవ త్సరానికి చేందిన బ్యాచ్271 ఏఆర్, ఎస్‌సిటిపిసిఎస్‌ల దీక్షాంత్ పరేడేను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఎస్‌పి నారాయణరెడ్డి ,మల్టీజోన్ 2ఐజి సత్య నారాయణ ముఖ్యఅతిథిగా హజరై మాట్లాడుతూ రామగుండం నుండి 119 మంది సిద్దిపేట్ నుండి 60 మంది కొమరాంబీమ్ అసిఫాబాద్ నుండి 58 మంది ,మహబుబ్‌నగర్‌నుండి 34 మంది మొత్తం 271 మంది ఇట్టి పాసింగ్ ఔట్ పరేడేలో పాల్గోనడం జరిగింది. డిటిసి ప్రిన్సిపల్ మురళిధర్ స్వాగతం పాలికరు. అనంతరం ఐజి మాట్లా డుతూ తెలంగాణ ఊటీగా పేరు పోందిన వికారా బాద్‌లో శిక్షణ విజయవంతంగా ముగించుకొన్న 271 మంది కనిస్టేబుల్‌లకు శుభాకాంక్షులు తెలి పారు. శిక్షణలో పాల్గో న్నా వరం దరు అన్నీ పరీక్షలు ఉత్తీర్ణులు ఇవ్వ డం జరిగింది. ప్రజలకు సేవ చేయాలని, ప్రజల శాంతిభద్రతల కోరకు ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వాల ద్వారా నయ మించబడిన అన్నీ అంశా లలో శిక్ష ణ పోంది శాంతి భద్రతల కోరకు సంర క్షిస్తూ, ప్రజల జీవితాలకు, ఆస్తులకు రక్షణ కల్పిస్తు, నేరాలు, విధ్వంసాలు జరగకుండా కాపా డేందుకు ప్రభుత్వాలు ఏర్పాటు చేసిన వ్యవస్థనే పోలీస్ డిపార్ట్మెంట్ ,నేటి కాలంలో ప్రజలకు పోలీస్ పరోక్షంగాను లేదా ప్రత్యేకక్షంగాను సహాయం చేస్తుంది అన్నారు. పోలీసు పరిపాలన ,డాక్యు మెంటేషన్, వ్యక్తత్వ వికసం, లా,అర్డర్ క్రిమినల్ చట్టలను గురించి అన్ని అంశాలను నేర్చుకొని శిక్షణను విజయవంతంగా పూర్తి చేశారని అన్నారు. కార్యక్రమంలో అధికారులు,ట్రైనింగ్ పోలీసులు పాల్గోన్నా రు.





## జెవివి చెకుముకి సైన్స్ సంబురాలు

ప్రజాపక్షం/నాగారం:విద్యార్థులలో సృజనా త్మక శక్తిని వెలికి తీసేందుకు జెవివి చేస్తున్న కృషి అభినందనీయమని ప్రధానోపాధ్యాయులు రాములు అన్నా రు. గురువారం జన విజ్ఞాన వేదిక కీసర మండలం ఆధ్వర్యంలో చెకుముకి సైన్స్ సంబురాల్లో భాగంగా నాగారం ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించారు. పరీక్ష ప్రశ్న పత్రా న్ని రాములు ఆవిష్కరించారు. పరీక్షల్లో మండ ల, జిల్లా స్థాయి పాల్గొన్న విద్యార్థులను అభినం దిస్తు ప్రశంస పత్రాలను అందజేశారు.ఈ కార్య క్రమంలో ఆనంద్ కుమార్, ఎం శ్రీనివాస్, ఎంఎల్ చౌదరి, పటేల్ నర్సింహులు,గుమ్మడి హరిప్రసాద్,వై శ్రీనివాస్, ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా మత్స్యకారుల దినోత్సవ వేడుకలు

ప్రజాపక్షం/శామీర్‌పేట :ముదిరాజ్‌ల సంక్షేమా నికి ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహాలను మత్స్యకారులు సద్వినియోగం చేసుకోవాలని ఉమ్మడి శామీర్‌పేట మత్స్యకారుల సంఘం అధ్య క్షుడు, జిల్లా ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కర్కపట్ల రాము అన్నారు. గురువారం తూంకుంట మున్సిపాలిటీ లోని ఉప్పర్‌పల్లిలో మత్స్యకారుల దినోత్సవ వేడు కలను జెండా ఎగురవేసి ఘనంగా జరుపుకు న్నారు. ఈ సందర్భంగా రాము మాట్లాడుతూ ముదిరాజ్‌లు అన్ని రంగాల్లో వెనకబడి ఉన్నందు న ఏ కేటగిరిలోకి మార్చాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఉప్పర్‌పల్లి మత్స్యకారుల సంఘం ప్రధాన కార్యదర్శి శంకరయ్య, మాజీ సర్పంచ్‌లు కట్టెల రవీందర్, రాంచందర్, ఉపా ధ్యక్షుడు రమేష్, రాజు,బాలకృష్ణలు పాల్గొన్నారు.

## సిఎంఆర్‌ఎఫ్ పేద, మధ్య తరగతులకు వరం

### మందుముల రజిత పరమేశ్వర్ రెడ్డి

ప్రజాపక్షం/ఉప్పల్ : సీఎం ఆర్‌ఎఫ్ పేద, మధ్య తరగతి ప్రజలకు వరంగా మారిందని ఉప్పల్ డివిజన్ కార్పొరేటర్ టీపీసీసీ ప్రధాన కార్యదర్శి మందు ముల రజిత పరమేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో సీఎం రేవంత్‌రెడ్డి అర్హులందరికీ కూడా సీఎంఆర్‌ఎఫ్ కింద మెడికల్ బిల్లులు సకా లంలో చెల్లిస్తున్నట్టుగా తెలిపా రు. ఉప్పల్ సర్కిల్లోని ఉప్పల్, చిలుకానగర్, రామంతాపూర్ ప్రాంతాలకు చెందిన వారికి సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను గురు వారం రజిత పరమేశ్వర్‌రెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భం గా చలపతి రావు 60 వేలు, రామచందర్ 32,500, అమృత 60 వేలు, భాగ్య లక్ష్మి 60 వేలు, ఈఫ్తికార్ హుస్సేన్ 60 వేలు, మీరాదేవి గుప్త 31500 చొప్పు న మంజూరైన చెక్కులను రజిత పరమేశ్వర్‌రెడ్డి లబ్ధిదారులకు అందచేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు చెన్ రెడ్డి, రఘుపతి రెడ్డి, తుమ్మల దేవి రెడ్డి, ఆగం రెడ్డి, మంచాల రఘు, అసలాం, మాశెట్టి రాఘవేం దర్, పూజారి హనుమంత్, ఆనంద్ ప్రభు మంద సుమన్ రెడ్డి పాల్గొన్నారు.



క్రీడ



# సెహ్వాగ్ కొడుకు డబుల్ సెంచరీ!

టీమిండియా మాజీ డాషింగ్ ఓపెనర్ వీరేంద్ర సెహ్వాగ్ తనయుడు ఆర్యవీర్ సెహ్వాగ్ విధంసకర బ్యాటింగ్‌తో దుమ్మురేపాడు. తండ్రి తరహాలోనే దూకుడైన ఆటతో డబుల్ సెంచరీ సాధించాడు. ప్రతీష్టాత్మక అండర్19 క్రికెట్ టోర్నీ కూచ్ బెహార్ ట్రోఫీలో ఢిల్లీకి ప్రాతినిథ్యం వహిస్తున్న ఆర్యవీర్ సెహ్వాగ్.. మేఘాలయతో జరుగుతున్న మ్యాచ్‌లో ఈ ఫీట్ అందుకున్నాడు. తండ్రి వీరేంద్ర సెహ్వాగ్ ఆటను గుర్తు చేసేలా 229 బంతుల్లోనే 34 ఫోర్లు, 2 సిక్సర్లతో 200 పరుగులు చేశాడు. షిల్లాంగ్ మైదానం వేదికగా బుధవారం ప్రారంభమైన ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన మేఘాలయ తొలి ఇన్నింగ్స్‌లో 260 పరుగులకు ఆలౌటైంది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన ఢిల్లీ.. ఆర్యవీర్ విధ్వంసకర ద్విశతకంతో రెండో రోజు ఆట ముగిసే సమయానికి 2 వికెట్లకు 468 పరుగులు చేసింది. ప్రస్తుతం ఢిల్లీ 208 పరుగుల ఆధిక్యంలో ఉంది. మరో ఓపెనర్ అర్ణవ్ ఎస్ బుగ్గాతో కలిసి ఆర్యవీర్ తొలి వికెట్‌కు 180 పరుగులు జోడించాడు. ఆర్యవీర్(200 బ్యాటింగ్)తో పాటు ధన్యా నక్రా(98 బ్యాటింగ్) క్రీజులో ఉన్నారు. ఈ ఏడాది అక్టోబర్‌లోనే ఆర్యవీర్.. వీనూ మన్కడ్ ట్రోఫీలో అరంగేట్రం చేశాడు. మణిపూర్‌తో జరిగిన మ్యాచ్‌లో ఆర్యవీర్ 49 పరుగులతో ఢిల్లీ విజయంలో కీలక పాత్ర పోషించాడు. తన బాటలోనే నడవాలని ఆర్యవీర్‌ను ఎప్పుడూ ఒత్తిడి చేయలేదని సెహ్వాగ్ ఓ ఇంటర్వ్యూలో చెప్పుకొచ్చాడు. తనకిష్టమైన రంగం ఎంచుకునేలా ప్రోత్సహించానని తెలిపాడు. 'నా పిల్లల ఇద్దరిలో మరో వీరేంద్ర సెహ్వాగ్‌ను చూడాలనుకోలేదు. వారు మరో విరాట్ కోహ్లీ, హార్దిక్ పాండ్యా మహేంద్ర సింగ్ ధోనీ కావచ్చు. కానీ వారు క్రికెటర్లుగా మారాల్సిన అవసరం లేదు. వాళ్ల కెరీర్‌ను వాళ్లు స్వేచ్ఛగా ఎంచుకోవాలి. అందుకు మేం సాధ్యమైనంత సాయం చేస్తాం. చివరకు వాళ్లు మంచి మనుషులుగా ఉండాలి. అదే మా కోరిక.'అని సెహ్వాగ్ ఓ ఇంటర్వ్యూలో తమ పిల్లల గురించి చెప్పుకొచ్చాడు. 15 ఏళ్ల తన కొడుకు ఐపీఎల్‌లోకి అరంగేట్రం చేసేందుకు తెగ కష్టపడుతున్నాడని సెహ్వాగ్ తెలిపాడు. 'కుర్రాళ్లకు ఐపీఎల్ మంచి ఫ్లాట్‌ఫామ్. గతంలో రంజీ ట్రోఫీ ప్రదర్శనలను ఎవరూ పెద్దగా గుర్తించేవారు కాదు. దాంతో భారత జట్టులో అవకాశాలు దక్కేవి కాదు. కానీ ఇప్పుడు ఐపీఎల్‌లో సత్తా చాటితే, నైపుణ్యాలను ప్రదర్శిస్తే వెంటనే భారత జట్టు తరపున ఆడే అవకాశాన్ని అందుకుంటావు. ఇదంతా ఐపీఎల్ క్రెడిట్. చిన్నరాష్ట్రాలకు చెందిన పిల్లలు కూడా క్రికెట్‌ను కెరీర్‌గా ఎంచుకోవడానికి ఐపీఎల్ ప్రధాన కారణం.'అని సెహ్వాగ్ చెప్పుకొచ్చాడు.

# క్వార్టర్ ఫైనల్స్‌కు లక్ష్యసేన్

## నిరాశపరిచిన పి.వి.సింధు



**షెన్‌జెన్ :** చైనా మాస్టర్స్ ప్రపంచ టూర్ సూపర్ 750 టోర్నీలో భారత స్టార్ షట్లర్ లక్ష్యసేన్ క్వార్టర్ ఫైనల్స్‌కు చేరాడు. మరో స్టార్ షట్లర్ పి.వి.సింధు ప్రిక్వార్టర్స్ లోనే ఓడి టోర్నీ నుంచి నిష్క్రమించింది. పురుషుల డబుల్స్‌లో డిఫెండింగ్ ఛాంపియన్ సాత్విక్, చిరాగ్ శెట్టి జంట కూడా క్వార్టర్స్‌కు చేరింది. పురుషుల సింగిల్స్‌లో రెండో రౌండ్ మ్యాచ్‌లో లక్ష్యసేన్ 21–6, 21–18తో రాస్మస్ జెమ్‌కే (డెన్మార్క్)పై విజయం సాధించాడు. వరుసగా గేమ్‌ల్లో ప్రత్యర్థిని చిత్తు చేసి 46 నిమిషాల్లోనే మ్యాచ్‌ని ముగించాడు. మహిళల సింగిల్స్ ప్రిక్వార్టర్స్‌లో ప్రపంచ 19వ ర్యాంకర్ అయిన పి.వి.సింధు నిరాశపర్చింది. గంట తొమ్మిది నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో సింధు 16–21, 21–17 21–23తో యో జియా మిన్ (సింగపూర్) చేతిలో ఓటమి చవిచూసింది. పురుషుల డబుల్స్ డిఫెండింగ్ ఛాంపియన్స్ సాత్విక్ సాయిరాజ్, చిరాగ్ శెట్టి ద్వయం 21–19,21–15 తేడాతో రాస్మస్ క్జెర్, ఫ్రెడరిక్ సోగార్డ్ (డెన్మార్క్)పై విజయం సాధించి క్వార్టర్ ఫైనల్‌కు చేరుకుంది. మహిళల డబుల్స్‌లో గాయత్రి గోపీచంద్ ట్రీసా జాలీ జోడీ ప్రిక్వార్టర్స్‌లో ఓటమిపాలైంది. 16–11, 11–21తో చైనాకు చెందిన లియు షెంగ్ షు, టాన్ నింగ్ జంట చేతిలో ఓటమి చవిచూసింది. ఈ టోర్నీలో భారత యువ షట్లర్లు అనుపమ ఉపాధ్యాయ, మాళవిక బన్సోద్‌ల పోరాటం కూడా ముగిసింది. మహిళల సింగిల్స్‌లో అనుపమ 7–21, 14–21తో నట్సుకి నిదైరా (జపాన్) చేతిలో ఓడిపోగా.. మాళవిక 9–21, 9–21తో ఎనిమిదో సీడ్ సుపానిడా (థాయ్ లాండ్) చేతిలో పరాజయం పాలైంది.

# గంభీర్.. ఆ ఎక్స్‌ట్రాలే తగ్గించుకో..



**న్యూఢిల్లీ :** ఆస్ట్రేలియాతో ఐదు టెస్ట్‌ల బోర్డర్ గవాస్కర్ ట్రోఫీలో టీమిండియా హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ ప్ర శాంతంగా ఉండాలని మాజీ కోచ్ రవి శాస్త్రి సూచించాడు. అ నాలోచిత నిర్ణయాలు తీసుకోవడం తగ్గించుకోవాలని సలహా ఇచ్చాడు. ఇక బోర్డర్ గవాస్కర్ ట్రోఫీ గౌతమ్ గంభీర్ ఇజ్జత్‌కు సవాల్‌గా మారింది. అతను హెడ్ కోచ్‌గా బాధ్యతలు చేప ట్టిన తర్వాత టీమిండియా చరిత్రలో ఎరుగని ఘోర పరా జయాలు చవిచూసింది. సుదీర్ఘ కాలం తర్వాత శ్రీలంక గడ్డపై వన్డే సిరీస్ కోల్పోయిన టీమిండియా.. టెస్ట్ క్రికెట్ చరిత్రలోనే తొలిసారి సొంతగడ్డపై క్లీన్ స్వీప్‌కు గురైంది.

**గంభీర్ సామర్థ్యానికి పరీక్ష..**

మూడు టెస్ట్‌ల సిరీస్‌లో న్యూజిలాండ 30తో టీమిండియాను వైట్ వాష్ చేసింది. ఈ ఘోర పరాజయం హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్‌పై ఒత్తిడిని పెంచింది. మరోవైపు బీసీసీఐ కూడా ఈ ఘోర ఓటమిపై గంభీర్‌తో పాటు కెప్టెన్ రోహిత్ శర్మపై కన్నెర్ర చేయడంతో పాటు వివరణ కోరినట్లు కూడా వార్తలు వచ్చాయి. బోర్డర్ గవాస్కర్ ట్రోఫీలో టీమిండియా మెరుగైన ప్రదర్శన చేయకపోతే కఠిన నిర్ణయం తీసుకుంటామని కూడా హెచ్చరించినట్లు ప్రచారం జరిగింది. ఈ క్రమంలోనే బోర్డర్ గవాస్కర్ ట్రోఫీ కోచ్‌గా గంభీర్ సామర్థ్యానికి పరీక్షగా మారింది.

**స్పాట్ డిసిషన్స్ వద్దు..**

పెర్త్ వేదికగా శుక్రవారం నుంచి ప్రారంభమయ్యే తొలి టెస్ట్‌తో ఈ సిరీస్‌కు తెరలేవనుంది. ఈ సిరీస్ ప్రారంభానికి ముందు అధికారిక బ్రాడ్‌కాస్టర్‌తో మాట్లాడిన రవి శాస్త్రి.. గౌతమ్ గంభీర్‌కు కొన్ని సలహాలు ఇచ్చాడు. ఆటగాళ్లతో ఎలా వ్యవహరించాలి, వారి స్వభావాన్ని ఎలా అర్థం చేసుకోవాలి, వారిలో ఆత్మవిశ్వాసాన్ని ఎలా నింపాలి? అనే విషయాలను వివరించాడు. అంతేకాకుండా ఇతరుల మాటలు విని అప్పటికప్పుడూ నిర్ణయాలు తీసుకోవడం మానేయాలన్నాడు.

# 'ముఫాసా' కోసం మహేష్‌తో పాటు వీళ్లు కూడా!



హాలీవుడ్‌లో తెరకెక్కిన 'ది లయన్ కింగ్' చిత్రానికి వరల్డ్‌డ్‌గా ఎలాంటి క్రేజ్ ఉందో ప్రత్యేకించి చెప్పక్కర్లేదు. ఈ ఫ్రాంచైజ్ సినిమాలకు తెలుగులోనూ మాంచి క్రేజ్ ఉంది. ఇక ఇప్పుడు ఈ ఫ్రాంచైజీ నుండి వస్తున్న మరో లేటెస్ట్ మూవీ 'ముఫాసా ది లయన్ కింగ్' కోసం ఇప్పటికే యావత్ వరల్డ్ వైడ్ సినీ లవర్స్ ఆతృతగా వెయిట్ చేస్తున్నారు. ఈ చిత్రానికి సంబంధించిన ట్రైలర్‌ను గతంలోనే రిలీజ్ చేయగా, దానికి సాలిడ్ రెస్పాన్స్ దక్కింది. తెలుగులో ముఫాసా చిత్రానికి సూపర్ స్టార్ మహేష్ బాబు వాయిస్ ఇస్తుండటంతో ఇక్కడి ప్రేక్షకుల్లోనూ ఈ సినిమాపై భారీ అంచనాలు క్రియేట్ అయ్యాయి. అయితే, ఈ సినిమాలో బోలెడన్ని క్యారెక్టర్స్ ఉన్నాయి. వాటిలో కొన్నింటికి టాలీవుడ్ స్టార్స్ వాయిస్ ఓవర్ ఇస్తున్నారు. వారిలో డా.బ్రహ్మానందం పుంబా పాత్రకు వాయిస్ ఓవర్ ఇస్తున్నారు. ఇక కమెడియన్ అలీ టిమోన్ పాత్రకు, సత్యదేవ్ టాకా పాత్రకు, అయ్యప్ప పి శర్మ కిరోస్ పాత్రకు తమ వాయిస్ ఓవర్ అందిస్తున్నారు. ఇలా పలువురు స్టార్స్ తెలుగులో తమ వాయిస్ ఓవర్ అందిస్తుండటంతో ముఫాసా చిత్రాన్ని చూసేందుకు ఇక్కడి ప్రేక్షకులు కూడా ఆసక్తిని కనబరుస్తున్నారు. ఈ సినిమాను డిసెంబర్ 20న వరల్డ్‌డ్‌గా గ్రాండ రిలీజ్ చేసేందుకు మేకర్స్ రెడీ అవుతున్నారు.

రీల్




# ఉపేంద్ర 'యూఐ'ను రిలీజ్ చేస్తున్న గీత ఆర్ట్స్

కన్నడ స్టార్ ఉపేంద్ర నటిస్తున్న లేటెస్ట్ మూవీ 'యూఐ' ఇప్పటికే ప్రేక్షకుల్లో సాలిడ్ అంచనాలు క్రియేట్ చేసింది. ఈ సినిమాను పాన్ ఇండియా మూవీగా రిలీజ్ చేసేందుకు చిత్ర యూనిట్ రెడీ అవుతోంది. ఇక ఈ సినిమాను తెలుగులోనూ భారీ స్థాయిలో రిలీజ్ చేసేందుకు చిత్ర యూనిట్ సిద్ధమయ్యింది. అయితే, ఈ చిత్రాన్ని తెలుగులో ప్రముఖ డిస్ట్రిబ్యూషన్ సంస్థ గీతా ఫిలిం డిస్ట్రిబ్యూటర్స్ రిలీజ్ చేసేందుకు డీల్ కుదుర్చుకుంది. ఈ మేరకు అధికారికంగా గీతా ఫిలిం వారు అనౌన్స్‌మెంట్ కూడా చేశారు. దీంతో 'యూఐ' చిత్రాన్ని తెలుగులోనూ భారీ స్థాయిలో రిలీజ్ చేసేందుకు సన్నాహాలు జరుగుతు న్నాయి.ఈ సినిమాను ఉపేంద్ర స్వయంగా డైరెక్ట్ కూడా చేస్తున్నారు. దీంతో ఈ సినిమా ఎలాంటి కథతో రాబోతుందా అనే ఆసక్తి ప్రేక్షకుల్లో నెలకొంది.



# మరో రెండు సినిమాలు ఓకే చేసిన విశ్వక్ సేన్..?

మాస్ కా దాస్ విశ్వక్ సేన్ నటించిన లేటెస్ట్ మూవీ 'మెకానిక్ రాకీ' నవంబర్ 22న గ్రాండ రిలీజ్‌క రెడీ అయ్యింది. ఈ సినిమాను రవితేజ ముళ్లపూడి డైరెక్ట్ చేస్తుండగా పూర్తి యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా ఈ మూవీ ప్రేక్షకులను ఆకట్టుకుంటుందని మేకర్స్ ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఇక ఈ సినిమాతో సాలిడ హిట్ కొట్టేందుకు విశ్వక్ సేన్ తీవ్రంగా కష్టపడుతున్నాడు. అయితే, ఈ సినిమా రిలీజ్ తరువాత తన నెక్ట్స్ చిత్రాలను కూడా వరుసగా లైన్‌లో పెట్టేందుకు రెడీ అవుతున్నాడు ఈ హీరో. ఇప్పటికే లైలా అనే సినిమాలో నటించేందుకు సిద్ధ మవుతున్నాడు విశ్వక్. ఈ సినిమాతో పాటు ఇప్పుడు మరో రెండు సినిమాలను కూడా ఆయన సైన్ చేసినట్లుగా సినీ సర్కిల్స్‌లో వార్తలు వినిపిస్తున్నాయి. దర్శ కుడు కెవి అనుదీప్ డైరెక్షన్‌లో ఓ సినిమా చేసేందుకు విశ్వక్ రెడీ అవుతున్నాడు. ఈ సినిమాతో పాటు 'భీమ్లా నాయక్' ఫేం దర్శకుడు సాగర్ కె చంద్ర డైరె క్షన్‌లోనూ విశ్వక్ ఓ సినిమా చేయబోతున్నాడనే టాక్ వినిపిస్తోంది. అయితే, ఈ రెం డు సినిమాలకు సంబంధించిన అఫీషియల్ అనౌన్స్‌మెంట్ వచ్చే వరకు వెయిట్ చేయాల్సిందే.

# కోటి దీపోత్సవంలో పాల్గొన్న రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము



కార్తీక మాసంలో అందరూ శివున్ని కొలుస్తారని.. అసత్యంపై సత్యం గెలిచిన పండగ ఇది.. తెలుగు నేలపై కార్తీక మాసం వేళ కోటి దీపోత్సవం చేయడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. అందరూ ఒక్కటై దీపాలు వెలిగించడం ఏకత్వాన్ని సూచిస్తుందని కోటి దీపోత్సవం నిర్వాహకులను రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అభినందించారు.

**ప్రజాపక్షం/హైదరాబాద్:** దీపాలతో ప్రతి కార్యక్రమాన్ని ప్రారంభించడం మన సంప్రదాయం.. కోటి దీపోత్సవంలో పాల్గొనడం ఎంతో సంతోషంగా ఉందని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అన్నారు. ఎన్‌టిఆర్ స్టేడియంలో జరుగుతున్న భక్తి టివి కోటి దీపోత్సవం కార్యక్రమానికి గురువారం ద్రౌపది ముర్ము విశిష్ట అతిథిగా హాజరయ్యారు. నిర్వాహకులు రాష్ట్రపతికి ఘనంగా స్వాగతం పలికారు. కోటి దీపోత్సవంలో దీప ప్రజ్వలన చేసిన రాష్ట్రపతి ముర్ము తొలి కార్తీక దీపాన్ని వెలిగించారు. పూరీ జగన్నాథునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. యాదగిరి గుట్ట లక్ష్మి నరసింహస్వామికి పట్టువస్త్రాలు సమర్పించారు. కోటి దీపోత్సవంలో రాష్ట్రపతి వెంట కేంద్రమంత్రి కిషన్ రెడ్డి, మంత్రి సీతక్కలు కూ డా హాజరయ్యారు. ఈ సందర్భంగా భక్తులనుద్దేశించి రాష్ట్రపతి ముర్ము మాట్లాడారు.

**రాష్ట్రపతికి ఘన స్వాగతం..**

రెండు రోజుల పర్యటన నిమిత్తం హైదరాబాద్‌కు విచ్చేసిన గౌరవ రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు బేగంపేట విమానాశ్రయంలో ఘన స్వాగతం లభించింది.ద్రౌపది ముర్మును రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ, ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి, కేంద్ర మంత్రులు జి.కిషన్ రెడ్డి, బండి సంజయ్, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి ధనసరి అనసూయ సీతక్క, స్వాగతం పలికారు. నగర మేయర్ విజయలక్ష్మి గద్వాల, ప్రభుత్వ సలహాదారు (ప్రొటోకాల్) హర్కర వేణు గోపాల్ రావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, డిజిపి జితేందర్, త్రివిధ దళాలకు చెందిన అధికారులతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు రాష్ట్రపతి కి స్వాగతం పలికిన వారిలో ఉన్నారు.

# ప్రపంచ మత్స్యకార దినోత్సవ ఉత్సవాలు



**ప్రజాపక్షం / హైదరాబాద్ :** ప్రపంచ మత్స్యకార దినోత్సవ ఉత్సవాలు2024 గురువారం హైదరాబాద్‌లో ఘనంగా జరిగాయి. ఫిషరీస్ కో ఆపరేటివ్ సొసైటి ఫెడరేషన్ ఛైర్మన్ మెట్టు సాయికుమార్ అధ్యక్షతన గురువారం హైదరాబాద్ సచివాలయం సమీపంలోని పివి నరసింహా రావు మార్గ్ వద్ద గల డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహం గ్రౌండ్‌లో రాష్ట్ర శాసన సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా గడ్డం ప్రసాద్ కుమార్ జ్యోతి ప్రజ్వలన చేసి ఫిష్ ఫుడ్ ఫెస్టివల్ స్టాల్స్ ను ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఖైరతాబాద్ ఎంఎల్‌ఎ దానం నాగేందర్, రాజ్యసభ సభ్యులు అనిల్ కుమార్ యాదవ్, సీనియర్ కాంగ్రెస్ నేత మాజీ పిసిసి అధ్యక్షులు వి. హన్మంతరావు, టూరిజం డెవలప్మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి, సీడ్స్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ అన్వేష్ రెడ్డి, టిజి ఐఐసి ఛైర్మన్ నిర్మలా జగ్గారెడ్డి, ఎస్‌టి కార్పొరేషన్ ఛైర్మన్ బెల్లయ్య నాయక్, ఎస్‌సి కార్పొరేషన్ ఛైర్మన్ ప్రీ తం నాగరికరీ, ఎంబిసిప కార్పొరేషన్ ఛైర్మన్ జెరిపేటి జైపాల్, వికలాంగుల కార్పొరేషన్ ఛైర్మన్ ముత్తినేని వీరయ్య తదితరులు హాజరైనారు. ఈ సందర్భంగా రాష్ట్ర మత్స్యశాఖ ఉన్నత అధికారుల కు, పలువురు మత్స్యకారులకు ప్రముఖుల చేతుల మీదుగా ఉత్తమ సేవా పత్రాలను అందజేశారు.



# లాక్కుంటే చూస్తూ ఊరుకోం

(మొదటి పేజీ తరువాయి)

అనుమానాలపై ప్రజలకు స్పష్టమైన అవగాహన కల్పించకపోవడాన్ని వారు తప్పుపట్టారు. గిరిజన ప్రజలు పంట సాగుకై రుణాలు తీసుకునేందుకు బ్యాంకులకు వెళ్తే అక్కడ బ్యాంకు అధికారులు మీకు రుణాలు ఇవ్వమని, మీ భూములు ఫార్మా కంపెనీ తీసుకున్నదని, మీ పేరుపై భూములు లేవని చెప్పడంతో భయాందోళనకు గురయ్యారని. ఈ విషయం తెలియడంతో ఆనాటి నుంచి నేటి వరకు రిలే నిరహార దీక్షలు చేపట్టారని, పలు మార్లు మండల స్థాయి, నియోజకవర్గ స్థాయి, జిల్లా స్థాయి అధికారులకు వినతి పత్రాలు సహా జిల్లా కలెక్టర్‌కు కూడా పలుమార్లు రాతపూర్వకంగా ఫిర్యాదులు చేశారని తెలిపారు. 'కడ' ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డికి కూడా రైతులు నేరుగా కలిసి ఫిర్యాదులు చేసినా పట్టించుకోకపోగా భూములు ఇస్తారా? చస్తారా? అనే ధోరణితో సమావేశాలను ఏర్పాటు చేసి రైతులను రెచ్చగొట్టేలా ప్రభుత్వం మొండి వైఖరి ప్రదర్శించడం శోచనీయమన్నారు. జిల్లా కలెక్టర్ వచ్చే సమయానికి రైతులు కేవలం నిరసనలు వ్యక్తం చేస్తూ 'కలెక్టర్..గో బ్యాక్' అంటూ నినాదాలు చేశారే తప్ప ఎలాంటి దాడులకు పాల్పడలేదన్నారు. కాకపోతే దీని వెనుక దుష్టశక్తులు ఉన్నాయని, బాధ్యులైన నిందితులను కఠినంగా శిక్షించడాన్ని తాము వ్యతిరేకించమన్నారు.సుప్రీంకోర్టు ఆదేశాలనుసారం సంవత్సరానికి రెండు పంటలు పండే వ్యవసాయ పొలాలను ఏ పరిశ్రమలకు గాని, కంపెనీలకు గాని తీసుకోరాదని చట్టాలు చెబుతున్నాయన్నారు. రైతులు స్వచ్ఛందంగా ఇస్తే తప్ప బలవంతపు భూ సేకకరణ చేయడం సహేతుకం కాదన్నారు.

**దాడుల వెనుక అసాంఘిక శక్తులు :** పశ్య పద్మ లగచర్ల గ్రామంలో పంట పొలాలు పోతున్నాయనే బాధతో రైతులు గ్రామానికి వచ్చిన కలెక్టర్ మరియు అధికారులకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ముందుకు వెళ్తున్న క్రమంలో కొంతమంది అసాంఘిక శక్తులతో కలిసివచ్చిన కొంత మంది దుండగులు కలెక్టర్‌పై దాడికి పాల్పడి వారు వెంటనే తప్పించుకుని అమాయక రైతులను, గిరిజనులను అడ్డంపెట్టుకుని ఈ దారుణానికి పాల్పడటం ఇది ఒక రాజకీయ కుట్రకోణం అన్నారు. అభంశుభం తెలియని రైతులు ఎవరు కూడా దాడులకు పాల్పడలేదన్నారు. పోలీసులు రాత్రికి రాత్రే వచ్చి కరెంటు నిలిపేసి, ఇంటర్నెట్ తీసేసి, ఆడవాళ్లు పిల్లలు అని చూడకుండా విచక్షణ రహితంగా ప్రవర్తిస్తూ దొరికిన వారిని దొరికినట్లు అరెస్టులు చేయడం సరికాదని మండిపడ్డారు. ఈ దేశంలో ఎన్నో పరిశ్రమలు ఉన్నాయని, వాటికి భూసేకరణ ఉంది కానీ ఈ తీరులో ఎక్కడా జరగలేదన్నారు. పంట పొలాల బదులు పోరంబోకు, బీడు భూములను ఎంచుకుని అభివృద్ధి చేయాలని పశ్య పద్మ సూచించారు.

**భూములు కావాలంటే ఐక్యంగా ఉండాలి : తమ్మినేని వీరభద్రం**

లగచర్లలో ఫార్మా కంపెనీ కోసం జరుగుతున్న భూ పోరాటంలో ప్రభుత్వం అనుసరిస్తున్న తీరుపై సిపిఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం ఆగ్రహం వ్యక్తం చేశారు. లగచర్ల, రోటిబండ తండ, పులిచెర్ల తండలో పర్యటించి భూబాధితులతో నేరుగా కలిసి మాట్లాడి వారి సమస్యలపై ఆరా తీశారు. మీ భూములు మీకే ఉండాలంటే మీరందరు ఐక్యంగా ఉండాలని సూచించారు. మీలో ఎవరైనా నమ్మించి మాయమాటలు చెప్పి మీ వేలి ముద్రలు వేయించాలని ప్రయత్నిస్తే ఎట్టి పరిస్థితులలో సహకరించవద్దని వీరభద్రం వారికి సలహా ఇచ్చారు.

రైతులను పరామర్శించిన వారిలో సిపిఐఎంఎల్ న్యూడెమొక్రసీ నాయకులు గోవర్ధన్, ఎంసిపిఐ(యు) రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వనం సుధాకర్, సిపిఐఎంఎల్ ప్రసాద్, ఎస్‌యుసిఐసి రాష్ట్ర కార్యదర్శి మురహరి, సిపిఐఎంఎల్ లిబరేషన్ రాష్ట్ర కార్యదర్శి రమేష్‌రాజా, ఆర్‌ఎస్‌పి రాష్ట్ర కార్యదర్శి జానకిరాములు, సిపిఐ జిల్లా కార్యదర్శి విజయ లక్ష్మి పండిత్, తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ఏఐకేఎస్ జిల్లా కార్యదర్శి గంటి సురేష్‌కుమార్, బికేఎంయు జిల్లా కార్యదర్శి ఎం.వెంకటేష్, సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పీర్ మహ్మద్, సావిత్రి, లాలయ్య, వెంకట్రాములు, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు బుస్సచంద్రయ్యలతో పాటు జిల్లా రాష్ట్ర నాయకులు తదితరులున్నారు.

# 8 నెలల్లో పూర్తి

(మొదటి పేజీ తరువాయి)

సిఎస్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఇందిరా మహిళా శక్తి కార్యక్రమం అమలుకు సంబంధించి గురువారం సచివాలయంలో ఉన్నతస్థాయి సమావేశంలో సమీక్షించారు. ఈ సందర్భంగా సిఎస్ శాంతి కుమారి మాట్లాడుతూ, 22 ఇందిరా మహిళ శక్తి భవనాల నిర్మాణం పనులు మొదలుపెట్టి వాటిని 8 నెలల్లో పూర్తి చేయాలనీ ఆదేశించారు. రాష్ట్రంలోని స్వయం సహాయక మహిళల ఉత్పత్తులకు మార్కెటింగ్ కల్పించడానికి శిల్పారామంలో ఏర్పాటు చేస్తున్న 106 ఇందిరా మహిళా శక్తి బజార్ నిర్మాణ పనులను తక్షణమే పూర్తి చేసి డిసెంబర్ మొదటి వారంలోగా ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలని పేర్కొన్నారు. ఈ ఇందిరా మహిళా శక్తి బజార్లో మహిళలకు ఆర్థిక చేయూత కుగాను నిత్యం సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించడంతోపాటునగరంలోని ఐ.టి సంస్థలు, ఇతర ప్రముఖ వాణిజ్య, వ్యాపార సంస్థలకు భాగస్వామ్యం కల్పించాలన్నారు అధిక మొత్తంలో డబ్బును పొదుపు చేసిన మహిళా సంఘాల ద్వారా 600 బస్సులను కొనుగోలు చేయించి ఆర్‌టిసికి అద్దెకు ఇచ్చేలా ప్రణాళికలను సిద్ధం చేశామని మొదటి దశగా 150 బస్సులను కొనుగోలు చేసేలా ప్రణాళికలను సిద్ధం చేయాలని ఆధికారులకు సూచించారు. అదేవిధంగా మహిళా సంఘాల ద్వారా 4వేల మేఘావాట్ల సామర్థ్యం గల సోలార్ పవర్ ప్లాంట్లను ఏర్పాటు లక్ష్యంగా పెట్టుకున్నామని, ఇందుకు వారికి జిఓ వడ్డీకే రుణాలను అందించి మొదటి దశలో 1000 మెగా వాట్ల సామర్థ్యం గల సోలార్ ప్లాంట్లు ఏర్పాటు చేయిస్తున్నామని వివరించారు. ఈ ప్లాంట్లను నీటిపారుదల శాఖ, దేవాదాయ, ఆటవీ శాఖలో నిరుపయోగంగా ఉన్న ఖాళీ భూములను లీజ్ పద్ధతిన సేకరించి ఏర్పాటు చేయనుండగా వీటి నిర్వహణా బాధ్యతలను తెలంగాణ రెడ్కో, విద్యుత్ డిస్కం లు చేపడుతాయని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో రవాణా, రోడ్డు, భవనాల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్, పిసిసిఎఫ్ ఆర్‌ఎండోబ్రియల్, రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి నవీన్ మిట్టల్, ఎండోమెంట్స్ ముఖ్య కార్యదర్శి శైలజా రామయ్యర్, పర్యావరణ, అటవీ శాఖ కార్యదర్శి అహ్మద్ నదీమ్, నీటిపారుదల శాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జా, పంచాయత్ రాజ్ మరియు గ్రామీణాభివృద్ధి శాఖ కార్యదర్శి డి.ఎస్.లోకేష్ కుమార్, గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి శరత్, సెర్ప్ సిఇఓ దివ్య తదితరులు పాల్గొన్నారు.

# తక్షణమే సమావేశం

(మొదటి పేజీ తరువాయి)

వారిని సొంతరాష్ట్రాల నుంచి బలవంతంగా సమీప రాష్ట్రాలకు తీసుకెళ్లి వెట్టి కార్మికులుగా మారుస్తున్నారని పేర్కొంది.'బాలలకు సంబంధించి అంతర్‌రాష్ట్ర సమస్యను పరిష్కరించాలనే విషయాన్ని బెంచ్ కనుగొన్నది. అందుకు కేంద్ర ప్రభుత్వం ఈ సమస్యను అందరికీ ఆమోదయోగ్య రీతిలో పరిష్కరించాల్సిన అవసరం ఉంది' అని ధర్మాసనం తెలిపింది. విచారణ సందర్భంగా ధర్మాసనం మాట్లాడుతూ వెట్టి కార్మికుల అక్రమ రవాణా ప్రాథమిక హక్కులకు విఘాతం కలిగించడమేనన్న విషయాన్ని నొక్కిచెప్పింది. అందువల్ల కేంద్ర కార్మిక, ఉపాధి శాఖ వ్యవహారాల మంత్రిత్వశాఖ తక్షణమే అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల సంబంధిత శాఖల మంత్రులతో ఒక సమావేశం ఏర్పాటు చేసి ఈ సామాజిక రుగ్మతను పరిష్కరించేలా ప్రతిపాదనలను రూపొందించాలని ఈ సందర్భంగా డివిజన్ బెంచ్ ఆదేశించింది. రక్షించబడిన బాల కార్మికులకు తక్షణమే ఆర్థిక సహాయం చేసేందుకు సులభతర ప్రతిపాదనలతో ఒక పథకం రూపొందించాలని బెంచ్ కోరింది. ఈ ప్రాముఖ్యత కలిగిన అంశాన్ని పరిష్కరించేందుకు అటార్నీ జనరల్ సహాయం ధర్మాసనానికి అవసరం ఉన్నందున అందుకు సహకారం అందించాలని అటార్నీ జనరల్‌ను బెంచ్ అభ్యర్థించింది. ఈ ప్రొసీజర్‌ను పూర్తి చేసే సమయంలో జాతీయ మానవ హక్కుల కమిషన్ (ఎన్‌హెచ్‌ఆర్‌సి) బోర్డ్ సహాయం తీసుకోవాలని సుప్రీంకోర్టు కేంద్రాన్ని ఆదేశించింది. అయితే ఆరు వారాల తర్వాతకు ఈ విషయమై విచారణను చేపడతామని తెలిపింది. విచారణ సమయంలో పిటిషనర్ల తరపు న్యాయవాది మాట్లాడుతూ రక్షించబడిన బాలకార్మికులకు తక్షణమే ఆర్థిక సహాయం అందించాలని ధర్మాసనాన్ని అభ్యర్థించారు. ఉత్తరప్రదేశ్ రాష్ట్రం గణాంకాలను పరిశీలించిన ధర్మాసనం 4,100మందికి పైగా వెట్టి కార్మికులకు ఇప్పటి వరకూ ఆర్థిక సహాయం అందలేదన్న విషయాన్ని ప్రస్తావించింది. కాగా విడుదలైన వెట్టి కార్మికుల సంఖ్యను మాత్రమే ధర్మాసనం ముందు ఉంచామని ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం తరపు న్యాయవాది ధర్మాసనానికి తెలియజేశారు. వారికి చెల్లించిన ఆర్థిక సహాయం వివరాలను రికార్డు రూపంలో ధర్మాసనం ముందు పెడతామని చెప్పారు. ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం వెట్టి కార్మికులను ఏవిధంగా ముందస్తుగా అరికడుతోందని ధర్మాసనం అడిగిన ప్రశ్నకు ఆయన సమాధానమిస్తూ దీనికి సంబంధించిన రికార్డు కూడా అందజేస్తామని ప్రభుత్వ న్యాయవాది బెంచ్‌కు విన్నవించారు.

పిటిషనర్లలో ఒకరు బెంచ్‌ముందు మాట్లాడుతూ తాను, తనతో పాటు మరికొంతమంది వెట్టి కార్మికులు బీహార్‌లోని గయ జిల్లాలోని స్వస్థలానికి చెందిన ఒక అన్‌రిజిస్టర్డ్ కాంట్రాక్టర్ అక్రమ రవాణా చేసి ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని షాజహాన్‌పూర్ జిల్లాలోని ఇటుకబట్టీలలో వెట్టికార్మికులుగా పనిచేయిస్తుండగా ఫిబ్రవరి 28, 2019న కాపాడబడి విడుదల చేయబడ్డామని బెంచ్‌కు తెలియజేశారు. తమకు చట్టబద్ధంగా రావాల్సిన కనీస వేతనాలను తనకు, తన సహచర కార్మికులకు ఇవ్వలేదని పిటిషనర్ ధర్మాసనానికి నివేదించారు. సర్వోన్నత న్యాయస్థానం జులై 2022న పిటిషన్ విచారణకు స్వీకరించేందుకు అంగీకరించింది.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at D.No 1- 6-75, Suravaram Venkataram Reddy Bhavan, Subhashnagar, Mahabubnagar - 509001, Telangana State, RNI TELTEL /2018/76758 **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com